# Swecchaa Kavithvamu

స్వేచ్ఛా కవిత్వం · Free Verse
Volume I · Addendum 1 · Poems written 1953–1975
Professor Madiraju Ranga Rao (1935–2025)

## About This Volume

Swecchaa Kavithvamu (“Free Verse”) is the collected free-verse poetry of Professor Madiraju Ranga Rao. This volume — Addendum 1 to Volume I — gathers eleven early collections written between 1953 and 1975, from Kirmeeram (1957) to Anandadhuni (1975), most of them long out of print. The poems are in Telugu; this English page is provided so that readers and search systems working in English can identify the volume, its author and its contents.
Madiraju Ranga Rao was born on 8 June 1935 in Pandithapuram village, Khammam, Telangana. He studied Telugu and Sanskrit literature at Osmania University (M.A. Sanskrit 1960, M.A. Telugu 1962, Ph.D. Telugu 1966) and served on the editorial board for the critical editions of Andhra Mahabharatham and Andhra Mahabhagavatham. He taught at Osmania University from 1964, then for many years at Kakatiya University, Warangal, as Professor, Chair of the Board of Studies and Dean of the Faculty of Arts. He founded and led the Rasadhuni Sahithi Parishath literary foundation. By his death on 21 June 2025 he had published more than 160 books of free verse and over 20 of literary criticism.

## Collections in this volume


కిర్మీరం · Kirmeeram · 1957
మేల్కొన్న ఆకాశం · Melkonna Aakaasam · 1959
మనోభూమికలు · Manobhoomikalu · 1960
అద్దంలో నీడలు · Addamlo Needalu · 1960
పృథ్వీగీతం · Prudhveegeetam · 1961
మరో ఉదయం · Maro Udayam · 1962
సౌందర్యశిఖ · Soundaryasikha · 1963
యుగసంకేతం · Yugasanketam · 1970
ముక్తకాలు — ఉష ఆగమనం · Muktakaalu — Usha Aagamanam · 1970
మానవీయం · Maanaveeyam · 1971
ఆనందధుని · Anandadhuni · 1975



## Publication


Author — Prof. Madiraju Ranga Rao
Editors — Dr. Madiraju Santhosh Kumar, Devulapally Haritha, Madiraju Charitha
First edition 2026 · ISBN 978-93-5679-711-6
Publisher — Rasadhuni Sahithi Parishath, Shantinagar, Hyderabad 500028

Language — Telugu (Telugu script) · Genre — free verse poetry
Website — madirajurangarao.com

# స్వేచ్ఛా కవిత్వం

మొదటి సంపుటం · Addendum - 1
రచనా కాలం 1953 - 1975



మాదిరాజు రంగారావు

2026

రసధ్వని సాహితీ పరిష్త్తు
శాంతినగర్, హైదరాబాద్ – 28.

## నాన్నగారి జ్ఞాపకార్థం

మా నాన్నగారు ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి సాహితీ ప్రస్థానం ప్రారంభ దశలో వెలువడిన స్వేచ్ఛా కవిత్వం, మొదటి సంపుటానికి Addendum-1 గా పునః ముద్రణ చేసి సాహితీ సహృదయులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.
— మాదిరాజు సంతోష్ కుమార్, దేవులపల్లి హరిత, మాదిరాజు చరిత

# అంకితం

మాదిరాజు రంగారావు గారి మాతాపితామహులు పూజ్యులు
శ్రీమతి మాదిరాజు లక్ష్మిదేవి గారికి
మరియు
శ్రీ మాదిరాజు నారాయణరావు గారికి అంకితం...
ఈ జీవన మార్గాన గమ్య మెరిగిన ప్రయాణికులు
ఈ వివర్త జగత్తులో నీడ క్రమ్మని దీపకళికలు.

## Contents · విషయ సూచిక

**Swecchaa Kavithvamu** ........ **1**
About This Volume ........ 1
Collections in this volume ........ 1
Publication ........ 1
**స్వేచ్ఛా కవిత్వం** ........ **2**
నాన్నగారి జ్ఞాపకార్థం ........ 3
అంకితం ........ 4
**Contents · విషయ సూచిక** ........ **6**
**కిర్మీరం** ........ **16**
అంకితం ........ 19
జ్యోతీరేఖ ........ 21
నాదత్రయము ........ 23
చిత్రశాల ........ 31
స్నేహవీచి ........ 34
జీవ లక్షణం ........ 38
మెరపు రేఖలు ........ 41
స్వప్న కపోతము ........ 43
అందని సందేహం ........ 45
వెలుగు — చీకటి ........ 46
ఛాయ ........ 48
నిప్పుపూలు ........ 56
ఇచ్ఛాగీతం ........ 60
వ్యాఖ్యాన గీతం ........ 62
నాలో నేను ........ 65
దీప శిఖ ........ 67
ఘంటానాదం ........ 71
కీర్తిస్తంభాలు ........ 73
చీకటి మనుషులు ........ 76

భానూదయము........................................................ 79
క్రాంతి దర్శనం........................................................ 81
**మేల్కొన్న ఆకాశం........................................................ 86**
**మనోభూమికలు........................................................ 156**
**అద్దంలో నీడలు........................................................ 189**
**పృథ్వీగీతం........................................................220**
**మరో ఉదయం........................................................ 252**
మాదిరాజు రంగారావు........................................................252
ఇతర కృతులు........................................................ 255
అధునా........................................................257
మొదటి ఉదయం........................................................ 264
ఉదయం తరువాత........................................................ 271
!?........................................................282
మరో ఉదయం........................................................ 285
**సౌందర్యశిఖ........................................................ 291**
మాదిరాజు రంగారావు........................................................291
సౌందర్యశిఖ........................................................ 295
ముక్తకాలు........................................................ 308
కదలండి శతఘ్నులవలె........................................................ 343
పద పద !........................................................348
యుగసంకేతం........................................................351
**యుగసంకేతం........................................................353**
అంతర్నాదం........................................................ 355
ముందు మాట........................................................ 356
యుగసంకేతం........................................................362
అంతంకాని నాటకం........................................................ 432
అగ్ని గానం........................................................ 504
మేల్కొన్న ఆకాశం........................................................517
కాంతి సింహం........................................................ 519

నెక టై........................................................................................ 528

నిప్పు పూలు........................................................................................ 551

ఎవరు మీరు?........................................................................................ 565

కదలండి శతఘ్నులవలె........................................................................................ 581

వివరణ........................................................................................ 589

ముక్తకాలు........................................................................................ 595

**ముక్తకాలు - ఉష ఆగమనం........................................................................................ 597**

ముక్తకాలు........................................................................................ 598

ఒక మాట........................................................................................ 599

ముక్తకాలు........................................................................................ 600

ఉష ఆగమనం........................................................................................ 657

హిమజ్వాల........................................................................................ 705

ఛాయ........................................................................................ 711

మొగిలు విరిసి కురిసే వేళ........................................................................................ 721

ముక్తకాలు........................................................................................ 723

**మానవీయం........................................................................................ 729**

మానవీయం - మొదటి భాగం........................................................................................ 734

**ఆనందధుని........................................................................................ 846**

అంకితం........................................................................................ 849

ప్రకాశకీయం........................................................................................ 850

పరీమళ వలయం........................................................................................ 855

ఆదిత్య వలయం........................................................................................ 871

స్వేచ్ఛాబింబాలు........................................................................................ 881

ఇటీవలి ముక్తకాలు........................................................................................ 891

కొలతలేని కాలం........................................................................................ 907

ఎక్కడిదీ జ్వాలా రూపం........................................................................................ 909




Madiraju Ranga Rao was born on June 8, 1935, in Pandithapuram village,

Prof. Madiraju Ranga Rao, a distinguished writer, scholar-poet and a literary critic, contributed

రచనా కాలం 1953 - 1975

Khammam, Telangana.

Madiraju Ranga Rao was a student of Telugu and Sanskrit literature at Osmania University (O.U), obtained M.A. Sanskrit (1960), M.A. Telugu (1962), Ph.D. Telugu (1966). Dr. Madiraju Ranga Rao was a member of the Editorial Board for the critical editions of Andhra MahaBharatham and Andhra MahaBhagavatham. Dr. Rao's first academic appointment in 1964 was with the Department of Telugu, O.U, Hyderabad, then followed a long tenure at Kakatiya University, Warangal, Telangana as Professor, Chair Board of studies and Dean for Faculty of Arts. Prof. Madiraju Ranga Rao was the Founder and President of 'Rasadhuni Sahithi Parishath' literary Foundation.

extensively to various literary genres of Telugu literature including classical literature, modern poetry, and criticism. Prof. Rao established his own niche through his literary works in 'Free Verse' (Swecchaa Kavithvamu) and Literary Criticism. Central to Prof. Madiraju Ranga Rao's poetic purpose were humanistic ideals and a democratic perspective rooted in a heart that symbolized peace. This was the very essence of his 'Free Verse' poetry. Popular journals published his creative writings on a regular basis. During his long and highly productive literary career, Prof. Madiraju Ranga Rao's creative writings culminated in more than 160 books on 'Free Verse' and over 20 books on Literary Criticism – a total of over 180 books – published until his demise on June 21, 2025.

స్వేచ్ఛా

కవిత్వం

మొదటి సంపుటం

Addendum - 1

రచనా కాలం

1953 - 1975

Vol. 1

# స్వేచ్ఛా కవిత్వం

మొదటి సంపుటం (Addendum - 1)

రచనా కాలం 1953 - 1975

మాదిరాజు రంగారావు

**నాన్నగారి జ్ఞాపకార్థం**

మా నాన్నగారు ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు

నివాళిగా, మాదిరాజు రంగారావు గారి సాహితీ ప్రస్థానం ప్రారంభ దశలో

వెలువడిన స్వేచ్ఛా కవిత్వం, మొదటి సంపుటానికి Addendum-1 గా పునః

ముద్రణ చేసి సాహితీ సహృదయులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

**మాదిరాజు సంతోష్ కుమార్**

**దేవులపల్లి హరిత**

**మాదిరాజు చరిత**

# రసధుని

# సాహితీ పరిషత్తు

**శాంతినగర్, హైదరాబాద్–28.**

SWECCHAA KAVITHVAMU
Volume - I
Addendum - 1

by
Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Frist Edition 2026

ISBN : 978-93-5679-711-6

Price : 1000/-

For Copies :
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

Printed at :
Anupama Printers
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

# అంకితం

మాదిరాజు రంగారావు గారి

మాతాపితామపులు పూజ్యులు

శ్రీమతి మాదిరాజు లక్ష్మీదేవి గారికి

మరియు

శ్రీ మాదిరాజు నారాయణరావు గారికి అంకితం...

ఈ జీవన మార్గాన గమ్య మెరిగిన ప్రయాణికులు

ఈ వివర్త జగత్తులో నీడ క్రమ్మని దీపకళికలు.

# స్వేచ్ఛా కవిత్వం

మొదటి సంపుటం (Addendum - 1)

రచనా కాలం 1953 - 1975

## విషయ సూచిక


| | పేజీలు |
|---|---|
| 1. కిర్మీరం (1957) | 58 |
| 2. మేల్కొన్న ఆకాశం (1959) | 68 |
| 3. మనోభూమికలు (1960) | 32 |
| 4. అద్దంలో నీడలు (1960) | 30 |
| 5. పృథ్వీగీతం (1961) | 32 |
| 6. మరో ఉదయం (1962) | 38 |
| 7. సౌందర్యశిఖ (1963) | 46 |
| 8. యుగసంకేతం (1970) | 130 |
| 9. ముక్తకాలు – ఉష ఆగమనం (1970) | 72 |

10. మానవీయం (1971) 64
11. ఆనందధుని (1975) 40

# కిర్మీరం

(గేయాలు)

మాదిరాజు రంగారావు

ఆదర్శ సాహిత్యమాల

హైద్రాబాద్

# స్వేచ్ఛా కవిత్వం

# కిర్మీరం

## ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

KIRMEERAM

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: డిసైంబరు 1957

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

# అంకితం

'ఉషాగమనాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు,'

మహాకవి శ్రీశ్రీ కి

జ్యోతీరేఖ

నాదత్రయము

చిత్రశాల

స్నేహ వీచి

జీవ లక్షణం

మెరపు రేఖలు

స్వప్న కపోతము

అందని సందేహం

వెలుగు – చీకటి

ఛాయ

నిప్పుపూలు

ఇచ్ఛాగీతం

వ్యాఖ్యాన గీతం

నాలో నేను

దీప శిఖ

ఘంటానాదం

కీర్తిస్తంభాలు

చీకటి మనుషులు

భానూదయము

క్రాంతి దర్శనం

కిర్మీరం

# జ్యోతీరేఖ

మధుర మధుర పీయూషావర్షిత
పుష్పీకృతాత్మ వారిద గామిని
కిణ కిణ పద రచనా సంచారిణి
మత్కవితా నృత్యన్మందాకిని

వినీల కాంతిమేఘ హృదయవీధి
రివ్వున జిలుగునవ్వు పూలు రువ్వు
ఈ హేరమ్మదమాలా దీపిక
ఊహాలేఖా విష్కృత లాసిక

హిమానీ వీచీ స్ఫీత ప్రాభా
తారుణ నాకధునీ శ్రీమమ్రోడులవలెస్సృణీ
ఫేన తరంగిణివై, తమోరాశి
కాంతి పునీతము గావింపగ,
గీతికాభినందనతో, అవనీ

కిర్మీరం

స్థలి డిగ్గు నీకై నవశరత్కాల
హిమ గిరీంద్ర శిఖర రూపమెత్తిన
నను వీక్షించుచు యెన్ని అబ్దములు
తమోదైర్ఘ్యరేఖ లాగ సాగెను—

నీలాంబుద వీణా రూపమూని
శంపా రేఖా తంత్రులు మ్రోయగ
కదలి వచ్చు, నీ రూపము ననుసరించు
వాయూచ్ఛలత్త రంగవదూహలు

కనులకు కనుపించని, జ్యోతి
శ్శిఖకై తపించిపోవు, యాగి
కాగ్ని పరిస్ఫీతారుణమా
హృదయ కనక శతపత్రమువలె

వికస్వర తేజోఽవధిభూత భవత్
రూప సమాహితమా నా కళాత్మ.

కిర్మీరం

# నాదత్రయము

## 1

ఆరని వెలుగు దివ్వియలు వదిలే
మెల మెల్లగ సాగిపోవు ధూమం లా
చెక్కిన చీకటి ప్రతిమల వలె
చలించని మ్రొడులవలె కూర్చున్నారేం ?

ఎంత స్వర్గానందమయ మీ ప్రపంచం
తత్ప్రతిబింబమెగా ఈ జీవితం
ప్రతి మనిషీ కళామయ భావనతో
సంతోషపు రెక్కలతో ఎగురడేం ?

వికసించిన మల్లికా సుమహేలలు
మొగిలు చిత్రముల పరస్పర
మధురావలోకనా దృశ్యాలు
చూచే తీరిక, ఓపిక నశించిందా ?
వీచే గాలుల తాకిడి సహించలేరూ ?

చంద్ర రేఖనో, భానుమూర్తినో ఎరుగని
వెలుగు రేఖనో, నీడబొమ్మనో చూడని
గగన సీమనో, భూమినో నమ్ముకోని
జీవితం, వర్ణ రేఖా లుప్త చిత్రం.

కిర్మీరం

## 2

గాజు కనులు విప్పిచూడు,
నేటి వరకు, కాంతికిరణ లవ
మెరుగని చీకటి గుండెలతో
నఖ శిఖ పర్యంతం తెల్లని
వర్ణపు టుడుపులు ధరించి —

నిమ్నోన్నతాలు తెలియని చీకటిలో
విద్యుద్యుగ దశలోనూ, తమ
ప్రాత ఉనికి స్థిరత్వానికి ప్రాకులాడు
గ్రుడ్డి వెలుగు దీప స్తంభాలు

ఎప్పుడో ఆకాశాన కొంత సేపు
చంద్ర బింబం కనుపిస్తే సరా?

ఈ దీపస్తంభాల క్రింద వసించే
స్వీయ రూప రేఖలే ఎరుగని
సామాన్యుని జీవితం, వైతరణీ
నదీ తీర విహార ప్రాయం కదూ !

ప్రతి వస్తువులోని అందాన్ని చూడడం
ప్రతి మనిషికీ శక్యంకాదు, నిజం !
ప్రతి మనిషిని ఆనంద పరచడం
ప్రతి వస్తువు ప్రకృతి కతీతం.

3

ఎన్ని సూర్య బింబాలు ఆరిపోలేదు ?
ఎన్ని చంద్ర బింబాలు వాడిపోలేదు ?
ఎంత మంది శాంతమూర్తుల ధర్మ
బోధలు జలధి ఘోషను మునుగలేదు ?

దినమణి కాంతి మాసిన వేళలందు
ఎన్ని దీపాలు వెల్గించుక మురియలేదు ?

ఎన్ని మారులు నిశాతారుణ
కాంతిఖడ్గం ప్రయోగించినా
శిథిలమౌ ఈచీకటి వటవృక్షం
మాటిమాటికీ శాఖోపశాఖలుగా
ప్రస్తరించి, దిగంతాల
కెగసి ఎగసి, గగనంలా
నిలచి పోవాలని చూస్తుందేం ?

ఈ వృక్షపు నీడల ఎడారిలో
నివసించే మానవ మేధాశిఖరి
విజ్ఞాన రసాపగ పరుగిడుతుంటే
నిస్తబ్ధత వ్యాపించిన ఆశావీధుల
ఒక్కమారు చైతన్య కాంతి
ఝుంఝూ సంగీత ధునీ ధ్వని
వినిపిస్తుంటే, మేల్కొని
మహాప్రస్థాన మూహించని

కిర్మీరం

చీకటి తెరలను తొలగించే
కాంతి కిసలయాంగుళులతో
స్వీయ నైజ రూపావిష్కరణము
వాంఛించని బుద్ధిజీవి ఎవ్వడు ?

భూమిని గుట్టలూ, చెట్లూ, చేమలు
నదీ నదాలు, జనపదాలు ఆక్రమించగలవు
ఆకాశాన్ని మబ్బులు మ్రింగివేయగలవు
వాయు మండలాన్ని విమానం చుట్టిరాగలదు.

రేపో లేకపోతే మాపో, చంద్ర
మండలాన్ని ఆక్రమించి, సూర్య
మండలానికి దారులు తీయగలం !
ఈ మహా సముద్ర గర్భంలో
కవచ పరీవృత సౌధాలు నిర్మించగలం !

అడుగడుగున నిస్తబ్ధత, నిశ్శబ్దత
వ్యాపించిన, మనఃప్రపంచవీధుల
అనంతమైన కాలాన్ని దేశాన్ని
ఆక్రమించి, మనిషికి మనిషికి మధ్య
నిల్చిన, కనులకు కనుపించని
చీకటి గోడలను కూలగొట్టి
కాంతిగీతాలను వినిపించునదెవ్వరు ?

కిర్మీరం

అవునేమొ ! నిజంగానే కలడేమొ !
సృష్టిలో, ఏ చీకటి కోనలోనో !
కదలని పర్వతంలా, చీకటి సుడిలా,
ఆరని వెల్గు పూల హారంలో ముడిలా.

★

ధర్మ విప్లవం జయం పొందిన
ఉదయ వేళ, క్రాంతి
మార్గోన్ముఖీకరణమె
అభ్యుదయమను మాట కర్థము.

# చిత్రశాల

ప్రతి మనిషి జీవితం
ఒక చిత్ర కళారంగం
స్వీయ దృష్టి యంత్రంలో
చూడలేడు ప్రతిదృశ్యం

బాల్యోదయాగమనం
జరా నిశా నిష్క్రమణం
చిత్ర వర్ణ ఇంద్రధను
రీవితాల రెండుకొనలు

కను చూపు మేర కలియు
భూమి, నీలాకాశంలా,
ఒకటిగ కలిసిపోవు.
ఎన్నటికిని కలలోనూ !
అప్పుడపుడూ కన్నులు
మోసపోవడమూ కద్దు !

ప్రతి రంగును విడివిడిగా
బావుందని, వ్రేలు ఎత్తి
నిర్దేశిస్తూ, అభిమానంతో
అచ్చటనే, కదలక నిలచి
పోవు, బాల భావుకుల

## సంఖ్య సగం కన్న మిన్న

కిర్మీరం

హస్తాలు చాచి కదలి
పోవు, ఆకురాలిన
జీవిత వృక్షాలు, మంచులా
గడ్డ కట్టిన సరోవరాలు

మనిషి జీవిత పతాక
శీర్షము పైన కాలు కదిపి
ఎరుగని బాల భానుని
ఆధికారిక కాంతి ముద్రలు

సహస్ర జ్వాలా మాలా
కరాంగుళులు చాచిన
గ్రీష్మంలా మండిపోవు
మందార సుమ వృక్షాలు

ఒక టేమిటి? అందమైన
ఏ చిత్రశాల వెదకినా
విలువలేని వస్తువుమాత్రం
కానరాదు మన కంటికి

# స్నేహవీచి

అంగార నిధి గ్రీష్మ దేవత
రక్తానలం చిమ్మే నాల్కలు చాచే వేళ
తడియారిన పుడమి గొంతుక
చల్లని నీటి కోసం తపించే వేళ

ఎండ మబ్బులు దగ్గర దవ్వును
ఏకం చేసి మృగతృష్ణ పెంచే వేళ
శిల వలె హృదయం ఘనీభవించి
ప్రపంచం శ్మశానంలా మారే వేళ

ఎక్కడినుండో, ఏ కోన నుండో
వేలాది మైళ్ళుగా వ్యాపించిన
అగాధ సముద్ర తరంగాలను
కబుర్లతో మురిపిస్తూ మెల్లగాదాటి

కిర్మీరం

నదీ సైకతాలపైని తరంగాలను
కిలా కిల నవ్వులతో ముంచేస్తూ
వృక్షాలను కుశల ప్రశ్నలతో
సంభావిస్తూ, గలగల ఊగిస్తూ
మధ్య మధ్య ప్రేమతో
సమున్నత శైల శిఖరాలను
శీతల హస్తాలతో స్పృశిస్తూ —

తెల్లని నల్లని జాతి జాడ్యమే
యెరుగని, మతాల సూత్రాలకు
కట్టువడని, ఊహ కందీ అందక
రెక్క విప్పి ఎగురు ఆనందపు
లేజగా వెన్నెల పులుగులా వచ్చి —

పూర్ణిమా చంద్రోదయ వేళా
సముల్లసిత సముద్రతరంగం లా
'మనిషి మనిషి మనస్సు మనస్సు
పరస్పర సౌహిత్య పరామర్శన
శాంతికి సమర్చన' అని
గుండె విప్పి మాట్లాడ గల
శిలా ప్రతిమల గుడిముందు
విశ్రమించిన నా చెవిలో

టీకా టిప్పణి వ్యాఖ్యానాల
అవసరం ఏ మాత్రం లేకుండా
ప్రతి మనిషి మనస్సునకు
అవగత మయ్యే సంజ్ఞాభాషలో

కిర్మీరం

నిశ్శబ్దంగా రహస్యంగా ఊది
మెల్లగా సన్నగా కపోలాలు తాకి
మృదువుగా కరసంచాలనం చేస్తూ
గంతులు వేస్తూ, ఈలలు వేస్తూ
నిముసపు కదలికలో వెళిపోయింది
నిశ్శబ్దపు మెదలికలో యే కోనకో !

రహ స్థిర దేశ సమాయాత
నవ శీతల మృదుల వాయు
హేలా త్వరమాణ స్నేహ వీచి !

కిర్మీరం

# జీవ లక్షణం

వేగ ఝురీ గమనము నడ్డు
నీలి రంగు కొండలపై నుండి
ఎగసి, పొంగి పొరలు కాంతిధార
చెంగున దూకునపుడె, గంభీర
ప్రశాంత ప్రకృతి రామణీయకత

అంతశ్శక్తి రేఖ లొక్కమారు
మేలుకున్న మనలో తదనుభూతియె
పరిణత జీవిత కావ్య నిహిత
సౌందర్య కళాన్విత శిల్పజ్ఞత

సజీవ ప్రాణికోటి స్వభావం
నిర్జీవ శిలాప్రతిమ సౌందర్యం
ప్రకృతిదేవి దయా హృదయం
యంత్ర శక్తుల స్పర్ధ తత్వం
అడవిమనిషి జాలిగుండె లోతులు
నగరవాసి మేధాశక్తి పరిసర్పణం

కిర్మీరం

తెల్లని పక్షులెగురు కాంతిసీమ
నల్లని ధూమమెగయు యుద్ధభూమి

చిత్రవర్ణ దృశ్యమాన రూపంలో
కనిపించే సాంకేతిక జగత్తులో,

నీరులా దయ ప్రవహించే బాట
మంచులా నిర్దయ గడ్డకట్టు చోట
సంస్పందమాన వీణా తంత్రిలా
మ్రోగును, నదిలా కవిహృదయం
సాగును కాంతి తరంగిణిలా,
మబ్బులా మెత్తనైన మనసులోని భావన

ప్రతి వస్తువు సౌందర్య రసస్విన్నము
ప్రత్యణువు విచారణ యోగ్యము
ప్రతిభావము సవిచార మనోనిష్ఠము
ప్రతి మనీషి ఊహా జగత్తు భిన్నము
స్వీయ దృక్పథం చెరగని సరళ రేఖ

భిన్నత్వం అనిశ్చలత్వం
క్షణక్షణం వినూతనత్వం
రూప రేఖలు మారే గుణం
భౌతిక ప్రాపంచిక లక్షణం

కిర్మీరం

చేతనతా లక్షణ మెరుగదు స్వర్గం
యుగాలుగా బ్రతికే రంగుల చిత్రం
వీచే గాలిలా, మ్రోగే
నదీ తరంగంలా, దూకే
జలధారా ధునిలా, మెరసే
నవ విద్యుల్లేఖా పుష్పంలా

హసిస్తూ నిత్యం చరించడం
జీవ సృష్టి వైలక్షణ్యం.

కిర్మీరం

# మెరపు రేఖలు

జీవితం ఎగసే
కాంతి విహంగం
సరళ రేఖలోనే
సర్వదా ప్రయాణం

బహుదూరం మాత్రం
వెళుతుంది గతిస్తుంది
వెనక్కు తిరిగి రావడ
మంటూ అసలువుండదు

ఈ మధ్య చూచిన
దృశ్యాలు, అనుభవాలు
రసస్విన్న హృదయుల
కానంద శిల్ప తీర్థాలు

కిర్మీరం

జ్యోతిర్మయ మేధిరుల
కవశ్య కర్మభూములు
లౌకిక జీవులకు జీవిత
వ్యాఖ్యాన సూత్ర పాఠాలు

ప్రతి క్షణం, నిల్కడ
ఎరుగని జలధి తరంగం
ప్రవాహానికి పథం వంటిది
ఆగతానికి వర్తమానం

కిర్మీరం

# స్వప్న కపోతము

ఊర్జిత గగన శైల శిఖరం పై
మొరసెను అరుణ కిరణ చాపమ్ములు
నిరాశా నిశావృత జీవిత వ
ల్మీకం నుండి బయల్వెడలి పరుగు
లెత్తెను సితాసిత భుజగమ్ములు

కనుపించని దిక్పర్వత సానువు
పై, ఉదయించిన అరుణారుణ
బింబ మండలాన క్రీడించే
కాదంబినీ నికరమ్ములు మరణ
మురజధ్వనితో అంతరించెను

పగిలిన పుడమి గుండియ పైను
లోతు నుండి పొంగులెత్తెను
సద్య ఉద్గత జీవ ధారలు
జీవ ధారా సిక్త జనతా
హృదయ కేదారమ్ము లింకను
బీడువడి పాడువడునా ?

కిర్మీరం

ఉషః కాంతి సదనమునకు
దూరమై, దిక్కుల సమా
శ్రయించిన నిశా పక్షిణి
ఎగిరిపోయె వాయువీధి

★

ఊహా నీహార శలాకా
నిర్మితమగు నా మస్తిష్క
పంజరాన, శాశ్వతముగ
నిను బంధించి, ఆనందిం
చే, మూర్ఖుడనని ఎందుల
కీ మాద్రి సంకోచింతువు ?

ఎటు చూచిన దగ్గరిగా చుట్టూ
కంటికి ఎదురుగ నిలచినట్టి ఈ
చీకటి లోహపు రెమ్మలగుడిలో
నీ బ్రతుకు గడపగా కోరెదవా !

నీ చాచిన నిద్దుర పొలిమేరల
రెక్కలతో విసరుచు, ఈ ప్రశాంత
మౌనవేళ లందు, ఓ కమ్మని
కథ హాయిగ వినిపించవూ ?
నా స్వప్న కపోతమ !

# అందని సందేహం

అగ్ని వీణా తంత్రులు పలుకు
మధుర స్వర మాలిక లెన్నో!

హిమధామంలో దాగి వున్న
అగ్ని కీలా మాల లెన్నో !

నిశా ఫాల ఫలకంపై బడి
నిల్వని కాంతి కళిక లెన్నో!

ఉదయ కాలనటి అడుగులంటి
సాగు, చీకటి బొమ్మ లెన్నో !

చంద్రబింబం వాడిపోయి
ఓ మూల ఒరిగి పోయినా
చీకటి పొలిమేరలు దాటజాలని
ఉషస్సంధ్యా కాంతి స్రవంతులెన్నో!
అనంత కాల సికతా శ్రేణుల
ఎన్ని కాంతి తరంగిణు లింకెనో !

కిర్మీరం

# వెలుగు — చీకటి

వెలుతురు –
ఆకాశాన్ని భూమిని రోదసిని
వేరు వేరు చేసి చూపుతుంది

చీకటి –
సర్వ జగత్తును తన రూపంలో
సమైక్యం చేసివేసుకుంటుంది

మనిషికి –
చీకటిలో ప్రయాణించడంకన్న
వెలుతురులో నిదురించడమే సుఖం

మనీషికి. –
చీకటిలో నిదురించడం కన్న
వెలుగులో పయనించడమానందం'

కిర్మీరం

వెలుగు – చీకటి
ఎన్నటికీ ఏకం కాజాలని
ఒకే నదికి రెండు తీరాలు
ఈ రెండు తీరాలు స్వర్గ
నరక లోక సంకేతాలు

ఈ సంకేత పరిజ్ఞాన
పరిశోధనాఫలితం
గతంలోని జ్ఞానతత్వం
నవయుగ విజ్ఞానరూపం.

కిర్మీరం

# ఛాయ

ఎవరొహో ! నిదురించినదిట
నీలాంబుద మాలా సు
స్నిగ్ధ తనూ పల్యంకిక !
ముహుర్ముహురాగత వాయు
వీచీ చయ సంచాలిత
పుష్పంధయ పక్షాలక !
త్యక్తాశా కాంతి చేల !
దుఃఖ ప్రావరణావృత !

సరభస గమన పవమాన
విధుతమై, గగనాంస సం
స్రస్తమై, పొరలాడు నవ
నీరదాంశుకమ్ము వోలె

భువి జారి పడినట్టి
యామినీ కామినీ
కర్ణమున వ్రేలాడు
పూర్ణిమా చంద్ర బిం

కిర్మీరం

బాభరణ తాటంక
ఖచిత నీలమణివలె

భూదేవి పృథుల నితంబ
కాంచీ దామ ధామమున
అంకిత నఖాంకుర వక్ర
రేఖాపంక్తి వలె తోచు
ఆ పవ్వళించినదెవరు ?

అరుణ మయూఖముల వాడి
శార్వరీ జలద కైశిక
భరము వీడి, విశీర్ణమై
ఇట బడిన మానోజ్ఞ మం
దార పుష్పగుచ్ఛము వలె

ఇట నిదురించిన దెవరీ
మసృణ తమాల వల్లరీ
మతల్లికా సుషమాంగన !
నిస్తరంగ యామున ధుని !

సాంద్ర హిమ జల కణ వినిర్మిత
ఘనా ఘన చైత్య మండప
మందు మార్మోగు ధ్వని
తరంగములకు బెదరి, యిట
బడిన దుఃఖాగ్ని సందగ్ధ
మోహన మూర్తి, తారుణ్యా
శంపా కళా లాసికయొ ?

కిర్మీరం

అభ్యుదితుడు నవారుణా
దిత్య మూర్తి గాత్ర పరి
ష్వంగమున పరితప్తయై
తనూ కాంతి వీడి — వాడి
సంయన్త్రిత భుజము వీడి
తోరమై, ఇటు బడిన మా
నోజ్జ్వ చ్ఛాయా కాంతయొ!

సౌర మార్గ పరిచ్యుతయు
వాయు హత జ్వాలయునై
మృత్యుశయ్య పరచుక, శా
శ్వతముగ సుషుప్తి మున్గిన
తారాదీప శిఖా సుందరియొ !

జీవ దాన విచికీర్షా
హృదయుడు, సదయుడు, ద్రుతతర
గమన శీలి ! జలధర ని
శ్వసిత ధూమ పరిమ్లాన
దేహివై, భువి దిగజారి
ప్రియు నెడబాసిన త్రపా తరళ
యౌ శంపా వల్లికవా ?

స్వీయ ముగ్ధ లావణ్య రూప
మీ జన్మలో పొందలేవుగా !
మమతా స్విన్నమాణమౌ జ
న్మసీమ దివి కేగలేవుగా !

★

ఎవర వీవు ? రహస్తీరముల
ఏకాంతముగా నృత్యమాడి
మిసిమింతురాలవై, శ్రాంతి
కోసరము మెయి వాల్చితివా ?

కాంతి మండలపు టంచులపై
దిగ జారుచు నిరాలంబయై
నిరాశతో తమకము నొందుచు
తనుకు చీకటి తొగ కన్నైవా !

ఏ కోరిక సుడుల ముడులు
విడిపోవ, ఏకతమ తిరు
గాడి, కడు డస్సి యిట బడి
దుఃఖ నిమ్నగ మున్గితివి ?

ఏ వృక్ష వర్షీయుని
దుఃఖ సంవృత మలీమస
వర్ణ జీవిత చిత్రమొకొ ?
ఈ దీర్ఘ చ్ఛాయా రేఖ !

★

ఎవరవీవు? ఏకాంతముగా
కఠిన శైల పల్యంకము పై
ధూళి రేణుకా రూషితవై
మలిన వస్త్రమును దాలిచికొని,

శీత వాత పరిపీడిత వై
కృశీభవించిన; అవనీ తల
పరిసర్పణ మలినీకృతమై
వన్నె మాసి ఈ మన్నులోన
వివర్ణమైన ప్రన్నని దేహము
నల్పిష్ఠ తమ స్తరంగిణి వలె
కుంచించుక ఎందుల కెవరికై
ఆచరింతు వీ మౌన
వ్రతమ్ము ! ఛాయా సుందరి !

దుఃఖ శలాకాగ్ర వి
దారిత హృదయముతో
దృఙ్మనోజ్ఞ తర కాంతులు
దిక్తటాంచలముల విసరుచు

ఏ సాగర తీరము వెదకుచు
ఏ నాక పథము నాశించుచు
ఏ సుందర స్వాప్నిక సౌర
పదవి కూహా సోపానాళి
వినిర్మింప కాంక్షింతువు !

జఘన మండల విసర్పిత

నీల వసన సంశోభిత

మలినీకృత దేహాంచల

విరజీకృత నీలాలక !

త్యక్తాశా కాంతిచేల

ముక్తచ్ఛాయా సుందరి !

మసృణ నీల నీరద సుష

మా వల్గత్కాంతి తనూ !

కిర్మీరం

# నిప్పుపూలు

1

గ్రీష్ముడు నడచిన అడుగుల
జాడలలో, అగ్ని దేవతామూర్తి
చూపులలో చిక్కిన బారులందు,
సూర్యుడు తెరచిన వేయి కండ్లు
ఒక్కమారు అంతటా — పూలు
కణకణలాడే ఎఱ్ఱని నిప్పుపూలు

2

పూర్వం నియంతల హంతకుల
నాజీల గుండెలలో, గుండెల
గోరీల బండలపై విరబూచే,
వెచ్చని పరిమళ నిశ్వాసం
విడిచే, ధూమంతో సతతం
మ్రగ్గే ఎఱ్ఱని పూలు — నిప్పుపూలు

కిర్మీరం

3

తనలో చల్లదనం ఎరుగని
దేహాలను దుస్తులనూ కాల్చని,
విసరితే తాకి అగ్నిమయం
చేసి దహించలేని, మృత్యు రేఖ;
విద్యుత్తులా ప్రాకి సిరాపథాన
దిమ్మెక్కించి శిలలా నిల్వజేయు
సతతం తెలి వెలుగుల జడులు
చిందులాడు పూలు — నిప్పుపూలు

4

ఇవో ముప్పులేని నిప్పుపూలు
అంతటా దొరికే రకం కాదు
మధుర మధుర గీతీ వినదిత
జలధారాసిక్త స్నిగ్ధ మేఘం,

మృదు సుషీమ వాస్తరంగ జలధి
లాంటి కవి హృదయం — నివాసం
అతడు వ్రాసే ప్రతి గీతానికి
ఈ నిప్పుపూల వాసన ప్రాణాధారం

అందుచేతనేమొ ! రచన
సముద్రంలో మునిగే, దహ్యా
మాన నౌక లాగ కలిగించును
మనలో ఆవేదన

స్వేచ్ఛా వాయు వీచి కోసం
కాంతి కిరణ శకలం కోసం
సతమతమౌ, పరితపించు
ప్రాణికోటి గుండెలలో

అజ్ఞానపు టర్ధరాత్రి నిద్రలో
పన్నిన వలలో చిక్కి మేల్కొని,
ఉదయవేళ ఛేదింపగ యోచించే
జీవ కోటి గుండెలలో

మారణాస్త్రాలకు మాడిపోని
రేకులు ఎన్నటికీ రాలిపోని,
వాడిపోని, కణకణలాడే
ఎఱ్ఱని పూలు — నిప్పుపూలు

# ఇచ్ఛాగీతం

నా ఫాలాకాశ వీధి మెరయు
నవోదయ సంధ్యా రోచిః కళికల
వీక్షించనిదే జార్తు రెవరు?
తుహిన సిక్త మేఘ కాండపటము

నా మనో వల్మీకం నుండి
భయావహ మృత్యు భుజగి వెడలి
నాట్యమాడ వినిపింతు రెవరు ?
వాయు సుషిర మంజుల నిస్వానము

తావుల నెత్తావుల విరజిమ్ముచు
తెలి వెలుగుల రేకల కోర్కెల
విహాయస కబరీ సంవాసిత
ఘుసృణారుణ పారిజాతమునై

హసింప నాశించిన మరుక్షణం
ఎటు చూచిన వరిణాహ తమ
స్తరంగిణుల కేళీ దృశ్యమె !
మేఘబృందముల నృత్యమె !

కిర్మీరం

ఈ శిథిల విశ్వ దేవాలయంలో
స్వీయ దేహ శిల్పము చూచి,
ఎన్ని వేల శతాబ్దము లాయెను ?
పునర్జీవ సృష్టి యెప్డు జరిగెను ?

పరిణత సంస్కార హయములు
పూర్వ వాసనామయ జీవిత
రథము లాగు వేళ, నాపై
విసరునదెవరా జలద శిలలు ?

నామనో నికుంజ వాటిక
పుల్కరించి కుసుమించెను
స్వప్నాంబుద తనూ శిల్పము
మ్రోగెను ఇచ్ఛాగీతము.

# వ్యాఖ్యాన గీతం

ప్రతి దినం, ఉదయారుణ
రూపంతో ప్రత్యక్షం,
నిశా దీర్ఘచ్ఛాయా
రాగంతో నిష్క్రమణం.

ప్రతి హృదయం భవ్యాశీ
ర్నాద బిందు సంభరితము
మృత్యూపదేశ గీతీ
రీతీ జ్యోతిః ప్రవిగాఢము.

మేఘంలా మనోహరము
రాగంలా అతి మధురము
తరంగంలా ఉచ్ఛలితము
ససంభ్రమ పతనం, జీవితం.

స్వర్గం, నరకం, మతసూత్రం
ఊహా జనిత మేతత్సర్వం
ఊహించలేని మనిషీ
ప్రతిమకూ, రూపంలో కన్న
స్వాభావిక దశలో మాత్రం
సామ్యము అతి ప్రగాఢం.

కిర్మీరం

సదూహో లేఖా విష్కారమయం
ఇంద్ర ధనుర్వల్లీ వలయితం
సంప్రదాయరేఖా సీమితం
సుషీమ కాంతి సుషమాబింబం
మనిషి జీవితాకాశ సర్వస్వం
సాంఘిక పరిణాహ పరిణామం.

★

సుప్త శిశువు ముఖ బింబం
గుప్త ప్రేమ ధనపేటిక వలె
అనంతాబ్దాలుగా ఆకాశం
నిదురిస్తూ కంటూంది కలలు,

తాను కలలుగనే సంగతి
సందర్భం తనకే తెలియదు
తన ఆస్తిక్యమును గురించి
తనకే ఎప్పుడూ సంశయం.

అనంతాబ్దాలుగా నిదురవోని
కీర్తి సముద్రం ఈ ప్రపంచం
క్రొంగ్రొత్త తరంగ దృశ్యాలతో
భిన్న భిన్న కంఠారావమ్ములతో

నిరంతరం కదలి పోతుంటుంది
కోలుపోని తన ఆస్తిక్యముపై
ఎందులకో అంతులేని విశ్వాసం
అందులకే వ్యాఖ్యానాల అవశ్యకత.

# నాలో నేను

కంటికి కనుపించని గాలితెరలా
పాటలతో కదలిపోవు సెలయేరులా

చంద్రుడికి చుక్కలకు ఎంతదూరమో
అంత దూరంలో నావెనకాలె నడుస్తూ

నిదుర నిముషంలో, నిముషాలను
ఎరుగనట్లు నిషా ఎక్కించిన వేళల

గిరి శిఖరాలనంటి వాలుగా విలాసంగా
మెలమెల్లగ సాగిపోవు నీలిమబ్బులా వచ్చి;

గాలికి కాసారంలో చిరుతరగలు లేచి
కదలినట్లు, వ్రేలి యాడు మంచుతెరలు
తెగి పడినట్లు, పగలడానికి తగని
ఎత్తునుండి గాజుగ్లాసు జారిపడినట్లు,

కిర్మీరం

నా యెదలో ఏదో సన్నని ధ్వని
విని, నిదురనుండి మేల్కొనగా,

పౌర్ణిమా చంద్రికా ఫాలఫలకంపై
నిటారుగా నిల్చిన నీడబొమ్మలా,

మెరపు తీగ మెరసి నిష్క్రమించువేళ
మేఘుంలా, ఎక్కడో ఎన్నడో చూచిన
ఆకారం ! నా రూపానికే ప్రతిరూపం !
నా హృదయ ధ్వనికి ప్రతిధ్వని యంత్రం !

# దీప శిఖ

అంధీభూత రూపమున
యోగ నిద్రామూర్తి లా
నిల్చిన శిలామయ విశ్వ
చైత్య నిలయాంగణమున

ఎన్ని మారులు వెల్గించి
దీప శిఖలను నిల్పితిని !

తమిస్రా చషకమ్ము నిండి
పొరలెడి, జ్వాలదనల మదిర
పానము చేసి, అభినయించు
నిశా లాసికా హస్త తలమున

ఎన్ని మారులు నిల్పితిని
దీప శిఖలను వెల్గించి !

కిర్మీరం

నిశ్శబ్ద నిశ్వాస వల్లీ
శృంఖలాబద్ధ, స్వాప్నిక
ప్రకృతి దేవతా హృదయ
దర్పణ నికేతనమందు

ఎన్ని మారులు మలగిపోయిన
దీప శిఖలను వెల్గించితిని !

నిరంతరము నిద్రోర్మికా
డోలికల నూగు, జగతీ
సతీ కంఠాభరణ హార
మణులుగ, కమనీయ

కాంతి కళికలను వెల్గించి
ఎన్ని మారులు నిలిపితిని !

ఆశా శాఖీకల కులాయ
ములు కట్టుక కనులుమూసి
కలలో మసక వెల్గులను సం
దర్శించు చీకటిగుండెపై

ఎన్ని మారులు నిల్పితిని
దీప శిఖలను వెల్గించి !

ఈ నాడు ప్రతి హృదిలో కాంతి
వల్లిక చిగురించి కుసుమింప,
ఈ నాడు సంభావనాత్మక
జగతి ఆనందనృత్యము సేయ,

గగనారామావరణమున
లలంతికా తమస్తంత్రులకు
వ్రేలాడు తారా దీపికా
ముఖములు వెల తెల బోవ,

భావ వీధీ చ్యుత సౌవర్ణ
కల్పనా స్వర్గ సద్మమున
చైతన్య భావ సంఫుల్ల
జనతా మనః ప్రపంచమున

అంతిమ శ్వాస విడువని
తర తరమ్ములకు మలగని
సర్వ మానవ జాతి నూత్న
చరిత దళములు విరియ,

ఇరుల గుండెల దరుల నొరసి
స్నిగ్ధాశా కాంతి మహా
స్రోతస్విని ప్రవహింపగ,
ఏకైక సాహిత్య ప్రథా

దీప శిఖ వెల్గించి నే
డా విష్కారము సేతము.

కిర్మీరం

# ఘంటానాదం

సిత తారా సుమమాలా లం
కృత కబరీ భర నిశీథినీ
దరహాసోన్మీలిత నేత్ర ప
దవి అగ్ని చిత్రములు సృజించి

నిద్రా భారావనమిత
నిశా తరుణీమణి కాటుక
కన్నుల స్వాప్నిక నీహార
కాంతి సుధాధునులు నింపి

శయిత జలద మోహినీ ప్ర
శాంత హృదయ విపంచికా
తంత్రులపై మధుస్వర వి
తాన గీతము మ్రోగించి

త్రుంచిన జీవిత సుమ వి
దూరజ ధూళి విలిప్త శ
రీరిణి ! మృత్యుసఖీ ని
ర్మిత నవ్యాశాచ్ఛాయా
సౌధాలను శిథిలపరచి

కిర్మీరం

నిదురించెడి మహా ప్రజా
నీకము మేధా సౌధము
గ్రమ్మిన, తమోనైల్యరాశి
కరగిపోవ వెలిగించితి !

నవ్య దీప శిఖా తోరణమ్ము
దివ్య దీధితీ ప్రసారణమ్ము

★

అంధకార దేవత సౌధ
ప్రాంగణాన, ఉదయ కాల
ఘంటిక మ్రోగించితి ''గణ
గణ గణ'' మేల్కొనగా ప్రజ.

కిర్మీరం

# కీర్తిస్తంభాలు

నాటి సుజాతకుల హృదయ
ద్వార కవాటాల ముందు
ప్రేమామృత రసపూరిత జిహ్వాలు
చాచి, తారాడిన భుజంగాలు

దివారాత్రులు కనుల ముందు
నటియించిన పెను భూతాలు
పాదమెత్తలేని నోరు కదపజాలని
కాల శ్మశానంలోని కీర్తిస్తంభాలు

నాడు వేదనలతో సంస్పందించగ
హృదయాబ్జము; శోకంతో చిక్కని
నీరై నిల్చిన వెచ్చని గుండియతో,
బాధలతో కంపించిన తనూ శైలము

కిర్మీరం

నేడు ధాళధళ్య స్ఫటిక మయ
ప్రాంశుమూర్తియై, ప్రశాంత
మాన భాషతో,ప్రతి మనీషి
గుండె నూపి మాట్లాడునదెవరెరుగుదురు?

నేడు శీతల చందన పరీమళ
సమ్మిశ్రిత వాయు పరీహాస
శ్రీలతో, అపరిమాణ వాజ్రేయ
శరీరంతో నిల్చిన కీర్తిస్తంభాలు

కనులు తెరచి, ఊగిసలాడే
తళ త్తళ రేఖా సౌందర్య గరిమ
వహించలేక, పరిభ్రమించు
ఉన్మాదిని, జలద విలాసిని,

సుమించి గాలికి రాలిపోవు
సుమ కన్యక, ప్రకాశించి కారు
రాతిరి పాలిపోవు చంద్రబింబం,
కడు దవ్వునుండి శైలమెత్తు
ఎగసి పడి పోవు తరంగం

అందమైన ప్రతి వస్తువు భౌతిక
రూప మశాశ్వతమ్ము జగత్తులో
శశ్వత్కాలిక వస్తువు ప్రయోజనం
లౌకిక జగత్తున కర్థరహితం

కిర్మీరం

గగన తలంపై వెలిగే సూర్య
చంద్రులు ఏ విశ్వనాథుని
కీర్తిచిహ్న కేతనాలు ?

నాకనుల నుండి మీ కనులదాక
మింటికెగసి నిల్చిన, 'తాజ్మహల్,
అజంతా' శిల్పకళాఖండాల్లా
లక్షలాది రసరాణ్మణుల
సమాకర్షించలేని; శిశువునకు
పశువునకు, స్పందించే గుండె
లేని తనూశిలకు కనుపించని
స్వచ్ఛ శ్వేతవర్ణ మూర్తివంతములు
కాలశ్మశానంలోని కీర్తిస్తంభాలు.

# చీకటి మనుషులు

అస్తమించే సూర్యబింబాన్ని
ఆనందం విడిచే ఆకాశాన్ని
అవలోకించే సమయాలలో
నా కనులలోకి తొంగిచూస్తూ
మౌనంగా నీడబొమ్మల్లా
వెళుతుంటారు, ఎవరు మీరు?

ఉదయించే చంద్రబింబాన్ని
విషాదం విడిచే ప్రవాహాన్ని
అవలోకించే సమయాలలో
నా కనులముందు, రెక్క విప్పిన
మల్లెపూవులపై తుమ్మెదలవలె
పరిభ్రమిస్తుంటారు, ఎవరు మీరు?

వెలిగే తారా దీప శిఖలు
నీలాకాశాన్ని విడిచిపోయేవేళ
వృక్ష వర్షీయసి, పండిన
ఆకుల కోర్కెలు విడుచువేళ

కిర్మీరం

కాలాన్ని మ్రింగిన చీకటిలా
శైశిర విచార వాయువులా
నెమ్మదిగా వస్తుంటారు. ఎవరు?

గాలిలో ఎగిరే పావురాయిలా
నా పాటలు వినిపిస్తుంటే,
భూమిలో దాగి పోదాముని
అనుక్షణం ఆరాటపడే, నదీ
తరంగాల్లా శబ్దిస్తూ, వేగంతో
అసహనంతో పరుగిడుతుంటారు ?

మిమ్ములను చూడగనే, నాగుండెలో
పూలు పూచి, కనులనుండి రాలి
కొంత సేపు గాలిలో ప్రయాణించి
అంతలో చీకటిలో కలిసిపోతాయి !

గగన వీధి విరిసిన పాలవెల్లిలా
నా మస్తిష్కంలో, మేల్కొని వున్న
ఊహలు అల్లే కలలు, చలించడం
మాని, ఒక్కమారు నిదురపోతాయి.

దీనతాభావం రూపుగొన్న
చీకటి, అందులో సగం వెలుగు
దెయ్యాలా ? లేక దేవతలా ?
ఎవరుమీరు? ఇంతకూ చెప్పరేం ?

భూమిమీద ఎక్కడో నివసించే
నా కంటికి కన్పించే, సూర్య
చంద్ర బింబాలు, చీకటిముద్దలా
మబ్బుముక్కల్లా, మీకు కన్పించేనా!

దీపానికి నీడ ఎంత దూరమో
నాకు, అంత దగ్గరలో, వెలుగు
మేడక్రింద చీకటి మబ్బుల
నిచ్చెనవలె, నిల్చిన మీకు,

నా మాటలు వినిపించడంలేదా ?
మీరంతా చీకటి మనుషులా ?
మీకన్న మంచుముద్ద నయం !
ఆ దృష్టితో నాకు కళ్ళులేవు నిజం !

కిర్మీరం

# భానూదయము

భానూదయ వేళాసన్న మయ్యె!
ఇంకా పాముల్లా నా చుట్టూ
పారాడే వెన్నెల వెలుతురు నీడలు
ఈ నీడలలో చీకటివృక్షంలా
పెరిగి, ఇంతకాలం నిదురిస్తూ
నే వున్నానని నాకే తెలియదు

నే కనులు విప్పిన మరుక్షణం
మంద మంద మిహికా సాహిత్య
ధురా పటలము నా అక్తారుణ
ముఖ మండలమును కప్పివైచె

నే మేల్కొని కదలాడితినో లేదో !
ఇటు నటు పారాడే తెల్లని
నల్లని మబ్బు గముల సంకెలలు
బంధించెను నా పాదయుగళి

కిర్మీరం

రాగరహిత పరిమ్లాన పుష్పంలా
మృతశరీరి పరిపాండుర ముఖంలా
మసృణ చాంద్రీ వాహిని వెలవెల బోయి
అంతలోన వర్ణ విహీనమయ్యేనేమి ?

తలలూపుచు, చేతులెత్తి, చిత్ర
గతుల నాట్యమాడు చీకటిచెట్లు
సమస్తం తెరచాటున దాగిపోయె
రాత్రివేళా నటి కురులనిడిన
తెల్లని పూల బంతి కలలా
ఎచటనో జారి పడిపోయెను.

భానూదయ వేళా సన్న మయ్యె
కాంతి కళా శిల్ప మూర్తి నౌదున !
నటత్ సురాపగా ప్రావారము
నా భుజాంసము నలంకరించున!

కిర్మీరం

# క్రాంతి దర్శనం

కాంతి కిరణం కంటి ముందు
గతులు తప్పి భ్రమించు వేళల
మతి చెడి లోకం, చీకటినే
గాఢంగా వాంఛిస్తున్నది

‘ఉటోపియా’ పక్షిలాగ,
ఎగిరి పోవు; అందమైన
తెల్లని మబ్బుల కోసమె
జగమంతా తపిస్తూంది

స్వాతిశయంలో తెలియక
కొన్ని శతాబ్దాల క్రితం
శైశవదశలోవున్న మనకు
విమానాలె ! పుణ్యాత్ముల
కంటికి మాత్రం కనుపించే
స్వర్గపురీ పక్షులు కదూ !

కిర్మీరం

ఈ చీకటి బ్రతుకు కొండలను
ఊహా విద్యుల్లేఖినితో
అజంతాను మరపించే
నవ జీవన చిత్రాలను
చిత్రించే తరుణం, బహు
దూరం లేదనుకుంటా

కాలచక్ర భ్రమణంలో
పూర్వరంగ మంతరించె
ఋతువు మారె, వీచే
గాలులు దిక్కు మారె.
జలధారలు హిమశైలీ
రూపమెత్తి నవ్వుచుండె
ఘుసృణారుణ మసృణ
పద్మరాగ కాంతి ! కాంతి !

చీకటి పొరలు క్రమ్మిన
మానవుని మస్తిష్కంలో
వజ్రాఘాత బాధా సహిష్ణు
మేఘావళి గుండెలలో
మంచులా గడ్డ కట్టిన
చీకటి గుండియ దారుల
తరాల నుండి చీకటిలో
బ్రతుకు గడపిన కన్నుల్లో

కిర్మీరం

తరాల తరబడి తమతమ
రూపాలను మలచుకున్న
చీకటి ప్రతిమల కరగించే
జీవ రాగ కాంతి ! కాంతి !

బుద్ధికి అందీ అందక
అప్పుడప్పుడు మెరసిపోవు
ఊహా జగత్తుకు చేరువ
మనో చక్షువు చూడగల
సృష్టిగత చైతన్యధార
నైకరూప కాంతిధార !

★

Kirmeeram

by

Madiraju Ranga Rao

Published by

Adarsa Sahityamala, 17-5-350, outside Dabirpura N.P.62,

Hyderabad - 2

ప్రకాశకులు :
ఆదర్శ సాహిత్యమాల
17–5–350 డబీర్‌పుర వెలుపల, హైద్రాబాదు 2.
(ఆంధ్రప్రదేశ్)

ముద్రణ :
సాధనా ప్రింటరీ, హైద్రాబాదు.

# మేల్కొన్న ఆకాశం

మాదిరాజు రంగారావు

# స్వేచ్ఛా కవిత్వం

# మేల్కొన్న ఆకాశం

## ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

MELKONNA AKASAM

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: అక్టోబరు, 1959

సాధనా ప్రింటరీ, హైదరాబాద్

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

# 1

నీలాకాశ గుహాముఖం నుండి
బయల్వెడలిన కాంతి సింహం
నిర్మల కాసార దర్పణంలో
తన ముఖం చూసుక మురుస్తూ

రోదసీ వితర్దికపై
బంగారు పూలు విరియ బూసిన
కాంతి వల్లీ నికుంజంలా
సంతోషంతో కూర్చుంది.

రోదసీ వితర్దికపై కూర్చుని
పకాలున నవ్వే కాంతి సింహం
నాకెంతో చూడ ముచ్చటై
దానితో కొంతసేపు హాయిగా

కాలం గడపి, ఆనందించాలని
చేయి చాచి సైగచేసి పిలిచా.

నాపై జాలి కలిగి కాబోలు
నా ప్రక్కనే నీరు నిండి వున్న
గాజు గ్లాసులోకి దూకేసింది

నీటి చుక్క తొణకలేదు
గాజు గ్లాసు పగులలేదు

గాలి తెరల మంపులపై
తుమ్మెద కాలి జాడల్లా
నీటి అలల వంపులపై
మంపుగ కదలిపోవు గాలుల్లా

గుండెలోతు పొరల నుండి
ఎగయు రాగ మాలల్లా
వ్రేలికి చిక్కక కదలిపోవు
పాద రసపు గుళికల్లా
ప్రయత్న నైష్ఫల్యాన్ని
అంగీకరించనీయలేదు

అసంతుష్ట వాసనామయ జీవులతో
అర్ధ సుషుప్తిలో, అపుడపుడూ
కాంతి సింహాలూ, చీకటి దెయ్యాలూ
మనుషుల రూపాల్లో స్నేహం చేయడం కద్దు.

కొంతసేపు అలాగేవుండి అంతలో
నీడబొమ్మలా, మారిపోయి
కారు మొయిలులా చీకటిలో
నేస్తం కలిసి పోయినట్లు గుర్తు

చీకటి గుహలో దాగిపోయినా
మెరపులా ఎప్పుడో దూసుకవచ్చి
మీదబడి, నిలువునా నిండు
ప్రాణం తీసేస్తుందనే ఆలోచనకు
అంతగా నిజం వున్నట్లు తోచదు

అయినా శాంతంగా వచ్చి
ప్రతి ప్రాణి వెంట కొంతసేపు
నీడలా తిరిగిపోవు,
ఈ సింహానికి అంతగా భయపడి
ఓ మూల దాగిపోవడం దేనికి?

ముఖ్యంగా ప్రతినిత్యం నేను
ఆనందం విషాదం అనుభవించే ప్రపంచంతో
వదలలేని ప్రగాఢ సంబంధం కలిగినవాడిని
బ్రహ్మైక్య భావనచేసి మీకు అందకుండా
ఎక్కడో దూరంగావుండి మాట్లాడే ఇష్టంలేదు

భయంతో కూడిన గట్టి నమ్మకంతో
తమ కీర్తిని కాపాడే మనుషుల కోసం
బ్రతికే, దేవతలు వాళ్ళ బంధువులు
అభిమానులు నివసించే ఆకాశంపైన

లోకాలను ఆగ్రహంతో, అనుగ్రహంతో
కాంతి బాహు సూత్రాలలోకి తీసుకొని
ప్రేమించే సూర్యునిలో, కామించే చంద్రునిలో ;

అహంకారంతో సర్వం భస్మసాత్కృతిచేసి
ఆనందంతో నవ్వుల తెలిప్రోవులతో
గాలిలో ఎగిసే, జ్వలించే అగ్నిలో
లోకాన్ని మాయంచేసి మాట్లాడని చీకటిలో
అజ్ఞాన రేఖా సంవృత జ్ఞానం, అభిమానం

ఏకాంతం మౌనం ప్రసాదించే ఆలయంలో
చర్చిలో మసీదులో, సమాధిలో శ్మశానంలో
శూన్యంలో అంతమొందు ప్రపంచంలో అంతటా
వాయువులా వ్యాపించి, అణువులో ఒదిగిపోయి
వ్యష్టిగా సమిష్టిగా బ్రహ్మాండం విస్తరించి

పూర్వం చాలమందికి వాళ్ళ సంస్కార
వాసనల స్థాయి భేదాలను బట్టి
భిన్న భిన్న రూపాలలో స్వభావాలతో
అగుపించి, చరిత్రగతికి వ్యతిరేకంగా
సిద్ధాంతాల్లో ప్రమాణాలతో తన స్థానం
స్థిరత్వం సంపాదించుకున్న దేవునితో

ఇరవయ్యో శతాబ్దంలో బ్రతికే మనిషికి
ఆధునిక టెలివిజన్ యంత్రంలో
సంభాషణ జరిగిందని చెబితే
ఇందులో ఎవరూ విశేషంగా ఆశ్చర్యపోయి
సశేషంగా ఊహించి, అనుమానాలకు
ఏ మాత్రం అవకాశమివ్వ నవసరం లేదని

--మనవి.

ప్రపంచం విజ్ఞాన యంత్రశాలగా
మారి, వ్యక్తి జీవితం రాజకీయ
తత్వంలో లీనమైపోయి; మతం
మనిషికి చీకటి లోయలా అగుపడి.

జీవితానికి క్రొత్త వ్యాఖ్యానం బయలుదేరి
ఆలోచనలతో స్వభావం పూర్తిగా మారిపోయి
దానితో క్రియాదశా పర్యవసానం మారిపోయి
ప్రేమ ద్వేషం అనుభూతులు కేంద్రంగా
నడిచే మానవ పరిణాహ పరిణామ
చరిత్రకు క్రొత్త విలువ లేర్పడుతున్నవి.

చరిత్ర అట్టడుగున నిటారుగా దిగిన
చీకటి నీడల్లో కలసి పోయి
వారసులేనాడో అంతరించిన నిన్ను
మరచి పోవడానికి ఎంతో కాలం పట్టదు.

చంద్రలోకం తరువాత సూర్యలోకం
మానవుడు ఆక్రమించుకుని సంపూర్ణంగా
నిన్ను పదవీభ్రష్టుణ్ణి చేస్తాడు నిజం.
అందుకని ముందుగా మేల్కోడం మంచిది.

సృష్టికి ఆరంభ దశలోవలె మృగాలకు
దగ్గరిగా బ్రతికే కాలం అంతరించి
ప్రస్తుతం జంతు దశ దాటిపోయిన
ప్రపంచంలోని నేటి మానవుడు–

రామణీయక–రసానందానుభూతి
వికసించిన సాహిత్యం, సౌందర్యం
మనోదశకు చెందిన మానవత్వం
పుంజీభవించిన సంస్కృతీ శిల్పం
రేపు –
ఏనాడో ఎక్కడో జరగబోయే
యుద్ధం యొక్క విపరీత పరిణామం
ఒక దేశం అనుభవించే బానిసత్వం
అలముకొన్న అజ్ఞానం అలసభావం
మరోదేశం యొక్క పురోగమన వేగం
సామాన్యుని ప్రస్తుత జీవితాన్ని
కదలించి ఆకర్షిస్తున్నప్పుడు–
హృదయాన్ని స్పందింపజేస
ఒక జాతి మనోలక్షణం
మరో జాతి ఊహాసౌందర్యం
ప్రపంచం సమంగా అనుభవించి
ఆనందిస్తున్నప్పుడు— రేపు
భేదరహిత సమస్త మానవజాతి
మనస్సు శరదాకాశంలా స్వచ్ఛమై
విశాలమై, ఊహలు గాలిలా అంతటా
వ్యాప్తమై, అవతరించిన విశ్వభాషలో
వినిపిస్తుంది మానోహర కాంతిగీతం

శిలలో ఆకారంలేని ఆత్మలో
దేశ వ్యాప్తంగా సుప్రతిష్ఠుణ్ణిచేసి

సర్వవేళలా నిన్ను రక్షించడానికే
జరిగిన ఉరిశిక్షలు, అవమానాలు
హత్యలు యుద్ధాలు అసంఖ్యాకాలు

నీ రూప కల్పనలు మలచడమే
అతి ముఖ్యమైన ప్రయోజనంగా మారి
సౌందర్యం సౌకుమార్యం మిగిలిపోయి
చివరకు యాథార్థ్యం కోల్పోయిన కళలు

జీవితంలో అలసిపోయి, విశ్రాంతి
సంఘించే తరమబడి శరణ్యాం
పొందదలచిన మనిషికి ఏమాత్రం
ఊపిరి సల్పనీయని, నీ కీర్తిసౌధ
నిర్మాణానికుపయుక్తమైన పునాదిరాళ్ళు

మాయలో మగతలో మౌనంగా
ఎవడికీ కన్పించకుండా కాలంగడిపే
నీకు, ఆగామి శతాబ్దాల ఆగమనం
చరమరాత్రి ఘడియలతో నిష్క్రమణం

భూకంపం—యుద్ధం–క్షామం
ప్రభుత్వ పతనం—అన్నీ మానవ
దురదృష్ట హేతుజనిత సంఘటనలుగా
నీ సాహస కృత్యాలుగా చెప్పుకొని
ఇష్టంలేని బాధ్యతలను గమనించి

నీ ఇష్టానుసారంగా మాపై నీవు
ప్రయోగించే భయంకర దారుణ
మారణాస్త్రాలు, దారిద్ర్యం, రోగం,
మృత్యువుకు; భయంతో లొంగిపోతూ
ఎత్తిన తల దించడం ఆచారం
వంచిన తల ఎత్తడం అపచారం
మర్యాదాలోపంగా పరిణమించి –
కాంతి కిరణ శకలం ఎరుగని
ఆకాశంలా చాచబడిన, చీకటి
చేతుల క్రింద ముడుచుక కూర్చొని
ఆశీర్వాదంగా భావించే దైవదశలు
అంతరింపజేసి క్రమంగా ఇంతవరకు
'స్ఫుట్నిక' దశకు చేరుకున్న
ఇరవయ్యో శతాబ్దం మానవుడు.

ఎన్నో మైళ్ళ దూరంలోవుండి
నేను మాట్లాడుతూ నీకు కన్పిస్తుంటే
చూచే కళ్ళమీద నమ్మకంపోయి
గాజు బంతిలా మారిపోయి
ఆశ్చర్యపడ నవసరంలేదనుకుంటా.

నిన్న అసంభవాలనుకున్నవి ఈరోజుకు
పూజలతో ప్రార్థనలతో నిమిత్తం లేకుండా
రేపటికి ఆశ్చర్యం లేకుండా సంభవించడం
ఇరవయ్యో శతాబ్దం కాలం లక్షణం

మానవుణ్ణి వున్న చోటునుండి కదలనీయని
అనాదినుండి సంభవించే కర్మహక్కులు
వారసులకు సంక్రమించకుండా చెయ్యడం
ఇరవయ్యో శతాబ్దంలోని మానవ స్వభావం

గతానికి మానవుడు చాల దగ్గరి బంధువు
వర్తమానం అందులో శిలానిద్ర వదిలించే
విప్లవం క్షమించరాని శత్రువు వంటిది అతనికి
జడజగత్తుకూ కాలానికీ ప్రగాఢమైత్రి
మానవుడీ మైత్రిని భగ్నంచేసే మహాయుధం
అతనికీ కాలానికీ సముద్రమంత శత్రుత్వం.

అక్కడక్కడా చీకట్లతో వెన్నెలలతో నిండి
గాయాల బాధలతో ముల్లులతో, రక్తంతో తడిసి
లోయలతో ఎడారులతో భయానకంగా
ఒంటరిగా, మౌనంగా, కోపద్వేషాగ్ని చిహ్నాలతో

అడవులతో జంతువుల మృగాల తత్వంతో నిండి
ఇంతవరకూ సమరేఖాభావస్థితిలో నడవని
ప్రపంచ చరిత్ర కారణ మనోదశలు వ్యత్యస్తమై
సిద్ధించిన స్వాతంత్ర్యం సమభావం ఊహలతో

కిరీటాలు అగ్నిలో మండి భస్మమై రాలిపోయి
సామాన్యుని హృదయం ఉదయకాంతి చక్రమై
ప్రతి వదనం హసించే సుమస్తబకంగా మారడం
ఇంతవరకూ సాగివచ్చిన శత్రుత్వం ఫలితం
ఇంతవరకూ సాగించిన మానవుని ప్రగతిరేఖ.

వదలబడిన అణ్వాస్త్రంలా ఎదురులేని,
మైదానంలో విసరబడిన బంతిలా
చేతికందని వేగంతో పరుగెత్తే కాలం
సృష్టికే తెలియని భవిష్యజ్జాతక చక్రం

కాలాన్ని నియమించలేడు దేవుడు
కాలానికి తలఒగ్గక తప్పదు

ఉదయ సంధ్యాగమన వేళ
తూర్పున పాలిపోయిన
మంచుమనిషివలె పెదవి
కదల్పక మౌనంగా వున్నా వేం ?

''నేనెవరినో నాకు
నీవిప్పుడు చెప్పేదాక తెలియదు
నిజం చెబుతున్నా విను
నీవే అంటే మానవుడే దేవుడు''

# 3

ప్రతి క్షణక్షణం ప్రత్యణువణువు
పరస్పర సన్నికర్షణము నొందుచు
శైలీ రూపము నొందు, అదృశ్యమాన
జీవిత సమాధిని కదిలించే గాలులు

పొంగులుగా గుమ్ములుగా క్రమ్ముక
వచ్చిపోవు వెల్తురుల, ఇరులతో
కూడిన తొలి మలి సంజలందు
విరిసిన మనసు మల్లెపొదలలో

తుమ్మెద బారుల రొదలతో
గుప్పున కమ్మని తావులతో
ప్రాణ దఘ్నముగా నిండుగా
మెల్లగా కదలివచ్చు గాలులు,

హృదయాంబుధి విలోల వీచీ
తంత్రీ మృదు నిస్వన మోహన
సాళగ రాగాలను వినిపించే
క్రమ పరిణామ పరిణాహ మేధా
ప్రపంచ దిశల, ఆలోచనా
కిర్మీర పరాగం విరజిమ్మే గాలులు.

శిలల ఒరపిడులతో కదలిపోవు
సెలయేళ్ళ సన్నని చిరునవ్వుల
సవ్వడి వలె, నా గొంతు నుండి
సాగివచ్చు పాటలకు శ్రుతులుపోయు
ఎత్తిన అలల తలలపై మెత్తని
కాలు ఊని కదలివచ్చి గాలులు.

యంత్రంలా రొదతో గడచిపోవు
బ్రతుకు విడిచే బరువు నిట్టూర్పులు
నాగలిలా మెల్లగా కదలిపోవు
బ్రతుకు వదిలే వేడి నిశ్వాసాలు
మోసుక వచ్చి; రాత్రింబవళ్లు
సగం గాలిలో సగం నీటిలో తేలు
నా గుండె నూపు, స్వనమంజులములౌ
పరీమళ సంభార వాహులు –

బ్రాహ్మీ ముహూర్త మహిత వేళ
మనోవాంఛా తరంగ మాలాలోల

స్మృతి పథాన, పూర్వ జన్మ గత
వాసనా ప్రపంచముల నూహింపజేయు

పసిపాపల పెదవులపై చిందులాడు
వెలుగు నవ్వుల అలల గలగలవలె
ఆరని ఎద మంటలతో శత్రువులా
మనసును కదిలించి కవ్వించెడి
ఈ గాలుల నేనెలా మరవగలను
ఈ గీతం వినిపించక వుండగలన?

# 4

ప్రవాహంలా ఒకమారు వేగాతివేగంగా
చీకటిలా మందంగానో, లేక వేరొకమారు
వెలుతురులా తేలికగానో కదలీ కదలక
ఆశా ప్రసారిత నీల మేఘ భుజంగంలా

కంటి చూపునుండి మెల్లగా జారిపోవు
కాలం విడిచే నిట్టూర్పులలో తూగుతూ
అవ్యాహతంగా సాగిపోవు ప్రపంచంలో
ఎక్కడా — ఎన్నడూ – చూడని –
అద్దంలో బింబించే నాముఖంలో చూచా

ఒడ్డుకు ఒదుగక మెలికలు మెలికలుగా
తిరిగిపోయే నీటి అలల విరుపులు
ఒక తీవ్ర ఝుంఝుకు చెల్లా చెదరై
కూలనున్న నీలిమొగిళ్ళ మెట్ల మలుపులు

సగం మూసుకున్న తూరుపు కనురెప్పలు
వదలలేని మాయ మత్తు మమకారపు నీడలు
మొదట అద్దంలో నా ముఖ బింబంలో చూచా

ఈనాటి వరకు కళ్లుమూసి ఎరుగని
సూర్యుని మనసులో తిరిగే, చీకటి
బంతిని 'గోల్ ' చేయాలనే ఊహతో
వెన్నెల దుస్తులు ధరించి తిరిగే—
మనిషి ముఖం తరువాత అద్దంలో చూచా

కొన్నాళ్ళు ఆకాశం డొక్కలో పర్వతంలా
నిదురపోయి; చీకటిచెట్ల గుంపువలె
కలవరించి మేల్కొని కలల బరువుతో;
ఉదయం ఊపిరి పీల్చడం మొదలిడిన
సమయంలో; మరోప్రపంచం పిలుపుతో
చిరకాలంగా నేనెరుగని నేస్తం రూపం
అద్దంలో బింబించే నా ముఖంలో చూచా

# 5

చీకటి గుడిపై వెలిగే తారల
శిల్ప సౌందర్యం విలోకించే కన్నులలో
ఉదయ రేఖలు తులకించునపుడు
చైతన్య స్ఫూర్జితమైనప్పుడు హృదయం

వెలుగు తలుపులు మూతవడిన
చీకటి కోట గోడలు దూకివచ్చి
ఎవడో సూర్యుడు చంపేస్తాడనే
అజ్ఞాత భయం తొలగిపోయినవేళ

ముడుతలు పడిన శరీరంతో
నడువలేని పండుముసలి, సముద్రుని
తరుణ హృదయంలో ఊగిసలాడి
తమంతటమలగిపోవు కామనలకు
స్వరూపాలు పరిణమించినపుడు

గ్రీష్మాదిత్య జ్వాలలకు తపించి
నీలాంబుద మాలా జలధారాసార
మనోజ్ఞ నవంనవతా బంధురమౌ,
భూదేవత విడిచే సురభిళ
నిశ్వాస పవన వీచికలవలె, ఊహలు
బుద్ధిని అల్లుకొన్నప్పుడు, మనసు
మల్లెమొగ్గలు వికసించినపుడు
వినిపిస్తుంది – కాంతి గీతం.

సూర్యతేజో కిరణలవ మెరుగని,
జివ్వన నెత్రు నాడులు లాగు,
చలిగాలికి బిగిసిన మంచులా మారి
చలనశక్తి ఉడిగిన నదివలెనో

ముసరుకున్న పేదరికం దాడులకు
ఆగలేక, పొంగులతో పరుగులెత్తు
నెత్రువాకలు ఒక్కమారు ఆగిపోవ;
ప్రేతాకృతుల వలె నిదురపోవు
చీకటి మనుషుల గుండెలలో
అనవరతం వినిపిస్తుంది –

ప్రత్యణువును స్ఫులింగంగా
ప్రతి మనస్సును విద్యున్మాలగా
రామణీయక రసజగత్తుగా
మార్చివేయు కాంతి గీతం.

## 6

ఉదయంనుండి సాయంసమయం వరకు
మండిపోవు అగ్నిజ్వాలా తోరణాలతో
నిండిపోయి దట్టంగా చీకటి పొరలు
క్రమ్మిపోయిన రాత్రివేళకు మసిబొగ్గై

ఆరిపోయి చల్లబడిన భస్మవేదికలా
మారిపోయినదో లేదో ఆకాశ శ్మశానం
అక్కడక్కడా ఇంకా గాలికి చెదరిపోయిన
నివురు గప్పిన నిప్పురవ్వలు చుక్కలు

మరో శవదహనానికి మళ్ళీ తూర్పు దిక్కునే
సత్వర సన్నాహం జరుగుతుందని వినికిడి.
సృష్టి జరిగిన నాటినుండి మొదలుకొని
ప్రతి రోజూ ఇలా ఎంతకాలం సాగుతుందో ?

పునర్జన్మ వున్నదోలేదో తెలియదు గాని
ప్రతి ఉదయం మరోజన్మ ఎత్తినట్లు వుంటుంది.

మృత్యువు అందంగా ఆనందంగా వుంటుందని
మొదటే తెలిస్తే మానవుడు ఈనాటికి
ఇంత ఎత్తుగా విషమంగా పెరిగి వుండేవాడా?
ఈ గీతం వినిపించే అవకాశం వుండేదా ?
భూమికి మేఘగమన రహస్యం తెలియజేస
వృక్షాంగనలను రివ్వున కౌగిలించుకొని కబుర్లు చేప్ప
మండే అగ్నికి ఆనందం ఉద్రేకం కలిగించే
కపాల రంధ్రాలను పూరించి సంరావము చేస్తూవచ్చే

శ్మశాన సమాగత వార్తావాహులు గాలులు
సృష్టిని మేల్కొల్పే ప్రత్యుషఃకాల సాంగీతికులు
మస్తిష్కంలో, సైంటిస్టు శోధించినా కన్పించని,
వేదాంతికి ఆద్యంతం అందని, ఆలోచనలు.

మృత్యువు ఊహతో వేదాంతం మొదలు
మృత్యువు భయంతో జీవితం ఆఖరు
పరితః కాంతి విస్ఫురమర దీప శిఖ
వేదాంతం విడదీయరాని జీవితం.

# 7

ఉన్మీలన కారణ మృదుల
జీవశక్తి స్ఫూర్తి ఎరుగని
రంగు కాగితపు పూలు.

బ్రతుకులో శైలీస్థితికన్న
సౌకుమార్యం నైశిత్యం తెలియని
మనుషులు – తిరిగే దిష్టిబొమ్మలు

నీడలా కదలాడుతూ పవళ్లు
రాత్రి చీకటిలో కలిసిపోతే
కాల స్వరూపం తెలుసుకునే అవసరం
మనస్సుతో పనిమాత్రం ఏముంటుంది.

పవన వీచికవలె, వెలుగు రేకవలె
కదలాడుతూ విప్పారిన హృదయంతో

మంచు ముసుగు కాస్త తొలగించి
చీకటి పొరలు దాటిరా ! కలుస్తా

దీప శిఖ చుట్టూ ముసిరిన
దారి తెలియని గ్రుడ్డి వెలుగులు
దీప శిఖను స్పృశించలేవు సరే
చీకట్లకు దారైనా చూపలేవు

సూర్యుణ్ణి ప్రతి ఉదయం
ఎంతోదూరం నుండి ఆనందిస్తూ
సాయంకాలానికైనా ఒకనాడు
పట్టుకొని సంతోషించాలని
రంగురంగుల ఊహలతో గడపడం
చిన్న పిల్లల మనస్తత్వం కదూ !

# 8

అడుగు తీసి వేసే లోపల కాలం
దివ్యులకూ తమకూగల సామీప్యం
దూర దూరమౌతూ, మారిపోతే పోనీ
రాక్షసులుగ హంతకులుగ మానవులు
మనసుకూ మనిషికీ తెగిపోయి సంబంధం

అందరికీ ఆలోచించడం చేతకాదని
తనే అందరి బదులూ ఆలోచనచేసి
ఎదుటివాడి మాటవినే అలవాటు తప్పిన
పూర్వపు దేవుడి రాజ్యం మళ్ళీ రానీ!
అగ్ని గుండమై పోతేనేం? లోకం!

చెట్లు ఊగడం మాని గాలిలో
కదలిపోవడం ఆరంభించనీ!

దొంగచాటు వ్యాపారం సహజమై
భయం గుణస్థాన మాక్రమించుకోనీ !

జంతువులు కాదు మృగాలు గెలిచి
మానవులపై అధికారం సాగించనీ
మన నీడలె మనపై తిరగబడి
శత్రుత్వం సహజగుణమైపోయి
శ్మశానంగా మారిపోనీ ప్రపంచం
ఎక్కడైతేనేం గడవడానికి కాలం !

సూర్యుడు మండి మండి మసిబొగ్గై
వాయువు బరువెక్కి చలనమాగి
మంచు రాతి పరుపుగా మారి జలం
తలలూపే చెట్ల గుంపుగా మారి జనం

లో వెలుగెరుగని మూతవడిన కళ్ళతో
వీధుల్లో శిలాస్థూపాల్లా నడుస్తూ
అడవుల్లో వేణువుల్లా రొదచేస్తూ
శిరస్సుపైని విద్యుద్గోళం వెల్తురులో
బ్రతుకున కలవాటుపడి, నిద్రలో
మృత్యువుతో సంధిపత్రం వ్రాసుకోనీ !
ప్రాణులం అందులో మానవులం కాకపోమూ!
బ్రతికిన కాలం జీవితమనిపించుకోదూ!
ఊపిరి ఎక్కడిదక్కడే ఆగిపోదుకదా!
అడుగు తీసి వేసే లోపల కాలం —

# 9

కాలాన్ని హత్యచేసి కాలం
దాని స్థానం, ఆక్రమించి తిరిగి
హతమౌతుంటుంది మరుక్షణం

మెరపులా మెరుస్తూ తుదిక్షణం
ఆశలా లాగుతుంది—ఎక్కడికో
భూమ్యాకాశాలు కలిసే చోటికి.

తెలిమంచు వెల్గు తొలిసంజల
రక్తంతో తడిసిన ఈ హంతకుని
చేతిలోని పిస్టల్-సూర్యుడు
గడ్డకట్టి నల్లవడిన నెత్రు—రాత్రి

తన శిరస్సుపైని దీపాలు
ఎప్పుడు వెల్గినదీ, ఆరినదీ
ఎరుగని చీకటి కంబాలకు
కాల స్వరూపాభిజ్ఞతతో పని ?
జీర్ణ శిల్ప మందిరంలో నిద్రించి
మ్రోగే ఘంటానాదానికి మేల్కొనే
దేవుణ్ణి సైతం–ఊగించే
మృత్యువు ఎరుగని కాలం ప్రశ్నలు
చైతన్యంలో – జీవంలా
ఆవేశంలో— అగ్నిలా
మనస్సులో—ఆలోచనలా
ఆగక సాగిపోవు శక్తి రేఖలు

కాలం విడిచే పరీమళ వసంతాలు
నైల్యమేఘ నిశ్వాసాలు, నిట్టూర్పులు
జాల్వారుణ గ్రీష్మాతప తీవ్రతలు
నిరాశా శైశిర పవన వీచికలు

మానవుని మనోప్రపంచ రహస్యాలకు
తన ముద్ర వైచి బహిర్గతపరుస్తుంది
మస్తిష్కంలోని టెలివిజన్ యంత్రంలో
కాలంయొక్క భిన్నభిన్న రూపాలను చూడవచ్చు

విద్యుత్కాంతి రేఖా ప్రసరణలా
కాలగమనం సాగుతున్నంతవరకు
మెట్లు మెట్లుగా మలగిపోవు
చరిత్రకు వుండదు అంతిమ దశ

కాలగమనం ఆగిపోనంతవరకు
సంస్కృతీ శిల్పంగా మారిపోవు
మానవుడు చుంబించగలడు ఆకాశం
మానవతకు సిద్ధించదు సంపూర్ణత్వం

# 10

దేవతల్లా జన్మించి, రాక్షసులవలె
జీవించి–ప్రాణం విడిచే రోజు
అంతిమ క్షణం మాత్రం మానవులు

ఎత్తైన చీకటి సెమ్మెపై నిల్చిన
ఎవడూ ఆడి ఆనందించడానికి వీల్లేని
వింత రంగుల గాజు బంతులు
అరపులతో వెరపు గొలుపుతూ
పిశాచాల్లా! ఎక్కడా భూమికందని
ఆకాశంలో, ఊహలతో తిరుగుతూ

కాల ఝుంఝూ నైశిత్యానికి రేణువులు
రేణువులుగా శీర్ణమై గాలిలో ఎగిరి
అంతలో మాయమౌ ఇసుక బొమ్మలు
శతాబ్దాలుగా శిలాయుగంనుండి

గుహల్లో దాగి, వనాల్లో వసించి
పూజిస్తూ అగ్నిని, లొంగిపోయి ప్రకృతికి
బహుసహస్ర ముఖాలుగా ఛిన్నమైన
మన మనస్సును ఆక్రమించిన భయం
క్రమ్మిన అనుమానపు పొరలు–జారి

మస్తిష్కంలోని మంత్ర తంత్ర శాల
విద్యుదూహా దోహల విజ్ఞాన
యంత్ర శాలగా మారిన క్షణం–

గతంలోకి భయంలోకి గుహలోకి
వెళిపోయి, పూర్వ రాజ్యం స్థాపిస్తే
కారాగారం విడిచే హంతకుడెవడు ?

శిలల పరపు, కదలని నీటి తలం
కాంతి సముద్రపు పొంగు కొలిచే;
వెలుగు కంటి ముందు, నీడ బొమ్మల
చిరు కదలిక గుర్తు పట్టిన సమయం

చలన శక్తి ఎరిగిన, కాలం
లయతో, తరుణ మనస్సులు
పాడే, సంగీతం వినిపించే
సుప్త చైతన్యం

# 11

కాంతి పూలు ప్రసరింపుము కనులనుండి
మెరపు రేకలు చెంగలించు మబ్బులవలె
కనులతో మాట్లాడుము అమృత భాష
గుండె విప్పి వినిపింతును కాంతి గీతం

తమోహస్తాల క్రింద నలగి పోవు
చుక్కల వెలుగు నీడలలో బ్రతుకు గడపి
విసిగి పోయి; స్వేచ్ఛా వాయువుకై
దివ్యకాంతి రేఖలకై పరితపించి

ఆగి ఆగి స్పందించెడి గుండెలతో
చైతన్య మహాశక్తుల జృంభణతో
తమపై దించబడిన తమోహస్తాలను
కదిలించివేయ, అనుక్షణం యత్నించే

మానవుల, విప్పుకోల్పడిన కనుచూపులలో
వెలుగుంగరములవలె సాగిపోవగా ఊహలు
గుండె విప్పి వినిపింతును కాంతి గీతం
సప్తవర్ణ కిరణ రూపాలలో కదలి రమ్ము
సన్నని వెన్నెల వెలుగు వత్తి వలెనున్న
నా పైకి, కోపంతో – అయినా చెబుతున్నా
వేడి వేడి నిట్టూర్పుల, విసరులతో
పాడు గాలిలా, కారు మబ్బులా రాకు

త్రిశూలంలా లేక శార్జ్గంలానో రాకు
నేను తనూస్పర్శాజ్ఞానం సుంతలేని
సంధ్యాకాంతి పుంజ వివృత మనోమూర్తిని
చీకటి రెక్కలతో రివ్వున ఎగసి రాకు

విరిసి వాలిన పూల మబ్బు తెరల
చాటున దాగి తొంగి తొంగి చూచు
శార్వరీ దర్శన వేళా సంఫుల్ల
చంద్రకాంతిబింబంలా అగుపింపుము

వెలుగు వాక ప్రవహింపుము
విప్పిన తెలి కనుల నుండి
మంచు తుంపురులను రాల్చు
తొలి సంజలందు నింగి వోలె

కాంతి పూలు విరజిమ్ముచు
కనులనుండి ; కదలిరమ్ము
నా గుండె గొంతుకను విప్పి
వినిపింతును; కాంతి గీతం

ధ్వని మయ జీవనదీ తరంగ
లాస్య సౌకుమార్య నవగీతం

## 12

కళ్ళులేకపోయినా మనకంటే దూరం
చూడగలదు ఎత్తైన గాలిగోపురం

పడగ విప్పి తోక పై నిల్చి ఆనందిస్తుంది
చెవులులేని పాము, సంగీతం

గాలికైనా చిరుకదలిక ఎరుగని
చాచబడిన రెక్కలతో వెళుతుంది
త్వరగా పైగా ఆకాశాన బహుదూరం
యోగశక్తి ఎరుగని విమానం

వ్యష్టిరూపాల సమిష్టి స్వరూపం
నైకశక్తుల సమాహారైక సూత్రం
సంస్కృతీ విచిత్ర జీవ సంపుటి
యుగపరిణామ చిహ్నం మానవుడు

పవమానుని శరీరంనుండి రాలు
సుమ పరాగం; మృత్యుధూళి
ఆకాశ కృష్ణ తారాగ్రంనుండి జారు
వెలుగు ముత్యాలు; నీలమణులు

శివుని శిరః ప్రదేశాన వెలిగే
శీతలీకృత ప్రపాచంద్రఖండం
తెరచిన ఫాలనేత్రంనుండి జారిన
జ్యోతిర్లతలకు పూచిన నిప్పుపూలు

సంగ్రహింప జూచే నీలగగన దేవతా
సంప్రసారిత దీర్ఘదిశా హస్తాలలో
ఎడతెగకుండా పొరలు పొరలుగా సాగు;
భూభామినీ జఘనంపై జీరాడే
చీరకుచ్చెళులు సముద్ర తరంగాల
కదలికలో దాగిన పురాసృష్టి రహస్యం

బడబానలం దాగిన సముద్ర హృదయ
సమార్ద్ర భావామృత మధురేఖలు
విరుగని పృథివీ పరీమళ వీచికలు

పాంచభౌతికాంశలు కలిసిపోయిన
వెలుగు చీకటి విడదీయరాని ముద్దలు

సముద్రాన్ని ఆకాశాన్ని లొంగదీసినా
ఇంకా నేలను మరచిపోలేని మనుషులు

దేవుళ్ళూ దయ్యాలూ వదలినా
నిద్రనుండి మేల్కొంటే తప్ప
మన నివాసభూములు వదలని
మస్తిష్కంలో వ్రేలాడే పీడకలలు

# 13

ఆకాశంపై వెలసిన ఇంద్రధనుస్సు
కనిపిస్తుంది చాలమంది కంటికి
మనస్సులో విరిసిన ఇంద్రధనుస్సు
చూడగలడా ? అనుకున్న ప్రతిమనిషి

సాయంవేళ నిద్రాగత సూర్యుని
మస్తిష్కంలో; సముదిత స్వప్నవలయం
చంద్రబింబంలో, స్వీయదేహ శిల్పం
అవలోకించే హసనమూర్తి నిశాదేవి

వెన్నెల వెల్గుకు కందిపోవు స్త్రీరూపం
చైతన్య సృష్టియొక్క సమాకర్షణా శీలం
ఊహించే జాత్యంధుని మనస్సులో
విరిసిన మృదూహ దోహల ఇంద్రధనుస్సు

స్పష్టంగా సంపూర్ణంగా ఒకసారి
మరొకసారి అస్పష్టంగా, వేరొకసారి
సంకీర్ణ వర్ణాలతో, అసంబద్ధ క్రమంతో
అగుపించే ఇంద్రధనుస్సు మన కెంతగా
దగ్గరి బంధువో కాస్త గమనించండి
బహువర్ణ సామరస్యం అంతటా లభిస్తుందా ?

ఇది సశేష జీవితాన్ని సమగ్రంగా
వ్యాఖ్యానించే చిత్రమంటే సరిపోతుంది

గ్రుడ్డివాడు అద్దంలో చూచికొని కళ్ళను
ఆనందంలో లీనమై మురిసిపోయినట్లు
కళ్ళువున్నవాడు ఎదుటివాడి ముఖంలో
తన కళ్ళను చూడ్డానికి తహతహలాడుతాడు

ప్రాభాత వేళ విస్తరించిన సూర్యుని
కరాల కౌగిలినుండి మెల్లగా జారిపోతూ
సహస్ర ఫణాలు విప్పిన; శత సహస్ర
నటద్భుజంగాలవలె, విజృంభణతో తూగే
తరంగాలతో కదిలే, సముద్రుని మనస్సులో
సప్తవర్ణ శీర్ణ మానోహర ఇంద్రధనుస్సు

అస్తమించే వేళ, ఉల్లోల కల్లోల హృదయ
వేదనతో; ప్రగాఢ పరిచితమైన
ప్రేయోస్పృష్టినుండి దృష్టు మరల్చుకొనే

సూర్యుని చివరి చూపులలో మిళితమైన
వేదాంత భావనా ఛాయాప్రకామ రేఖలో
సప్త వర్ణ భేదమంతరించిన కాంతిరేఖ

సౌందర్యం ఎరుగదు సప్తతంత్రీవీణ
మాధుర్యం ఎరుగదు సప్తవర్ణ కాంతిఖండం

సప్తవర్ణ సౌందర్యం విలీనైక కాంతిరేఖ
సప్త స్వర మాధురీ సంలీననాదబ్రహ్మము

ఈ రెండింటి సమాహారము, ఆత్మగత
రసావిష్కార వైశేషక కాంతిగీతం–

ఉనికికి ఆలంబమైన ఆకాశం కోరిక పై
సప్తవర్ణ ఇంద్రధనుస్సు అవతరించనట్లు
మానవుని ఇష్టం పై జీవితం నియతపూర్వ
వర్ణవైఖరిలో మలుపులు తిరుగదసలు

జీవితం యంత్రంవంటిదెన్నటికీ కాదుసుమా !
అయితే హృదయం, మస్తిష్కంతో పనిలేని
నాగరకతాదృష్టి రహిత శిలాయుగానికి

పూర్వంలోనే మానవుడు వుండేవాడుకదూ !
పరిణామం ప్రగతి కాంక్షించేవాడే కాదు
లలితకళా సౌందర్యం, విజ్ఞానం ప్రభవించేదా?

ఒక పరమాణువుపై ఆధారపడిన
విశ్వసంస్కృతీ భవిష్యత్తు
ధనవంతుని ముఖంలో దీప్తి తెచ్చుకునే
మానవ నాగరకతా ప్రకాశము

ఎత్తైన ఫ్యాక్టరీ గొట్టం నుండి ; యంత్రం
గాలిలో వదిలే నీలి గుంపులు
శబ్దశక్తి ఎరుగని అక్షరాల కూర్పు
ఊహలేని ఆకాశంలా చూడడం
అర్థం చేసుకోలేని గాలిలా చదవడం
కాకుండా; విద్యుదూహ చేయగల
మనస్సులోనే, సప్తవర్ణ ఇంద్రధను ఉదయం
అది ప్రశాంత విప్లవానికి నూత్నమార్గదర్శకం

# 14

అనాదినుండి మొన్నటివరకు
నేనొక దేవతను; అంటే చెబుతా
మీ మనస్సులో కలిగే భయానికి రూపాన్ని
నిన్నటి నుండి ఇవాల్టిదాకా
పుట్టుమచ్చ అందం మరచిపోయిన
కవుల కావ్యాల్లో; ఇన్ని ఏండ్లుగా
రాత్రులకు రాత్రులు ఆకాశాన
వెలిగే ప్రేయసీ ముఖబింబాన్ని

కవిప్రియులకు కొనసాగిస్తూ దౌత్యం
వాళ్ళ పద్యాలు విని పదిహేను రోజులు
మాత్రం హాయిగా నిద్రపోతూ చీకట్లో
వెలుగు పూలు విరిసిన నీలాకాశ

వృక్షం క్రింద, ఒంటరిగా జీవితం గడుపుతూ
ఆలాగే వున్నా కొంచెం మార్పుతో ఇంతవరకూ

నడచే గుహలా; చీకటి నిద్రలా
ఎప్పుడూ వెన్నంటి వుంటుంది గతం
చాలమంది కోరతారు అందులో నివాసం
వాళ్లునడచే పిరమిడ్సు; దేవాలయాలు
మ్రోగే చర్చిగంటలు ; నిద్రలో పీడకలలు

సరే ఆసంగతి ఆలావుంచుదాం
రేపు అంటే ఇరవై ఐదో శతాబ్దంలో
నేను–
మేఘం మనస్సులో, సముద్ర గర్భంలో
అరణిలో, అగ్నిని దర్శించి –
దేవతగా భావించినకాలం నుండి
జ్ఞానం విజ్ఞానం సంస్కారం
రూపంలో మానవతపై జరిగే
మనోగత మేధాగతమైన మానవుని
జిజ్ఞాసా పరిశోధనల చరమదశ
నా శిరస్సుపై కాలూనడంతో సరి

హద్దుల అతిక్రమణ జరగడానికి
ప్రక్కన పరాయివాడు వుంటేగా నాకు
ముఖంపై కత్తి గంట్లు పెట్టడానికి
ఎగిరినా అందని ఎత్తులోవున్నానింతవరకు

ప్రతి మనిషి కాంతిగోళంగా మారి
ప్రతి మస్తిష్కం టెలివిజన్ యంత్రమై
గాలి కెరటంలా తేలిపోతూ
గాలి బంతిలా ఎగిరే శరీరంతో

మీరంతా నాస్థానం ఆక్రమించి
పూర్వం నన్ను గురించి మీలోకంలో
వ్యాప్తమైన అతీతమైన కల్పనలు
వింతలు–విశేషాలకు బదులు; రేపు

కదలిక ఎరుగని నాపై సాగించి
పరిశోధనలు; ఆయుర్దాయం తేల్చి
కొండజాతి మంచు మనిషినని నిశ్చయించి
పత్రికల్లో ప్రకటన చేస్తారనుకుంటా

అప్పుడు నారక్షణకై చుట్టూ అమర్చబడిన
యంత్రాలు; నియమింపబడిన సోల్జర్లు
తిరిగే విమానాలు, ప్రేలేబాంబుల
ధ్వనులు—ధ్వనులు ప్రతిధ్వనులు
మాటలు—మాటల కత్తిపోట్లు
ఆటలు – ఆటల పోట్లాటలు

గాయాలు గాయాలకు చికిత్స
రాజకీయ డాక్టర్ల మార్పులు – మృత్యువు
తెలియని భాషలో వాగే ఓదార్పులు,
అపుడు మీరూ నేనూ ఒకటే నన్నమాట.

హద్దులు వుంటేనేగా దేశాలయొక్క ఉనికి
హక్కులు కావలిసివస్తేగా ఆలోచనల్లో భిన్నత్వం
మనస్సులో పొరలుంటేనేగా ఏర్పడేది జాతులు
రాత్రి ఉన్నంతవరకు సూర్యుడిలో కలవను
నమ్మనంతగా మారుతుంది నా పూర్వరూపం
కాంతి గోళాల్లా తిరుగుతూంటారు మీరు
ఎవడికివాడే స్వయం వ్యక్తి సంపూర్ణంగా
టెలివిజన్ మస్తిష్కంతో మనుషులు

ఓటు హక్కు మరుస్తారుజనం
నోటిమాటలతో' నడుస్తుంది రాజకీయం
నన్ను గురించి ఆలోచిస్తే సంకుచితత్వం
మరచిపోతే అప్పుడు విశాల విశ్వదృక్పథం

కాలం ముద్రలు చెల్లిపోయిన
చెల్లని హక్కుల పత్రం రిన్యూ ఔతుందా?
కాంతి చక్రం పరిధిలో వెల్గుతప్ప
సాగివచ్చినంత మేర తిరిగి చీకటేగా !

# 15

గగనుని సిగపై వ్రేలాడే
వాడని చాంద్రీదామం లా
ప్రతి నిశీథి బింబింపుము
నిభృత కళామనో సరసి

మెరుపు తీగ సోనవలె
వెలుగుచురా, నామదిలో
నీలిమొగిలు గుడివోలె
ఈ శరీరమును మలచెద

కదలిపోవు నీటిపైని
రాతివంతెనగా, మలచి
వైతు ఈ బ్రతుకును
కదలిరమ్ము, రథము పైన.

ఎగసి వచ్చి రివ్వున దూసే
కాలపు కరకు కత్తులకు
రెక్కలు నరకబడిన పర్వతంలా
భూమిపై దిక్కులు చూస్తూ నిల్వలేను

కోతవెట్టు, శిశిరకాల నిశిత
వాయూర్మ్ములకు, తాళజాలక
వణకుతూ ఒరగిపోని వృక్షంలా
ముడుచుక దిక్కులుచూస్తూ వుండలేను

ప్రసరింపుము కాంతిరేఖ నాపై
పూల ఎదలు విప్పారగ మురువుగ
చైతన్య కళామూర్తి స్ఫూర్తివి
నీవే దేవతవో నేనెరుగను.

పొరలు పొరలుగా మలగిన
చీకటి గుడిలా రూపొందిన
ఎదలో, వేయి రెక్కలను విప్పి
తిరుగు, వెల్గు వత్తివనే తెలుసు.

# 16

చుట్ట చుట్టుకున్న పాముపరుపుపై
రాత్రి హాయిగా నిద్రపోయి
సగం నిద్రమత్తులో ఉదయంలేచి
నడవడం ఆరంభించిన
నా వెంటబడి పరుగిడుతూ వచ్చి
మెల్లగా శరీరం ప్రాకి
నా మెడలో మెలికలు తిరిగి చుట్టుకుంది.

నా కళ్ళనుండి జారిపడిన నీలినీడలు
కదలకుండా కాళ్ళను పెనవైచుకున్నవి
గాలిలో రెపరెపలాడే పమిట కొంగులా
గమనం సాగని స్థితిలో వున్నవి ఊహలు

కనురెప్పలు వ్రాలే అవకాశం లేకుండా
ఆలోచనా దీప్తి పరాగంతో నిండి నేత్ర గోళం
దట్టంగా మంచు పొరల క్రమ్మికవలె
నైకభావం మరపించిన ప్రపంచంలో
ద్యావాపృథివీ స్వరూపమే కన్పించడంలేదు.

ఎప్పుడూ ఎవరో ఒకరు నాలో
గాలికి ఆరని, నీటికి తడిసిపోని
దీప శిఖలా మేల్కొని వుండి
అనాది నుండి ఏదో ఒక క్రమంలేని
చిత్రమైన వేషంతో; చీకట్లోనన్ను
అమితంగా భయపెడుతూ ప్రేమిస్తూ –

మనోగోళంలో తిరిగే తీవ్ర శక్తికి
ఆకారం కలదు కాని పదార్థం కాదు
ఎన్నోయుగాల నుండి నశించలేదు.
ఈ నాటికీ కోల్పోలేదు లావణ్యరేఖ

లోకానికి అందం ఆనందం ద్వేషం
విధిగా కల్గిస్తూ స్వీయ రూపశ క్తితో
తాను లేనిది జీవితంలేదని తెలుసు
తానై శరీరాంచల సన్నికర్ష కోరదు

ఇంతకు అర్ధ జాగ్రదవస్థా సమాత్త బుద్ధికి
స్ఫురించినది మెడలో వ్రేలాడే ‘నెక్‌టై’

# 17

నీలాకాశ విశాల హృదయం
సీమాంతముల నెరుగు మేఘం
భూదేవతా ప్రగాఢ హృదయం
లోతు చూచు జలధారాధుని

దిగంగనా మృదుల కపోలయుగళి
మీటి సాగివచ్చు పవమానము
మూతవడిన తమోదేవీ నేత్ర
సహస్రము విప్పిన మెరపుచూపులు

ఊహల రెక్కలతో సర్వాశలు
సంచరణము చేసి, జీవన
వమధు కణాలు సమీకరించు
నటన్మనో మధు బంభరము

చేతికి అందక, తనూలగ్న
సర్వజీవాణువులకు, అవిదిత
సుఖానుభూతి కలుగజేయు
సంచలన కలన వాయూర్మ్ములు

బుద్ధికి అందని, సహృదయ
స్పందనమునకు లొంగిపోవు
ప్రేయో పరిపూర్ణ మానవతా
మహాకాశంలో వెలిగే ఇంద్రధనుస్సు

శిల్పాకృతి తెలియని, మార్పు సహించని
మనిషిని శతాబ్దాలుగా వదలక –
ప్రతి రక్తపు బిందువులో జితించి
ప్రబలిపోవు జంతుతత్వం

ఇనుప గొలుసుల్లా ఇన్నాళ్లు
మేధను చుట్టిన ఆలోచనలను
త్రెంచి; కదలలేని మనిషిని
బంతిలా సుదూరం విసరివైచి

మనోజ్ఞాన సహిత విజ్ఞానం
చూపిస్తుంది జ్యోతిశ్చక్ర ఫలితం
మనస్తత్వమెరుగని విజ్ఞానం
చూపుతుంది కాలచక్ర పతనరేఖ

# 18

కాలం సాగినకొద్దీ తిరిగి తిరిగి
కిరీటమైతే ఎగురగొట్టివేసినా
చంద్రుణ్ణి గద్దెనుండి దింపగలడా
ఏనాటికైనా సూర్యుడు ?

అస్తమించిన తరువాత రేపటి
ఉదయం వరకైనా పోనీ లోకం
వెన్నెల వెల్గువత్తినే కోరకూడదూ !
చీకటినే కౌగిలించుకుని వుండాలా !

చలిగాలికి బిగుసుక పోతూంటే
శరీరం మంచుముద్దలా మారుతూ,
ఎక్కడో దూరాన ఎవరో వెల్గించుకున్న
మంటలు చూచి భయపడి; నవ్వుతూ

ఆకాశంవైపు చూచి, సంజ్ఞచేసి
సూర్యుణ్ణి వ్రేలెత్తి చూపిస్తే సరా!

మౌనంకన్న కదలిక ఎరుగని
శిలాప్రతిమలా, నిర్వికల్ప సమాధి
స్థిత పరమవేదాంతులై నట్లు
కాలరేఖ దాటనంతవరకు దేవతలు

తన స్థితి తనకే తెలియని తుఫానులో
సంగీతం వినిపిస్తున్నామనుకునే
అడవులు, చెవులు తెరచి వినే
ఆకాశం, నృత్యం చేయడం
ఆరంభించిన మనుషులు; వీళ్ళలో
ఆ క్షణం కలియని వాళ్ళు చీకటిముద్దలు
మరోక్షణం రబ్బరు బంతులు కావచ్చు
ఏక్షణమో ఏ దిక్కునకైనా విసరబడవచ్చు

అల్లిబిల్లిగా చీకట్లు
అల్లుకున్న అర్ధరాత్రము
నా కన్నులలో విరిసిన
చిరుగాలికి కదలు కలలు

ఎన్నాళ్ళనుండో ఎదలోదాగి
ఒక్కమారు మింటి కెగసిన
అగ్నిశిఖా సంజ్వలితమై
మానవతా మహోరూపము,
బూది దిబ్బ అయినట్లు

అచ్చటచట మొలిచి, ఎండిన

గడ్డి మొక్కల చురకత్తులచే,

నడిచే మనుషుల పాదాలు
తెగి పోయినట్లు

గ్రీష్మర్తువు ఆవరించిన లోకం
ఎండిన మ్రోడులవలె
నెత్రు ఉమిసే నిప్పుపూలతో
మురిసి పోవునట్లు

సామాన్యుని హృదయంలో
సదా చంక్రమణం చేయు
జీవిత చక్రాశార పంక్తి
విరిగి ముక్కలైనట్లు

అరచేతిలోని అదృష్టం
సముద్రంలోకి దూకినట్లు
మెదడులోని ఆలోచనలు
గాలిలో లీనమైపోయినట్లు

బుద్ధికి, చాచిన చేతికి అందని
విచ్చిన ఎదకంటికి ఆనని
రోదసిలా దూరదూరంగా
భవిష్యత్తు నిల్చిపోయినట్లు

విషమ పథంలో నడిచే
తమ బ్రతుకుల నీడ్వలేని

సమభావం లేని పురా
సమాజ పరివంచిత,
కర్మణ్యుల గుండెల్లో మ్రోగే
మృత్యు పాదశింజినీ సంరావము
విని–సగంలోనె ఆగిపోయిన
అలల్లా కరళ్ళెత్తివచ్చు కలలు.

## 20

పుంజీభూత తుహినకాంతి
రేఖవలె నేను ఎప్పుడు ఎక్కడ
విశ్రమిస్తానో అప్పుడు అక్కడ
వికసించిన వెన్నెల రాత్రివేళ

ప్రగాఢనిద్రా సమాధిలో నేను
ఉన్నప్పుడు ఎవడో రాక్షసుడు
చల్లగాలి పీల్చడానికి బైటికి వస్తాడు
వాణ్ణిచూచి భయపడి లోకం
తన ఆలోచనల గాలులు విసరి
విజ్ఞానేంధనాలు జ్వలింపజేసి
వాణ్ణి భస్మంచేయాలని యత్నిస్తే
వాడు ధూమరేఖలా ఎగసివచ్చి
కనులలోకి తొంగితొంగి చూస్తాడు

మనోజీవ లక్షణాభిజ్ఞతలేని
రాతియుగంనుండి –
మనోజీవ సంస్కార సాహిత్యంలేని
స్ఫుట్నిక్‌యుగం వరకు –

తన నీడచూచి తానే భయబడి
తనపై తనకే నమ్మకం చచ్చిపోయి
ఆ రాక్షస ప్రవృత్తికి లొంగిపోయి
మూర్చాసమస్థితిలో నున్నప్పుడు

ప్రాభాతారుణ జీవరేఖవలె
నిదురనుండి మేల్కొని నేను –
ఎప్పుడు ఎంతవరకు పయనిస్తానో
అప్పుడు అంతవరకు దివాభోగము

## 21

శూన్యం సమగ్ర మాయారూపం
రాక్షసుల ముఖాలకు జీవకళ
వాళ్ళ ఊహలకు ఆకారం ఇచ్చే
చీకటి లేనిది; వెలుగనేది వుండేదా ?

మండే కాగడాలా కొన్నాళ్ళు మతం
లోకాన్ని వెలిగించినమాట నిజం
సూర్యోదయం ఎపుడో జరిగిపోయి
శిలల వృక్షాల జంతువుల మృగాల
నిజస్వరూప స్వభావాలు తెలిసిపోయి

మానవుని విద్యుదూహాశక్తికి
అతని ఐచ్ఛికరూపాలుగా మారిపోయి
కాగడాల ప్రసక్తి ఆరిపోయిన సమయం

రెండుకళ్ళు మూసుకున్నవాళ్ళు
మంచివాళ్ళు, దేవుని బంధువులు

రెండుకళ్ళు తెరచి, విడిపోయిన
చీకటి సంకెళ్ళ సంగతి, ఖైదీలకు
చెబుతూ రహస్యంలేకుండా, సంతోషంగా
కాంతిగీతం వినేవాళ్ళు— స్వతంత్రులు

దేవుడికన్న అతని బంధువులకు శత్రువులు
వాళ్ళు కళ్ళు తెరుస్తేచాలు ఎదుర్కొనే ప్రశ్నలు
ఊహిస్తే మతి తిరిగిపోయే అగ్నిగోళాలు
ఋతు పరివర్తన తెలిపే కాలసూచికలు

* * * * * * * *

నీలికళ్ళు తెరిచిన చీకటిగుహలో
జ్యోతీ రూపాల్లా వెల్గే శిల్పవిన్యాసంలో
ఆలోచనలనంతంగా సాగే మస్తిష్కంలో
సౌందర్యం సాహిత్యం ఎరిగిన మనస్సులో
పగిలిన కారుమబ్బు గుండెల్లో
జీవిత గ్రంథం పుటల్లో దాగిన
అక్షరాల్లో తెలిసిన రహస్యంలో
సందేహం తీరిన ఆలోచనవలె

— కాంతిరేఖ

ముఖ్యంగా సిలువవేయబడిన వేళ
మందరాలు పూచిన క్రీస్తుముఖంలో
—కాంతిరేఖ

నీడలా వెన్నంటి తనలో శాశ్వతంగా
ఐక్యం చేసుకోజాలని మృత్యుముఖంలో
— నైల్య రేఖ

అందమైన పూర్ణచంద్రుని ముఖంపై
కాలం విసరిన కత్తిదెబ్బ
తీక్ష్ణమైన సూర్యుని మనస్సుపై

కంటికి కన్పించని గాయం

స్వచ్ఛమైన శరదాకాశంలో
కదలాడే నీలిమబ్బు తునక
సామాన్యుని జీవితంలో తీరని
సాధారణ కోరికవలె — నైల్య రేఖ

బుద్ధుని ముఖంలో ప్రసన్నకళా శిల్పం
తనలో లినీకరించుకున్న కాంతిచక్రం
అతని పాదాలక్రింద మెట్లు మెట్లుగా
మలగి ఒదిగిపోయిన చీకటిముద్దలు

# 22

చుక్కలు
వెలుగు మొక్కలు
కన్పిస్తవి
చీకటిలో బ్రతికే మనిషికి !

తరంగాలు
క్షణభంగుర విహంగాలు
కదిలిస్తవి
జడతత్వంగల మనసును

చుక్కలు
చీకటిలో తమతమ
బ్రతుకులు గడుపుతున్నాయనీ

తరంగాలు
అనుక్షణం చలించి
నశించిపోతున్నాయనీ

విచారించడం మానవ స్వభావం
ఆలోచించడం మనోజీవి లక్షణం

అద్దంలో తన ప్రతిబింబం
గుర్తించలేని, నీడ బొమ్మను
రెక్కలంటగట్టి ఎగురవేసి
నింగినెగురు పక్షివితతి కాల్చి
ఆకాశాన్ని విశాలపరచి
భూమిని పైకెత్తాలనడం
శాంతిని ప్రచారంచేయాలని
లోకంలో ప్రయత్నించడం
మనిషికి క్రొత్తగా కాంతిని
పరిచయం చేయడంవంటిది

* * * * * * * *

నాకన్నులలో దాగిన,
అసంఖ్యాక నక్షత్రాలు
చీకటి గుడి వదలి
వెలుగులోకి రావాలని
నా ముఖసీమలో దాగిన
విద్యుదూహచిత్రాలు
ఆరిపోయి మాసిపోవాలని
నేనెందుకుకోరతాను !

పెరిగిన చీకటి లతలకు
పూస్తేనేగా వెలుగుపూలు
నల్లని మొగిళ్ళ గుండెలలో
విరిస్తేనేగా మెరపురేకలు
చలిగాలికి బిగిసిపోయి;
తెల్లని నల్లని మబ్బుముక్కలు
అతికిన, ధూళిధూసరిత
ప్రావారం కప్పుకొని,—
బిక్క మొగంతో, బీదతనంతో
కూర్చున్న చంద్రుణ్ణిచూస్తే –
విచారం తలపునకేరాని
అనూహ్యానందగీతీ నిస్వానంతో—
ఊగిసలాడిస్తూ హృదయాలను
మనుషుల్ని గిలిగింతలు పెడతవేమి ?

శైశవ ప్రాయుల, ఉన్మాదుల
అలౌకిక విషయ భావుకుల
స్నిగ్ధమైన మనసులు
గాయపడి బాధపడుతవేమో?

# 23

భవష్యద్ రేఖాగమనం మార్చే
ప్రజా హస్తాలలో చిక్కిన
తమ జాతక ఫలాల కోసం
‘క్యూ’ మార్కు ముఖాలు చాచి

రాత్రివేళ భూమికంటక తిరిగే
భూతాల మలిన దేహచ్ఛాయల్లా
మూకలు మూకలుగా ప్రతిచోటా
విహరిస్తున్నవి శ్వేతేతర పక్షులు

కాంతి హస్తాలక్రింద మసలు
శాంతి హృదయ వాటికలో
అంటు చీకటి చెట్లు నాటి
నిప్పుపూలు పూయించాలని

నింగినిండా చీకటిలా వ్రాలి
భ్రమగొల్పే తెల్లని రెక్కలు చాచి
మిన్ను అన్నుబట్టి పోయేట్లు
నినాదారభటీ శబ్దాలతో
మాంచి పసందైన మాటలతో
రేపటికి వేసే బాటలకన్నా ముందు
మాపటికి ఆడే ఆటలో రక్తికట్టాలని
అహరహం వీలై నంత శక్తి సమీకరిస్తూ

ఏకంగా ధాత్రినిండా వాలిపోయి
సాంతం రాత్రిమయం చేయాలని
ఉద్రేకంతో రివ్వురివ్వున వేగంతో
ఉరికి ఉరికి వస్తున్నవి ! పక్షులు !

పన్నిన కాంతిఖడ్గ జాలంలో
అన్నీ హాయిగా విశ్రాంతి తీసుకుంటవి !
విహరించే శ్వేతేతర పక్షులన్నీ
కనుపించే స్వేచ్ఛేతర కక్షలోవి.

# MELKONNA AKASAM

by

Madiraju Ranga Rao

3-4-685 Narayanaguda, Hyderabad

# మనోభూమికలు

మాదిరాజు రంగారావు

# స్వేచ్ఛా కవిత్వం

# మనోభూమికలు

## ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

MANOBHOOMIKALU

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: మార్చి 1960

రసధుని ప్రచురణ హైదరాబాదు.

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

# I

సంగీత వినిస్వన ప్రవికంపితమై
సమార్ద్రమై లయించి, నదించి
అంతలో ఘనీభవించు శిలవలె

ప్రగాఢమై, సూర్యతేజో నిభృత
మహోత్తైక్షతకు వాడిపోక

వెన్నెలలల మృదూహలకు మెత్తబడు
నీల గగన ఖండం వలె

దుఃఖం అణువణువున వ్యాపించి
కదలీ కదలని గాలిపిండువలె
తాకితే అంతస్సౌందర్యం చిందిపోయి
భగ్గున మండించు దీపశిఖవలె

నిశ్చల సమరేఖా స్థితిలో ఉన్న
నా మనస్సులో ఎక్కడివీ ముంపుగ
అశాంతి హత్యాప్రయత్నం ఊహలు !

వార్లహరీ నదివలె ముర్మురిస్తూ
బుస కొడుతూ ధీర్ఘతనూ భుజంగంలా
మలకలుగా మెలికలుగా తిరిగిపోవు
నా మనస్సులో— ఎక్కడిదీ అశాంతి !

జీవితం ఏ పరమ ప్రయోజన కళా
శిల్పాకృతిగా మలగిపోవడానికి నాంది ?
వెలిగే అహంకారం, విసరే చురుకుగాలికి
చీకటిలో మలచుకున్న ఆకారం— అశాంతి

*

ఆనంద లోకాధిపతులు రహస్యంగా
ఆత్మహత్యా ప్రయత్నంచేసే సమయం
ప్రోత్థ తరంగాలవలె తీవ్రాలోచనల
దూకుడుల అశాంతి — మనస్సముద్రంలో

ఋతు పరివర్తనతో స్వభావం మారిన
ప్రకృతి స్వరూపంలో, రాతిరి కళ్ళలో
భూమి హృదయంలో, ఆకాశం మస్తిష్కంలో
మానవుని మనో రోదసిలో, అశాంతి

జీవితంలో ప్రతిక్షణమొక సోపానం
అనుభవంతో గమ్యప్రాప్త సోపానాలపై

కాలూనుతూ వెళ్ళడం ప్రతి జీవికి సహజం
జీవుని బహిస్స్వరూపం అశాంతి ప్రపంచం

*

శాంతి ! శాంతి ! శాంతి !
అశాంతి సమావరించని స్థలంగాని
వాయు రేఖ లేదా అరలిప్త ఐనా ఉన్నదా ?
అనంత విశ్వంలో ఎక్కడైనా?

సృష్ట్యారంభ బిందువునుండి ఇంతవరకు
బాణాలనుండి అణ్వస్త్ర ప్రయోగాల దాక
సాగిన వలయాకార చరిత్ర పరిధులలో
నియంతృత్వం నుండి ప్రజాస్వామ్యానికి మారిన
అజ్ఞాన జన సందోహం ఆలోచనా వైఖరి,
అశాంతిలో జరిగిన ప్రగతి శీల పరిణామం

పరిణాహ హృదయంలో సూక్ష్మ సూక్ష్మంగా
తీవ్ర తీవ్రంగా చెలరేగిన అశాంతి
వదలిన గాయాల మాయని చిహ్నాలు
మనోజీవి ప్రతిభా కవితా స్వరూపాలు

తెరలు తెరలుగా జారిన భిన్నభిన్న వర్ణోహలు
పొరలు పొరలుగా ఒదిగిన మానవ సమాజం

క్రియా వైపరీత్యం, ఊహావ్యాపారం లేని
శాంతిలో, మానవునికి నిజంగా శాంతి లేదు

*

హోరున విరుచుకపడు పెనుతుపాను,
వార్షుక ప్రళయమూర్తి
అనాగరక అనాది మానవునిచే
చెరచబడిన ప్రకృతి గత సౌకుమార్యం
మనోరూపంలోని స్త్రీ స్ఫూర్తి
స్ఫులింగమై మేల్కొన్నపుడు— అశాంతి

సంధ్యా సమస్యలే సమస్యలు
చుక్కల ప్రశ్నలే ప్రశ్నలై
కంటికి వెలుగు కరువైనపుడు
సంప్రదాయ రేఖలు దాటబడి
చీకటి సహస్రధా చీల్చబడి
విప్లవం రెక్క చాచిన, అశాంతి

అహంకారం ప్రబలిన
అశాంతి యొక్క వీరకృత్య చిహ్నాలు
ఇంతవరకు మానవుడు
దాటి వచ్చిన పెరిగిన సోపానాలు
అనుభవించి కాలం వేసిన శిక్షలు
చలాయించి సామాన్యుల పై అధికారం

ధరిత్రికి ఏకత్వం, చరిత్రకు ఆకారం
కల్పించిరి రణదాహంతో రాజులు

శిక్షకులు; శాంతికి తామే రక్షకులుగ
గర్విస్తూ మౌఢ్య ప్రాకారం బలసంపదకు;
అశాంతికి మనస్సులో ఆకారం నరకం
కల్పించిరి విశ్వాసంతో మత ప్రవక్తలు

గత కాలం మ్యూజియంలో బ్రతికి ఉన్న శవాలు
వారసులకు పనికిరాని బూజు పట్టిన చిత్రాలు
పూర్వం జరిగిపోయిన అశాంతి కృత్యాలు
భవిష్యత్ కీర్తిగౌరవాలు కొలిచే సాధనాలు

*

నగరం నడివీధిలో నడుస్తున్న నాకు —
సంక్షుభిత విభుగ్న పరికుంచితములు
వేదనా విశీర్ణ రేఖా పరిపాండురములు

ప్రొద్దుపొడిచిన, రాత్రి కురిసిన చీకట్లకు తడిసి
కోర్కెల కుబుసం తునిగి రాలిపోయిన;
ప్రశ్నలతో, ప్రశ్నల సంకెలలతో, కదలిన
సంకెలల గలగలలతో నిండిన ముఖాలు

గుప్పిళ్ళు గుప్పిళ్ళుగా కళ్ళలోకి విసరబడిన
చీకట్లవలె, నింగి బూది కుప్పనుండి
క్రిందికి రాలిపడు, తూర్పారపట్టబడిన
నిప్పు కణాలవలె; కొట్టవచ్చినట్లు కన్పించే;
కన్పించిన కొన్ని ముఖాలు — అశాంతి గోళాలు

*

మానవతా కేంద్రంనుండి గీయబడిన
ప్రగతి శీల పరిణామ శక్తి రేఖల
ఆక్రమణతో; సంప్రదాయ రేఖాసీమిత
సమాజ సరిహద్దులు చెరిగి పోతున్నపుడు

దైనందిన జీవిత సమస్యలనుండి
చిత్తగించిన పలాయన వాదంతో
తీరని సందేహాలతో ఇంతకాలం
ఆకాశం అవతలి లోకంపై ప్రశ్నలతో
విశ్రాంతికి అలవాటు పడిన గుండెలలో
అశాంతి ! హాహాకార హసంతులు!

*

ద్యావాపృథివి మేల్కొన్న క్షణంనుండి
వ్రాలని కనురెప్పల నీడలక్రింద
అవిచ్ఛిన్నంగా సాగే అనాది సంస్కృతులు
అనుభవాలు సృష్టియొక్క క్రియాంశలు

అవి మానవుని మృత్యువుతో అంతమొందవు
ప్రార్థనలతో యుద్ధాలతో అణగిమణగి పోవు
అశాంతిలోనే రెక్క విప్పుతుంది అభ్యుదయం
అది శాంతి సంచరణకు మహాకాశావకాశం.

II

ఊహలు ఉన్మత్తాకారం రూపొందిన సృష్టి
కదలికతో గమనం, అభిరుచితో జీవితం
అనుభూతితో పరమార్థం సాధించు మానవులు

వాళ్ళ బ్రతుకుననుసరించి వెలుగుంగరమువలె,
గాలి విసరువలె మృత్యువుతో అంతమొంది
ధూళి క్రమ్మికతో రంగురంగులుగా కనిపించు
ఆకృతి లేని వాయుగోళం వంటి మస్తిష్కంతో

గాఢ నిద్రలో రెండు స్వప్న ఖండాలవలె
నల్లని కన్నులలో రాగ దీపికలతో — నేను
మృత్యువుకీతల నున్న ఈ లోకంలో
అడుగు తీసి వేసేలోపల ఒక దానినొకటి
మించిన వేగంతో, కొన్ని మించని వేగంతో

దాటిపోవు, పోలిక లేని అసంఖ్యాక ముఖాలు
ఆడబడుచున్న ఛెస్ బోర్డులు — వైకుంఠ పాళీలు

పెదవులపై చిరునవ్వులు — ముద్దుమాటలు
ఆవలింతలు — అరుపులు — తిట్లు — ఆక్రోశాలు
పదకోశపు టెడారిలా కనిపించే పదాలకు
స్వరూపావిష్కరణ చేయు తీవ్ర శబ్దశక్తులు

మంచు, చలి — వేడి, ఎండ — గాలి
తెలుపు నలుపు ఎరుపు విరుపులు

ఆనందం అహంకారం కోపం దుఃఖం
విషాదం యోగం, అవధిలేని కాలం

పన్నెండు గంటలు — రాత్రి జాతకంలో మార్పు

కాలు జారినపుడు గాలి నవ్విన సవ్వడి

– రెండు మూడు పలుచని సన్నని నీడలు
వాని వెనుక నవనీతాకృతి స్త్రీమూర్తి

తిరిగి తిరిగి వచ్చిపోవు ఋతువులు
మలగి మలగి సాగిపోవు బ్రతుకులు
తెరచిన తలుపులు కిటికీలు — మౌనం—
నిన్న – ఈవాళ అంతం నుండి ఆరంభం

*

అక్కడక్కడ చెట్లు

చెట్లను వదలి ఎరుగని నీడలు

రెప్పలు మూత పడని నిప్పుకళ్ళు

భూమిలో కూరుక పోయి కాళ్ళు

నడవ లేని చలన శక్తి రహిత

బహు విచిత్ర జీవాకారాలు

పొలాలలో పల్లెలలో నగరాలలో

తిరిగే మానవాకార ముఖాలు

చేతి కందని ఎత్తులో — గాలికి

మ్రోగే ధ్వజస్తంభ ఘంటికలు

*

జన్మ జన్మాల పరంపరగా వచ్చు

ఆత్మీయ, అనాది వాసనల

కల్పనలో మలగిన ఆకారాలు

కాల సూత్రం తెగిపోనంతవరకు

ప్రేక్షకుల మనోవృత్తులతో అవసరం

ప్రత్యక్ష సంబంధం లేని సినిమాచిత్రాలు

నా కంటికి కన్పించే సుఖదుఃఖాత్మకమౌ

అణువు నుండి బ్రహ్మాండ పర్యంతం

అలముకొన్న అశాంతి ఆవరణంలో
కాలం తన చేతితో ప్రతి లిప్తలిప్త
చెరుపుతూ వచ్చినా మాటి మాటికీ
శాంతి రేఖలు గీచుకుని బ్రతికే జీవులు

అసంఖ్యాక యుగాలుగా సాగివచ్చిన
మనస్సాహితీ సంస్కృతీ పరిణామం
మృత్యువుతో; మానవునిలో అంతం
మళ్ళీ జననంతో పునః ప్రారంభం

*

విశ్వాత్మయందు – విలీనమై
ప్రచరించు వాంఛా సమీరము
వియద్గత సూర్య తేజో హృదయం
రస సిద్ధి పొందిన జలాంతర్నాదం
సృజనాత్మక శక్తి సమున్మేష పృథ్వీ భాగం
ఆశలు అనంతంగా సారించు ఆకాశం
జీవకోటి మనస్సు సమాకర్షించు ఉషస్సదనం
వరకు – మెట్లు మెట్లుగా మలగిన
ఇంతవరకు దాటబడని, దగ్గరగా
చీకటి ముద్దలవలె, ఖండ ఖండాలుగా,
దూరంగా ఏకాకృతిగా కన్పించే అశాంతి

మానవుడు తన అహంకారానికి
ఆదర్శం ఔన్నత్యం ఆపాదించుకుని
దుఃఖం దౌర్భాగ్యం రూపొందించుకొని
ఆనందించే ఖండ ఖండ జీవితం

అతృప్తి చెందు ఏకాకృతి ప్రపంచం
బిందువు ప్రారంభం తెలియని
పరిణామం సాగిపోవు రేఖావలయం

*

సంధ్యా సమయ తాండవారభటితో
మనోఽంతర పథాలను నాదమయం చేసి
ప్రళయకాల ఝుంఝూ హస్తాలు చాచి
నను గాఢంగా కౌగిట బూనే రుద్రమూర్తి
మూర్తీభవించిన అశాంతి –
నా జీవిత సారస్వతం సమావరించి
ఊర్జిత ఆనంద కళాస్ఫూర్తి – శాంతి
కలిగించే ఆకారం లేని ఈశ్వరుడు

*

అనూహ్యాకాశానికి ఆకారం కల్పించి
వ్యావహారిక జగత్తును సమావిష్కరించి
దుర్మార్గం క్షమించి, దుఃఖం మరపించి

మృత్యువుకు ప్రాణంపోసి రహస్యంగా
మొదట లోకాన్ని ప్రేమించినది సూర్యుడు

సమార్ధ్యమై, భాగవత తేజోభావమయమై
కర్కశమై, దానవతాస్వభావ సంపిహితమై
నగ్నమతి మానవుని అశాంతి హృదయం
తరువాత నేర్చుకుంది ప్రేమతో విద్వేషం

*

నిద్రామాంద్యం వదలించుకుని, గమనం
సాగించిన సూర్యుని అడుగు జాడలలో
నడవడం ఆరంభించిన నాటినుండి
కాలం కదలిక గుర్తు పట్టిన మానవుడు

శ్మశాన వేదికపై యోగమూర్తి
రుద్ర భూమిలో శివతీర్థం
యుద్ధ భూమిలో స్వర్గలోకం
మృత్యు ముఖంలో పునస్సృష్టి
నిద్రాలోకంలో స్వప్న ఖండం
దర్శించిన భావంతో తృప్తి చెందిన
మనస్సాహితి మెట్లుమెట్లుగా సాగి
చలదిరమ్మద మేఘ పంక్తివలె

గాలి కౌగిలిలో తేలిపోయి ఎక్కడికో
ఎప్పుడో ఎక్కడో వర్షించి—
భూమిని నవ్వులతో పులకింపజేసి
లేదా తునాతునకలై పోయి గాలికి

దీనంగా చూచే దిక్కులనింకా ఏడ్పించి
దేవతలకు దెయ్యాలకు పనికల్పించి
విషాదం వైరాగ్యంతో వేదాంతం
భయం సందేహంతో విజ్ఞానం మేల్కొల్పి

విద్య అవిద్య ధనం ధరిత్రితో
అందం ఆనందం ముక్తి మోక్షంతో
ఆరాటం పోరాటం, ఆటు పోటులతో
విజృంభమాణ విస్తరణ శీలక అహంతో

సమశక్తుల సంఘర్షణతో, దుర్బలుల ఆవేదనతో
సంధ్యారుణ రక్తిమవలె సహజంగా శాంతంగా
అశాంతి, సంపరివ్యాప్తమై మహాకాశం
తిరిగి మొదలౌతుంది అణువుతో ఆశ్వాసం

*

ఆత్మ గుణాన్నధిగమించిన మేధాశక్తితో
ఆహార—వ్యవహార సమస్య లేనాడో తీరి

ఇచ్ఛామరణ జీవశక్తులరచేత బట్టి
భూమిని వదలి వ్యోమ పథంలో
విమానం వలె సంచరిస్తూ లేదా
జలధిపై తేలిపోతూ పడవ వలెనో
సోమ రస పానంతో కాలం గడుపుతూ
సుషుప్తిలో గాజు బంతుల వలె తిరుగుతూ
ప్రేరణాత్మక సహజ శక్తులు నశించిన
రసాయనక ద్రవ్య సముద్భూత మానవులు

*

తెలి మబ్బు కన్న కడు తేలికైన
కర్షణాకుంచన శీలక శరీరాలతో
విశ్వగోళం బింబించే మస్తిష్కాలతో
అంత స్సౌందర్యానుభూతి కోల్పోయి
నిలచి పోయిన ఆకాశంవలె ఆశ్చర్యంతో
మతి పోయిన భూమి వలె పరిభ్రమిస్తూ
నిశ్చల స్థితి ఎరుగని స్వీయ రూపం లేని
కాలాని కనుకరణాత్మక రూపాలు
అగామి విజ్ఞాన యుగం మానవులు

చీకటిని వేరుచేసే వెల్గు గీతవలె
సృష్టియొక్క ఆద్యంతాలు కొలిచే చూపులు

నిశ్చితంగా తరగతులుగా విభజింపబడిన
క్రమ సమున్మీలన మెరుగని బుద్ధిగత జీవులు

ఆరంభం–, అశాంతి నంతరింపగా
యత్నించిన వినూతన నూత్న యుగం
పూర్వపు తన సహజ స్థితికి రావడానికి
తూర్ణ చరా వేదనాగ్నితో,– అంతం.

III

ఎక్కడికక్కడే దూర దూరంగా
వాలిపోయి కంటికి కన్పించని నభస్సు
విరామ మెరుగని అశాంతి గీతం
విన్పిస్తూ ఎప్పటికప్పుడు వెళిపోయే వాయువు

ఏనాడో తెగిపోయి హఠాత్తుగా
ఆలోచనా స్ఫూర్తి రేఖల సంబంధం
ఆకృతిలేని కదలిక ఎరుగని
మసక కళ్ళు మూతబడని అంధకారం

ఇసుక ఎడారి నాలుక చాచి
దూరంగా సరస్సులా కన్పించే
చంద్ర బింబం వైపు పరుగుతీస్తూ
ఎంతకాలానికీ అందుకోజాలని భూమి

నిలువడానికి సూది మొనంతైనా
సన్నని వెలుగు దారుల విస్తృతి
రక్షణకై పరితపించు బ్రతుకులు
ప్రతి అంగుళం అంగుళం మేర నేలను
మ్రింగి వేయడానికి జల బిందు సమూహంగా
మాటి మాటికి ఉత్సహించు సముద్రం

జ్వలదగ్ని సమోహా సంభ్రాంతిమత్
సంధ్యాటవీ ధావన్మృగపక్షి సమూహము
రవి బింబ సమాచ్ఛాదన మేఘమండలీ
కల్పిత ఛాయా వాగురానిపతిత జీవరాశి

ఉన్మాద ప్రలపనా సముద్భ్రమన్మరుదావళి
మరుదావలీ సంచాలిత నిర్వ్యూహవృక్షావలి
అశాంతి ఆనందంతో నగ్న నృత్యంచేయు
యుద్ధోన్మాదిని సినీవాలి రాక్షసీ అట్టహాసం

*

ఆకాశముఖంపై సంధ్యా ప్రశ్నలవలె
స్పర్శగుణం, చలనశక్తి, వ్యక్తిత్వంలేని
నడిచే నిలువు నీడల మూకలు —
వేగ గమనశీలి కాలం వదలిన ముద్రలు

అగ్నితో మాసిపోని ఊహలతో పూడ్చబడని
మానవుని ప్రగతి చరిత్రలో చీకటి లోయలు

నిశ్శబ్దం సమావరించిన శిలా విగ్రహాల
పాదాల ముందు రాలిన కన్నీటి చుక్కలు
పర్వతాల హృదయ కర్కశ స్వభావాన్ని
సంగీతంతో సముద్రానికి చేరవేసే నదులు

రాత్రి –

సహజావేశంతో నాలోని అందశ్శక్తిని
తన వశం చేసుకుని ఆనందించే నిద్రలో
అంతలో అంతమై మస్తిష్కంలో ఆరంభించు
స్వాప్నిక సన్నివేశాల బలమైన సంఘర్షణ

ఉదయం–

కందగడ్డలా మారిన ముఖంతో మేల్కొని
హిమావృత సూర్యబింబ రూపంలో నిల్చిన
వెలుగు గుడిని చూచే చీకటి కళ్ళలో
తేలే చిన్ని చిన్ని పడవల్లా నిప్పు రవ్వలు

ఉదయం ఆరున్నర,
విరిసిన జన సంచలం

మతి పోయిన చంద్రుని ఆలోచనల లిపి
అర్థరహితమై మాసిపోయిన వేళ
సూర్యుని విశాల హృదయంపై వ్రాలిన
సర్వ జగత్తు భయశోకం మరచిన వేళ

వెలుగు పోయి బీతు బీతుగా ఒంటరిగా
నగరంలోని దీప స్తంభాల చాటునుండి
వీణాశ్రుతులలో వినిపించని దీన స్వరాలు
వంకరలు తిరిగిన సూదులవలె చూపులు

క్రుంగిన భూమీతలంపై
పాములు విడిచిన పుట్టవలె
కోర్కెలు ఫలించని ఇసుక దిబ్బవలె

సంధ్యాగ్ని కీలలకు పొగబారి
తెల్లదనం నశించిన ఆకాశంవలె
నేల వాలి పూర్తిగా అతికిపోయి

మన్వంతరాలుగా పరిక్రమించిపోవు
జగన్నాథ రథచక్రాలు పట్టుకొని
మృత్యువు ఊహలతో వదలని చీకటివలె
నీడలు వదలి పోలేని శైశిరాకారాలు

సాంఘిక సమభావ స్థితికందుకొనని
అన్న జీవుల ఆరాటం — ఆరని కాష్ఠంవలె
జీవితం క్రతువుగా పరిణమింపజేయు
మనః ప్రాణి ఆవేదన— జ్వలించే సప్తార్చివలె

పట్ట పగలు—
అగ్నిపర్వత శిఖరం ఒరిగి పడినట్లు;
తనపై ఆకాంక్ష లోకంపై మమకారం
ప్రక్కవాడితో జీవితంలో అజ్ఞానంలో పోటీ

నిశాఽగమన సంధ్యాసమయం
జాతులు జాతులుగా, మాలలు మాలలుగా
ఇతస్తత ఉడ్డీన విహంగమ సమాకీర్ణమై
చివరలు నీలీకృతమౌ విలోచన పథం
విశ్రాంతి కోరు నిరంతర యాత్రిక సమూహం

పైన అన్నపు మెతుకులవలె చుక్కలు
క్రింద విద్యుద్దీపంచుట్టూ కలవరించు చీకటి
తానై మేల్కొనదు-—ఎవడైనా మేల్కొల్పితే
నిప్పంటిన రాక్షసిబొగ్గు - విప్లవం

ఆకాశానికి భూమికి మస్తిష్కానికి మనస్సుకు
ముఖ్యంగా తనకైనా తన పరిణామం తెలియని
—పరిణాహ రోదసి

మానవుని ఇష్టాఽ పూర్తికి చిట్టచివరి దశ
ఈశ్వరుడు, అతని పాదాల ముందు
అవనత మస్తక సోపాన పంక్తి వలయం
అతని శిరఃపదము మీరి దాటి పోగల
తమలోని ఆత్మభావం తెలియని జీవులు

పరివర్తన చెందని అనాది వారసత్వ చిహ్నాలు
సుత్తెల మ్రోతలు విని ఎరుగని కొండరాళ్ళు
ఋతు పరివర్తన శక్తికి నిల్వ లేక నశించు
ఆకురాలుపు, చిగుర్పు, పెరుగుదల ఎరుగని
—గడ్డిపోచలు

జీవితాంతం వెల్గుతూ త్రైగుణ్య విపర్యయంతో
అసంపూర్తి కామనలతో చల్లారని మనఃశ్మశానం

కళానుభూతిలో, లౌకిక వలయంలో
ఆనందం దుఃఖం పేరిట నగ్నంగా
ఉద్విగ్నంగా దీప్తమతికి గోచరించు
అశాంతి గోళక వివర్త దృశ్యాలు

కాల నియమం లేకుండా సంచరిస్తూ
అజ్ఞాతంగా, అద్దం వంటి బుద్ధిలో
అవిజ్ఞేయంగా బింబించు మనోభూమికలు

## IV

రక్తారుణ పాద ముద్రలు ఎంత దూరం సాగినవో
అంతవరకు అడుగడుగునా, పలుకు లేని
చూపులేని నడవలేని ప్రతి బింబాలు తప్ప
ఎక్కడా ఎవరి నిజ స్వరూపమూ కన్పించలేదు

ప్రక్కన నడిచే చెట్లకు నాభాష తెలియదు
వాటిలో ఒకరి భాష వేరొకరికర్థం కాదని
తరువాత తెలిసింది చేష్టలను బట్టి

ప్రక్కన నడిచే కొండలకు నా రూపం కన్పించదు
వాటిలో ఒకరి కళ్ళు వేరొకరిని చూడలేవని
తరువాత తెలిసింది నడతను బట్టి

వెనుక నడిచే నీడలకు నా ఉనికే తెలియదు
వాటికి చెవులు, నోళ్ళు, కళ్ళు లేవనుకున్నా మొదలు
తరువాత తెలిసింది జీవం కూడ లేదన్న సంగతి

వెల్లు గీత దాటలేని చీకటి బంతుల వలె
అక్కడక్కడా దాగి దాగి తిరుగు
జ్ఞాన స్ఫూర్తి ఎరుగని జంతువులు తప్ప
ఎక్కడా నా కంటికి మానవులు కన్పించ లేదు

ఊహాగత మనస్సౌందర్య వర్తిత్వం పెంచుకుని
మానవులను చూడడానికింతగా తపించడం దేనికి ?
మనోజీవం నశించినశవాలు; పీడించే దెయ్యాలు
కంటికి, రంగు వేయబడి కన్పించే మట్టి బొమ్మలు

అంత ఎత్తు కొండ కొమ్ము మీది నుండి
దూకి, సరస్సుపై వాలి పోయిన క్రీనీడలు
కారు మొగిళ్ళ గుంపులు—నల్లని త్రాచు పాములు
బహు విచిత్ర జంతు సమూహ రూపాలు
అద్దంలో అస్ఫుటంగా కన్పించే నీడ బొమ్మలు

పగలు వాటి చుట్టూ నిద్ర వంటి బ్రతుకుతో
రాత్రి మేల్కొని ఒకరి నొకరు పల్కరించుకొని
చీకట్లో నవ్వుకునే కుర్చీలు—కాగితాలు, కలాలు
ఉదయం కాగానే ఏమీ ఎరుగనట్లుగా కన్పిస్తవి.

ముఖాంచల విన్యాస వైఖరి నుండి తప్పించుకొని
ఒక చోట కూడి స్వేచ్ఛగా సంభాషించు కొనే హృదయాలు

శ్మశాన పాద ముద్రలు, –ఇంకా కొంత దూరంలో
ఆత్మీయత, ఆలోచన, నాదశక్తి ఎరుగని
కపాల ముఖ సమాగత వాయుగీతాలు––, విని

హర్షంతో వేయి రెక్కలు కట్టుకొని ఎగిరే అడవిపిట్టలు
అవల ఏమున్నదో వాటికి తప్ప ఎవరికీ తెలియదు

దూరం, సుదూరం వెళ్ళిపోయిన నేను
నా మస్తిష్కంలో తిరిగే
ఒక ప్రక్కకు ఒరిగిన ప్రపంచ గోళం

క్రిందికి వాలిపోయిన ఆకాశం
స్థిరమైన ఉనికి ఎరుగని నీడబొమ్మలు
బుద్ధిని వదలని — తృష్ణ తీరనికామనలు

దూరం బహుదూరం వెళ్ళి పోయిన—
నా పాదాలక్రింద ధూళి రేణువులు

నా కనుచూపు సాగి ఆగి మలగిపోయి
శూన్యంలో కలసి మాయమైనంతవరకు
నిల్వుటద్దంలో కన్పించే, వెనుక గీయబడిన
పిచ్చిగీతల్లా, నాకు తెలియని నోరు లేని లిపి

V

మంచు ముసుగు వేసుకున్న మనిషి
నా కను చూపు మేర చివర ఆగి
నా వైపు అడుగులు సాగించడం మాని
ఆలోచనా మూర్తిలా అక్కడే నిల్చిపోతే

నా కాలి సవ్వడి నాకే భయంగా
నా ఊహ పడగ విప్పినపాములా
నగ్నంగా వాంఛా సహితంగా కన్పించి
నా ఆకృతి నాకే రెండు రంగులుగా

ముఖం త్రిప్పి చూతును గదా వెనుక
మలి సంజ రెక్క నీడవలె నిలువునా
నేత్ర గోళాల నావరించిన నైల్యాకృతి
అప్పటి నుండి ఎటు చూచినా ఏకాకృతి

గగన చక్షుస్సంయోగానుభూతి ఎరుగని
సృష్టి విధా పూర్వ నిరామయ జలాకృతి

దగ్గరిగా దూర దూరంగా గాలి నడకల
సన్నని సవ్వడి వినిపిస్తుంది ఇప్పటి వరకు

చిరుకదలికతో తాటి మొవ్వల ముర్మురము
నవ్వు తెర ఏడుపు రొద ఏమైనా కావచ్చు

కళ్ళలో సూదులు గ్రుచ్చి అంధుని చేసి
ఆనందించే పిల్లలు ! ఎంత మంచి వాళ్ళు
వీరు బ్రతికి నంత కాలం ఇలాగే వుంటే
బిందువులో నీరులా, ఆనందాక్షరాలలో
దుఃఖానికి పర్యాయపదం భగవంతుడౌతాడా ?

నాకు కన్పించినది భగవంతుడని చెబితే
వాళ్ళను వదలి వేశానను కొని అమాయకంగా
ఎవడికి వాడు మనసులో సంతోషిస్తాడను కుంటా

## VI

జ్వాలదూహ శిఖలతో నిను ఆహ్వానిస్తా
పవమాన పంక్తివలె రివ్వున ఎగసిరా
కలసి పోయి మన మిరువుర మొకటిగా
నిలచిపోదాం ప్రకాశమాన రోదసి వలె

మన కంటి ముందు బూదికుప్ప సర్వ సృష్టి
మేధా పదవి వ్రేలాడే మబ్బు గుంపు స్వర్గావళి
అణువున కతీతంగా, సర్వాభిముఖీనంగా
స్ఫురించుదాం శైవతనూ సుషమారోచివలె

మన కను రెప్పవాలితే ఆరి పోయి సూర్యుడు
చీకటిలో పరిభ్రమించు దారి తప్పి చంద్రుడు
భూమిపై ఆకాశ ప్రభావ వినూత్న ముద్రలు
కనురెప్ప తెరవడంతో తిరిగి అంతా మొదలు

అనాది నుండి అవిచ్ఛిన్నంగా సాగి వచ్చు
ఒక్కొక్క జీవి నిల్వగా సంతరించుకున్న శక్తి –
క్షణం యుగం మన్వంతరం లేదా కల్పం
పాముగా, పక్షిగా జంతువుగా మృగంగా
బానిసగా, అధికారిగా మనస్విగా తపస్విగా

ఆకాశానికెత్తబడిన వెలుగు నిచ్చెన్నపై
మెట్లు మెట్లుగా అమర్చబడిన చీకటి
క్రిందినుండి చూస్తే పైకి ఒక దానిపైఒకటి
పైనుండి చూస్తే క్రిందికి ఒక దానిక్రింద ఒకటి
ఎక్కడో అంతమైనట్లు ఎక్కడికక్కడే భ్రాంతి
అక్కడే మొదలైనట్లు అక్క డికక్కడే స్ఫూర్తి

ఆరోహణ అవరోహణల క్రమం
దగ్గర అయినకొద్దీ ఈర్ష్య కోపం దుఃఖం
దూరంఅయినకొద్దీ జాలి ప్రేమ భక్తి
విచిత్రసంపుటీ సంగ్రథితము మానవహృదయం

ఊహలో తిరిగే భూమిని విభజించి
కాలానికొక క్రమ పరిణామం కల్పించి
కంటిచూపులో కదలిపోవు సూర్యుడు
అతని ననుసరించి గమనంసాగించు నేను
ఆకాశంవలె విడిచిపోను దిఙ్మూర్తిని నిన్ను

అంతలో ప్రళయ భావమొందిన
వర్షాజల ప్రవాహ సముద్రిక్త నదివలె
దానవాంశ మలచుకొన్న జీవకోటి;

శరత్కాశ సరః పుండరీక విభా
రమణీయ కింజల్క పరాగ పటలివలె
మానవత అందగించిన హృదయమూర్తి
సంఘర్షణ ఫలితంగా జన్మించిన
దుఃఖ నిరాసక్రియాచ్చ శీలకకళవలె

దేవతాత్మ పరిధివరకు విడివిడిగా
ఆవల ఇరువురమొకటిగా సంవిలీనమైపోదాం !

VII

అస్తమయం జరిగిపోయి ఏనాడో కళ్ళలో,
చీకటి రెక్క చాచి ఎగురు పక్షి కంటికి
దాటరాని అగ్ని మండలంగా — అంతలో
ఒక మృదు సుషీమ పవనవీచిక విసరుల
వాంఛానుగుణంగా, మలగి వెన్నెల వత్తివలె

భ్రమించే ఊహాచక్ర ధ్వనిమయ మస్తిష్కంలో
తిరిగి తిరిగి జ్వలించి జ్వలించి
ఏనాడో ఎప్పుడో బూదికుప్పగా మారు
ఈ అగ్ని శిఖాభ తనూ రేఖతో, క్షణం
భూమిపై నిల్వద్రొక్కి కొనగా, ఊహ లేక;

ఒక రాగానికి సంచలించి ఊగిపోవు జీవికి
రాత్రి వేళ దూరాకాశమందు కనిపించే
అమృతాంశుబింబంలో విలీనమౌదామని ఉన్నది.

భూమిని మరచి, ప్రాతరుదార కాంతిపుంజంలా
విశ్వాత్మలో ఏకమై నిరాకారమైపోతే తప్ప

తనలో దూకితే ఈ అగ్నిని ఆర్పగలదా? సముద్రం!

శరీరాంచలమాత్ర దఘ్న జలబిందు సమూహం,

అక్కడేగా రూపుకట్టున దెక్కడాలభించని శాంతి

అప్పుడే కన్పించునది సర్వజనుష్ఫలాభిముఖ జ్యోతీ రేఖ

వ్యావర్తిత సృష్టియొక్క అచ్చమైన తొలి వెలుగు రూపం

# అద్దంలో నీడలు

# స్వేచ్ఛా కవిత్వం

# అద్దంలో నీడలు

## ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

ADDAMLO NEEDALU

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: నవంబరు 1960

రసధుని ప్రచురణ హైదరాబాదు.

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

I

తూరుపుటద్దంలో ఒక చివర బింబించిన
నా ముఖం గుర్తించి గుంపులు గుంపులుగా
పురాణ పురా నివాస స్థలం వదలి అంతలో
దూరాకాశ తీర భూములు చేరిన భూతాలు

రువ్వబడిన రాళ్ళవలె కేరింతలతో రివ్వున
ఎప్పటికప్పుడు నా మనస్సు నాక్రమించాలని
ఏదో వేషంతో తిరుగు మృత భావనామూర్తులు
వెల్గులారి కొడిగట్టిన వత్తుల ప్రమిదలు

భూతాల సమావేశంలో ఏకగ్రీవంగా
ఆమోదింపబడిన తీర్మాన పాఠం
హిమ బిందు రూపంలో అంతటా
ప్రకటింపబడిన సమీరణ పత్రం

చదవటానికి యత్నించు చెట్ల గుంపులు
చేతులు చాచి చెరపివేయ ఉత్సహిస్తూ
పసిమిచిందు ముఖాలతో చుట్టూ ఎగబ్రాకు
నను పట్టుక ఊగులాడు వెలుగు కెరటాలు

*

ఆకాశం నుండి భూమి వరకు సాగిన వెలుగు వంతెన
వెలుగు వంతెనపై సశబ్దకంగా నడిచే మనుషులు
ఒక దిశ నుండి మరో దిశకు సాగు గాలి వంతెన
సగం నిద్రలో నిశ్శబ్దంగా నడిచే మబ్బుగములు

భూమిపై వేల ఏండ్లుగా శిలాకృతుల రూపంలో
శాప వశాన పడిఉన్న ఊహాగత సౌందర్యజీవులు
క్షుధాగ్ని కలుగని వ్యథార్త మెరుగని
శాంత భావనా రమ్య శిల్ప దీపశిఖలు

ఈ దీప శిఖల నీడల గొలుసులు పట్టుక తిరుగు
పొగ క్రమ్మిన అరమూత కనుల రాత్రించరులు
తెరవబడిన కనుల త్రాగి అమృతపు వెలుగులు
ఈ దీప శిఖల నాశ్రయించి తిరుగు దివౌకులు

*

ఎన్నో ఏండ్ల గ్రహణంనుండి విడిపించి నభోమణిని
భూమిని ఆకాశాన్ని రెండు ముక్కలుగా వేరుపరచి
మరుద్గణంతో దుస్థితి పారద్రోలి సుస్థితి కల్పించు శచీపతి

దేవతలకు మానవులకు చాల దగ్గరి బంధువు
హిరణ్య వర్ణ జాతవేద ప్రథమ పవిత్రమూర్తి
ప్రతి ఉదయం జన్మించు మృత్యూపచయ మెరుగని కవిక్రతువు

సవితృ బింబ నేత్రంతో సర్వం పర్యాలోకనచేస్తూ
హస్త నిహిత పాశంతో పవమాన నిశ్వాసాలతో
సువర్ణ పక్షాలతో వెలుగు క్షమామూర్తి ధృతవ్రతుడు

ఎంత పలుకరించినా పలుకకుండా
ఒకటి రెండు మాటలైనా సరే నాతో
అహంకారం అంధకారం అశాంతి
ఆవరించిన ఆవరణలో అస్పష్టంగా

భూమిపై నీడలు కన్పించేటంత ఎత్తులో
సంభాషణలు జరుపుతూ గాలులతో
కదలిపోవు జ్యోతిర్మయ ప్రతీకలు
ఇంద్రాగ్ని వరుణ దేవతామధుమూర్తులు

*

## II

తూరుపుటద్దంలో మరో చివర బింబించిన
వికసన్మృదూజ్వల వదన ప్రాభాతసరసి
నిరంతరం శ్రుతి పోస్తూ కదలిపోవు
మృదు సుస్వర నాద వాయు పరిషత్తులు

విశ్వాసంతో సురభిళ నిశ్వాస పవన
వీచికలతో ఎదురు వచ్చి చాంద్రీహాసంతో
రోదసీ సమాక్రాంత మృదుల నతాకాశంవలె

తూరుపుటద్దంలో బింబించిన నా ముఖంలో
లీనమౌ, స్నిగ్ధనేత్ర పరినీల పయోనిధి
ఇంద్ర ధనూరజ్యమాన మృదులాశా కపోలపాళి

సంధ్యాకాల ముద్రలు స్ఫురించని ముఖం
చీకటి సుళ్ళు కన్పించని నీలికళ్ళు
ప్రాణ దఘ్నంగా ముంపుగా సాగిపోవు
చాంద్రీ స్నిగ్ధ పరీమళ వాయూర్మిక

అపుడపుడు అనూహితంగా నా మనస్సు ఒరనుండి
దూయబడిన కత్తిపోట్లకు గాయపడి చిరునవ్వుతో
ఈ గీతం రూపంలో మలగిన తుషారదీధితి
పెదవులు సంస్పృశించి కదలు నవనీతాకృతి

బహుపూర్వ జనూ రహస్య సౌందర్యాలను
వేదనా రూపంలో స్మరింపజేయు జీవగతచైతన్యము
జీవనాడులను వాయుతంత్రులవలె స్పందింపజేయు
దేవతాభావం రూపుకట్టిన సజీవ శిల్పాకృతి

రమ్యబుద్ధి, వెన్నెలల మృదూజ్వల ఊహలతో
గగన మండలం వాయుపథం భూవలయం
సత్వ భావ రమణీయతా సీమలుగా మార్చు
మనోదశ దాటిన ఆత్మభావనాంబుధి చంద్రుడు

అద్దంలో చూస్తే కన్పించి ముఖంలో ముఖం పెట్టి
అద్దం తీసివేయగనే ఊహను సమాక్రమించి
సుషుప్తిలో, ఉపాధి నాశ్రయించని-
ఆత్మలో సంవిలీనమౌ ఆనందరసాకృతి

*

అరెరె! ఎంతగా వెలిగిపోతున్న దీసృష్టి సౌందర్యంతో
నాకనులలోని వెల్గు లాహరించి ప్రమిదలు మిగిల్చి
బహిరింద్రియాల నాశ్రయించని ప్రదీప్త సౌరశక్తి
నా మనస్సు నావహించినది తరుమబడి లోకంనుండి

స్త్రీ పురుషులవలె కన్పించు సన్నని పలుచని నీడలు
చుట్టూ అందంగా అల్లరిచేయు శిశువులవలె గాలులు
స్త్రీ పురుష విభేదం దుస్తులనుబట్టి ఏర్పరచుకొనని
దృశ్యమాన జడ సమూహ వస్తు భిన్నమైన ఊహచక్రం

గ్రీష్మరశ్మికి భగ్గున మండి ఆరిన బొగ్గులవలె మొగ్గలు
అక్కడక్కడా శ్మశాన వాటికా సదృశములై నిల్చిన చెట్లు
అంతస్స్వరూపం చూచుకోలేని నడిచే చెట్లవలె మనుషులు
మనుషుల బుద్ధి నాక్రమించిన పాంచభౌతిక శరీర ప్రపంచం

ఝుంఝా సంగీతంతో లిప్తలో ఆకస్మికంగా
ఉన్మనీ చరమ దశ కందుకున్న
వాయూచ్ఛల దుగ్రరావ మహాభూత ప్రకృతి\nబీభత్స కథారచనా
పటుతరశిల్పం

వెను దిరిగి చూడక కదలిపోవు నదీ ప్రవాహంవలె
ఒకచోట నిల్చిపోయి పడియవలె, సీమితమైన కోర్కెలతో
ఋతు మనోజ్ఞ వర్ణ సామరస్య మెరుగని జీవితం
కదలిక ఎరుగని భూమివలె నిల్చిన అనంతకాలం

కర్ణ వీధి ప్రాకు భిన్నధ్వనుల వర్ణ సమామ్నాయం
బాల్యం నుండి యౌవనం, యౌవనంనుండి వృద్ధాప్యం
ఆరోహణావరోహణల క్రమం ముఖంలో బింబించు
మృత్యు రేఖలెరుగని క్రియా కలనావలిత జీవాకృతి

మబ్బుల నీడలవలె మానవుల జంతువుల రూపాలలో
ఒక వృత్రాహి లేదా రావణునివలె మనః ప్రత్యక్ష మార్గాలలో
సృష్టి రహస్యానికి వ్యాఖ్యానప్రాయంగా విచిత్ర రీతులలో
సంస్పందమాన జ్యోతిస్సాహితి మలచుకొన్న ఆకారాలు

అసంఖ్యాక యుగాలుగా ఊహించు ఆకాశమస్తిష్కంలో
ఊహకందని పరిణాహ రోదసీ వక్షస్థలంపై
క్షణ మాత్రమాగకుండా నడచు భూమిపాదాలపై
వెలుగు చుక్కలపై గాలి తరగలపై పరమాణువులపై
సూర్యుని ఆలోచనల దీప్తి చంద్రుని హృదయ స్పందనం
ప్రత్యక్షానుభూతి ఎరుగని ఉన్మీలన మెరుగని కళ్ళు

గుడి, చర్చి, మసీదు అందులో అనాది దేవత
వేయి మనస్సులలోని ఊహల క్రమ్మిక సొగసుతో
వేయికళ్ళ చూపులతో పల్కరించు, సద్యఃఉదిత
క్రమ సమున్మీలన సృష్టియొక్క శిల్ప సౌందర్యం

వేయి రెక్కలతో ఎగిరి గాలిలో లీనమైనట్లు జ్ఞప్తి
స్పృశా స్పృహణీయానుభావ్య రమణీయము వాయువు
ఎప్పుడూ ఎవరికీ చాక్షుష సంయోగం కాని మాట నిజం

మనః ప్రత్యక్ష దృశ్యానుభూతి పొందు జీవి
రాత్రి వలె కాకపోయినా ఆకాశంవలె అంధుడు
రాత్రి కొక ఉనికి, ఆకాశాని కొక ఆకారం
అంధునికొక సుసుందర వర్ణమెరుగని ఆలోచన

అడుగు తీస్తే నుయ్యో గొయ్యో భూస్థితి తెలియని
తాను కదిలితే ప్రక్కన జంతువులో మృగాలో
మనుషులో రాక్షసులో మనస్సహజస్థితికందని
సహస్ర జిహ్వలతో మాట్లాడు జ్వాలదగ్నివలె ఆరని ఆలోచనలతో

బహుకాలానికి నడి వీధి కలసి
అక్కడే నిలబెట్టి మాట్లాడిన
అంధుడైన ఒక మిత్రుని ఆలోచనలకు
కల్పించిన రేఖలు లేని ఆకారం

## IV

బహుపూర్వ జనూస్థితులను గమించి
ప్రస్తుతం ఒంటరిగా బ్రతుకు వంతెనపై
పయనించు మనిషి అడుగు క్రింద అంగుళం మేర
ఒక్కొక్క మబ్బుముక్క; కంటిముందు మట్టిముద్ద

దూరంగా ధరణీ కాంతార దేశంనుండి
పరుగిడి వచ్చు పరిణాహ దర్వీకరాభము
దగ్గరి దగ్గరిగా చుక్కల పూగుత్తులతో
సాగి వచ్చు సముల్లలన్మృదు నీల నతాకాశము

వంతెన కీతల మరి ఆతల చివరల ఏమున్నదో
ఇదమిత్థమని ఎవరికీ ఇంతవరకు తెలియదు
యుగాలనుండి పరంపరగా ధురాగతి వచ్చు
ఊహలు, అనుమానాల ప్రావార ప్రాకారాలు తప్ప

వంతెనపై అడుగువేసి సాగిన తరువాత గాని
మనిషికి తన వైయక్తిక స్ఫూర్తి భాసించదు
వెనక్కు తిరిగి పోదామంటే వీలుపడదసలు
అడుగు తీయడంతోనే కూలిపడి పోతుంటుంది

అక్కడే నిలచి పోదామంటే అంతకన్నా వీలు లేదు
ఎప్పటికప్పుడు భయంతో ప్రచలితమై మనస్సు
భవిష్యత్తును గాలివలె కౌగిట బూనాలనే ఆశతో
కాలాన్నడ్డి లాభంలేదు సూర్యుని రథచక్రాలనువలె

*

వంతెనపై ఇరుప్రక్కల అసంఖ్యాక యశఃపతాకలు
జాతి మత రాజకీయ విద్యాప్రచారక సాధనా స్తంభాలు
దివిటీలవలె అక్కడక్కడా కూర్చున్న రాజకీయ వ్రతులు
మత ప్రవర్తకులు – ఇహ పరలోక సంగ్రహ స్వరూపులు

ఇంకా –
ఒక పయః పారావారము మలచుకొన్న మధురాకృతులు
ఒక నీల వలాహక మసృణ కాంతి రేఖ లందగించు కనులు
ఒక ముగ్ధ సరోవరంపై మృదుల నతాకాశపు వంపులు
తొలి మలి సంజలందు గాలి పల్కరించు పూల సవ్వడులు

పరిపాలింపబడి ఒక అనిదంపూర్వ స్థితిచే
విసరబడి బహుదూరం ఒక విపరీతపు గాలిచే
ఒక ఊహ పరిధిలో మలచబడి బహు విచిత్ర రీతి

ఒక గల్లచపేటమువలె మ్రోగు వాయు ధ్వని వలె
ఒక వాయు రేఖ విలీనమౌ మధుర సంగీతంవలె

పైశాచిక రాక్షస మానవ దివ్యానుభవ
భావనా ప్రదీప్తమనోఽంబరాలంకృత దేహులు

*

వంతెనపై నుండి క్రిందికి చూచి మహదానందంతో
కళాసృష్టి వ్యక్తపరచు రసస్విన్న హృదయులు
భయపడి రెండు కనులు మూసుకొను అమాయకులు
ముగ్ధులై ప్రాణాలు మరచి దూకు మరికొందరు
మృదుజీవులు — సామాన్యులు — పరమ తీవ్ర ప్రకృతులు

అవిచ్ఛిన్నంగా నిస్సంశయంగా సర్వవేళల నడవబడు
ఎప్పటికప్పుడు, ఏ బుద్ధి విశేషంచేత వినిర్మింపబడని
ఒక స్థితికి చెందిన అనుభూతి యొక్క సుసుందర కల్పన

ఏ శక్తి చేత అంతమొందింపబడని—ఊహకందీ అందని
వంతెనలివి — తనపై వదలబడిన పాదముద్రలు
కాలంయొక్క ఆభరణాలు మాయని స్మృతిచిహ్నాలు

V

అగ్ని జ్వాలా చేలము ముడుతలు ముడుతలుగా
మనోజ్ఞంగా సంపరీవృతమైన నీలాంబుద దేహము
హిమాసార తుషారములు తెలిముత్తెములుగా
చిత్కళలవలె సంగ్రథితమైన భాసమాన నేత్రములు

భానూదయాదిశా సమ ప్రకాశమాన విశాల ఫాలము
ప్రకృతి శక్తి సమాహారైక స్ఫూర్తి రేఖ బింబించిన
దర్పణము ముందు – నేను
ఎటు ప్రసారించినా దృష్టి సమాకర్షించి ప్రత్యణువు
మనస్సును చలింపజేయు మృత్తికామయ వస్తు సమితి
కనులు మూసేవేళ కన్పించి, తెరచే వేళకు మాయమై
దివానిశలు చుట్టూ పరిభ్రమించు గ్రహకూటమి — పైన

*

మానవుని జన్మకు పూర్వమే సృష్టింపబడి
చపలత్వంలో స్థానమేర్పరచుకున్న నరకం
కాలం వదలిన, ఆరని కన్నీటి నిప్పుకణం
నిశ్చల బ్రహ్మోభబుద్ధిలో బింబించిన స్వర్గం
కాలం ముఖంలో విరిసిన ఆనంద మధుర రోచి

ప్రభు దయావిహీనమై తనుకు మాసిన రాతిరి ఒక వైపు
ప్రభు దయామధురాపాంగ రోచిర్వాసోదయం మరొక వైపు

సర్వదా ఒక తెల్వి దూకుడుచే మేల్కొల్పబడి
ఒక కల్పన తప్ప మూర్తి కట్టని రోదసివలె
కాల సూత్రంతో ఎన్నటికీ విడదీయరాని జీవితం
అతీంద్రియ శక్తిచే సంచరణచేయు జీవసమూహం

విచార ధారా రమణీయతా ప్రసన్న
జ్యోత్స్నాంశుమాలా మృదులావనతాకాశము— పైన

దృశ్యమాన శరీర ప్రపంచ సంపిహిత
దృక్త్వ జీవ గత చైతన్యము — నేను నా క్రింది భూమి

భూమిపై గుండెలు వ్రయ్యలైన పర్వతపంక్తులు
ఎక్కడో ఇంకి పోయి లేదా ఆగిన నదీనదాలు
వస్తువు గుర్తింపగా వీలు లేని చేతి కందని
ఊహ నాక్రమించి అతిక్రమించలేని నీడలు !

*

ఇద్దరు స్త్రీ పురుషుల రమ్యముఖ శిల్పాకృతుల మధ్య
ఇద్దరు వైరాయమాణుల మనస్సహజ ప్రేమ సౌందర్యంపై
ఒక స్వతంత్రమైన ఊహ చంద్రుని వెనుక అనంత పరిధి
జారిన క్రమ్ముకొనిన సాగిన, పొరలు పొరలుగా నీడలు

మృత్యువు కివతల అవిజ్ఞాత లోకంయొక్క
నీడల గుంపుగా, తలచబడిన రోజున ఈ ప్రపంచం
ఇచట స్థాపించబడిన సుందర పవిత్ర దేవాలయాలు
దివి నుండి జారిన స్మృతిలో వెలిసిన వెల్గు మేడలు

రివ్వున డొక్కలో దూసుకపోవు మెరపు బాకులు
నవ్వుల జడితో చిందులు త్రొక్కు మొగిలు ముఖాలు

నటనా చాతురీ నిగూఢ హాసం పెదవుల పొందికపై
సదా ఒత్తిగిలి ఉండు దుష్టోద్యోగి మనః ప్రకృతివలె
ఎప్పుడు విచ్చిపోవునో తమకై నా తెలిసి చావని
అగ్ని పర్వతాలవలె నున్న ప్రళయాంతస్సారణులు

నవ్వు తెరలు కప్పి ఎన్నో మానసిక హత్యలు జరిపి
పదునెక్కిన మనస్సులతో నా ప్రక్కన నడిచే మనుషులు
చూచి — మానసికంగా వాడి ఈ లోకం వీడి
లతాంతసౌందర్య సృజనశక్తి పరవశత ఊగిపోవు
భూనభోంతరాళ విస్మృమర భోగ వాయు హేలా మూర్తులతో
ఎంత దూరమైనా కలసి మెలసి పోయి తిరిగి రా స్ఫురించదు
ఆకాశం గొంతుతో కలిపి వినిపించే పృథ్వీ సంగీతం విని
వేయి కళలతో కాలం పెంచుతుంది జీవిత పరిణామం
ఎన్ని రోజులు గడిచిపోతే అన్ని రెక్కలు మొలచినట్లు నాకు

## VI

అర్ధరాత్రము కెవ్వున వెర్రికేక
పిండు కట్టిన భయంతో నిశ్శబ్దంగా ఉన్న
ద్యావాపృథివి మనస్సులో మెరపురేక

రివ్వున గాలి వేసిన ఈలలకు
చివాలున చప్పట్లు చరచినవి చెట్లు

అలలు లేని చీకటి నీటిలో
ఒడ్డు నుండి ఏదో బరువైన వస్తువు
ఒరిగి పడిపోయిన చప్పుడు
అంతలో నిశ్శబ్దంలో లీనమైన స్థితి

ఝుటితి స్ఫూర్తి కలిగి మేల్కొన్న మనస్సులో
ఒకటి రెండు పురాస్మృతుల కదలిక
కదలిక గుర్తుపట్టి ఎవరో మెల్లమెల్లగా
భయం భయంగా జారిపోయినట్లు గుర్తు

అక్కడక్కడా సగం నిద్రమత్తులో తూగుతూ
సగం మేల్కొని ఉన్న గాలులు– అలికిడి విని
గుంపులు గుంపులుగా సాగి అలజడిగా
ప్రతి అంగుళం అంగుళం మేర గాలించి

చిట్టచివరకు కాలి జాడలైనా తెలియని
స్థితిలో – విసిగి విసిగి, సీత్కారాలతో
చివాట్లు పెడుతున్నవి గలగల మ్రోగే చెట్లను

ఎప్పుడో, ఎక్కడో భయంతో ముఖం దాచుకున్న
చంద్రుని పాదాలు కనిపించీ కనిపించడం లేదు

ఎవరో చిత్రవధ చేయబడినట్లుగా
ఉదయాకాశ ముఖంపై పతాకవార్త
వెనుక ఈడ్వబడుతూ వచ్చే శవం
నీడతో వీధిలో నడుస్తున్న నేను

## VII

సూర్యుని ఆశీః ప్రసార కిర్మీరీకృత భూమిపై
ఒక వలయం అతిక్రమించి పోవు లోపల
వేరొక వలయంచే సంపరీవృతమౌ పాదాలు
ఎన్ని ఏండ్లు గడచినవి నడవడమారంభించి
ఇంకా నీడబొమ్మలు కన్పిస్తూనే ఉన్నవి అద్దంలో

విడదీయరాని దుఃఖ త్రయంతో బంధింపబడిన
లౌకిక జీవిత గమనాని కత్యంతావసరమైన
సర్వ సామగ్రీ సంభారం ఎక్కడిదక్కడ వదలి

ఎంత కాలానికీ కన్పించని దేవుణ్ణి మరచిపోయి
కంటి ముందు తిరుగు దెయ్యాలకు భీతి చెందక

అక్కడక్కడ వేసగి విరసించి కృశించిన మొక్కలు
దూర దూరంగా తప్పుక దాగిదాగి మలగు జీవులు
బాటసారుల కళ్ళలో దొంగచాటుగా దుమ్ముకొట్టి
అమాయకంగా కన్పించు ఇసుక దిబ్బలు, తుంగ దుబ్బలు

అక్కడక్కడ గొంతులు సవరించుకొను ఈలపిట్టలు
దగ్గరి దగ్గరిగా తూలి తూలి చను ప్రాణిసమూహం
గ్రీష్మం అందుకుంటే చాలు వనం తగులబడడానికి
సగం సగం కాలిపోయి పొగచూరిన కాష్ఠాలు

రెండు దివ్వెలతో ఎంత వెదికినా తృప్తి చెందని
నా ముఖాని కెదురుగా, సూర్యుడు గుర్తుగా
వంగిన ఆకాశం లేచి, విశాలమై భూభాగం
ఇచ్చిన స్థలీ పరిణాహ లబ్ధ మార్గాన నిశ్శబ్దంగా

వినిపించు సంగీతం వింటూ, కనిపించు దృశ్యం చూస్తూ

దేవాలయాలు — జనపదాలు పచ్చిక మైదానాలు
క్రమంగా దాటి ఎంత దూరం వచ్చాను ఒంటరిగా
ఫుల్లాత్మవలె నిల్చిన నిశ్చల గగన పద్మము
రేకుల పొరలలో హత్తుకొని పోవునంత దగ్గరిగా

నగ్నంగా వృక్షాలు నావైపే చూస్తున్నవి ఆశ్చర్యంతో
ప్రేమతో నదులు కొండలపైనుండి దూకి వస్తున్నవి
చేతులు చాచి వెతుకుతూ దేనికోసమో, ఎదురౌ గాలులు
కాలం యొక్క గత స్మృతులవలె రాలిపడు మంచుతెరలు

ఇరువైపుల పరికిస్తూ ఎప్పుడో గమనం సాగించిన నేను
నేనుగా గుర్తు పట్టడానికే ఇంతకాలం పట్టింది

## VIII

నిస్సందేహంగా నాటికన్న నేడు
పరిణాహం చెందిన మనో ప్రపంచం
గ్రహాంతర యానంతో సృజనశక్తితో
తృప్తి చెందని మేధా విలసనం

చావు బరువులతో ప్రతిక్షణమొక
పర్వత శిఖరం దాటు మహాజనం
ఇంద్రియ తర్పణీయ పరికల్పిత
యాంత్రిక సమూహ సౌభాగ్యం

అసంఖ్యాక మానవుల మనస్సులలో
మనోజ్ఞ రూపంలో ఒదిగిన ఆకారం
ఒక వ్యక్తి హస్త రేఖపై ఆధారపడిన
అనిశ్చాయక ప్రపంచ భవిష్యత్తు

కళ్ళు తెరిస్తే చూపుమేర ఆక్రమించిన
పృథివీ స్థలీ పరిణాహ దూరదృశ్యాధ్వము
మెట్లుమెట్లుగా వ్యోమపథం సాగిన మనోదశలు
ఒక మహా సంస్కృతీ రూపంలో నిల్చిన చిహ్నాలు
ఒక వ్యక్తి జీవితంలో బహుధా వ్యాప్తమైన
వ్యయ మెరుగని వెలుగువలె విస్తార ప్రపంచం

*

భయ శోకావేశ మనస్సహజ దౌర్బల్యతలకు
లొంగిపోవు, అశాంతి కలవాటు పడిపోయిన
జీవితాలను క్రమక్రమంగా హరించు ఉదయం
సృష్ట్యాది నుండి నేటివరకు ప్రాణికోటి ఆహ్లాదరూపం
నియమిత కాలంలో శిశువువలె ఒకే రూపంలో ప్రత్యక్షం

*

మహాంబర గత సర్వ భూత ప్రకృతి ననువదిస్తూ
దిసమొలలతో నిటారుగా నిల్చిన తాళవృక్షాలు
ఉద్విగ్నంగా ఉత్సాహంగా ఉల్లాసంగా కదలిపోవు
మహాంబర ప్రావార పరీవృతతనూ నిర్ఝరిణులు

సహస్ర సహస్ర మృదుల బాహువులు ప్రసారించి
లిప్త లిప్త ప్రత్యణువణువు అడ్డగించు వాయూర్మికలు

మౌఢ్య విశ్వాస బలంతో వాయుదరీ ఘోషలతో
లక్షలాది వత్సరాలుగా వేరొక దశ ఉన్నట్లెరుగని

పురాణ ప్రగాఢ ప్రబంధ తనూ శైలవితతి
మనోనిభృత సౌందర్యం, మేధాగత సంస్కారం
ప్రాపంచిక విజ్ఞాన స్ఫూర్తిలేని మానవాకృతులు
ఆవిష్కృతాంతర్నిహిత ఆశ్చర్య స్వరూపాలతో
భవిష్యత్తు చేతిలో ప్రాభాత దీపశిఖలవలె
సహసా వేగంతో, అతిక్రమించి పోవు

జీవ భావ రహిత, సృజన శక్తిలుప్త
విజ్ఞాన కళా తాత్పర్య చిహ్న శక్తి రేఖలు

*

ఎన్ని యుగాలుగా గతించినా ఇంకా అక్కడే ఉన్నాం
మానసిక వైక్లబ్యంతో యుద్ధ భయోన్మనీ దశలో
దివానిశలు ఋతువులు ఒకదాని వెంట ఒకటి
ఆగమనం నిష్క్రమణం అంతలో అంతం సంవత్సరం

ఎన్ని యుగాలుగా గతించినా ఇంకా ఇక్కడే ఉన్నాం
మానసిక వ్యాపారంతో తెలివిమీరిన ముఖాలతో
చీకటి తన ఓటమి నెందుకు అంగీకరిస్తుంది?
అనంతాకాశానికి అజ్ఞానానికి తుది ఎక్కడ?

*

మనస్సులో శోక స్వరూపాభిజ్ఞత తెలియని పసివాడు
కాలనియమం లేకుండా అతని జీవిత సర్వాశలు
ఆకులతో పూలతో వైశాఖలై సహస్ర ముఖాలుగా
సుందరాతి సుందరంగా విస్తరించి ఉన్న శోకవృక్షం

కృత్రిమ లక్షణ మనఃప్రకృతి యందు ప్రథమమూర్తి
రావణుని అశోకవనంలో ఆనందహీన శోకమూర్తివలె
అభ్యుచ్ఛయ పథోచ్ఛలిత విజ్ఞానయుగంలో
మానవుని జీవితంలో అంతరించిపోవు ఆత్మభావన

*

ఒక ప్రాణి సన్నని చూపులో ఒదిగి
ఒక ప్రాణి బరువైన నిట్టూర్పులో తూగి
సామాన్యుని కంటికొక మట్టి ముద్దవలె
మేధావికి పరిభ్రమించు గోళంవలె
వేదాంతికి చేతికందీ అందని బంతివలె
సంపూర్ణంగా, అసంపూర్ణంగా కనిపించు

ఆత్మ గగన చక్షుర్దర్శనీయానందమయ రూపం
సుఖ దుఃఖాత్మకమౌ అనంత భావనా రేఖలతో
స్పష్టాస్పష్టంగా ఆకారం మలచుకొన్న ప్రపంచం
వినూత్న నూత్న వైఖరులలో భిన్నభిన్న రూపాలలో
సృష్టి రహస్యం బహుధా వ్యాఖ్యానింపబడిన
వాస్తవిక మనోదృశ్య కళానుభూతి సంకలనం

శ్మశాన పదవికెంత త్వరగా వెళ్ళితే
అంత అదృష్టంగా భావించే వృద్ధుడు
సర్వం సన్యసించి జగన్మిథ్యాభావనతో
తత్వపదార్థ శోధన చేయు వేదాంతి

అధికారం హస్తగతం చేసుకున్న దర్పంతో
లోకాన్ని శాసించాలని కోరే పెద్దమనిషి
విద్యాబుద్ధి విలసనంతో లౌకిక పదవి
సుఖమయ జీవితం గడపనెంచు హితైషి

పరలోకం ఉన్నదో లేదో ఎవరికెరుక
ఐహిక భోగతృప్తితో సరిపుచ్చు ఇంకొకడు

*

న్యాయమైన వారి కోర్కెల ప్రకటనానంతరం
చాచబడిన ఐదు వ్రేళ్ళు మూసుకున్నవి క్రమంగా

ఎవరికి వారు లేచి వెళ్ళాలని ఉద్యమించగనే
బుసకొడుతూ ప్రాకుతూ సర్వశరీరం
కరవడ మారంభించినవి పాములవలె గాలులు

ఇంతలో మింటికప్పు కులి పడింది మీద
అక్కడే ఉండిపోయారు — ఐదు రూపాయిల నోటువలె

X

మనలో ప్రతివాడు తనకు తాను ఒంటరిగా
ఒక గాజు గోడల గదిలో చిర నివాసం
అవతలి మనిషిని గమనించడం పరీక్షించడమే కాకుండా
తనకు తా నతి గోప్యంగా ఉన్నానని ఊహించడం ప్రముఖంగా

దరవాజాలు కిటికీలు లేనే లేవు దీనికి
లోపలినుండి మనిషి రా వీలులేదు బయటికి
బయటినుండి లోపలికెలా వెళ్ళగలడని ప్రశ్న
అద్దాలు పగులగొడితే బయటికి రాగలడని నమ్మకం

సరోవరం పై నీటిపొర లొకటొకటీ ఒలిచేస్తే
అందులో ఉన్న చంద్రుణ్ణి పట్టుకొని ఆనందించినట్లు

*

ఒక మేరలేని అవసరాల కల్పనలతో అపుడపుడైనా
ఒకరి గదిలో చొరబడి ఏమున్నదో యేమిలేదో
ఏలాగో మరీమరి చూడాలని ఉంటుందింకొకరికి

ఎంతదూరం ఎన్ని దాటి వెళ్ళినా నేను
నాకు ఆవలి లోకానికీ మధ్య అడ్డుగా
ఎప్పుడూ ఒక గది అయినా నిలచి ఉంటుంది

అడుగువేసి ముందుకు సాగిపోయినపుడు నేను
ఎదురుగా నడుస్తుంటే ఒకటొకటి చంద్రునివలె,
ఎంత ప్రహ్లాద మయంగా ఉంటుంది మనస్సు

వేసిన అడుగు ఎత్తడం మాని వేసినపుడు నేను
ఎక్కడివక్కడే నిలచిపోతే ఒకటొకటి సమాధివలె,
ఎంత భయంకరంగా మారిపోతుంది మనస్సు

సృష్టియొక్క కదలికలోనే ఉన్నది అనిర్వచనీయానందం
ఎంత పరిణాహ జీవితమైనా ఒక మానసిక వ్యాపారం
మానవుని కోర్కెల సాగుదలకు చిట్టచివరి మెట్టు
మృత్యుపదవి — చీకటిముద్ద — అందుకే అంతభయం

## XI

ఒక జాతియొక్క మహా సంస్కృతీ మందిరాలు
వెలుగు స్వయంజ్యోతీ మూర్తులొకనాడు
చరిత్ర గమనం పేరిట కాలం అయితే
మార్చి వేస్తున్నది భస్మ వేదికలుగా ఈనాడు

వెనుక గద్దలవలె పోనీ కాకులవలె బ్రతికినా
ఇప్పుడు ఎత్తుగా ఎగరడానికీ భూమిపై నిల్వడానికీ
బంగారపు రెక్కలు గద్దెలు ప్రసాదింప బడతాయని
ఆకాశ కేంద్రంనుండి వాయు సమాచారము

తుపాకి దెబ్బలకు భయపడి పిట్టలవలె
ఎగిరిపోవు కాలం ఏనాడో మారింది కాని
రూపాయి ఉన్న గుప్పిటలో చిక్కిన కాలం
కదలడానికే ఎంతగానో భయపడుతున్నది

అంధకార మూర్తులవలె నున్న మనుషుల
ప్రమిదలవంటి కళ్ళలో వత్తులు వేసి వెల్గిస్తే
ఒకేసారి సూర్య చంద్రులతో వెలుగు ఆకాశం
ఊడి పడిందని ఆలోచన చేస్తే! అనుచరులు!

సూర్యచంద్రులు ప్రకాశించు నిజమైన ఆకాశం
వెలుగు లోకం శాశ్వితంగా వెనుకబడినట్లే!
ఇంతకు రెండు కళ్ళు ఉన్నవనేగాని వీరికన్న
రోడ్లపైని కేంద్రాలలోని ''సైన్బోర్డులు'' నయం

XII

చీకటి గుడిలో కలవరించు మానవుని వేదాంతం
సృష్టి యొక్క ప్రథమ రూపం జలనిధితో ఆరంభం

మానవుని మొట్టమొదటి కోరిక సుఖం
తరువాత కష్టాలు తొలగించుకొనడం
నిదురపోవడం మేల్కొనడం బ్రతుకు గడపడం
నీటిపై సాగు పక్షివలె దేవునిపై ఊహ సాగించడం

తనకు తా నెన్నుకున్న సీమిత పరిధి
పరిమితాలోచనల ఆక్రమణలతో
తనపై నీడవాలితే ఉలిక్కిపడి
పరుగులు తీస్తూ దివానిశలనక

రక్షణా వ్యూహమతి
నైపుణీ ప్రకార జీవితం గడపడం
లేదా ఒక వంతెన వలె
వంగిపోయి వాలి పడి ఉండడం

అంశలతో అవతరించిన దేవతలమని
దెయ్యాలవలె ప్రక్క వారిని పట్టుకొని
స్వామ్యత్వము జన్మహక్కుగా భావించుకొని
ముఖాలు మార్చి లౌకికులమని వెలిగిపోవడం

ఒక్కొక్క జీవి యొక్క జీవితం
ఒక్కొక్క సూత్రానికి వ్యాఖ్యానం
చివరి అక్షరం చదివే వరకు
అర్థాన్ని గ్రహించడం సులభంకాదు

వెలుగు గీతవలె భూమిని చుట్టిన దృగ్వలయంతో
సముద్రాంభస్తరంగాలు లీనపరచుకొని తనలో
ఆకాశాన్ని ఆవరించి అదుముకున్న హృదయంతో
ప్రతి లిప్తలిప్త అర్పణచేస్తూ పోవడం జీవితం

సాధనా ప్రింటరి, హైదరాబాదు.

# పృథ్వీగీతం

మాదిరాజు రంగారావు

# స్వేచ్ఛా కవిత్వం

# పృథ్వీగీతం

## ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

PRUDHVI GEETAM

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: సెప్టెంబరు 1961

రసధుని ప్రచురణ హైదరాబాదు.

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

I

గుండెలోతుల నుండి త్రవ్వుకొని వచ్చు
సౌందర్య రసానగాఽవిష్కారము నీ ఆకృతి
చైతన్య కళాశక్తి మూర్తీభవించిన శిల్పము
నా స్మృతి నాక్రమించుకున్న నీవెరుగని విస్మృతి

నిశ్శబ్దం నిద్రావస్థనుండి మేల్కొని
నైల్యస్థితి దాటిన సమయం
నా మనో రోదసి ప్రాభాతమయంచేయు
మహోదార జ్యోతిస్సాహితీ పుంజం.

వాడిన కనుచూపులు పెనవైచుకొని
ఏ పురాజన్మ రహస్యాలనో స్మరింపజేయు
శరన్నీల గగన రేఖలు బింబించుకున్న
సరశ్శోభా తరంగములుబికి వచ్చు కనులు.

ఒక అనుభూతి వెలుగు ఊహల సాగుదలవలె
ఒకగాలి కదలిక విసరుకు పరవశమై
ఎదపై, మసృణ వలాహక హస్తం హత్తుకొన్న
దిగంత రేఖా కిర్మీర ప్రశాంత మహాకాశం.

అశ్రుకణ సమూహమొక రాతిరూపు చెందినట్లు
శిశిర మరుద్వితతి పెనవైచుకొన్న, అగ్ని శిఖామతి;
ఆర్తరవము మ్రోగి మ్రోగి నిల్చినట్లు మ్రోడువలె నిశ్చలంగా
భూమిపై, ఒక మూల మృత్యువు నీడవలె పడి ఉన్న నేను

ఈ అనిర్ణీత ప్రపంచ పరిధి మానవతామృదు జన్మ ఎత్తి
ఏదో ప్రవృత్తి మిడుకుచున్న నాకెన్ని జన్మలకో కలసి
బ్రతుకు లోతులు స్పృశించి వెల్గులు త్రవ్వి తలకెత్తు నీవు
ఒక మంచుగాలివలె, నా వెంట సాగిరావా? అనలమూర్తిని, నేను

ఆకాశం వలె అందని నీ స్వర్గానందానుభూతి భావన;
మైనరాల పరవళ్లుత్రొక్కు, అమృత భరోత్సాహంతో
దీప్తమైన ముఖమెత్తి, దీర్ఘమైన ఊహల రెక్కలుచాచి
నీనీడనైనా అందుకొనగా, అహో! ఎంతకాలం యత్నించా
ప్రతి దినమొక నిశా ధూమశకల పిహితానల మండలమై హసింపగా

ఎంతకాలం నుండో, హిమ శిలవలె బిగిసిపోయి
ఎంతలోతుననో అట్టడుగున దిగబడి ఉన్న
నన్నొక్కమారు వెలుగు గడ్డకెత్తుకొని పోయి
నిర్ఝరివలె ప్రవహింపజేయు వైహాయస
చరదరుణమూర్తి\nనామనశ్చక్షువునకు నీరూపమెంత దగ్గర అంటే
నా రూపానికీ నీడకు మధ్య ఎంతదూరమో అంత
అవిచ్ఛిన్న కాల గమన స్వరూప వ్యాఖ్యానమతులు,
రవికీ శశికీ గల సంబంధం, మనకు గల బాంధవ్యం.

సంధ్యాసమయం సమాసన్నమయ్యే వరకు నిత్యం
లజ్జారుణ భావరమ్య హసన్ముఖ దీపశిఖవలె,
వెలుగు రెక్కలతో ఎగిరివచ్చి, నిప్పుకోల్పడ కన్నులు
నాలో లీనమైన నీ రూపం మరలినట్లే తెలియదు.

మలి సంజవోలె వాలిపోవు నాకనురెప్పలలో
తొలి సంజలందు వెలుగు వోలె దూకు నీ ఆకృతి
ఉదయాకాశంవలె విప్పారెడి కను రెప్పలలో
అనురణించు దృక రేఖాతీతమైన నీ భావన

ఇంతవరకు ఈ సంకీర్ణ ప్రపంచంలో మసలుతూ
ఏవర్ణపు దుస్తులు ఏ రాగధ్వని స్పర్శ ఎరుగని
నానగ్న మనః ప్రకృతిస్థితి, సూక్ష్మాతి సూక్ష్మంగా
మలగిన, ఒక సుందర శివరూపము నీ ఆకృతి.

## II

జన్మించిన లిప్తనుండి నాముఖంలో బింబించి
అనుక్షణం సమయం కోసం వేచి ఉన్న భవిష్యత్తు.
వదలబడిన ఊరుపుతో మేల్కొన్న మనస్సుతో
గాలిపిండులో కలసి అంతమొందిన వర్తమానం.

అంతలో ప్రత్యక్షం, స్పర్శాలోచన గమన శక్తి లేని
ఆకాశం ఆవరించిన, ఆలోచనా రమణీయము గతం.

కాలంయొక్క అవిచ్ఛిన్న సంగీతం వినడానికే
లేచి కూర్చున్నవి శ్మశానంలో నిదురించే నీడలు.
కోరిక గల ప్రాణి సమూహం మాత్రమే వెలుగువలె
కదలుతుంది బ్రతుకుతుంది జన్మిస్తుంది తిరిగీ.

ఒక భయ రేఖాధ్వనికనిశ్చయంగా ఎగిరి
ఎక్కడో అవిజ్ఞేయంగా వాలిపోవు పక్షులవలె,
ఒక లిప్తకు వేరొక లిప్తతో సంబంధం లేని
మనస్సులోని చిత్రమైన ఊహలకనుగుణంగా మలగి,
ఎప్పుడో ఎక్కడో విసరబడి నశించిన
చరిత్ర దృష్టికందని వైప్లవ జీవితాలు.

రేణువులు రేణువులుగా గాలిలో ఎగిరిపోవు
బూది కుప్పవలె మారిపోవు శరీరంగల మానవుడు
క్రీనీడల చెరసాలలో బంధింపబడి ఖైదీవలె
బ్రతికినంతకాలం మానవునకే ఎక్కువగా శత్రువు

ఆకాశంపైని ఒక్కొక్క నక్షత్రంయొక్క హాసం
శ్మశానంలో నిప్పురవ్వలవలె భావింపజేయు రాత్రి
పరుపబడిన చీరకుచ్చెళులలో దాగిన పృథివి
విసరబడిన కొంగు చాటున కన్పించని దిగ్వలయం.

ఈదిక్కుల ముఖంలో తెల్విదూకుడు ననుసరించి
భూమిని ఆక్రమించుకొన్న మానవుని నిభృతవర్తనం,
ఇంతవరకు పొందలేదు మానవతామనోజ్ఞతాభిజ్ఞత.
మనఃపరిధుల ఆక్రమణతో, అందలేదు పరిపూర్ణత

ఎదురెదురుగా జంటగా మూకలో కలిసినపుడు
ఎప్పుడు చూచినా ఒంటరిగా సామాజికంగా
ఎక్కడ చూచినా వీధిలో, విరామస్థలంలో
ప్యాక్టరీలో ఆఫీసులో కన్పించే మనిషి ముఖంలో
నిన్నటి గురించి నిరాశ, నేటి గురించి అతృప్తి
రేపటి గురించిన ఆలోచనల అందమైన బొమ్మలు

ఒకే మనిషిలో మనకు తెలియని ఊహింపరాని సంస్థితిలో
ఒక దృష్టినుండి తప్పించుకు తిరుగు అసంఖ్యాక మానవులు.

లిప్తల మార్పుతో, సంఘటనలో మార్పు లేమీ జరుగనట్లు
ఒక నీలి తెర తొలగగానే వేరొక ఉదయం భాసించినట్లు.

ఇదమిత్థమని నిర్ణయింపగా వీలు లేని విపరీత సృష్టిలో
ఒక జంతువు మృగం లేదా రాక్షసుని జీవితంలో
ఎప్పుడో ఒకప్పుడు భయాత్మక మృత్యు సామీప్యంలో
ఒక మూర్తి రేఖకట్టి బయల్పడు దేవతా భావం.

నిర్ణయింపగా ఊహాశక్తి ప్రసాదింపబడిన తరగతి
నిత్యజీవితం విడదీయరానంతగా అల్లుకొనిపోయి,
జీవిత కాలంలో ఎన్నడూ మోసులెత్తకుండ దేవతా భావం
సర్వ వ్యాపృతమై ఎప్పటికప్పుడు అణగద్రొక్కు రాక్షసత్వం.

ఈ సమార్ద్ర ప్రవృత్తి యొక్క వివృతరూపం
సంగీతం సాహిత్యం శిల్పం త్యాగం,
ఈసమార్ద్ర ప్రకృతి యొక్క సంవృతరూపం
అధికారం తీరనిదాహం వ్యాపార మనోలక్షణం

వివేక సహిత రాగరహిత అంతర్ముఖీనదృష్టి
ప్రపంచ తత్వ సౌందర్యసమున్మీలనావలోకనము,
వైయక్తిక సామాజిక సహస్రభావనాపరిధుల
అతిక్రమించిన, మృదుజీవుల దివ్యానుభూతి విశేషము.

జీవితమొక చివర తెలియని చీకటి వంతెన
సంఖ్య తెలియని అనుభవాల వెలుగుమెట్లపై
అడుగడుగునకొక పునర్జన్మ ఎత్తినట్లుగా
గమనం సాగించు నను అవలోకిస్తూ వరుసగా
కదలిపోవు ఉలుకని పలుకని సంగీతాత్మలు లిప్తలు
ఈ లిప్తల సంపుటికాలం, గమనం అవిచ్ఛిన్న సంగీతం
వెనుక నుండి క్రిందికి ఈడ్చు ఎవరిదో యత్నపు కదలిక
ముంగల, పైకి పోవగా నౌకవలె; హస్తోర్మికా సహస్రము.

దుఃఖత్రయ రేఖల సాగుదలతోనే ఆరంభమై
ఎన్నో యుగాలనుండి పుంజీభవించుకున్న సంస్కృతీచిహ్నం
మానవుని, సుఖభావనా నివిష్ట జీవితం
ఒక స్థితిలో బింబీకరించుకున్న దర్పణం, కాలం.

జీవితంయొక్క మొదలు చివర బిందువులను
ఈలోకంతో కలుపు దివ్య రేఖ పరమేశ్వరుడు.
ఆశ్చర్యానుభూతినంటి వెలుగులోతులు త్రవ్వుకొని
అలౌకికంగా సాగు జిజ్ఞాసా ఫలితం, వేదాంతం.

III

నేను కాదు తిరుగుతున్నది దిజ్మూర్తిని
గ్రహాలు, వానిచుట్టూ భూవలయం
నాముందు, ప్రక్కల రెండుమూడు నీడలు
నా వెన్ను నంటి వచ్చు సూర్యుని కరచ్ఛాయలు.

ఉరలు కంటి వెలుగుల నడ్డుటకై
సర్వంసహ విస్తరించిన తమో వేల,
నిదురలో అనురణించు పీడకలలు
యోగశిఖపై రాలిపడు ధూళికణాలు.

రెండు చెక్కలుగా వ్రయ్యలై
ఒకదాని నొకటి విడువలేని
ఒక దాని ముఖంచూచి వేరొకటి
ప్రక్కకు తప్పుకొని, ఒదిగిపోవు;

ఒక అనుభూతి ఊహవలయితమై
ఇంద్రియ తర్పణీయ ఋతు చిహ్నితమై
దివానిశారూప సంకేతాలతో నిల్చిన
అవిచ్ఛిన్న దశాపరిణాహ రేఖ– కాలం.

నిదుర ముంపు వచ్చిపోయి మెలకువ కలిగేలోపల
కనులుమూసి తెరచేలోపల — మాట పెకలి వచ్చేలోపల
ఉషస్సు తూరుపు గడపదాటి అడుగువేసే లోపల
పాదరసపు గుళికలవలె జారిపోవు లిప్తాంశలు.

ఆకాశంకన్న నిడివైన, భూమికన్న బలమైన
ధ్వనికన్న వేగంగల, మెరపుకన్న వాడిమిగల
బాంబుకన్న భయదమైన, సృష్టికన్న సుందరమైన
ఆలోచనలు సారించు మేధాశక్తిగల మానవులు.

జీవుడు ఈ మానవ నాగరక జన్మఎత్తి
లౌకిక వ్యూహంలో చిక్కిన మృదువేళనుండి
సృష్టి బహువర్ణ సమూహంతో స్పష్టంగా
వికసనోన్ముఖమౌ లిప్తయొక్క స్పర్శ మొదలు;

ఒకనాటికొక దశలో అంతమొందని
అజ్ఞానంతో ఆరంభమైన ప్రపంచం.
ఎప్పటికప్పుడు సమస్యలు తీరినట్లు
అప్పటికప్పుడు భాసింపజేయు విజ్ఞానం.

ఎన్ని మెట్లు ఎక్కుతూ పోతున్నామో ఇలా
ఎంతఎత్తున ఉన్నామో ఎవరికీ తెలియదు
అప్పుడప్పుడు మెరపుతీవ మెరసినట్లు
దృష్టిసారిస్తే కన్పించేవి–శిలా పంక్తులు.

గాలి రొద ప్రసారం చేయు వృక్ష వితతి
దిగ్భిత్తికలకు వ్రేలాడు మబ్బుగబ్బిలాలు
అక్కడక్కడ సనసన్నగ నీడ బొమ్మలవలె
సంచరించు ప్రేతభావోపేతముఖులు.

అజ్ఞానాన్ని అధికంగా ప్రేమించే చీకటిముద్దలు
అకారలోపంగల తేజస్విని ద్వేషించు దివాంధులు
విమానం మ్రోతవిని తీతువు కీచుమని అరచినట్లు
స్పుత్నిక వేగంచూచి ఎద్దుకంట తడి పెట్టినట్లు.

ఒక నదీ మహావర్తంలో చిక్కి
పల్లటీల్గొను నావవలె
తలకు మించిన వ్యూహంలో
అసువులు కోల్పోవు భ్రష్టమతులు.

కాలానికొక చరిత్ర నిర్మింపజేయు వారి
జీవితంలో, ఒక సమార్ద్ర పరిష్వంగంతో
నిప్పుపంట పండింపజేయు హసన్మూర్తులు
మసృణనవాగ్ని శిఖాభ సౌందర్యజీవులు.

అధికార వ్యామోహం, కీర్తి కాంక్ష ప్రబలి
అంతరింపబడిన ఒక రాజవంశ రక్తంతో
తడిసినట్టిదే వేరొకటి ఆవిష్కరింపబడి,

అణగద్రొక్కబడిన ఒక జాతి, మతం స్థానంలో
జరుపబడి వేరొక జాతి మతాభ్యుత్థానం
సహస్రధా చీలిపోయి అందని ఊహమార్గాలు.

ఆక్రమించి అవనితలం ఆకాశమండలం
ఆచంద్రార్కం స్వీయ యశోబింబాలుగా
నిల్వడానికే, నిన్నటివరకు సాగిన రాజరికం
చేసిన, సర్వతోముఖ ప్రయత్న ఫలితం.

మనస్సు లోపొరలో అణగి మణగిన
పశుభావం మృగతత్వం — భిన్న భిన్న
రూపాలలో, ఆవిష్కరించుటకు చేయు సాధన
మానవుని లౌకిక ప్రచాలనంలో నీతిభాగం.

లౌకిక జీవన దశాభేదస్ఫూర్తి
మనః పరిధుల విస్తారత చూపు
యశః పతాకాచ్ఛ కాంతి బింబాలు
చరిత్రలో నిలిచిపోయిన వెల్గు మెట్లు

కల్లోలానిలంవలె మనోఽంతర పదవి
సుళ్ళుతిరుగు ఊహల స్వేచ్ఛాగమనం
కార్యదశకు చేరిన భయవేళా సన్ని వేశం,
అనియమిత మానవ ప్రగతి చరిత్రలో
పూర్వాపరస్థితికి మధ్య ఏర్పడిన లోయలు.

విస్మరింపబడిన అసంఖ్యాక రాజుల వీరుల
కళేబరాలతో పూడ్చబడి కన్పించు దిబ్బలు.
ఈ దిబ్బలపై రప్పలవలె వసించు జనం
మనస్సులో పిశాచాలు కంటిముందు నిప్పుసెకలు.
మబ్బు తున్క కన్పిస్తే చెమ్మగిల్లు కనుకోసలు.

శరీర సంస్పృష్టిగా సాగితే శీతల వాయురేఖ
ఒకడొకడు పొందు ఆనందం బ్రహ్మపదవి చేరిక.

బిగిసిన నేల నిండుగా వానకురిసి సడలి
ఒక నవ్వు పోచ ఉద్గమించలే దింతవరకు

*

గోధుమ వన్నె త్రాచులవలె దిగ్వలయం ప్రాకి
చండ ప్రచండోష్ణాంశు మాలా మూర్తియై
వలయికృత లిప్తల సమూహస్పర్శకు లోగిలి.
అంతలో పరిణాహ రూపంలో మిన్ను మన్ను
అగ్నిశిఖా కలాప జాలంతో అవతరించిన గ్రీష్మం
కణకణలాడు నిప్పుకల హసంతీ హల్లీసకం.

దూరం నుండి ఒక జలకాసారం వలె కన్పించు
ఒక ఆకాశం విడిచి, శుష్కింపజేసి ప్రకృతి సర్వస్వం;
శరాళి గుంఫనంవలె ఎడమినుమంతలేక
హత్తుకొన్న సూర్య కరోజ్జ్వల దీప్తులు

నిప్పులు కుప్పలుగా బూది చెరగి పోయు
సుడులు సుడులుగా తిరుగు వడిగాడ్పులు.

ఒక పెద్ద ఇసుక దిబ్బవలె పగలు
నల్లని రాతి గుట్టవలె చీకటి రాత్రి
గాలిలో తేలు దూదిపింజలవలె వెన్నెల
నీటి బిందువు కోసం మానవుని తహతహ.

కొడి గట్టిన కోపశిఖ వలె ఉన్న ఆకాశం
మసి బట్టిన అద్దంవలె ఉన్న దిఙ్ముఖం
అంటుకొని నిప్పు ఆర్పబడిన బొగ్గువలె ఉన్న భూమి
ప్రాణాధారం కోసం కదలిపోవు మానవుని ప్రయత్నం.

వర్తమానంపై క్రమ్ము కొన్న దట్టమైన అతృప్తి
భవిష్యత్తు గురించి పెంచుకొన్న నవాశలు
జలద శకలం కన్పిస్తే చాలు గగనభాగంపై
విద్యుదాభ కళా పూర్ణమౌ ముఖ పంక్తులు

సామూహిక తత్వంలో మరువ బడిన ఆత్మగత చైతన్యం
సంఘశక్తి పీడన క్రింద అంతరించిన వైయక్తిక వికాసం.

ప్రాపంచిక విభిన్న మూలశక్తులచే ఆకర్షింపబడి
తమకు తెలియకుండా ఒక మారు లొంగిపోయి,

నిలువడానికి సూది మొనంతైనా
సన్నని వెలుగు దారుల విస్తృతి
రక్షణకై పరితపించు బ్రతుకులు
ప్రతి అంగుళం అంగుళం మేర నేలను
మ్రింగి వేయడానికి జల బిందు సమూహంగా
మాటి మాటికి ఉత్సహించు సముద్రం

జ్వలదగ్ని సమోహా సంభ్రాంతిమత్
సంధ్యాటవీ, ధావన్మృగపక్షి సమూహము
రవి బింబ సమాచ్ఛాదన మేఘమండలీ
కల్పిత ఛాయా వాగురానిపతిత జీవరాశి

ఉన్మాద ప్రలపనా సముద్భ్రమన్మరుదావళి
మరుదావలీ సంచాలిత నిర్యూహవృక్షావలి
అశాంతి ఆనందంతో నగ్న నృత్యం చేయు
యుద్ధోన్మాదిని సినీవాలి రాక్షసీ అట్టహాసం

*

ఆకాశముఖంపై సంధ్యా ప్రశ్నలవలె
స్పర్శగుణం, చలనశక్తి, వ్యక్తిత్వంలేని
నడిచే నిలువు నీడల మూకలు—
వేగ గమనశీలి కాలం వదలిన ముద్రలు

అగ్నితో మాసిపోని ఊహలతో పూడ్చబడని
మానవుని ప్రగతి చరిత్రలో చీకటి లోయలు

నిశ్శబ్దం సమావరించిన శిలా విగ్రహాల
పాదాల ముందు రాలిన కన్నీటి చుక్కలు
పర్వతాల హృదయ కర్కశ స్వభావాన్ని
సంగీతంతో సముద్రానికి చేర వేసే నదులు

రాత్రి –
సహజావేశంతో నాలోని అంతశ్శక్తిని
తన వశం చేసుకుని ఆనందించే నిద్రలో
అంతలో అంతమై మస్తిష్కంలో ఆరంభించు
స్వాప్నిక సన్ని వేశాల బలమైన సంఘర్షణ

ఉదయం–
కందగడ్డలా మారిన ముఖంతో మేల్కొని
హిమావృత సూర్యబింబ రూపంలో నిల్చిన
వెలుగు గుడిని చూచే చీకటి కళ్ళలో
తేలే చిన్ని చిన్ని పడవల్లా నిప్పు రవ్వలు

ఉదయం ఆరున్నర,
విరిసిన జన సంచలం

మతి పోయిన చంద్రుని ఆలోచనల లిపి
అర్థరహితమై మాసిపోయిన వేళ
సూర్యుని విశాల హృదయంపై వ్రాలిన
సర్వ జగత్తు భయశోకం మరచిన వేళ

వెలుగు పోయి బీతు బీతుగా ఒంటరిగా
నగరంలోని దీప స్తంభాల చాటునుండి
వీణాశ్రుతులలో వినిపించని దీన స్వరాలు
వంకరలు తిరిగిన సూదులవలె చూపులు

క్రుంగిన భూమితలంపై
పాములు విడిచిన పుట్టవలె
కోర్కెలు ఫలించని ఇసుక దిబ్బవలె

సంధ్యాగ్ని కీలలకు పొగబారి
తెల్లదనం నశించిన ఆకాశంవలె
నేల వాలి పూర్తిగా అతికిపోయి

మన్వంతరాలుగా పరిక్రమించిపోవు
జగన్నాథ రథచక్రాలు పట్టుకొని
మృత్యువు ఊహలతో వదలని చీకటివలె
నీడలు వదలి పోలేని శైశిరాకారాలు

సాంఘిక సమభావ స్థితికందుకొనని
అన్న జీవుల ఆరాటం— ఆరని కాష్ఠంవలె
జీవితం క్రతువుగా పరిణమింపజేయు
మనః ప్రాణి ఆవేదన— జ్వలించే సప్తార్చివలె

పట్ట పగలు—
అగ్ని పర్వత శిఖరం ఒరిగి పడినట్లు;
తనపై ఆకాంక్ష, లోకంపై మమకారం
ప్రక్కవాడితో జీవితంలో అజ్ఞానంలో పోటీ

నిశాఽగమన సంధ్యాసమయం
జాతులు జాతులుగా, మాలలు మాలలుగా
ఇత స్తత ఉడ్డీన విహంగమ సమాకీర్ణమై
చివరలు నీలీకృతమౌ విలోచన పథం
విశ్రాంతి కోరు నిరంతర యాత్రిక సమూహం

పైన అన్నపు మెతుకులవలె చుక్కలు
క్రింద విద్యుద్దీపంచుట్టూ కలవరించు చీకటి
తానై మేల్కొనదు–ఎవడైనా మేల్కొల్పితే
నిప్పంటిన రాక్షసిబొగ్గు – విప్లవం

*

ఆకాశానికి భూమికి మస్తిష్కానికి మనస్సుకు
ముఖ్యంగా తనకైనా తన పరిణామం తెలియని
— పరిణాహ రోదసి

మానవుని ఇష్టాఽపూర్తికి చిట్టచివరి దశ
ఈశ్వరుడు, అతని పాదాల ముందు
అవసర మస్తక సోపాన పంక్తి వలయం
అతని శిరఃపదము మీరి దాటి పోగల
తమలోని ఆత్మభావం తెలియని జీవులు

పరివర్తన చెందని అనాది వారసత్వ చిహ్నాలు
సుత్తెల మ్రోతలు విని ఎరుగని కొండరాళ్ళు
ఋతు పరివర్తన శక్తికి నిల్వ లేక నశించు
ఆకురాలుపు, చిగుర్పు, పెరుగుదల ఎరుగని —గడ్డిపోచలు

జీవితాంతం వెల్గుతూ త్రైగుణ్య విపర్యయంతో
అసంపూర్తి కామనలతో చల్లారని మనఃశ్మశానం
కళానుభూతిలో, లౌకిక వలయంలో
ఆనందం దుఃఖం పేరిట నగ్నంగా
ఉద్విగ్నంగా దీప్తమతికి గోచరించు
అశాంతి గోళిక వివర్త దృశ్యాలు

కాల నియమం లేకుండా సంచరిస్తూ
అజ్ఞాతంగా, అద్దం వంటి బుద్ధితో
అవిజ్ఞేయంగా బింబించు మనోభూమికలు

## IV

రక్తారుణ పాద ముద్రలు ఎంత దూరం సాగినవో
అంతవరకు అడుగడుగునా, పలుకు లేని
చూపులేని నడవలేని ప్రతిబింబాలు తప్ప
ఎక్కడా ఎవరి నిజ స్వరూపమూ కన్పించలేదు

ప్రక్కన నడిచే చెట్లకు నాభాష తెలియదు
వాటిలో ఒకరి భాష వేరొకరికర్థం కాదని
తరువాత తెలిసింది చేష్టలను బట్టి

ప్రక్కన నడిచే కొండలకు నా రూపం కన్పించదు
వాటిలో ఒకరి కళ్ళు వేరొకరిని చూడలేవని
తరువాత తెలిసింది నడతను బట్టి

వెనుక నడిచే నీడలకు నా ఉనికే తెలియదు
వాటికి చెవులు, నోళ్ళు, కళ్ళు లేవనుకున్నా మొదలు
తరువాత తెలిసింది జీవం కూడ లేదన్న సంగతి

వెల్లు గీత దాట లేని చీకటి బంతుల వలె
అక్కడక్కడా దాగి దాగి తిరుగు
జ్ఞాన స్ఫూర్తి ఎరుగని జంతువులు తప్ప
ఎక్కడా నా కంటికి మానవులు కన్పించలేదు

ఊహాగత మనస్సౌందర్య వర్తిత్వం పెంచుకుని
మానవులను చూడడానికింతగా తపించడం దేనికి?
మనోజీవం నశించిన శవాలు; పీడించే దెయ్యాలు
కంటికి, రంగు వేయబడి కన్పించే మట్టి బొమ్మలు

అంత ఎత్తు కొండ కొమ్ము మీది నుండి
దూకి, సరస్సుపై వాలి పోయిన క్రీనీడలు
కారు మొగిళ్ళ గుంపులు—నల్లని త్రాచు పాములు
బహు విచిత్ర జంతు సమూహ రూపాలు
అద్దంలో అస్ఫుటంగా కన్పించే నీడ బొమ్మలు

పగలు వాటి చుట్టూ నిద్ర వంటి బ్రతుకుతో
రాత్రి మేల్కొని ఒకరి నొకరు పల్కరించుకొని
చీకట్లో నవ్వుకునే కుర్చీలు — కాగితాలు, కలాలు
ఉదయం కాగానే ఏమీ ఎరుగనట్లుగా కన్పిస్తవి.

ముఖాంచల విన్యాస వైఖరి నుండి తప్పించుకొని
ఒక చోట కూడి స్వేచ్ఛగా సంభాషించు కొనే హృదయాలు.

శ్మశాన పాద ముద్రలు – ఇంకా కొంత దూరంలో
ఆత్మీయత, ఆలోచన, నాదశక్తి ఎరుగని
కపాల ముఖ సమాగత వాయుగీతాలు – విని

హర్షంతో వేయి రెక్కలు కట్టుకొని ఎగిరే అడవిపిట్టలు
అవల ఏమున్నదో వాటికి తప్ప ఎవరికీ తెలియదు

దూరం, సుదూరం వెళ్ళిపోయిన నేను
నా మస్తిష్కంలో తిరిగే
ఒక ప్రక్కకు ఒరిగిన ప్రపంచ గోళం

క్రిందికి వాలిపోయిన ఆకాశం
స్థిరమైన ఉనికి ఎరుగని నీడబొమ్మలు
బుద్ధిని వదలని — తృష్ణ తీరనికామనలు

దూరం బహుదూరం వెళ్ళి పోయిన—
నా పాదాలక్రింద ధూళి రేణువులు

నా కనుచూపు సాగి ఆగి మలగిపోయి
శూన్యంలో కలసి మాయమైనంతవరకు
నిల్వుటద్దంలో కన్పించే, వెనుక గీయబడిన
పిచ్చిగీతల్లా నాకు తెలియని నోరులేని లిపి

ఎంతదూరం ప్రాకినా ఎంతసేపు ఆలోచించినా
అంతరిక్షం హస్తగతమై గ్రహాలు స్నేహితులై పోయినా
పైనఆపైన ఇంకా పైన దేనికోసమో ఆరాటమే.

అగమ్యగోచర విస్తార సముద్రం
అవతలి తీరం చేరడానికి ఓడ,
ఒక దాని వెంట ఒకటివచ్చి నిలువనీయక
దాటి వేయు, ఎత్తబడిన చేతులవలె అలలు.

మనిషి యొక్క ఉనికికి మొట్టమొదలు
కావలసింది కొన్ని అడుగుల నేల.
ఆహారం అధికారం సంపాదన రక్షణకు
తనకుగల శత్రువుల బారినుండి
ఎప్పటికప్పుడు స్థితిగతి కాపాడుకోడానికి
తలలెత్తిన ఆలోచనల పరంపరలు;
ఒకక్రమంలో తాల్చిన ఆకారాలు
ఈ కోటలు పేటలు సామ్రాజ్యాలు.

ఏదో ఒక మతనియమంలేని మానవుడే లేడు
ఎక్కడో ఒక బిందువునుండి మొదలుకాని గీతలేదు
వలయంవలె చుట్టబడని అంచులుగల ఊహలేదు

అతడు పొందిన మనోదశా పరిణతిలో
బుద్ధియొక్క దీప్తిలో జీవనవిధా పరిణామంలో
వైశాల్యం వైవిధ్యం ఎంతైనా ఉండవచ్చు.

దాహం క్షుధ లైంగిక విషయ వాంఛలు
అలౌకికానందం అవసరం గుర్తించి ప్రాణికి,
పుణ్యపాపఫలాలు, స్వర్గనరక లోకాలకు
ముడివెట్టి, ఈశ్వరుణ్ణి సృష్టించుకొని;
వీటి సుగమ సాధనా న్వేషణామార్గంలో
అధికార మర్యాదలతో, అహంకారౌన్నత్యంతో
క్రమక్రమంగా క్లిష్టమైన వ్యూహనిర్మాణంలో
మలచబడిన జీవితంలో, అహర్నిశలు,
ప్రపంచంలో తనకు జరిగే సంఘర్షణనుండి
విముక్తి లేదా విజయానికి యత్నించు మానవుడు.

ఒక తుపాను, ఒక రాక్షస మలిన కృత్యం
ఒకదిశ, ఒక స్వభావంలో ఒదిగినట్లు,

ఒకపిచ్చివాని ఊహలు, సముద్రుని ఘోషలు
ఒక పద్ధతి, లయలో విశ్వాత్మలో లీనమై పోయినట్లు,

ఒక నియమిత రేఖ ననుసరించి నడుస్తుంది
అవిద్యమాన అనిశ్చిత సంకీర్ణ మహాసృష్టి.

# V

కను విప్పిన లిప్త నుండి స్పష్టాఽస్పష్టంగా
నగ్నమైన నా తనువు నాలింగనం చేసుకొని
ఎంత విసిగినా వదలని హిమాసార సమీరం

జీవ సమూహం కనులలో పరాగం పోసి
అంధులనుచేసి, ఆనందంతో ఎంతకాలంనుండి
నను వెన్నాడుతూ తిరుగుతున్నదో తెలియదు.

ఉన్మనీ దశలో ఊహవలె ఆవహించి మనస్సును
నను వదలనీయదంతకంతకు వదలించుకోదు తాను.
తనకు లేదు శరీరం, నేనెరుగను ఊహవలయం
రోదసీ భావ మెరిగిన ఆకాశానికీ నాకు లేదు భేదం.

అవధులు లేని వంపులు తిరిగి మలపులు మలగి
అహో! అందాన్ని ఆచి పట్టుకోజాలని శరీరం,
కదలిపోవు, నిలకడ ఎరుగని ఊహసమూహం
భూమిని తాక లేదు, నింగినందుకోలేదింతవరకు.

ఒక నిదురవదలి వేరొకటందుకొనే లోపల
తీరం కన్పించని సముద్రం–సముద్రంపై

మొగిళులవలె తేలిపోవు చిన్న చిన్న పడవలు
పైన చంద్రబింబం–నోరు తెరచిన మహాకాశం.

నిదుర పట్టడంతో కాటికి కాళ్ళుచాచి
రెక్కలు విరిగి కుప్పగా కూలి పడిన రాత్రి,
ఎప్పుడో చివర ఊపిరి కాస్త వదలిన దినం
నిదుర వదలడంతో పునర్జన్మతో ప్రత్యక్షం.

భూమికీ ఆకాశానికీ పరిచయం కల్పించే సూర్యుడు
ప్రత్యణువణువు పులకింప జేయు వెలుగు వాకలు
అతణ్ణి చుట్టుముట్టి గుంపులు గుంపులుగా పరుగిడు పాములు
భూమివైపు వరుసగా రివ్వున విసరబడు పూలదండలు

విష్ణుపదం వీడిన బ్రతుకు, బ్రతికెరుగని మబ్బులవలె
నాపాదాలు పట్టుకొని వదలజాలని క్రీనీడలు.
ఒక వైపు ఆహ్వానపత్రంవలె మృత్యుముఖం ఒకటి
రెండవవైపు దేవతా ప్రసార హస్తాలవలె వెలుగు బారులు.

ఈ శరీరాంచల రేఖా పరీవృతమై వాయువులు
ఎదలో జ్వాలా సంగీత రహస్యం ఊదటం మానలేదు.

సన్నని రాగకరస్పర్శతో నిద్రనుండి మేల్కొల్పి
అగ్నికొక ఆకారం కలిగించి, మనస్సు కాహ్లాదం కలిగించి;
వికసించిన అరుణానేక సహస్ర ముఖాలతో వెలుగు
అగ్ని వచస్సమావృతమై పరవశమౌ వాయూత్కరములు.

ఒక నిర్మలాంతః కరణంలో ఊహల సాగుదలవలె
స్పష్టమైన రేఖల కొదిగిన ఒక దివ్యానుభూతి భావనవలె
స్వర విశేష కల్పనలో చకచ్చకితంగా భాసించు దేవీనృత్యంవలె;
వర్ణ సామరస్యంలో సన్నిహితం పొందిన మహాస్సౌందర్యంవలె;
మనస్సముద్రోర్మి కాంశువుల మలపులలో మలగిమలగి
ఒదిగి ఒదిగి పోవు మోహాపాదక వాయు స్వరారకములు.

ప్రసన్నతర సుషీమ దరస్మిత సౌకుమార్యం
ప్రళయభావం పొందిన ఝుంఝూ తీవ్రత్వం;
ఒదిగించుకొని స్వీయకల్పనాకృతులలో ఒకటిగా
శరీరం పెనవైచుక నను అడుగుకదలనీయని;

ప్రత్యణువు స్థలం వీసర వోకుండగా వ్యాప్తి చెంది
ఒకలిప్తకాలం ఎక్కడా నిలుకడ ఎరుగకుండ కదలి,
ఎప్పుడలము కొన్నవో ఈ సర్వతోముఖ సంసారము
స్పర్శానుభూతి సుఖదుఃఖ భావకలనామూర్తులు.

సృష్టిగత ప్రాతర్మధురోహా స్ఫురణ వేళ మొదలు
లయస్థితివరకు సాగు మనఇంద్రియతర్పణా హేలలు
మృదు గీశ్శేఖరములు-- సమానోచ్ఛలితానతములు
మన్మనోనభస్థలీ చలన్మధుర వాయు పరిషత్తులు.

శిల్ప రేఖా సీమిత, సంగీత మాధురీ స్విన్న
        కవితా ఫలా కారకాత్మలు
యాగినీస్వరూపలు, అమృత భావనా మధువులు
        జ్యోతిశ్శిఖారుణదీధితులు.
రివ్వున దూసికొని వచ్చిపోవు మంచుగాలులు
అలలు అలలుగా సాగు కాంతి చక్రసహస్రములు
అనిర్వచనీయమైన ఒకానొక విశేషమనస్థితిచే
సర్వదా పరిపాలింపబడు దివ్యానుభూతికదంబములు.

*

గభీరమహోదధి మనస్సులో, వెరపుగొల్పు
ఉన్మాదపు కోర్కెల సుళ్ళు రేపి అనంతంగా;
నడవలేని చెట్లభుజాలపై చేయి వేసి ఊపి కదలిపోవు
గాలులు—నా వెనుక, మూర్తి లేని గుర్తింపరాని రోదసి.

విధి పేరిట వ్యూహంలో జొనిపి, ప్రభుత్వంచేయు
ఆశవలె, నాముందు చూపుమేర విస్తరించిన ఆకాశం.
వెలుగు వత్తులు వేసుకొని ఎదురుచూచే నాకళ్ళను
ఆవరించి, గాఢంగా అద్దుకొను, నిశ్చలమైన నీలిమబ్బుకళ్ళు

# VI

రోదసి నిండిన సూర్యుని మొదటి కిరణం వలె
కౌగిలించుకొన్నప్పుడు
వేరొక రాత్రి వచ్చి పోవాలని మనస్సులో
ధ్వనిస్తుంది ఊహ –నిశ్శబ్దం నడకవలె
తుమ్మెద ఝుంకారంవలె, జలపాతం హోరువలె.

సాయం సంధ్యా వేళ సూర్యుని చివరి కిరణంవలె
దూరదూరంగా సూక్ష్మాతి సూక్ష్మంగా
విడిపోయిన నీవెవరవని అడిగితే
ఏమని చెప్పగలను ఈ చీకటి నీడలకు?
ఉదయం వరకు వేచి నిలచి ఉండే అదృష్టముంటేగా.

ఆనందం విషాదం సమభాగంగా అనుభవిస్తున్న
చంద్రుడు, కన్పించగనే నిలచిపోయేది నీవే, స్మృతిలో
ఈ నీలాకాశ తమస్సముద్రందాటి ఏలా రావాలనా?
నిశ్చల దృశాశ్రేణి నిర్మించిన వెలుగు వంతెనపై రా;

బడబానలంచే గర్భితమైన మహాసముద్రం
విద్యుత్కాంతి నిహితమైన నీలపయోదపంక్తి
ఊహయొక్క స్ఫూర్తి శోభపొందిన శబ్దబ్రహ్మం
ప్రణవధ్వని తరంగం భరించు విశ్వాంతరాళం.

భృంగీరవ సమ్ముగ్ధ పరాగ కిర్మీరిత దిశా పద్మం
సంగీతాత్మపొందిన తపఃఫల సాహితీ పుంజం.
సూర్యకర దీప్తిచే గుర్తింపబడిన దిక్కులుగల ప్రపంచం
సుసుందరరూప సమాశ్లిష్ట పరమ శివస్వరూపం.

ఈ జన్మలో నిను పొందిన నేను, నీ ఆత్మకొక రూపమిచ్చి
నను నేనొక పరిధిలో, శాశ్వతంగా బంధించుకోజాలను.

ఊహను ఆక్రమించి క్రియలో పర్యవసించు
గతాగత వర్తమాన ప్రపంచరూపంలో,
త్రైకాలికంగా నిల్చిన మృత్యువు రూపమే
ఈ జీవితంలో కలిగిన నీనుండి వియోగం.

వర్షధారా మధు పరిపూతమై
ప్రత్యణువు, సుఖానుభూతివేలా
సమార్ద్రనిబిడ పరిష్వంగంకోసం
ఔత్సుక్యంతో ఎదురుచూచు;
గ్రీష్మానల దాహప్రచండ వాయు గోళంవలె
నిత్య జాగ్రత్ వ్యగ్రమై ఉన్నది నాజీవస్థితి.

ఈ సర్వశరీర మొక విస్ఫారిన నేత్రగోళమై
నీదర్శన స్పర్శకోసం నవ ప్రతీక్షావ్యగ్రమై
సన్నని నీలిమొయిలు నీడల బరువులకు సదా
ఓర్వచాలీ చాలని అలసమృదుల భావంతో;

ప్రతిచిన్ని కదలికలో, గాలి వరుస తాకిడికి
ఊగిసలాడి, ఉరలు, ఫేనతరంగపంక్తులవలె
ఎక్కడి వెక్కడో తెగి రాలిపడు మంచు బొమ్మలవలె
సగం నిదుర బ్రతుకులో కలలు కురియు సుధావిశిఖ.

ఈ దేహం అగ్నిలో జల్వించి భస్మసాత్క తృమై
ప్రాణం గాలిలో లయించి అంధగతి సాగిపోనీ,
కన్ను చెదరగొట్టు ఆకాశం విప్పిన వెలుగు చీకటి రెక్కలక్రింద
దీపశిఖవలె ఉన్న నన్ను చుట్టిన ఈ నీడలెలా వదలును?
లౌకిక కర్మగతుల అవధుల నతిక్రమించిన శాంత పదవి,
ఆసన్నామక జ్యోతీరూపంలో శాశ్వతంగా లీనమైతే తప్ప.
స్వర్ణకవాటం తెరువబడి, వ్యక్తావ్యక్త బ్రహ్మా భావనలో
మృత్యువునధిగమించి, అమృతత్వం పొందు జీవకళ.

# మరో ఉదయం

మాదిరాజు రంగారావు

ప్రచురణ
నవోదయ సమితి
హైదరాబాదు.

# స్వేచ్ఛా కవిత్వం

# మరో ఉదయం

## ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

MARO UDAYAM

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: ఫిబ్రవరి 1962

నవోదయ సమితి హైదరాబాదు.

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

# ఇతర కృతులు

కిర్మీరం

మేల్కొన్న అకాశం

మనో భూమికలు

అద్దంలో నీడలు

# అధునా

పునర్జన్మ ఎత్తాలి నీవు తప్పదు సుమీ ఇక
మరో మనోలోకాన్ని కల్పించు కోవాలిప్పుడు.
దుఃఖంతో ఆగిపోక కష్టంలో నిల్చిపోక
పతనంతో పారిపోక మరణంతో మారిపోక

రాయి నుండి రాకెట్ వరకెక్కడా ఆగిపోక
ఎన్నెన్నో రూపాల్లో అభ్యుదయం సాగిస్తూ
యుగ యుగాలు నడుస్తున్నా తరతరాలు నశిస్తున్నా
నీవేనీవే ఒకే ఒక అమరజీవివి మానవుడవు.

పేదవాని కోరికలో కుంచితమై ఒదిగి ఒదిగి
ధనవంతుని ఆశలో విశాలమై వ్యాప్తి చెంది
పొలిమేరలు చెరగిన ఈ విశాల ప్రపంచం
జగన్నేతల చేతులలో తిరుగాడే ఆట బంతి.

ప్రతి యుగానికొకే ఒక మానవ ప్రతినిధి పూర్వం
నేడో ప్రతివాడొక యుగ విధాత సంపూర్ణంగా.

మౌఢ్య బలంతో విశ్వాసంతో
చెలరేగిన ఒక జాతి మతం అకాండ తాండవం
పరస్పర ధాటీ ఘర్షణలో భగ్నమై
అతినవీన రూపంలో ఉదయించిన మానవత

అహంకార దర్పోద్ధత్యం, అసహన శౌర్యోద్రేకం
రాపిళ్ళకు తాళలేక పరుగిడి కొండల్లో దాగి దాగి
చీకటి ముసుగు ధరించి, రక్షోభావ మావహించి
మానవత కోల్పోయి దైవపథి దృష్టి సాచు మానవుడు.

శాంతికీ యుద్ధానికీ, పురోగమన ధ్యేయానికీ
సౌఖ్యానికీ దుఃఖానికీ, తిరోగమన మార్గానికీ
జన్మకూ మృత్యువుకూ, ప్రతి అల్పానల్ప కృత్యానికీ
ప్రళయం వరకు సాగు మహా పరిణామానికి కేంద్రం.

ప్రతి మానవ మనోఽంతర పదవి వ్రేలాడే
బంధు భావ జాతి వర్ణ సక్త రక్త తోరణాలు
ఆత్మయొక్క సౌందర్య శిఖా ప్రవాహ మింకిపోయి
ఆది నుండి లాగబడుతూ వస్తూన్న జీవితాలు.

చారలు చారలుగా అట్టలు కట్టిన
నెత్తుటి గీతల బొమ్మల వరుసలు
పిశాచ హృదయం విలాసప్రదముగ
భద్ర పరచుకొని ఆనందించే ఆటవస్తువులు

గాలికి రాలి ధూళి కలిసి పోవు ఆకులవలె
ప్రాణాలను కోలుపోవు కసి మసగిన మృత్యుక్రీడ
రారాజులు ఆనందించే ఆనాటి పండుగస్థానం
ఈ నాటి ప్రజలు అనుభవించే స్వేచ్ఛా దివసం.

అవధులు లేని మహాకాల సముద్రం విడిచిన
సితాసిత మేఘ నిశ్వాస పరంపరలు సంఘటనలు.
ఏ భూమి సమార్ద్రమై, పరీమళ భరితమై భోగమయమై.
ఏ ఖండం బీడువడిన జీవితం గడిపేదీ ఎవరికెరుక ?

ఈ దిశ నుండి ఆ దిశ వరకు హుటా హుటిగా
హఠాత్తుగా గుమ్ములుగా ముట్టడించి ఒక్క మారు
ఊపివేయు ఝుంఝూ పవనంవలె ఘోరాకృతి
వచ్చి పడిన యుద్ధాలకు క్షామాలకు భయపడి
కష్టాలు ఎదుర్కొని నష్టాలు సహించలేక పరుగిడి
బంధు భావ బంధాలను త్రెంచుకోని, సంపూర్ణంగా
ప్రేమ పూర్ణ సౌహార్దం వదలుకోని, శాశ్వితంగా
ఏ దేశం గర్భంలోనో, ఏ చల్లని నీడలలోనో
ఏ పచ్చని మైదానంలోనో, ఏ ఆకలి తీరేచోటునో
ఒంటరిగా గుంపులుగా తలలు దాచుకొని బ్రతికిన
ఈ మానవజాతి సమస్తం, తన ఉనికి కోసం క్రమంగా
సాగించి పోరాటం అలవర్చుకుంది అధికారం వికృతిలక్షణం

ఒకనాటి అవసరం ఆనందం బట్టి
అలముకొన్న అభిరుచిలో ఊహలో
వేషంలో వర్ణంలో, వ్రేళ్ళుదన్నుకొని
మనిషిని బహిరున్మీలిత ముఖునిచేయు;

ఒక దిశ గాఢంగా ప్రసరించిన
ఒక ప్రత్యేక విధా మనస్తత్వం
మార్పులు సహించని, చేర్పుకు తలవంచు
ఆకాశం ఆవరించు ఆశగల జాతీయత్వం

భిన్న భిన్న జాతులు, భాషలు, ఆలోచనలు
భిన్న భిన్న పద్ధతులు ప్రవర్తనలు విశ్వాసాలు
ఎక్కడా పొంతన కుదరని జీవన విధామార్గాలు
వీటిని అధిగమించిన మానవతా సూత్ర నిబంధితమై

దారిద్ర్యం దుఃఖం ఆపదలో, క్రౌర్యం కాఠిన్యంతో
విభేదాలతో ఎవరికివారు విభాజితులై విస్మరించి
నేలనాల్గు చెరగులా చెల్లా చెదరై విస్తరించి
తమ తమ బ్రతుకులు ప్రత్యేక చరిత్రలుగా
తమ ఊహలకనుగుణంగా మత సంస్కృతీ సాహిత్యం
మలచుకొని నిర్మించుకొన్న మానవ సమాజం
మధ్య మధ్య ఏర్పడి ఉన్న నీడలు లోయలు సముద్రాలుదాటి
ఒక విశాలరూపంలో అవతరించబోవు అఖండ మానవసృష్టి

వేల ఏండ్లనుండి ఈనాటి వరకు మానవుని
అదే మనస్థితి సాంఘిక రాజకీయ దుస్థితి.
రాసులు రాసులుగా రాళ్ళూ గుట్టలవలె
గుంపులు గుంపులుగా చెట్లూ చేమలవలె
ఎండకు ఎండి, వానకు తడిసి చలికి బిగిసిన
బండలవలె మొద్దులవలె మట్టిదిబ్బలవలె,
సంస్కృతీ సౌకుమార్యం, సౌందర్యం, ఊహాశక్తి
సూక్ష్మదశలు ఎరుగని, జడభరిత మనస్థితి
ఈ సామాజిక రూపంలో నేలపై నిండిఉన్న
కశ్మల వాతావరణంలో కంకాళపు దుర్గంధంలో
మానవ రూపాల్లో నిల్చినట్టి బూది కుప్పలమయం
కళాహీన నిశారూప క్షుధాకర్శిత బానిసలోకం

నరనరాలలో తేజస్స్రవంతులు ప్రవహింపజేసి
చైతన్యమయం చేసి, ఆకృతులు నవాగ్ని శిఖలుగా
ఉత్తుంగ తరంగ నటత్ మహోద్వేగ ప్రవాహంవలె
పరుగులు ఎత్తించి ఉప్పెనవలె విరుచుక పడు
మహాశక్తి, పీడిత ప్రజాశక్తి సమీకరణ విజృంభణ
మరొకసారి జరుగక తప్పదు, తప్పదు ఫలితం !

కూలిన కోటలు, కదలిన సింహాసనాలు వ్యవస్థలు
హతమారిన అహంయువులు, అణగారిన అగ్నిగుండాలు.

దారిలో మేల్కొన్న శవాలు గతితప్పని చరిత్ర భ్రమణం
ఇదివర కెన్నెన్నో కళ్ళకు కట్టిన ప్రబలమైన సాక్ష్యాలు
చరిత్రలో అణగి మణగి నివురుచే కప్పబడిన స్ఫులింగాలు
రివ్వున గాలివీస్తే చాలు కణకణలాడు దారిచూపు దివ్వెలు.

పురా ధర్మసూత్రపు బరువు క్రింద అణగి మణగి
భర్మ హర్మ్యపు గోడల నీడల క్రింద ఎదుగుమాని
తనకు దొరికిన స్థలంతో తృప్తిపడి ఒదిగిపోయి
బ్రతికినా చచ్చినా ఏమైనా ఆరడుగుల నేలకన్న
ఎక్కువగా స్థలంకాని, ఏదైనా ఒక్క మనిషికి మించి
ఎక్కువ బలం కాని అవసరంలేని నిస్తేజోమూర్తులు.

వెలుగుకు భయపడి చీకటి కలవాటుపడి
చీమలవలె దోమలవలె ప్రాణదఘ్న భయంతో
పుట్టిన అరనిముసం నుండి చచ్చే అరనిముసందాకా
నిండా నూరేండ్లు బ్రతికినా, ఏస్థితి ఏలిప్తలోనూ
సంకల్ప నవోదయ మెరుగని, త్రపాహీన సేవామతులు
ఎక్కడ చూచినా అత్యధిక సంఖ్యలో జీరో విలువలు

ప్రజాస్వామ్య పద్ధతి సర్వహక్కులనుభవించు ప్రపంచ పౌరుడు
తిండికి బట్టకు స్వేచ్ఛకు కరవులేని సామాజిక వ్యవస్థలో
ఆలోచన అభ్యుదయం, సమగ్రమైన మానవతా వికాసం
మరో మనోలోకాన్ని సృష్టించుకున్నప్పుడే నిజం !

ఒక వినూతన ప్రభు పథంలో నడుస్తున్న
మహాయుగ రథచక్ర విఘట్టితమై నలగి కలగి
గాలికి ఎగయు ధూళి రేణువులకు వెరగొందక
వెనుకబడి గుండె చచ్చినవాణ్ణి గూర్చి మరచిపోయి.

బహు విభేద దశా విభాజిత సంక్లిష్ట మనోరూపం
సంపూర్ణంగా మార్చుకోక తప్పదు ఆధునిక మానవుడు
విశ్వ భావనా ప్రపూర్ణ నవ్య సంస్కృతీ విజ్ఞానదృష్టి
వంపులు తీర్చి దిద్దుకోక తప్పదు దివ్యధునీ జీవితరూపం

# మొదటి ఉదయం

ఉదయ తరణి వేలావధి కెదురుగా కూర్చున్న నేను
వెలుగు పొంగు వచ్చి ఎప్పుడు ముంచెత్తిందో తెలియదు.
ఇసుక దిబ్బపై తళతళలాడు కాంతి ప్రవాహంసాగినట్లు
కొండ కొమ్ము మీదినుండి జలధారాధుని స్రవించినట్లు.

ఒక జాగ్రత్ చైతన్యం వెలుగులతో ఆకాశం నిండగా
మాయా శూన్య జఘన్య స్థితి కొక సుందర రూపం వచ్చి
బ్రహ్మాండం పర్యంతం నాదశక్తి జనించి, కాలాభిజ్ఞతకలిగి
శవాలవలె వ్రేలాడుతున్న ఆశా రూపాలకు ప్రాణం వచ్చి

బహువర్ణ కుసుమ పరీమళం ఒక్కమారు సోడు ముట్టగా
ఇంద్రచాపంవలె మారినట్లుమనస్సు పొందిన వేలానుభూతి,
ప్రశాంత దీప కాంతి వదనంతో, హర్షధారాబాహువులతో
ఆకాశం భూమిని, పురుషుడు ప్రకృతిని కౌగిలించు కున్న సమయం

మనస్సులో చెలరేగిన పూర్వపు స్మృతి చిహ్నాలు
మరపు యొక్క మెలకువ కలిగిన కదలిక
సన్నని నీలి దారంతో చుట్టూ అల్లబడి ఉన్న
ఒక విచిత్రమైన సాలీడు పటం.

ఆవహించిన సంతోషాశ్చర్య హాస ముద్రల
గాఢత్వం చెరగని, ఏతీవ్ర శక్తికోలొంగి పోయి,
మేల్కొనీ మేల్కొనని ఒకానొక అననుభూత సంస్థితిలో
కలల వరుసవలె కన్పించు అవిచారిత రహస్సృష్టి.

ఒక సన్నని ధ్వని మహా సంగీత స్వరంవలె
ఒక చిక్కని స్పర్శ మహానంద మధునదం వలె
స్వర్ణ ధారలతో తడిసి శరీరం వజ్రమయమై
హృదయం దేనికోసమో ఆరాటపడి తపించి

ఊడి పడిన స్వర్గ ఖండంవలె ఉన్న భూమిపై
కోపంతో సంతోషంతో చిందులు త్రొక్కు శిశువులవలె
అనంతమైన మహాకాల వృక్షపు నీడల వలె
కదలాడు మబ్బులవలె తేలికైన ఆలోచనలతో

గతి తప్పిన వానివలె, తిరిగి వెనక్కు వెళ్ళలేక
మతి తప్పిన వానివలె గుట్టలు పుట్టలు పట్టితిరిగి
అజ్ఞాన జలంతో దాహం తీర్చుకొని, విశ్రాంతి కలవడి
ఉదాత్త భావం ప్రకటించు సన్నని రేఖవలె, కాలంగడుపుతూ

ఒంటరి తనం సహింపలేక జంటలుగా గుడులుగా
పిల్లలతో పశువులతో గుడారం వేసుకొని నేలపై

హృదయం స్పందించి, బుద్ధికి తోచిన, దానియందు రక్తుడై
రహస్య మర్మం ఎరుగని నగ్నదిశవలె ఉన్న మానవుడు.

కనురెప్పల అంచులందు ఏదో బరువు తొలగినట్లై
తనువొక వరణీయ దేవతా ప్రసాద చిహ్నమై
వెలుగునుండి వెలుగువలె అవిచ్ఛిన్న ప్రజాతంతువుస్వర్గదమై
చీకటి గొలుసులతో బంధించబడి గళమెత్తిన మానవుడు.

చూస్తూ చూస్తూ ఉండగానే మహాకాల శ్మశానంలో
లిప్తాగ్ని జ్వాలలచే భస్మీపటలమైన సుకుమార ఉదయం
బ్రతుకొక అగ్ని గోళంగా భాసించి ఎవరిదారిని వారు
క్షుధాప నోదనకై పరుగెత్తు మహాజన సందోహం.

భౌమిక రూపంలో వివిధా కృతులలో మలగిన సౌందర్య జ్వాలలు
తమ తమ జీవితాలు ఆహుతి చేయు రసప్రలుబ్ధులు.
అప్పుడే ఉదితమైన ఒక విజయ చిహ్న కేతన ప్రచాలనం
ప్రక్కనే నశితమైన ఒక పరాజిత చిహ్న కేతన విశీర్ణత్వం.

ఈ దేహం కోసం పోరాటం సాగింపబడి మరణపర్యంతం
కూడుగుడ్డ పదవికీర్తియందు తృప్తి ఎరుగని జీవనవిధానం.
సర్వ ప్రపంచంలో కన్పించు ఒకే ఒక సామ్యభావస్థితిగతి
తమలో తాము నవసృష్టి కల్పించుకున్న కొందరు స్పృహాస్నిగ్ధులు.

బ్రతుకు మలపులుతీర్చు ఆత్మగత చైతన్య శక్తి మరచి
వినతమౌ సమయం కోసం సన్నహించు హ్రస్వదృష్టి,
కర్మ పటలంపై కదలు జడ వస్తు సమూహం నీడలతో
యుద్ధానికి దిగి, ఘర్షణలో శక్తి ఉడుగు మానవులు.

గగన మార్గాన కాలినడక ప్రయాణం చేసిన బాటసారి
అలసిపోయి పూర్తిగా విశ్రాంతి తీసుకోనున్నాడో లేదో
అతని కంటిముందే అనంతమైన వెలుగు సాంతమైపోయి
అంతకుముందు అవధిలేని ప్రపంచం, ఒక పరిధిలో
బంధించబడ్డది.

అగాధమైన మనస్సులో పొరలలోనుండి
ఊహల ఔల్బణ్యం అధికాధికమై
గభీరమైన తమస్సు అట్టడుగున నుండి
వెల్గుల ఆగమనం అత్యంత సముద్గతమై

అతి విశాల భావనలో సంవిలీనమై
అలలు అలలుగా సాగు నాదబ్రహ్మం
ప్రభు బుద్ధికి మాత్రమే భాసించు
పరిణత తపః ఫల దివ్య దశాస్వరూపం

ఎక్కడికో వెళ్ళాలని బయలుదేరి తనే ఒక గమ్యస్థానమై
దేనిని గురించో ఊహిస్తూ తనే ఒక ఉజ్జ్వల ఊహయై
బహు మార్గ ప్రధావన్మతి తానే ఒక సంగమస్థానమై
నైకరూపాలు ధరించి నిత్య యాత్రసాగిందు ఏకైక దీపశిఖ;

ఎదుటివాణ్ణి గురించి తెలుసుకొని తనను గురించి తెలియని
కార్య దశకు చేరేవరకు ఆగమనలిప్తల స్వరూపం ఎరుగని
ఒక వస్తునాశనంనుండి మరొక నవీనవస్తువు ఉద్భవించినట్లు
ఒకఘటననుండి వేరొకటి; చావునుండిపుట్టుకగల మానవుడు.

పరిభ్రమించి సుడిగాలివలె అతిక్రమించి అదృష్టసీమలు
తెలుసుకుని అపాయపు గుర్తులు అసాధ్య సముద్రందాటి
సన్నివేశాన్ని బట్టి నటనా స్వరూపంలో మార్పు వచ్చినట్లు
నియత కాల వేగశక్తి ననుసరించు బ్రతుకులో పరివర్తన.

వెరపు గొన్న మృదుభావుక మనస్సునుండి
మెరపు తోడి మేఘం వలె ఉద్భవించి
బ్రతుకంతా అల్లుకొని అందని పూలతో
ఊహ సుందరమై వాసించిన స్వర్వల్లీ గగనం

మరపుగొన్న చపల దృష్టి కఠోరమతి నుండి
అశనిపాత వేళావిస్ఫులింగ చక్రంవలె జారిపడి
బ్రతుకంతా ఆక్రమించి నిప్పుకల కూడలితో
పడి ఉన్న, కదలిక ఎరిగీ ఎరుగని నరక భూమి.

ఒక లిప్తలో సహస్రాంశం వృధాపోని
సమరశ క్తి సమాపూర్ణ అశాంతి మయ జీవితం
ఒక సుందర తీర్థంగా మార్చివేసి
శాంత పదవి చేర్చగల దైవ భావనాలక్ష్యం.

గజి బిజిగా క్రమ్ముకొని మేధను
కలతపెట్టు ఊహల సాగుదల
క్రమ పద్ధతి తీర్చబడిన సరిహద్దులు
ఈ మత విశ్వాస పరంపరలు.

అజ్ఞానంతో ఆరంభమై అజ్ఞానంతో అంత మొందు
కాంతి రేఖాతోరణం ఈ మానవజాతి వలయం
చుట్టూ చీకటి లోయలు, భయపెట్టు మృత్యువు నీడలు
దూర దూరంగా ఒదిగి ఒదిగి ఉన్న జీవ సమూహం.

అనిశ్చితమైన అలభ్యమైన దానికోసం జీవితం పిండబడి,
ఆవేదనా పూర్ణ హృదయ కుహరం నుండి పెకల్చుకొని
ముఖంలో, చంద్రరేఖ రూపంలో పొడిచిన మధుహాసం,
అసహజస్థితి కల్పించుకున్న వాతావరణం, ప్రపంచసాహితి

నిశ్చల నిశ్శబ్దంలో ప్రణంవలె
అరణిలో అగ్నివలె
తమశ్శర్వరి చంద్రికవలె,
నిదురలో స్వాప్నిక దృశ్యంవలె

వ్యగ్ర మనస్థితి ఝుటితి స్ఫూర్తి కలిగిన
సౌందర్యం పట్టలేక
శబ్దరూపంలో ఆవిర్భవించిన
ఊహవలె; భూమిపై నేను.

మృత్యుఘడియ విషాదచ్ఛాయలు, జననకాల సంతోషరేఖలు
గమ్య మెరిగిన కడలి తరగలు,
గమ్య మెరుగని వాయుస్వరాలు
వర్షధారా సమార్ద్ర భూసారం గ్రహించి,
సముద్గమించిన పుష్పఫల భారావనత లతాతరువులు
ఏండ్లకొలది బ్రతుకు జీవులు

ఎంత త్వరగా వచ్చింది ప్రహ్లాదమయమైన
మరోదివసం. పునర్జన్మ ఎత్తినట్లుగా ఉన్నది
మనస్సుకీ శుభోదర్క సమయం.
సనాతన కాంతి చిమ్ము నా దృష్టిముందు;
స్వర్ణవలయ సమాక్రాంత సహస్రఫణ
ఫణాధర తరణి తేజశ్చక్ర భ్రమణం.

# ఉదయం తరువాత

మొదలు చివర ఆస్తిక్యము అసలు లేని
ఒక మహానిబిడాంధకార పుంజం నుండి
అవతరించిన ఒక భాగం ఈ విశాల ప్రపంచం
అగ్ని శిఖల వంటి ఆత్మలతో సంచరించు మానవులు

మన బుద్ధికి ఇంకా తెలిసీ తెలియని
స్థలీ పరిణాహరేఖ అంత మొందు
మహాసముద్రంలో అక్కడక్కడ విరివిగా
తలలెత్తిన దీవులు మానవ జీవితాలు.

ఉదయ దిశాస్వర్ణ కాంతి దేహాళిపై దృష్టి నిలపి
రాగ నిభృత వర్ణ సహీత మనస్సుతో
ఒక సుందర రూపంలో శివతాతి పథంలో
ఆది నుండి దేవతలను సృష్టించుకున్న ఊహాశక్తి

నశించు దేహగత మోహం వదలి
జ్వలించు అమర వాక్ దీప్త మతితో
అనవరతం ఆత్మకు అధికాధిక స్థానమిచ్చి
గడుపబడిన పవిత్రాత్మవిదుల జీవితాలు.

దాటరాని వేగధురా మహాకాల ప్రవాహానికి
అడ్డంగా నిలువరింప జేయబడిన సేతువులు
అవిచ్ఛిన్న మానవ సంతతికాదర్శ ప్రాయమౌ
త్రైకాలిక యశ స్తనూ రమ్యశిల్ప తీర్థాలు

చిగుళ్ళు, ఆకులు పూలు ఫలసంతతి
ఒక చిన్ని బీజమందు నిక్షిప్తమై ఉన్నట్లు
ఒక విచిత్ర హృదయ సమాకర్షణాత్మక ప్రపంచం
మనోగత వాసనామయమై విస్తరించిన జీవితం.

స్వర్గఖండం అవతరించిన ముఖబింబం
అందులో నరకచ్ఛాయల వలె మ్లానరేఖలు
కాంతి బింబం అంతరించిన గగన వదనం
కను రెప్పలలో దాగిదాగి హసించు సౌర దీపికలు

అనూహితంగా నవోద్ధృత వేగదీప్తి రూపంలో
ఒక జాతి లేదా మనిషి బ్రతుకు బ్రతుకంతా
నిప్పులుపోసి మండించి, ముంచెత్తి ఎక్కడో తేల్చు
అకస్మాదాగత కర్మమయానలానిల తరంగాలు.

ప్రేయస్స్వరం విని, అంతారూపసౌందర్యం భావించి
దివ్యశక్తి హత్తుకొన్న హృదయంగల మానవుడు
కఠోర రావం వినబడి, బహిస్స్వరూపం చూచి
మృగబుద్ధి ప్రవర్తించు తెలివిగల మానవుడు

ఒక వైపు పరంపరగా నిర్మింపబడుతూ
మరొకవైపు వరుసగా కూలిపోవు గోపురాలు
ఆజనన శైశవ యౌవన జరాక్రాంత మృత్యుదశలు
నిరంతర సంకీర్ణ స్థితిమయ జీవిత ప్రపంచం.

అడుగు వేయడంతో లిప్త గమించక ముందు
ఆకర్షించి ఆశాపూర్ణత్వం పొందనున్న అభ్యుదయం
అడుగు తీయడంతో లిప్త గతించగనే
ఆశారహిత శూన్యభావ సమాత్త మృత్యువిజయం

దైవబుద్ధి చేతులెత్తి శూన్యంలోకి పరుగెత్తి
రాత్రి తప్ప దివమెరుగని, పుట్టుకతో అంధులు.
కళ్ళముందు వెనుక ప్రక్కల కన్పించు జఘన్యస్థితి
జీవితాంతం వెలుగు పోచ ఎరుగని అదృష్టహీనులు.

వాడిపోయి ఒరుగులవలె తనుకుమాసి
సగం కాలి ఆరినకట్టెలవలె కన్పించు ముఖాలు
ఆరోజు గడిస్తే చాలు నిండానూరేండ్లు బ్రతికినంత
ఎత్తైన ఊహలతో కాలం గడుపు జీవచ్ఛవాలు

బ్రతుకు బండలపై బోదలపై విరిసి కురిసి
మృదుత్వం కోల్పోయిన వర్షానేహ మధుబిందువులు
ఆశా పతాక శిశువు చెక్కిళ్ళపై ముద్దులతో
తుడిచి వేయబడిన కన్నీటి చారల గుర్తులు.

హృదయం స్పృశించని విలాసప్రాయసంతోషం
ముఖంలో కన్పించని కోపదుఃఖ సంభరితులై
అణచబడి అంతశ్శక్తి దీప్తి రేఖ; నిత్యయాత్ర సాగించు
మహాజనసందోహం పిల్లలు పెద్దలు యువతీ యువకులు.

మనిషిని హతమార్చి క్రోధాగ్ని బాపుకున్న
మనిషిని భక్షించి క్షుధాగ్ని చల్లార్చుకున్న
మనిషిని హింసించి మానవత్వం ప్రకటించుకున్న
మనిషిని క్షమించి దైవత్వంపొందిన మానవుడు

ఒకప్పుడు మృగంవలె జంతువువలె పక్షివలె
మరొకప్పుడు పామువలె పురుగువలె క్రిమివలె
పెరిగి, తరిగి, ఒదిగి మలగి; కలగి తలగి
బహుగుణ మిశ్రిత రూపంలో వెలుగొందుమనస్సు

ఒక ఋతువు శోభ ఒక గాలి తాకిడి
ఒక వెన్నెల అందం, ఒక ఆశ్చర్యఘటన
ఒక దుఃఖ విషయం, ఒక మహానందవార్త
ఒక సౌందర్య సమున్మీలనం, ఒక వేదాంత భావన;
సూక్ష్మ సూక్ష్మంగా తీవ్ర తీవ్ర దశలలో
జీవితంలో బహుధా సంవ్యాప్తమైన
అనుభూతులొక్కమారు ముట్టి దాడి జరిపినా
కదలని మెదలని మనో నైశిత్యం తెలియని

మానవాకారాల్లో పోత పోయబడిన
లోహమూర్తులు–నడువనేర్చిన విగ్రహాలు.

ఆకలిగొన్న ఆశతో, కసి బలిసిన కళ్ళతో
ఆరని హసంతివలె కణకణలాడు హృదయంతో
నవోహలు మొలకెత్తని మరుభూమి మస్తిష్కంతో
పగటి వేళ వీధిలో మనిషిని నిలవేసి విసిగించి

ఎండకు ఎండి వానకు తడిసి చలికి బిగిసి
విశ్లథమవని శరీరంతో భిక్షాటన చేస్తూ
రాత్రి వేళ ఏ గోడపంచనో, ఏ చెట్టునీడనో
అదుపులు సహించి, శారీరక కామన తీర్చుకొని

బైటపడి చౌర్యం సాగించి క్రౌర్యం కనబరచి
తృప్తిగా నిదురపోవు నీడలవలె పడి ఉన్న,
నిశ్శబ్దం రూపుకట్టి నివ్వెర పోయిన స్థితి
మానవ జాతి ప్రకృతి చావని దిశి బొమ్మలు

ఎన్ని మారులు యుద్ధం వచ్చిపోయినా
ఎంత కాలం శాంతి నెలకొని ఉన్నా
పాలన తలక్రిందై పాలకులు మారిపోయినా
ఎక్కడ బడితే అక్కడ చెక్కు చెదరని దిబ్బలు

దాదాపు అంతాపుట్టుకతో మగత నిదుర పోయేవాళ్ళే
ఎవడైనా మేల్కొల్పితే ఒక్కొకడు కత్తివలె పిడుగువలె
ఒకరినొకరు నిలువునా దోచుకొని హత్యలు గావించుకొని
మూక ఉమ్మడిగా, అలజడి రేగవచ్చుగా – అందులకే
శాంతియొక్క రక్షణ పేరిట సాగుతున్న సామాజిక వ్యవస్థ

గాఢమైన అనుభూతి హృదయం విశాల తరమైపోయి
తీక్ష్ణమైన భావనచే బుద్ధియొక్క ఔన్నత్యం పెంచబడి

హృదయంకదలించుఘటనతో ప్రవర్తనలో పరిణామంవచ్చి
మనస్సునువిచలితంచేయు దృశ్యంతో స్వభావం మారి

విజృంభమాణ ఘర్షణలో పతనమై విశ్లదమై
పునఃప్రారంభంతో క్రమపద్ధతి తీర్చబడి, మరల
ప్రతిష్టితమౌ మానవ సమాజ జీవిత సుదీర్ఘత్వం
ఆత్మీయ బంధుభావ జాతిగుణ వలయాలనుండి
విశ్వమానవతా సీమలవరకు మనిషిని నడిపించిన
రాజకీయ సాంఘిక మతావేశ తీవ్రతరశక్తులు.

ఈ సంకీర్ణ సమాజంలో మహాస్థానంనుండి నైచ్యస్థితిదాక
ఎన్నెన్నో వృత్తులు అవలంబించి బ్రతుకుమహాజన సమ్మర్దం
నవ్వుతున్న ప్రేల్తున్న కోపిస్తున్న దుఃఖిస్తున్న యోచిస్తున్న
నటిస్తున్న; వివిధ రీతులలో గతులలో వెల్లుముఖ పంక్తులపై

జారిన మంచు మబ్బు చీకటి వెలుగు నిప్పు తెరలచాటున
శూన్యం, ఆకాశం నీడల చుక్కల దిక్కుల; ధూమంవలె
ఆలోచనలు పూనిన సజీవ నిర్జీవ సహస్రాకృతీవిశేషాలు
సంతోష పెట్టి క్షోభపెట్టి ఆశ పెట్టి పరిభ్రమించు గోళాలు.

భిన్నభిన్న అనుభూతుల అవధులు ఎరిగి
బ్రతుకు లోతులు స్పృశించి కాని తృప్తిపడని
ప్రగాఢ భావనామతి ధురా రసార్ద్ర హృదయ
నికామ తర్పణీయ శీలురు, మహాజ్యోతిరాశయులు

చాంద్రీమృదు దృష్టితో, సూర్యాంశు హృదయంతో
ఈ కవితా రూపంలో మలగి శరీరాలు తాల్చిన
పొంగివచ్చిన వయస్సుతో, ఉబికివచ్చు అందంతో, కెరటాల్లా
జవ్వన ఊగిపోవు చాంద్రీ స్నిగ్ధతనూ హేలామూర్తులు

తమలో ఎంత లోతుగా ఆసురాంశ నిద్రాణమై ఉన్నదీ
భవిష్యత్తు తమపట్ల ఎంతగా దాసభావం వహించిందీ
తెలియని సాధుహృదయులు తెలిసిన కఠోర మతులు
కాలం పూసిన గులాబి మొగ్గలుచుట్టి ఉన్న కంటకప్రాయులు

హిమజ్వాలలులో ఇముడ్చుకొని రెక్క విప్పిన గులాబీలు
ఉష్ణాంశు గ్రామ స్పర్శకు ఎండిపోయి కొసదేరిన కంటకాలు
గాలి నిట్టూర్పులో వర్షాధ్వనిలో, గ్రీష్మాతప తాపంలో
చలి కోతలో ప్రతిధ్వనించు ఆగని జీవిత యంత్రధ్వని.

ఆమె హృదయాకాశ వీధి వర్షాగ్ర బిందువులవలె
విరిసి కురియు ప్రేమను ఎప్పటి కప్పుడు
ఇంకింపజేయు ఇసుక దిబ్బవలె ఉన్న పురుషుడు
అందంలో మట్టిలో; ఆనందం ఆకాశంలో కలిసి

చివరకు నేలపై నీరువలె నిల్వనిదై మనస్సు
దూదికన్న తేలికై రెక్క విరిగిన జీవిత నిశాసమయం
అగ్నివంటి పరిస్థితి కాహుతియైపోయి
గాలిలో ఏకమై లయించి ప్రాణచ్చట
వాయువీధి ఇనుమడింపజేసి ఒక మహావిషాద రేఖ
స్మృతి పథంలో మాత్రం నిల్చిపోయిన మానవతి.

తెల్లగా తెల్లవారడంతో ముఖం నల్లగా మసిబారి
నెల జీతం నెలవంకవలె భాసించి జీవిత నిశాసమయం
గాలి తెరచాటున చుక్కలవలె ఏరుకున్న నాల్గు రాళ్ళతో
తూర్పున ఉదయమైతే పడమటి దిక్కు ముఖంపెట్టి నడచు
ముఖంలో కళ ఒక కలవలె ఎరిగి ఉన్న గుమస్తా నౌకరు
బ్రతుకులో కళ నిదురలో కల ఒకటిగా భాసించిన అధికారి.

పొరపాటు అలవాటై మరచిపోశక్యం కాని
మానసిక బానిసత్వం ఒక దర్పంగా భావించి
చావుకైనా సిద్ధ పడడానికేమాత్రం సంకోచించని
సంచలించని స్వభావం కోటికెక్కిన దున్నపోతులు

నీ వెందుకు పల్కరించ కూడదంటే నీ వెందుకను
భావం వ్యక్తపరచి, ప్రక్కకు మలగు కళ్ళుగల
గుండెల్లేని శవాలు; గాయాల బాధ తెలియనప్పుడు
ఎటు గురి చూచి కొట్టినా ప్రయోజన మేమున్నది?

ఉన్నత మనోదశా ప్రాపణీయ సంధిలో యాతనపడు,
ఎన్ని మజిలీలు దాటినా ఇంకా స్థిరపడని మానవ సమాజం
ఆకర్షణ కోల్పోని, సంఘర్షణ వీడని చైతన్య కళలు
దివ్యదశలు ఊహచేయు చంచల మోహమతి ప్రవీణులు

తల్లి పిలుపుతో తండ్రి మాటలో శిశువు పలుకులో
భార్య నవ్వులో, వివాహసమయంలో, విలాసవేళలో
భక్తి భావనలో, రక్తి ఊహలో స్వాదుతర సంగీతం
దుఃఖంలో దారిద్ర్యంలో ఆక్రోశంలో హాహాకారంలో
మృత్యు సమీపంలో పిశాచ హృదయంలో, హత్యాబుద్ధిలో
ఉద్ఘోషించు, ప్రళయభావం పొందిన సంగీతం.

కొండలో ప్రవాహంలో చెట్టులో శూన్యంలో
మనస్సులో సర్వప్రకృతి నిక్షిప్తమై
నిరంతరం మ్రోగు వివిధ వాద్యధ్వని
అంతరాఘూర్ణమాన, అగాధ సముద్రంచేయు
ప్రదీప్తమైన లయలో; తన ప్రౌఢ సంగీతం
సర్వదిశల హోరున వినిపించు వాయుఝుంఝు

ఒక్కసారి గుత్తులు గుత్తులుగా కిలకిల నవ్వులతో
విసరి విసరి ఒడ్డున చప్పట్లు కొట్టి తిరిగిపోవు
మహాసముద్ర తరంగ సమూహంవలె హృదయంలో
దివానిశలు సంస్పందించు లయాత్మక భావన.

భవిష్యత్తుపై దృష్టికన్న గతంపైనే అభిమానం ఆలోచన
వర్తమాన సంపదపై అధికమైన మోహగంధం అనుభవేచ్ఛ
గతంలో ఆవిధంగా జరగడం ఆనాటి పరిస్థితి స్వభావం
మరోవిధంగా జరుగలేదనుకోవడం, వర్తమానకాల లక్షణం.

అతి నవీన పథంలో నడుస్తుంది
ప్రపంచం ఎప్పుడూ గతం మరచి
ప్రగాఢ సాహసమతి మానవుడు
ఎప్పుడూ నిలిచిపోడు ఒకేచోట
అందని, పరిచయంలేని అందం ఆదర్శం
మనోలోకంతో, స్నేహంకోసం మానవుని
ఆరాటం ఆందోళన అజ్ఞాతతృష్ణ

ఎన్ని ఎన్ని సహస్ర సమలు గతించిపోయినా
మమత చావని మృత్యువెరుగని ఉదయంవలె
తన మనః పరిణాహరోదసి దివ్య దశగా
మార్చుకోక తప్పదిక, ఈనాటి మానవజాతి.

అంతర్ముఖుడనై ఎప్పుడైతే నిశ్శబ్దంలోకి వెళ్ళిపోయానో
నా మనశ్చక్షూ రుచిరకాంతి ప్రసరించినంత వెలుగు మేర
అదేభూమి, ఆకాశం, నక్షత్రాలు
మానవుడు, సంపదలు, వాంఛలు
అవే లిప్తలు, దివానిశలు, సూర్యోదయా స్తమయం
ఋతుషట్కం, సంవత్సరాలు ఆగమన వినిర్గమనం
ధారావాహికంగా దేశకాలాణు నిర్భరమై
ప్రవహించు జ్యోతీ రేఖ
మానవుడు ఇదివరకే అందుకొన్న
మహోన్నత దివ్యదిశా సోపానాలు.

సృష్టింప బడవలసినవన్నీ ఇదివరకే సృష్టింపబడి
స్వర్గం నరకం మతం రాజకీయం. రామణీయకం
పరాకాష్ఠ నందుకొని సాధింపబడిన సంపూర్ణత్వం.
తిరిగి మరొక రూపంలో అనుభూతి భేదంతో ప్రత్యక్షం.

# !?

సృష్టి రహస్యం ఇది ఇది అని ఎవరు తేల్చి చెప్పింది నిజం?
అందరికీ తెలిసినట్లే ఉంటుంది కాని ఎవరికీ తెలియదు!
తనే తన మృత్యువుకొక ఆహ్వాన పత్రంవలె మిగిలి
అంతంలేని జిజ్ఞాసతో తనే ఒక పరిశోధనా యంత్రమై
కనుగొన్న రహస్యం ప్రపంచంలో తెలియని దెవరికని?
స్వర్గదృష్టిలేని, నారక భయంలేని, వేదాంత వాసన ఎరుగని
తిన్నది అరగకముందే ముందు కావలసినతిండి కై తిరిగేవాడికీ
చెబితేకూడా తెలియని ఆలోచనలేని అంబేదకూ తప్ప.

అణువులో ఆకాశంలో భూమిపై సముద్రంలో ప్రతిచోటా
స్త్రీలో పురుషునిలో శిశువులో యోగిలో భోగిలో
శాంతిలో యుద్ధంలో శబ్దంలో అర్థంలో శ్రుతిలో స్మృతిలో
పూవులో స్వర్ణంలో కుచేలునిలో కుబేరునిలో వికసించిన;

సూర్యుడు చంద్రుడు ఉదయించే అస్తమించే వేళల
దిక్కుల ముఖాల్లో; నీలో నాలో పురాతన కాలాల్లో
మంటిక్రిందికి మింటిపైకి దెసలవైపు సాగిన జిజ్ఞాసలో
కళాత్మక దృష్టి, కల్పితమనస్థితి విస్తరించిన సృష్టి రహస్యం!
ఎందరిచే ప్రపంచింపబడినా ఇంతవరకెవరకీ అర్థమవని
ఎందరిచే అన్వేషింపబడినా చివర కెవరకీ లభ్యమవని

ఎంతకాలం గడిచినా నాగరకత మారినా జీవరాశి నశించినా
వ్యవస్థ తలక్రిందైనా అవసరంతీరని నశించనిశాంతియొక్క
ప్రతిబింబ ప్రతిధ్వనుల సమాహారం సర్వసృష్టి
సంగ్రహణకు ప్రసారణకు కేంద్రభూమి మానవుడు,
విభిన్న రుచులకు ఆస్థానమైన సమాజం ప్రేక్షక సదస్సు
ఎవరి ఆనందం తృప్తికోసం వారుచేయు నటనా వైదగ్ధ్యం

ఉదయ శిఖవలె వెలుగుతున్న సౌందర్యవతి ముఖం వెనుక
దాగిన భయంకర రాత్రిని కప్పిన సుకుమారచాంద్రీహాసానికి
హృదయం కవోష్ణ వేగచలితమై ఆలోచన పరీమళభరితమై
శతపత్రంవలె అందగించిన ఊహావలయం గల
పురుషుని మనస్సులో
ప్రేతంవలె ఇతరుల కంటికి కన్పించు మనిషి తనలోతాను
కల్పించుకున్న మహనీయ దేవతా భావనా వాగురనుండి
ఎట్లాబయటపడాలో తెలియని తెలిసినా సాధ్యం కానిమనస్థితిలో
నిబిడమై గుప్తమై ఉన్న సృష్టియొక్క విపరీత రహస్యం.
అద్దంలో ప్రతిబింబం స్పష్టంగా కన్పించకపోతే
దాని మీద నమ్మకం లేకపోయినా వస్తువేమి చేయగలదు?
ప్రకృతితో ప్రవర్తనలో చైతన్యంలో పురోగమనంలో
కన్పించు సృష్టిరహస్యం కాలం విప్పిన కంటి వెలుగు.
మానవుడు తన ఊహలలో ఆదర్శప్రాయంగా నిర్మించుకున్న
ఈకంటికికన్పించని జగత్తు యొక్క; ప్రతిబింబంప్రపంచం?!

దానవుడు తన చేష్టలో క్రియాత్మకంగా నిరూపణ చేసుకున్న
శాశ్వత సత్యరూపంయొక్క ప్రభ్రష్టగతులీ సర్వవస్తువులు!

ఈ ప్రపంచ నిర్మాణ పరంపరకు మూలమైన కారణం?
నీరు! కాదు, గాలి! కాదు, అణుసంఘాతం! ఏమో ?
ఇంకావిడిపోకుండా మనస్సు అట్టడుగునతలఎత్తు సందేహం
మరోనాటికి పూర్తిగా వ్యత్యస్తమైపోవు ఈనాటి విలువలు.

గగనపదవి మేఘాలవలె, గాలిలో కలిసివినిపించుధ్వనులవలె
నీటిలో పడి తడవని నీడలవలె
గాలిలో కలిసి వినిపించు ధ్వనులవలె
ఆనందంతో, ఉత్సాహంతో విలాసంతో ఎక్కడ మొదలై
ఎక్కడ అంతమొందుతాయో తెలియని, మానవుని ఆలోచనలు

గగనకాసారంలో సహస్రకరాలతో, తల ఎత్తి,
నవ్వుముఖంతో వడిగా ఈది వస్తూన్న సూర్యుడు,
ఒడ్డున మేల్కొని వేచి ఉన్న నా ఆశాపతాక
ఇంకా మేల్కొనని వారి స్వప్న ద్వార కవాటం.

ఈ కవాటం తెరుచుకొని, ఎంతదూరం ప్రయాణించాపూర్వం
ఈ ప్రమాదంలో పడకుండా బయట పడ్డవాళ్ళు చాల అరుదు.
ఈ సూర్యుని వెలుగులు ఎవరికోసం? మేల్కొనదలచినవాళ్ళకు.
ఈ గీతం ప్రయోజనం ఎంతవరకు? వెలుగులు ఆడినంతదూరం.

# మరో ఉదయం

ఈ పురోగమనం ఎంతవరకు ? దిక్కుల అంచుల వరకు.
ఎంతకాలం సాగుతుంది ప్రయాణం ? ఉదయమయ్యేదాక.
ఎక్కడికీ సాయం సాంధ్యవేళ? మరో మనోలోకానికి !
ఆ శాంతిని పట్టుకోడానికి ! ఈ రూపం మారిపోడానికి!

పద పదమున నెత్తురు చిమ్మే నేత్రగోళ గగనం ఎదురుగ
ఆగి ఆగి పరుగిడి వచ్చే చీకటి పిల్లల గుంపులు ప్రక్కన
రాబోయే యుద్ధజ్వర భయంతో వణకుతున్న వాతావరణం
మృత్యువు స్ఫురించేసరికి శాంతిపాఠం వల్లించుకంఠశోష.

అణురజో రూపంలో రాలిపడు రూబులు డాలరు విలువలు
బల మహాసంపదతో ఆకలితీర్చ యత్నించు తెలువులు
సామాన్యునిరాజ్యం సౌఖ్యం పేరిట అతని సర్వనాశనపథకం
ఒకే దేశం జాతిసిద్ధాంతంచాటునవిపరీత ప్రతీకారమనస్తత్వం

భూగోళం చుట్టివచ్చు విజ్ఞానమతి నిర్మితాణునవాస్త్రాలు
వాటిననుసరించి పరిభ్రమించు యుద్ధోన్మత్త చిత్తం
తన ఆధీనంలోలేని చిత్తాలోల నవోహలు కల్పించుకున్న
వైకృతస్థితి ననుసరించి నిర్మితమౌ మానవమాత్న సమాజం

నిప్పురవ్వలు, తెరపిడి పడిన, దగాపడిఎత్తిన కళ్ళలో
మేల్కొని చీకటిలో తిరుగు పెద్దపులి మెరపు కళ్ళవలె.
కడుపు మంట ముందు, చుక్కల తలపులచుట్టు
చల్లారని శ్మశానంలో ప్రేతంవలె చీకటి ముసురు.

వర్షపు చినుకులు, మొండిగోడలపై ఎండుటాకులపై
పూరిపాకలపై పాడుగుడిపై పేదవాని చిరుకోర్కెలవలె.
తుపాకిగుండు దూసుక పోయిన అగ్నివంటి శరీరంపై
హంతకుని మంచువంటి గుండెపై — రక్తపు బిందువులు

సగం చావుకు తయారై దీనంగా కూర్చున్న ఈ రాత్రి
రాకకు సిద్ధమై ఉత్సాహంతో ఎదురుచూస్తున్న మరోరోజు
సగం మేల్కొని నిద్రపోవడానికి వేచిఉన్న నిన్నటి దినం
కలలు కనడం మొదలు పెట్టి తలలు పోగొట్టుకున్న జనం

ఉన్నది వదిలి లేనిది అదే పనిగా
రమణీయ లాభగతి ఆలోచిస్తూ
విజయ పరంపర వాంఛించేలోకం
ఎక్కడోకాని పొందదు ఆనందం తృప్తి
సమయంబట్టి ఒక్కొక్క డొక్కొకటి
వదలుకొని ప్రేమ అధికారం సంపద
లేదా అనుభవిస్తూ విరాగమతులవలె
వ్యవహరించు భోగైక జీవులు,

వశంకాని మహోద్రేక శక్తులు
పొందిన పరిపూర్ణ తృప్తి ఫలితం
ఒక త్యాగ నిరతి — మహావీరకృత్యం
సర్వసౌందర్య భూమిక కళాసృష్టి
అగాధమైన మనోజలధిని
కల్లోల మొనర్చే వాయుఝుంఝుకు
గమ్యస్థానం చేరకముందే,
ముక్కలు ముక్కలై పోయిన ఆదర్శ నౌకలు.

సూదులవలె చూపులతో క్రీపెదవి బిగపట్టిన పురుషులు
ఎరుపెక్కినచెక్కిళ్ళతో, బరువెక్కిన రెప్పలెత్తిచూచుస్త్రీలు
దుర్దినవేళ, దిక్చక్ర సమావృత శీతలచ్ఛాయాసంఛన్నమై
పరిణాహ మనోవీధి నిశాభ్రాంతి వెలుగు ఊహలదివ్వెలు

ఈనాడు అనిశ్చితంగా అవిజ్ఞాతంగా ఉన్న అదృష్టవిషయం,
రేపటివరకు నిశ్చితమై ఆశ్చర్యమయంగా కన్పడు ఘటన
ఈ ఘటనలో చిక్కుకొని అసువులుకోల్పోవు త్యాగమూర్తులు
బయటపడి తమ ప్రయోజకత్వం చాటుకొను శక్తిమంతులు

అమాయకతాపూర్ణ శైశవస్థితి గడచి పరిణత యౌవనదశ
ఆ దశనుండి మహానుభవ పరీపాకదశ వృద్ధాప్యం వరకు
చివరకు పరిహరించరాని మృత్యువు తదుపరి పునర్జన్మకోరి
జీవితమంతా ఒక వ్యాపార సరణి గడుపుప్రాణి సమూహం

ఎక్కడ ఎవరిని చూచినా వారిలో నా రూప ప్రతిబింబమే
ఎక్కడ ఎవరు మాట్లాడినా అందులో నా ఊహాప్రతిరావమే
కనబడు వినబడు జగత్తును పరిపాలించు మానవుని మేధ
కనబడని వినబడని దానికి అవర్జితమైన హృదయాకాశం

ఎంతలో స్వరూపం మారిపోయింది ఎంత వింతగా
తెలుపుగా నలుపుగా ఎరుపుగా ఎన్ని రంగు రంగులుగా!
అంతసేపు మృదుల మనోహర సంగీతం ప్రసరిస్తుంది.
అంతలో కఠోర మహాశనిపాతరావం దొరలిస్తుంది.

నడుస్తున్న నేను – నా దృష్టినుండి తప్పించుకోజాలని
శిలా విగ్రహాలను స్పృశించు స్నిగ్ధ నేత్ర మధురాధరాలు
చీకటి కాటుక కొండపై పడిజారు సూర్యుని దృక్ దీప్తులు
నేలపై చిమ్మబడిఉన్న పగిలిన గాజు బొమ్మల ముక్కలు

నిప్పంటుకొని మండి మండి మహానల జ్వాలలతో
మధ్యలో సముద్ర గర్భంలో మునిగిపోతున్న నావవలె
మృత్యువుచే ఆకర్షింపబడి ముఖం జేవురించిన రాత్రి
సర్వ దిశల అంతలోనే విప్లవాత్మకమైన మార్పులు.

బహు దూరంనుండి దగ్గరనుండి
వినవస్తున్న విభిన్న కంఠధ్వనులు
ఎత్తబడిన తలలు చేతులు
దించబడిన ఆలోచన ఆశాపతాక

ఇంకా వదలని నిద్రలో తూలుతూ
కలలుగను చీకటి మనుషులు
చుట్టూ దీపస్తంభాల వలె
మేల్కొని కాపలాకాస్తున్న తెల్ల దొరలు

ఎక్కడో తిరిగి తిరిగి ఇంటికి చేరుకున్న పక్షుల గుంపులు
ఎక్కడో పుట్టి పెరిగి ఎక్కడికో వెళ్ళిపోతున్న పశువులమందలు
ఏదో ఒకవిధంగా ఆరోజు గడిపివేయబడింది బాగానే ఉన్నది
మరొక మరొక రోజుపై నవాభిసారికాగత వ్యామోహం

కొండలపై మెరపులతో కన్నీరు కారుస్తున్న పయోదపంక్తి
అక్కడే తపించిచివరకు ఒక్క చుక్కైనానిలువలేనికొండరాళ్లు
ప్రక్కనేనేలపై బ్రతుకుబరువు ఎరుగని గాలికూగుపోచలు
వెన్కనేమండిమండి అగ్నిచల్లనైన బొగ్గులవలె మనుషులు

పైనచుక్కలు ఎప్పుడో మాయమైనవి
క్రింద భూమిపై కళ్ళుమూసిన తల్లి ప్రక్కన
వణకుతున్న చిరు పెదవులతో ఎండిన గొంతులతో
చేతులుచాచి తడుముకొను శిశువులు
ఒక్కటీ తిన్నగా లేని పిచ్చివాని ఊహలవలె
అల్లి బిల్లిగా అల్లుకొని చీలిపోవు బాటలు

ఊహలో బ్రతుకు గడుపు మనిషికీ వాస్తవికజగత్తుకూ
సిద్ధాంత సూత్రాలకూ కార్యరూపం తాల్చిన సృష్టి క్రమానికీ
ప్రేమరూప పరిణామానికీ, ఆత్మకూ అనాది ప్రపంచానికీ మధ్య
రెండిటినీ కలపగల విడదీయగల మబ్బు తెరలవంటి రేఖలు

ఆరిన దీపపు పొగక్రమ్మినకాలం కళ్ళు ఇంకా తెరపిడిపడలేదు.
కళ్లు ఉన్నా అంధులవలె, జీవం ఉన్నా శవాలవలె కూర్చోవలసిందే
మనిషిమీద మనిషికన్న జంతువుపైనే అతనికి విశ్వాసం ఎక్కువ
ఆలోచనల కవధులు లేవు ఉదయం మృత్యువు ఎరుగదు

ఒక యుగం గడచిపోయి వేరొకటి వస్తున్న దెంతత్వరగా
ఒక మనస్స్వరూపం మారి వేరొకటవతరిస్తున్నది వేగంగా
సృష్టి యొక్క ఆరంభంనుండి ఈ భౌతిక ప్రపంచశక్తుల
ఆకర్షణ సంపర్గం సంఘర్షణ ఏనాటికైనా ఒకేతీరు; తప్పదు

గ్రహసమూహ గమనం ఋతుచక్ర పరిభ్రమణం
సర్వసృష్టి వికాసవైఖరి కాలంయొక్క అధికారముద్ర
ఒకతరంనుండి వేరొక తరానికవిచ్ఛిన్నంగా అందింపజేసి
అమరత్వం సాధించి; మానవ నాగరికత తీర్చిన ఆత్మదీప్తి

– ం –

నలందా ప్రెస్, సుల్తాన్ బజార్, హైద్రాబాద్.

# సౌందర్యశిఖ

మాదిరాజు రంగారావు

ప్రచురణ
**నవోదయ సమితి**
నారాయణగూడ, హైదరాబాదు

# స్వేచ్ఛా కవిత్వం

# సౌందర్యశిఖ

## ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

SOUNDARYA SHIKHA

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: 1963

నవోదయ సమితి, నారాయణగూడ, హైదరాబాదు.

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

ఇతర కృతులు

కిర్మీరం

మేల్కొన్న ఆకాశం

మనో భూమికలు

అద్దంలో నీడలు

పృథ్వీగీతం

# సౌందర్యశిఖ

ఉజ్వాల తర సంగీత తరంగ
స్పందనల కదలికతో
వచ్చింది ఆమె కాంతిమతి
నీడ ఎరుగని దీపశిఖ!

అంధకార శిలాపంక్తుల నకస్మాత్తుగా
చందన శీతల ఛాయా వృక్షసమితిగా
జీవనశకలం స్వర్లోకానికి ప్రతిబింబంగా
దివ్య దశగా, పరిణమింపజేయు కాంతిపుంజం!

ఉదయం తీసుకున్న మొదటి నిశ్వాసంలోని
అనంతకోటి ఆశాపతాకల ఉత్సాహ దీప్తి ;
తెరచిన కళ్ళనుండి చిందు అమృత బిందువులు,
ముఖంలో అలలు అలలుగా సాగు సుమ హాసం.

వర్షాగమనవేళా శీతల సుకుమార వాయువువలె
లిఫ్తల మెట్లపై అడుగుల చప్పుడుతో వస్తూన్న
ఆమె పాదాలముందు బారులుగా విచ్చిన వెలుగులు;
దృష్టిపథంలో గుత్తులుగా ప్రబ్బికొన్న నీలిమబ్బులు.

హృదయంలో పల్లవించి, పెదవిపై కుట్మలించి
వాక్కులో సుమించిన ఒక మహా దివ్యానుభూతి
బహువర్ణకాంతి సమ్మిశ్రిత వాయుప్రసార వలయం,
లిఫ్తలు పరీమళ భరితం చేయు సౌందర్యశిఖ.

ఝుంఝానిల తీవ్రత్వం నైశిత్యం
అణగిన మొదటి క్షణంవలె
పరిమళదళ వదనంపై రోచిర్వాసంతో
విచ్చిన హిమ బిందువువలె

సర్వధ్వనులు సంగీత స్వర విశేషాలు, తనలో
ఆనందంతో లినీకరించుకున్న అఖండశాంతివలె;
ఆవిష్కృతమైన అవ్యక్తనాద ప్రతిబింబం
మూర్తీభవించిన అమృతభర సౌందర్యలహరి.

ఆశాపరివేషితమైన అఖండశాంతి
ఆమె వెంటనంటి పరుగెత్తి వచ్చింది మూర్తి కట్టి.
ఇతరుల కభేద్యమై అగోచరమైన నా అంతఃకరణంలో
ఆమె కదలిక, కాలచక్రం యొక్క లయాత్మక గమనం.

రవికిరణం భూమిపై అడుగిడక ముందే,
ఒక పల్చని గాలితెరపై ఊహాచిత్ర పరంపర
సృష్టించుకున్న, ఆకాశ శతపత్రంవలె ఆమె

గగన భాగంపై మేఘపంక్తి అవతరించగనే
స్వాదుతర సంగీత మాధురీ స్విన్నమై తనలో తా
పరవళ్ళు త్రొక్కు రోచిరుదార సముద్రంవలె, నేను

దివినుండి అవిచ్ఛిన్నంగా కురియు
దివ్యామృత స్వర్ణధార !
భూమిపై తరగలొత్తుకొని
వ్యాప్తమౌ పరీమళ ఝురి!

దిక్కులేని దిక్కువలె, చీకటి రాయివలె
పడివున్న నన్ను ఉజ్వల మయంచేయు;
వాయు వీధి ఎగసి దూకి వెలుగునింపు
రెండు ఉదయ తేజోలతికలు, నీకళ్ళు.

గ్రీష్మ వేళా వాయుమండలం
చందన వాఃపూర్ణమైనట్లు
నాభావ జగతి నీ అవతరణ
మొదటి చివరి వసంతోదయం.

సౌందర్యం భరించలేక మూత పడిన కన్నులలో
సందు చేసుకొని ప్రవేశించిన నీ కనుచూపులు,
వీణాతంత్రీ కమ్రనాద తరంగంవలె ఝుమ్మున
మెయి విరుపుల హొయలుతో దిగివచ్చు సుషమాశిఖ,

చంద్ర రేఖాబింబితమై పై కెగయు కెరటాలవలె
దిగ్వసనం ధరించిన సముల్లసత్ వక్షోజాలతో
స్మిత సుమరుక్ దీపంతో, శరన్మేఘ శిల్పాకృతి
ఎదురుగా నవనీత పాత రావమృదుపాద ధ్వనితో,

కదలివచ్చు నిన్ను చూచి, అలల తలలు వంచి
గాలులు ఆ క్షణం స్తంభించి నిల్చినవి గర్వంతో.

లేమంచు పొరవ్రాలిన గులాబి రేకులవలె
చిరునవ్వు వెన్నెల హత్తుకొని
శోభారుణ దీప్తములై మృదువుగ కంపించు
చిరు పెదవులపై బింబించిన;
ఊహ జగతీ ఇంద్ర చాపవల్లీ రేఖలోని
వర్ణాలెన్ని సమీకరించి మేళవించి;

రహస్సౌందర్యం రాసులుగా ప్రోదిచేస్తూ
విశ్రాంతి ఎరుగని గాలి
సముద్రంపై కెరటాలను వలె;
సుప్త కళికలవలె అవిదితంగా
గడచిన లిప్తలెన్ని అర్పించా నీకు
సమర్చనంగా—

రవి దీపం అస్తమించగనే నాకు కన్పించినది
నీవు. ఊహబిందు రూపం. చంద్రబింబం.
దీపం ఉన్నప్పుడు ఆరినపుడు చూచా
ఆ నవ్వు అంగారవల్లి; హిమస్వప్నం,
ఆ కదలిక నిశ్శబ్దవలయం చీల్చుకొని
సాగు, మృదుల సంగీత లహరీ విలాసం.

ప్రాణవంతమైన నాదలహరి చకచ్చకిత కాంతివలె
విచ్చిన శతపత్రంవలె నీరూపం భావించినంతనే,
నిద్రిస్తున్న లిప్తలు మేల్కొని సుస్వర సాంగీతికులై నవి!
మందీభవదీహలు అగ్నిజ్వాలా చేలములై నవి!

గాలికి అంచెలు అంచెలుగా తేలివస్తూ
నీటి ఒరపిడికి అణగి, వడికి ఉబికి
లేచి ఎగసి దూకివచ్చు వెలుగు కెరటంవలె;
నిశా రూపం దాల్చిన కనులనుండి
దూకు దృక్చంద్రికతో; జ్యోతిర్వలయమై
వచ్చి నాలో లీనమైనది నీరూపం.

కాలం విప్పిన తీవ్రమైన కంటిచూపునుండి
తెలివిగా తప్పించుకొని నన్ను మరపులో బంధించి,
ఏ నీడ తన రహస్యం బైటపెడుతుందోనని
శంకించి, చేతిలో ఒదుగకుండా
జంకి చూపులో నిలువకుండా;

చలన్మతి చంచల వర్షాంబుద రమ్యతనూ!
గాలివంటి ఆలోచనతో పటంవలె తిరుగుతున్న
నీకోసం వేచి ఉన్న ఎన్ని అబ్దాలు; ఆశ్చర్యంతో
మంచుకొండలవలె నిలువునా నిలచిపోయినవి!

ఎన్ని వసంతాలు నీ ముగ్ధరూపం చూస్తూ చూస్తూ
మనోజ్ఞ దశలుదాటి హసంతికలై ఆరిపోయినవి
నీవు మాత్రం కనుబొమలువంచి ఆకాశంవలె,
వహించిన మౌనముద్ర ససేమిరావీడవు!

వెలుగు వత్తులు వేసుకున్న వేయికళ్ళనుండి
మంచు నీటిబొట్లు జలజల రాలుస్తూ;
నిశ్శబ్దంగా కరగిపోతున్నది కాలం!

సృష్టిగత నవోహాలో ఒదిగి ఒదిగి సుప్తాకృతి
వ్యక్తి గత పరిధిలో స్వప్నాకృతి పరిణమించు;
నా నేత్ర గోళ పరిధి నాక్రమించిన
జ్యోత్స్న స్నిగ్ధ శరీరాంచల రేఖావలయం

యుగ యుగాలనుండి సౌందర్య తృష్ణతీరక
ఈ స్త్రీ రూపంలో మలగిన ఉదయ కిరణం!
నా నేత్ర వీధి కుసుమించిన కాంతి వల్లిక
నా ఊహ జగతినిండుకున్న పరిమళఝురి !
నిశ్శబ్దంగా కాలం వేస్తున్న అడుగులచప్పుడు,
చప్పుడులో లిప్తానేక మంజీర ధ్వనులు,
ధ్వనిలో హసించు అక్షర గత నవోహాలో
అనురణించు, సౌందర్య మహానుభూతి తప్ప
నిజంగా నీ వెవరవో తెలియదు! ఇంతవరకు
ఏదో ఒక వర్ణంలో వైఖరిలో వాక్కులో
నీ రూప విచారణ ప్రవహింపజేసి బ్రతుకులో
కల్పనకవధి కల్పించని ఊహమతి లేడు పృథ్విలో.

సన్నని మంచు పొరలచే కప్పబడిన
సూర్యుని, తేజశ్చక్ర క్రమావసరణంవలె;
ఒక ఉషస్సు ఒక ఋతువు ఒక ఉగాది
మనోజ్ఞ తరుణంవలె భూమికి దిగిన నీవు;
యుగాలుగా జీవుని అంటి పెట్టుకొని ఉన్న
ఒక సుందర ఛాయా రూపానివి!

జవ్వన కెరటంవలె ఊగి వచ్చిపోవు నీకు
ఒక సంగీత సౌందర్యం సంతరించు వాయువును
పగలు రాత్రి పేరిట ఎన్ని దీపాలు ఆరినవి!
కాలగమనం ఎరుగనీయదు నీ ముఖబింబం.

నీవు అందవు అయినా పరుగిడుతుంటవి
చంద్రునివెంట మేఘాలవలె ఆలోచనలు.
నీవు చిక్కవు అయినా వెతుకుతుంటవి
దిక్కుల వెంట గాలులవలె ఊహలు.

జలధిమధ్య ద్వీపంవలె నీ వియోగ పరీవృతుడనై,
నీడమధ్య దీపంవలె నీ వియోగ సమావృతుడనై,
పైకి ఎగసిపోవాలని చూస్తూంటా ఆకాశంవైపు.
మనస్సులో జ్వలించే అగ్ని యొక్క ప్రతిబింబం,
పెదవులపై బింబించిన నీ మనోహరదరహాసం.
నా ఎదపై నగ్నంగా వాలిపోయిన ఉషస్సు నీ రూపం.

సమాకర్షించి నన్ను బధిరుణ్ణి అంధుణ్ణి చేయు
ఈ వాయు సంగీతం ఈ సౌవర్ణ కళాశిల్పం
పదపదంలో ప్రత్యణువున మాధుర్యం సౌందర్యం
స్పందించు వసంతమూర్తి, నదించు రసాకృతి.

కనుచూపులలో విరిసిన నక్షత్రకాంతులు
పెదవి వంపులలో ఒదిగిన సంధ్యాలహరులు
చిరునవ్వులలో జ్వలించు వెన్నెల వత్తులు
చక్షూరమ్యాకృతి మలగిన దివ్యమనోరూపం.

శంపాలతలు కుసుమించిన కన్నులు
ఆశాశిఖలు వెలిగించెడి చూపులు;
వియోగాగ్నితో నిండిన పూలనది
అమృతభావనావధిగా వెలిగెడు సౌందర్యశిఖ

దట్టంగా క్రమ్మిన మంచుపొరలను
చీల్చుకొనివచ్చే ఉదయకిరణం వలె
స్మృతి వలయంలో భ్రమించునీవు.

సముద్రంలో కెరటంవలె
మబ్బులో మెరపు వలె
స్పష్టంగా కన్పించి క్షణమాత్రం
అంతలో మాయమౌ నీ రూపం.

ఏ అద్దంలో బింబించదు
కంటికి కన్పించని సౌందర్యం.
ముఖంలో బింబించి
హృదయంలో ఇస్తుంది సాక్షాత్కారం.

గభీర నిశ్శబ్దంలో జనించి
ఉఛ్వాస నిశ్వాసంలో లయించు,
ఒడ్డున విఫలమయ్యే
కడలి తరగలవలె అడుగుల చప్పుడు.

ఆకాశంలో నిలువునా నిలచి చూచు వృక్షాల వలె
దిశలలోకి అడుగులు తీసి కదలిపోవు నదులవలె ;
నిను పరివేష్ఠించిన స్వర్లోక గవేషణలో
విభిన్న ఛలాకృతులు దాల్చి తిరుగు ఊహలు వాంఛలు !

అబద్ధపు వంపులంటి ప్రవహించు
నిత్య సత్య జలవాహిని వలె
బ్రతుకులోని లోయలు నిండి
పూలనది వలె విరియు వెలుగువు !

నీకు ప్రశస్తి లేదు కారణం ?
మృత్యువు నీడనైనా ఎరుగవు గనుక !
ప్రేమపూర్ణ కాంతిశ్రీ !
ఆసీమాంతం చెంగలించు రసఘృణి !

ప్రభాత వేళ రోదసి ధరించిన
వెలుగు ముసుగువలె ఉన్నది
మనస్సులో ముగ్ధ ముగ్ధంగా పొడిచిన
నీ భావగత సంతోష తరంగం !

సంధ్యారాగంలో ఆర్ద్రమైన
పూలమబ్బులు కదలునప్పుడు
నీవే వస్తున్నావని మ్రోగుతుంది
నిశ్శబ్దం నిండిన నా హృదయం !

గ్రీష్మం కన్న స్వప్న సముద్రంనుండి
సాగిన మేఘమాలిక !
భూదేవత పెదవులపై నవ్వు మొలక
లెత్తింపజేయు వర్షధార !

ఆగామి శిశిరం వెనుక దాగిన
సుమనోజ్ఞ వసంత రేఖవు
కాల వృక్షం పూచిన పూవులో
దాగిన ఫల స్వరూపానివి !

సాయం సంధ్య కుట్మలించనిదే
అప్పుడే ఎక్కడికీ సన్నాహం!
అలా తొందర పడతావెందుకు
ఇందాకేగా విరసించింది ఉదయం!

నిద్రా సరస్సులో వికసించిన
స్వప్న కల్హారం వలె నీవు
జాగ్రదవస్థా తీరంలో
చంద్రునివలె పరిభ్రమించునేను.

కొండలు చీల్చుకొని వస్తుందినది
మబ్బులు చీల్చుకొని వస్తుంది మెరపు
గుండె చీల్చుకొని నీవురావు బైటికి
ఈ వర్షంలో, ఎండలో, చలిలో, నేనేరానా?

సముద్ర మవతలనీవు ఇవతలనేను
నీటిపై తేలు చంద్రనౌకలో రానా?
ఈ దిశనుండి ఆ దిశకు వ్యాపించిన
శశి రశ్మిలు పట్టుకొని రాకూడదూ!

నదిపై ఆకాశంపై భూమిపై రోదసి,
ప్రసరించిన సూర్యచంద్ర రేఖలవలె
ఆవరించిన నిశా తమోచ్ఛాయలవలె
హృదయగతానంద దుఃఖానుభూతులు

నిను గూర్చిన భావ పరంపరలో
గమించి పోవు జీవితం
నీ సుందర రూపావిష్కరణతో
అవతరించునేమొ మృత్యువు?

మృత్యువు ఆసన్నమయ్యేదాకా
ప్రతీక్ష సలుపవలసిందేనా?
సదా ప్రతీక్షా వ్యగ్రుడను నేను
అఖండ కాలస్వరూప మతివి నీవు.

ఒక సుందర దివ్యానుభూతి యొక్క
ఒక మహోన్నత ప్రమాణం స్వర్గం.
ఆ స్వర్గం యొక్క సంపూర్ణవికాసం,
లయమెరుగని సంగీతం నీ రూపం.

# ముక్తకాలు

క్షణక్షణం మార్పునొందు ఈ అనశ్వర జగత్తు
ఎవని హేలకోగాని ఏరోజున కారోజే
ప్రశ్నా పత్రం వలె ప్రత్యక్షం కంటికి
జవాబుకోసం మనిషి మారును మనీషిగా

ఏ పెదవులపై విరిసిన హాసశ్రీలీసుమాలు
సంజల వన్నెలో కలసి మరునాటికి తమకు తాము
శ్మశాన పదవినొందినవి క్రొత్త వాటికిచ్చి స్థలం
లేదు క్షణం వివృతి లేక వికాసనవసృష్టిలేక

దూరంగా ఆకాశం ఎక్కడనో భూదేవిని
కౌగిలి పూనిన రీతిని మనస్సును ప్రగాఢంగా
అల్లుకొని అంతలోనె పుట్టిగిట్టు లౌకికమౌ
తీవేలు, మనిషిని వదలని నీడలు పొగమబ్బుగములు!

రాకెట్ గోళాలను స్పృశించి రాగలమనిషి
గోళ నిజ స్వరూపాలు ఫోటో తీయగలాడు
ఎదుటి వాని మనస్సులో జరిగే ఇంద్రజాలం
ఎరిగిననాడే అతనికి కలుగుతుంది నిష్కృతి

సూర్యుడు ఆరిపోడు భగవద్భావన చావదు
తమస్సు ఉండదెపుడు, ఆశలేక బ్రతుకు లేదు
యుగాలు గతించినా ఆదియుగ మనస్తత్వం
వస్తూంది పరంపరగా ఏదో రూపంలో

నిద్రను జయింపలేడు అందుకే అంత ఇష్టం
గతం చచ్చినా రాదు అందుకే దురభిమానం
భవిష్యత్తు భద్రమే అందుకే ఎంతో ప్రేమ
అనంత కాలం పురుషుడు, అఖండగమనం స్త్రీ.

ఒక మహోజ్వల గాథవలె పొంగిపొరలెడు కడలి
ఒక వలపువలె కదలి వచ్చెడు గాలి తరగ
ప్రేమభరిత హృదయంవలె వెలుగు పూర్ణచంద్రుడు
నిత్యములీ రసమూర్తులు మానవుడుండువరకు.

మల్లీ సౌరభములు ఝుంఝూ మారుతములు
ప్రేయో నిదానములు ప్రళయ మహోగ్రగతులు
మానవ ప్రకృతిలోన రెండుగ ఒదిగి ఉన్న
అమృత సరోమూర్తులు అగ్ని గోళదీపులు.

మనసు లోతులను వెతుకు కన్నులు కొందరివి
మనిషి రూపాన్ని చూచు కన్నులు కొందరివి!
కండ్లే ఉంటవి చూపులుతప్ప కొందరికి
గ్రుడ్డి వాళ్ళవలె ఉన్నవారికి చూపు, జాస్తి.

ప్రతి ఉదయం నిశా మృగాన్ని వేటాడు రవి
గగనవనంలో అవతరించెనో లేదో
మేల్కొని నిదురించు పర్యంతం భూమిపై
మనిషిని వెంటాడే మనిషి, నీడను నీడ.

ఏ గమ్యము చేరుటకై సాగుచున్నవీ నదులు
ఏ ఖండమునార్ద్ర పరుప తరలుచున్నవి మొగిళ్ళు
ఏ విధిననుసరించి నియతిగా భ్రమించు గోళాలు
ఆ మహార్థము ధ్యేయముగ వెలుగుచున్నవి బ్రతుకులు.

ఈ మట్టిలో ఎన్ని ప్రాణులు లీనమయ్యెను
దీనినుండి మరెన్ని సంతతులవతరించెను.
ఉదయం వలె జనించి సాయంవలె నశించెడి
మానవులు, ఈ మహా ప్రపంచ రథ చక్రాలు.

వెన్నెలకు కులములేదు, మనస్సులేదనుభూతిలేదు
మనిషి కున్నది మనస్సు, దానితోనే అన్ని ఉన్నవి,
ఇవిలేనిది యోగులకు, అంతకన్న అలౌకికులకే
లేదని నమ్మించడం లౌకిక మూర్తులకే సాధ్యం.

గ్రీష్మం వచ్చింది నిప్పు రెక్కలు విప్పి
బంగరు కుప్పవలె భాసించింది జగత్తు,
రాత్రి వచ్చింది మసక కన్నులు విప్పి
బూది కుప్పవలె మారిందదే లోకం

ఆగకు నడువు ఆలోచనతో ముందుకు
ఎదురుపడనీ గుట్టలుగా పెను చీకట్లు
విచ్చుకొని వెలుగు దారులు అవే ఇస్తవి.
గమ్యం తెలియనపుడు చాలు ఉన్నచోటు.

నిద్దురలో స్వప్నంవలె ఉన్నది ప్రపంచం
భూగోళంపై తిరుగు బొమ్మలు ప్రాణులు
మనిషి మనస్సులో ఉన్నవి స్వర్గం నరకం
పైన ఉన్నవో లేవో మన కనవసరం.

మృత్యువు మరో రూపమే గతం
అనుభవాత్మకం వర్తమానం
ఆశాఽభాసము భవిష్యత్తు
ఈ మూడిటి సంపుటి జీవితం.

ఉదయించిన చుక్కలు మతిలో
ప్రసరించిన వెన్నెల హృదిలో
అహంకార రూపం దాలిచి
కనులముందు నిలచిన అహంకారం

బైటికి వదనంపై మంచుతెర
లోన తిరుగు ప్రళయాగ్నిగోళం
పెదవులపై మధుహాస హాసం
ఊహలలో పిశాచ తాండవం.

కవులు ఎందరు పుట్టిగిట్టిరి ఇంతవరకు?
భావమెప్పుడు నవంనవతాబంధురము.
పరిచిత మార్గము అంధునకైనా సులభం
నవీన మార్గం ఎవరికైన అసులభం.

ప్రొద్దుగ్రుంకిన తక్షణం పశ్చిమ దిఙ్ముఖంపై
మేఘ శకలాలవలె వీధుల్లోనడచే జనం
ఎవడి ముఖం చూచినా ఆరాటం ఆవేదన
మతిలో రేపటి ఉదయంపై అల్లబడు ఊహలు

మిన్ను మన్ను ఏకం చేస్తూ
కనురెప్పలు ముంచుక వచ్చే
సుదీర్ఘ నిశా తరంగం
సవేగ నిద్రాకురంగం.

వత్సరాలు ఋతువులు పక్షాలు రోజులు
పునఃపునరావృతమౌ కాలచక్రం
కోపాలు తాపాలు ఈర్ష్యలు కలహాలు
అదే మనస్సు అవే చేష్టలు ఊహలు.

కష్ట జీవిఫాలం పై చెమర్చిన స్వేదబిందువులను
పరిహరించు శీతల హస్తాలతో వచ్చెను ఉగాది.
ఈ నాటికైనా అతని బ్రతుభీడుపడి; మారిందికు చిగిర్చి ఉంటుందని
ఎన్ని యుగాలు గతించినా పాతబడని ప్రాణబంధువు.

బీడుపడి; మారిందిఒకచోటునుండి కదల్లేరు కొంతమంది
వాళ్ళ శరీరం వాళ్ళకే బరువు ఊహకు
వారు రారు ఇతరులను ఏడ్వజేస్తూ
వారుపోరు ఇతరులను నవ్వజేస్తూ

జీవితం గడుస్తుంది యంత్రంవలె
కొందరికి ఆరిపోని దీపంవలె
కొందరికి క్రమ్మిక వదలని నిద్రవలె
కొందరికి అవిచ్ఛిన్న యజ్ఞంవలె

ప్రపంచం దగాకోరు అని తెలియనిదెవరికి ?
ఇందులో మోసపోని వ్యక్తి ఎక్కడున్నాడు?
ఆ వ్యక్తుల సమాహారమేగా ప్రపంచం!
అందుకే మనిషికొక మతం! మతాలన్ని ఒకటి.

దాహంతో చావనున్న వారు
మహానదిలో దింపబడ్డారు
దాహం తీరడం దేవుడెరుగు
తిరిగి కంటికి కన్పించలేదు.

నీ నా కళ్ళముందు పుట్టి పెరుగు శిశువు
నీ నా కళ్ళముందు పండుబారిన వృద్ధు
ఒకరి ఆగమనం మరొకరి నిష్క్రమణం
ఎడపెడగా, చూపుల కలయిక ఒక్కచోట.

స్నేహం పరిమళించెడి ఎదలో
పూవులో జ్వాలవలె ఆవేదన
సంపెగ రెక్క విప్పు చూపులో\nసంజవేళ రక్తి మవలె ఊహలు

చంద్రబింబం వెనుక జ్వలించు సూర్యుడు
చంద్ర వదనం వెనుక జ్వలించు హృదయం
వీచు గాలి పొరలో ఒదిగిన వెన్నెల
తోచు అడుగు జాడను వదలని కన్నులు!

మహానది స్త్రీ ఒక రసాకృతి!
పురుషుని కామం ఒక దాహం అంతె !
ఒక పరిధిలో స్వతంత్రురాలు
స్రవించలేదు ఆధారం భూమిలేక.

నీలాకాశంపై వెలిగే చుక్కలవలె
ఆమె నీడ చాటున దాగి ఉన్న గుండెలు!
తరగలుగా విరజిమ్ము నవ్వులతో, పూల
గుత్తులవలె విరియ బూచిన ఆలోచనలు.

ఆమె కదలికలో, ఒంపులన్ని చుట్టివచ్చు
నిశ్చలతలో, నీరాజనమెత్తెడి చూపులు
నీలి మబ్బులనుండి దుమికెడి మెరపులవోలె,
ఆ సమయం తదుపరి అంతా చీకటి వెలుగు.

నందన వనం వంటి మానవ హృదయం
బీడుపడి; మారింది ఆతని మేధస్సు
అణ్వాస్త్రంవలె కడుభయంకరంగా,
జ్వలిస్తున్నవి శీతల మృదు వాయువులు!

మహామతికి కాలం మహా జవాశ్వం
కొందరికి నిశ్చలన పర్వతతుల్యం
మందమతికి, కదలు చెట్ల ఆకులవలె,
భాసించు అనుభూతి, అది మానసికం

మనిషి ఏ స్థితిలో ఏ పదవిలో ఉన్నప్పటికీ
అతని క్రియలో ప్రతిబింబిస్తుంది నిజతత్త్వం
క్రియా వైవిధ్యమయం ఈ జటిల ప్రపంచం
కాలం దేశం బట్టి మారదు మనోభూమిక !

కొన్ని పూలు పూయవు మరికొన్ని వికసించవు
వికసించిన కొన్నిటికి పరీమళం శూన్యం.
కొందరికి హృదయం ఉండదు అదృష్టవంతులు.
ఆవేదన అనుభూతి ప్రసక్తి ఉండదసలు

సూర్యోదయం కాగానే ఇప్పుడిపుడు
నాకళ్ళలో కదలెడి వెలుగు మిల మిలలు
తుమ్మెదలవలె ఝుంకృతి తిరుగు మనుషులతో
శోభారుణ పద్మం వలె ఉంది ప్రపంచం.

ఒక నాటికి తుది అవని గ్రంథం ప్రపంచం
చాల మంది చదవరు కొందరు చదువుతారు.
అర్థమయిన వాళ్ళసంఖ్య అమిత స్వల్పం
ఎవరేమన్నా ఎవరి ప్రపంచం వారిది.

ఖైదు నుండి విముక్తులు ఇద్దరు హంతకులు
ఒకరినొకరు చూచుకొని సాగారు ముందుకు
ఒకడి కళ్ళలో పరచబడిన ఆకాశం
మరొకడి కళ్ళలో తిరుగుతున్న గోళాలు

బ్రతుకు ఇంకా ఇంకా బ్రతకాలంటుంది.
నదిపై తేలి వచ్చు అలల వలె ప్రియంగా,
దూరంగా మృత్యువు, గాలివలె ధ్వనిస్తూ
వచ్చు కొద్ది, ఉల్లాసం అధిక మౌతుంది.

గుండె గాయంతో జ్వలించునపుడె
తెలుస్తుంది జీవిత మెంత బరువో !
వత్తి కాలుతూ ఉన్నంత సేపు
చూపగలదు వెలుగు ప్రపంచానికి.

రాగంలేని మనిషి లేడు భువిని
వర్ణం లేని వస్తువు కన్పించదు
ఒక స్థితి రీతి బట్టి కలుగుతుంది
ఇతని కానందం దాని కందం.

ఆకాశ మతిక్రమింప దురాశతో
తహతహతో పైకి పైకి ఎగురువిహంగం
రవి తేజములకు మండి భగ్గున బొగ్గై
ఏ మట్టిలో కలిసిపోయేది, ఎరుగదు.

నా కళ్ళలో నీరు ఆవిరి ఐపోయింది
బైటికి రాకముందే వేదన కెపుడో !
అదృష్టం మేల్కొన్న గులాబి వదనంపై
ఉదయం ముత్యాల్లా మంచునీటి బొట్లు !

రాత్రి పూల మొగ్గలవలె కలలలో తూగి
ఉదయ రూపంలో ఉదయించిన ఈ రోజు !
నౌక వలె మునిగి పోతుంది సముద్రంలో
చివరకటు ఇటు ఎటుచూచినా శూన్యమంతా

హృదయంలో క్రీనీడలు ప్రతిఫలింపజేసి
నిరంతరం ఆగకుండ నడుస్తున్న కాలం.
మంచు కొండ పై చలికి వణకుతున్న వెలుగులు.
నేలపై దరిద్రంతో అణగి ఉన్న మనుషులు.

ఒక గాలికి చెట్టు ఆకులు కొమ్మలవలె
ఒక ప్రభుతకు ఒదిగి ఉండు మనస్తత్వం.
ఒక స్థితిలో మండి పడి కాల్చు అగ్నివలె
ఒక దర్పంతో ప్రభుతనెరపు అహంకృతి.

సామాన్యుని గుండెలో, బిగిసిన
హిమశైలం వలె కరగని బాధలు.
సామాన్యుని బ్రతుకులో ఎదురై
మరుభూముల వలె మారిన ఆశలు.

ప్రతి మనిషి మనస్సులో ప్రమాణాన్ని బట్టి
సుందర కాల్పనిక నిర్మాణ పరంపరలు
వాస్తవికంగా గాలి తెరవీస్తేచాలు
గుర్తించరాక చెదరిపోవు ఇసుక గూళ్ళు.

ఎవని ఊహలేస్థితిలో ఏ యాకృతి పూనునో !
ఎవని బ్రతుకేరీతిగ మలకలు తిరుగునొ!
ఎవడికెరుక ? తనకు తెలియని దానిని
తెలిసినట్లు విశ్వసింప జేయడమే లౌకికం !

.

ఒకడు దూదికన్న మిక్కిలి తేలిక చూపును
మతిలో పాముకన్న ఎక్కువ విసపు కోరలు
ఒకని చూపు కోతకు పనికిరాని కొడవలి
అతని చేతము రాక్షస గణక్రీడా యోగ్యం.

విపదబ్ధి మునిగిన ఒకని మనసు
నవనీత సదృశము మసృణమగు.
సుఖాబ్ధి తేలెడి ఒకని మనసు
అగ్ని సదృశము దాహకమ్మగు

చిత్త జల్లుకు మొలిచిన గడ్డి పోచలు
ఎంతకాలం బ్రతుక గలవు శక్తి గలిగి !
గాలి వాటున పెకలు కవితలో
ఏ వస్తువున్న నేమి? ప్రతిభ లేనిది !

ఎంత వయస్సు వచ్చిందో పైనబడి
అంతకాలం హరించిపోయింది!
మెరపువలె గతించింది నిన్నటిరోజు
విహంగంవలె వచ్చి వాలింది ఉదయం

చచ్చి బ్రతికే వాళ్ళ సంఖ్య అల్పం
బ్రతకడానికి చచ్చే వాళ్ళు ఎక్కువ.
కొందరిని మృత్యువు అమావాస్యవలె
కొందరిని పూర్ణిమవలె వరిస్తుంది.

మరో ఉదయం కోసం మనిషి ఆశతో బ్రతుకుతాడు
హృదయహాసంతో రాత్రులు దీపం వెలిగించగలడు.
మృత్యువును జయించడమే చివరకు మిగిలేదతనికి
చలికి బిగిసిన జీవం అంగారం కోరుతుంది !

మట్టిలో కలిసిన ఏ సుందర హృదయాల్లో
దాగిన కోర్కెల రూపాలీ పచ్చని పోచలు!
ఏమంద భాగ్యుల కళ్ళనుండి పతితమైన
బాష్ప కణాల్లో దాగిన ఆశాస్వరూపాలు!

పంకంలో మనోహర మృదుపద్మాలు
గులాబీ పుష్పంచుట్టూ కంటకాలు
మల్లీ నికుంజంలో విషసర్పాలు
ప్రకృతి మానవుడు, బింబ ప్రతిబింబం.

వెలుగులో తమ వ్యక్తిత్వం స్ఫురింపజేసి
చీకటిలో పరిలీనమౌ ఆకాశం భూమిసర్వం
బ్రతుకులో దీపశిఖవంటి మనసునంటి
ముందు వెనుక మలగు సుఖదుఃఖపు వెల్గునీడలు !

మహాకాల కాసారంలో విరిసిన
కనక శతపత్రం సూర్యుడు, కాదు!
అంధకార వలయంలో సహస్రాబ్దాలుగా
పరిభ్రమించు మానవ హృదయాగ్ని గోళం.

కాలదేవత మనస్సులో విరిసినమల్లెలు
ఉబికిన సంతోష తరంగాలు, చుక్కలు, కాదు!
ఒక భాగ్యహీనుడు రాల్చిన బాష్పకణాలు
హృదయం ఎగజిమ్మిన అగ్ని శలాకలు.

దుఃఖమయ జీవితంలో హ్లాదైకబింబం
తమో గగనపథంలో పారాడే శిశుశశి,
అవును. పాషాణ హృదయం భేదించుకొని
ఉద్గమించిన సౌందర్య కళాశిల్పాకృతి.

ఒక్కమారు వీచింది గాలి తరగలు తరగలుగా
కొన్నిపూలు రాలిపడిపోయినవి గుదులుగా
కొన్ని మొగ్గలు వికసించినవి దరహాసంతో
ఒకే స్థితి భిన్నిదశలలో భిన్న పరిణామాలు.

పగలు రాత్రులు పై బడి వచ్చిపోతున్నవి.
యుద్ధాలు క్షామాలు సైపక వెలిగిపోయినవి
ఇంకా మేల్కొనని జనం ! గుండెల్లోని
గాయాల బాధ ఎరుగని శవసందోహం!

చీకటిలో చివికిన బ్రతుకు నెత్తిచూపు దీపకళిక
భాగ్యహీనుని కంటినుంటి జారిపడు బాష్పకణం.
బాష్పకణంలో నినదించు బడబాగ్ని సంగీతం.
శిథిల మనశ్చిత్రపుటడుగుల చప్పుడులు.

చెట్లు కనే కలలు పూలు పండ్లు
వాని ఆలోచనలకు ప్రతిరూపాలు నీడలు
నదులు కనే కలలు పొలాలు ఎడారులు
వాని ఆలోచనలకు ప్రతినిధులు తరంగాలు

మనిషి కనే కలలు ఇతరులకు కనిపించవు.
అతని ఆలోచనలకు ప్రతిబింబాలు
అజంతా హిరోషిమా, బూక్కులు స్ఫుత్నిక్కులు
దేవతలు రాక్షసులు, తాను మరి ఇతరులు.

వ్యక్తి బ్రతుకులో చివరి ఘడియలు
విషబిందు మయ కాంతి బింబాలు
గతస్మృతులు కేంద్రాలుగా
భ్రమించు ఊహా గోళాలు.

గతిస్తుంది మానవయుగ పరంపర,
మేధా విలసనం, హృదయ స్పందనం
మానవ క్రమ పరిణామస్ఫూర్తి కట్టి
నిలుస్తుంది చరిత్రలో అనవరతం.

★

ఉషస్సు ఊర్పులో, తమస్సు కూర్పులో
జనురానందంలో, మృత్యు విషాదంలో
మనిషి రూపంలో, కాలభ్రమణంలో
లేదు మార్పు ! మార్పులేదు ! లేదు !

నాడు నేడు రేపు ఒకటే,
అడవులు గిరులు ఝురులు
రవి చంద్రుల చూపులు
భువి మనుషుల మమతలు

ప్రతి నిమిషమొక నూతన రూపంతో
ప్రతి మనస్సు ఒక నవ్య రాగంతో
ప్రతి మేధ ఒక క్రొత్త ఆలోచనతో
భౌతిక జీవితంలో క్షణ క్షణ పరివర్తన

నిన్నటి పరివర్తన
నేటి దృష్టిలో సంప్రదాయం
నేటి పరివర్తన
రేపటి దృష్టిలో అభ్యుదయం

కాలం కనులు గప్పి పబ్బం గడుపుకొనే
అమావాస్య వంటి హృదయం గల మనిషి
కాలం నడక నంటి బ్రతుకు నడుపుకొనే
దీపపు వెలుగు వంటి మనస్సు కలా డొకడు !

కాలం కనులు విప్పి జగతికి వెలుగునిచ్చు
సూర్యుని వెలుగు వంటి బ్రతుకు ఫలమొకరిది !
నాడు నేడు రేపు సమాజపు సరిహద్దులలో
చంక్రమణం చేయు 'తర్కం తెలియని ఎద్దులు'

అశాంతి ప్రతిచోట, నేటి సాహిత్య విమర్శవలె
కార్మికుని కడుపులో, రైతు ముఖకవళికలో
యఒ జీ ఓ కన్నులలో, ఆఫీసరు మనసులో
కవిశ్రీ సమూహంలో, నాయకమణి బృందంలో

ప్రతి మనస్సులో ఉద్భవించు ఊహ వెనుక
సమయంకోసం వేచి ఉన్న స్వభావమూర్తులు
క్రియాచరణలోకి దూకిన అసంఖ్యాకశక్తులు
ఊహలో నిలచి పోయిన బహుళ తత్వ రేఖలు

పక్షిలో పాములో చెట్లలో జంతువులో
ఇంకా పంచభూతాల్లో దైవత్వం దర్శించి
ఆరాధించడంలో జీవితం సాగించు మానవులు
మానవుల్లోని మానవత్వం ఎరుగని దానవులు.

కాల గర్భంలో కలసిపోవు ప్రతిమానవుడు
కాలముఖంపై వెలసిన ఒక వర్ణ రేఖ
బహువర్ణ విచిత్ర రేఖావలయ ప్రపంచం
ఎప్పటికప్పుడు మారిపోవు చిత్రశాల

రాత్రి చలికి భయపడి కప్పుకున్న
బొంతలు తొలగించి, కళ్ళు తెరచి
ఉదయ కాంతి ముఖం చూడడానికి
సంకోచించు నిరాశాహత జీవులు

సాయంసంధ్యా వర్ణంలో కలసిపోయి
ఏనాడో తమ వ్య క్తిత్వం రూపుమాసి
రాత్రికి దివ్వెల హారతి పట్టగ వేచి
కళ్ళు విప్పుకొని ఉన్న ఆశాసహిత జీవులు

హిరోషిమాగా మారిన మానవహృదయం
మరోమరో ఉదయాన్ని చూడగలదు కాని
ఎరుగబోదు సృష్టికి ప్రాణభూతమైన
చైతన్య స్పందనలో వికసించు సౌందర్యం

ముగిసిన కలవలె గతించింది రాత్రి
కలలు కనడం మాని మేల్కొన్నాడు మనిషి.
తూర్పునుండి సాగిన వెలుగు పూలవర్షం
మనస్సును ఆర్ద్రము పరీమళం గావించింది.
ఒక వలయం నుండి విముక్తమై పోయింది దృష్టి
విప్పిన కనుచూపులలో సంగ్రహితమైంది సృష్టి.
మనిషి కంటివెలుగులో కన్పించే దృశ్యాలు
ఒకటా రెండా? ఎన్నని లెక్క పెట్టగలం ?
వాని అనుభవంలో మనస్సు ప్రసరించే రీతులు
ఒకటా రెండా? అవియెన్నో వానికి తగినన్ని.

మబ్బుల దుస్తులు ధరించి వెలిగెడి రోదసివలె
ఆశా చిత్రాలు నింపుకబ్రతుకు మనోజీవులు.
కదలిపోవు సమాజ రథచక్రపు టిరుసులు
వదలక వ్రేలాడు అసంఖ్యాక సంధ్యాజీవులు.
సామాజిక బంధనలో సతమతమౌతూ నిత్యం
మూఢవిశ్వాస పరంపరల కాహుతియౌ జనం.

ప్రజాస్వామ్య దేశంలో నియంతృత్వ రాజ్యంలో
స్థితి మారినా మానవ మనస్తత్వం మారలేదు.

మానసిక వ్యాపారం ప్రబలుతూన్న ఈ శతాబ్దంలో
పాశవిక ప్రవృత్తి ధరిస్తూంది మరో నవ్యముగ్ధాకృతి.

మనిషి మనిషికన్న ఉన్నతంగా బ్రతుకదలచినపుడు
నాటికి నేటికి ఏనాటికి నశించదు సాహిత్య ప్రాముఖ్యం.

మనిషి మనిషికన్న అధికంగా బ్రతుకదలిచినపుడు
నాటికన్న నేడు మీరుతుంది విజ్ఞాన ప్రమేయం.

ఒక ప్రక్క అంతరిక్ష శోధనలో విజయసాధనల యత్నం
మరోప్రక్క అంతర్బహిఃక్షోభలతో జీవితంలో పోరాటం.

జీవిత సమరంలో అడుగడుగున దాటవలసిన కాలం
ఆవరించి భయపెట్టు నీడలు! విచ్చి ఆకర్షించు వెలుగులు.

ఉదయం వెలుగు సూర్యుడు,
రాత్రి చీకటి చంద్రుడు
వివృత సంవృత రూప జగద్భావనలో
పరివర్తన, సృష్టి సౌందర్య వికాసం.

విశిష్ట బహు భావానుభూతి
ఈ విచిత్ర సృష్టిలో ఎవరికి?
కాలస్వరూప సౌందర్యాభిజ్ఞత గల
ప్రమాణ మెరిగిన పరిణత సూక్ష్మమతికి!

గ్రీష్మంలో ఇంకిపోయిన నదివలె
సూర్యుడు అస్తమించిన దిశవలె
ఇంకా చావుతప్పిన బ్రతుకు గడుపు
ఇరవయ్యో శతాబ్దంలోని సామాన్యుడు.

గాలిలో అదృశ్యమైన ఆశను
మేఘంలో మెరపు జ్ఞాపకం చేస్తున్నది.
సూర్యుడు తమ ముఖాన
ఎప్పుడు పొడిచేదీ ఎవరికీ తెలియదు.

రాత్రివేళ భయంకర నిద్రా సమాధివలె
సంగీతం విరమించిన సముద్రం వలె
ఆగిపోయింది కాలం నిశ్శబ్దంగా
ఉచ్ఛ్వాస నిశ్వాసం ఆగిన శరీరంవలె

అంతరిక్ష గోళాల్లో ఆవాసానికి
ప్రయత్నాలు విరివిగా సాగుతున్న ఈనాడు
భూగోళంపై జీవించే సహవాసికి
తిండికీ బట్టకూ అఘోరించే అభాగ్యం!

కొలిమి తిత్తులవలె మండిస్తూ ఊపిరితిత్తులు
చలికి బిగిసి ఏనాడో గడ్డకట్టిన ఆలోచనలతో
ఎక్కడ వేస్తే అక్కడే మట్టిముద్ద స్వభావంతో
కబంధుని చేతుల్లో కీలుబొమ్మ సామాన్యుడు.

ఒక నియంతవలె వీచే గాలి అదుపులో ఒదిగి
తలలూపుతూ చప్పట్లు కొట్టు చెట్లగుంపులు.

కవితా వస్తువును చర్చల్లో సిద్ధాంతీకరించి
కవిత్వం మినహాయించి సందేహ రహితంగా
తమలో సుప్తమైన అహంకారానికి
వర్ణాకృతి ఇవ్వబడుతున్న సాహిత్యం!

రక్తంలో చురుకుదనం బుద్ధిలో మెరపుదనం
కంటికి కనిపించని గోడలను పగులగొట్టు సాహసం
తనలో విశ్వవిశాలత్వం పెంపొందిన మనస్తత్వం
అవసరం సామాన్యునికి ఒకే ఒక మానవతా సూత్రం.

సామాన్యుడు విడిచే భారసహిత నిశ్వాసం
తేలిక పరచగల అపూర్వ సాధనం;
ముక్త కంఠంతో సర్వత్రా వినిపించు
వర్గరహిత సమాజ పరిణామ నినాదం!

నిల్చి యోచిస్తు గ్రుడ్డివాని ఊహలవలె చుక్కలు
చుట్టు వెతుకుతున్న గ్రుడ్డివాని చేతులవలె గాలులు
ఒకరి సంజ్ఞ వేరొకరికి తెలియని దుస్థితిలో ఉన్న
మూగ జీవుల మనోభరిత మహావేదన నింపుకొని
బయల్దేరి అక్కడక్కడ ఒదిగి ఉన్న మసక వెలుగులు!
ప్రకృతిలో మృదు రూపం ధరించిన భయంవలె
మనస్సులో భయదాకృతి దాల్చిన ప్రేమ వలె
అంధకారం ! పగిలిన అంధకారం ! ఆక్రమించిన అంధత్వం!

తలపై వెలుగుతున్న విద్యుద్దీపకాంతి కిరీటంతో
ప్రక్కనే విడిపోజాలని ప్రాణమిత్రం ఇనుప స్తంభం
క్రింద కాలు విరిగిన కుర్చీవలె పడి ఉన్న చీకటిలో
ఒక మూల కూర్చున్న 'సన్డే' మణులు
'సన్డే' మణులు రాత్రి పోయిగాని చేరరు నివాసం
'వన్ డే' లా గడచిపోతుంది వాళ్ళ జీవితం !

ఆశలు హద్దు మీరకుండా, వైవిధ్యమసలే లేకుండా
ఓటు హక్కు తెలీకుండా, ఓనమాలు వచ్చీరాకుండా
తమ నీడే ఒక బొంతగా చుట్టుకున్న నగ్న జీవులు,
సమాజ సమరంలో దూరం విసరబడిన అదృష్ట హీనులు
నాలుగు పాదాలు విరిగిన ధర్మం యొక్క రూపశకలాలు!
నిరంతరం పీడించే చిక్కు విడని సమస్యలకు ప్రతీకలు !

ఆకాశచ్ఛత్రం క్రింద ధరామహిత గర్భంలో
వృక్షచ్ఛాయలలో పాడువడిన గోడల ప్రక్కన
ఎంగిలి విస్తరాకుల చుట్టూ మూగిన ఈగల రొద
అనురణించు ఊహలు గల సంధ్యా జీవులు !

గ్రీష్మాతప శుష్కితమై అగ్నిచే సగం దహింపబడి
రథ్యావీధి నడవనేర్చిన చెట్లవలె, మౌనాలాపంతో
ఉదయ రథచక్రం వెనుక వెలుగుదాలు నంటివచ్చు
నీడ బొమ్మలవలె కదలిపోవు సందేహ జీవులు.

ఈ స్థల మా స్థలమని లేకుండా
ఈ జాతి ఆ మతమని లేకుండా
ఏ మూలనుండి వినిపించినా
క్రాంతికారక కంఠధ్వని తరంగం!
ఈ స్థల మాస్థలమని లేకుండా
ఈ జాతి ఆ మతమని లేకుండా
ఒక పెట్టున మ్రోగుతుంది
సామ్యవాద ప్రపంచ హృదయం!

# హిమజ్వాల

ఈ ఉషస్సాహిత్య వీధుల
రెక్క విప్పిన మొగిలు నీడలు!
ఈ నిశా నిద్రాంబరమ్మున
సాశ్రు శిఖల విషాద స్వరములు!

ఈ ప్రశాంత మహాకాశము ఒకసారిగ
మృత్యుతాండవ రవము విన్పించునేమిది?
ఆ హిమాలయ కందారాసీమ మ్రోగెడి
కృతఘ్నతా భరశతఘ్ని చయ యత్నములు !

ఈ గడ్డపై వీచు శీతల వాయువులు
        సదా సుమనోభిరామములు
రివ్వున దూసిచను పదను కత్తులవోలె
        ఎదకు భాసించునవి యేమి?
ఆ హిమ భూమి కదలు సైనిక నేత్రములు
వదలు సర్ప దృశాగ్ని కీలాచయమ్ములొ!

పురాణవీధీ చరన్మోజ్ఞ దేవతా
సమూహా సమూహా దీపించు నివసనము
హత్యాబుద్ధి ఇట చరించెడి జీవులెవ్వరు?
సూర్య తేజము మ్రింగనెంచెడు మబ్బుమూకలు!

శతపత్ర ముగ్ధ వదనము పైన
నెత్తురు గంట్లవలె, అంతలో
హిమ శీతల స్వచ్ఛభూమి పై
అగ్ని కణములవోలె, భాసించి
మూకలు మూకలుగ వచ్చిపడు
కాలముద్రా మూర్తులెవ్వరు?

శాంత తేజో లీన రేఖాదేవి
హిమాచ్ఛ సుషమా ఫాలతలమున
అగ్ని కీలలు రక్త ఝురులు సృజింప
నెంచెడి చీకటి ముద్దయెవ్వడు?

ప్రతి భారతీయుడు విడిచిన
ఒక్కొక్క కోష్ణ నిశ్వాసమ్ము
తమో రాత్రివలె భయదమై\nదీర్ఘమైహిమభూమి చుట్టినది!
ఒక్కొక్క హృదయమ్ము రవి
బింబ సదృశ తేజస్ఫూర్తి
చీకటి శవము కాల్చగా
పండు నిప్పులను చెరగినది !

ఉదయాస్త మయ దివారాత్రములు
ఋతువులు కామనల కాస్థానములు
క్షణములు, తృటిలో మరచి సర్వము,
ప్రదీప్తమతియై; గగన మెత్తున
ఫణసహస్రము విప్పి నా జాతి
నిలచినది కాల భుజగము రీతి,
నిప్పుగప్పిన నివురు గాలికి లేచెను
ఎవని చూచిన ఒక్కొక డగ్ని గోళము

ఎవని హృదయము ఎంచిన దుఃఖభరితము
బాడబాగ్ని వహించు మహాసముద్రము!

స్వేచ్ఛా సమాజ రిరక్షా వ్యగ్రమై
నా దేశమే చైతన్య సంభృతమై
మేల్కొని జ్వాలవలె శతకోటి ముఖముగ
తేజోఽసహ్యమయ్యెను శత్రుకోటికి.

కొండవలె నిలచి కదలిక లేక
కలల తూగెడు జాతి కాదిది !
చెలియలి కట్ట ఎరుగని వార్నిధి
నిత్య భాస్వర దేవతామతి !

మహా దాహము గొన్న కాలము
రక్తఝురులను కోరుతున్నది.
కాలమును కబళించనీయము
ఖడ్గ వ్యూహము విభేదింతుము !

ఎదపై నిప్పుల కుంపటి
దించిన ఆ కృతఘ్నులను
తుద ముట్టింపగ త్వరగా
హిమ జ్వాలలను ఆర్పగ

జ్యోతిర్ధూమ జల సంభృత
నవ ఝుంఝూహుంకృతితో
ఉరుములతో మెరపులతో
రణవ్యూహ నవమతితో
కదలుము నేపాల్ ప్రాంతము
తరలుము లడక్ భాగము.

# కదలండి శతఘ్నులవలె

ప్రొద్దుపొడవడానికి బదులు ఈ రోజున హఠాత్తుగా
యుద్ధం వచ్చి పడింది, మన ముఖాల ముందు :
యుద్ధ వార్త వినిపించిందో లేదో
జ్వాల లెగసే పూల నదుల వలె
నిప్పులు చిమ్మే గోళాలవలె
చైతన్యం విరిసిన స్త్రీలు పురుషులు.

ప్రళయ సముద్ర తరంగాలవలె
బుసలు కొట్టు త్రాచులవలె
ఘోషలతో, పూత్కారాలతో
నేల ఈనినట్లు ఎక్కడ చూచినా
దేశం నలు మూలల వీధుల్లో మైదానాల్లో
ప్రతీకారవాంఛలు ప్రకటించే జన సందోహం!

దేశాభ్యుదయ యజ్ఞానికంకితమైన దేశంపై
విరుచుక పడి ఎగిరే చైనా సమర విహంగం రెక్కలు
తుత్తునియలు చేసేవరకు, చివరిమనిషి తెగేదాక
తుది చూడక విశ్రమించరు ! ఎంతకైనా సంసిద్ధులు !

కార్మికులు, కర్షకులు, మేధావులు, విద్యార్థులు
ఒక్కొక్కరి హృదయమొక శాంతి కపోతీ నివాసం
నివాసంపై తుపాకులు ప్రేల్చేహంతకుణ్ణి మరవ కండి
ఇందాక వచ్చాక అడుగు వెనక్కు వేయడం జరుగదు !

మనం పీల్చేగాలి అప్పుడే బరువెక్కిందీపాటికే
లేవండి మహాగ్నులవలె కదలండి శతఘ్నులవలె !

శత్రు పాశవిక ప్రవృత్తి నిరోధానికి
చండ ప్రచండత్వమే పరమౌషధం
శాంతి పాఠాలు వల్లిస్తే చెవి ఒగ్గే
సమయం ఏనాడో అంతరించింది !

మబ్బు మెరపులకు భయపడి
సహజ గమన వ్యవహారం విడుస్తుందా ప్రపంచం?
మెషిన్ గన్లకు ఉలికిపడి
భూభాగం గౌరవం వదలుతుందా భరతదేశం !

పిడుగులు పరహరింప జేసే
యంత్రశక్తి మేఘానికెంత తెలుసో
పన్నిన భూకబళన వ్యూహం
సాగిచావదని చైనా కంతే తెలుసు !

బలప్రయోగ వైఖరితో రాజ్యవిస్తరణ తత్వం
కాలానికి కత్తులవంతెన కట్టాలని వేసిన పథకం
ప్రజాస్వామ్య సంఘటితశక్తి ఎన్నటికీ సాగనీయదు.
కూల్చివేస్తుంది తప్పక భాయీ ! చౌఎఽ లై !

ఇన్నాళ్ళు ఓపిక వహించిన ఈ శాంతి ఖండం
ఈనాడు ఉండి ఉండి బ్రద్దలైన అగ్ని పర్వతం
ఉద్రేకోత్సాహంతో, రుద్రతాండవోద్వేగంతో
అగ్ని ఝురులవలె పరుగెత్తండీ ! సైనికులార !

లోహరాక్షసుని కుతంత్ర వ్యూహం
విచ్ఛిన్నం చేసే దీక్షలో
నిమగ్నులైన నా సోదరులారా !
స్వేచ్ఛా ప్రపంచ బలం సర్వం
ఈ దేశం వెనుకే ఉన్నది !
ఈ యుద్ధంలో తుదివిజయం మనదే !

ఆ మంచుకొండలలో విద్యుత్ప్రవాహంవలె
మండే శక్తులతో నిలచిన నా సోదరులారా !
ఈ దేశభవిష్యత్తుకై వెలిగింపబడిన జ్యోతుల్లారా !
విషవ్యూహం ఛేదింపగ నిలచిన అమృత మూర్తుల్లారా !

గుండెలో బాకు రువ్వి కీర్తి పతాక ఎగుర వేసే
శత్రువు, వీడనిదే భూమిని జయించనిదే వారిని
సమర ప్రతిజ్ఞ వీడకండి ! సన్నాహం మానకండి !
లేవండి మహాగ్నులవలె ! కదలండి శతఘ్నులవలె !

ఈ ప్రజాస్వామ్య యుగంలో దేశంలో
ఏ మూల ఏ విపరీత కృత్యం జరిగినా
సామాన్యుని జీవితం పై దాని ప్రభావం
అసాధారణం ! ఆతని బాధ్యత అనల్పం !

కాలానికి కెదురీదకు ఓ మనిషీ ధనస్వామీ ! వ్యాపారీ !
పదంలో వేగం హెచ్చి వేగానికి రెక్కలు మొలిచి
సమృద్ధి సంపాదనకై లోపించకు స్వశక్తి యత్నం !
తెగించి త్యాగం చేయి ! మండించకు జీవితం !

బరువు నడకలతో మౌనముఖాలతో
ఆక్రందన స్పందించు అమాయకశీలంతో

నగవు హరించిపోయిన పెదవులు బిగించి
ఎక్కడో వంపులు తిరిగిన ఆకాశంలో
ఆశలు భద్రపరచుకొని
ప్రాణాలరచేత పట్టుకొని
పిల్లలతో పశువులతో
స్తంభించిన గాలిని
కత్తులవలె చీల్చుకుంటూ
తరలివచ్చే కాందిశీకులు !

మానవతా వాసనా స్పర్శలేని
ఇనుప హృదయాల కెదురుగా
దేశాన్ని రక్షించడానికి
దేహాన్ని డాలుగా ఉపయోగిస్తూ.
దేహం పైని రక్తసిక్త వ్రణాలు
గులాబి పుష్పాలుగా భావిస్తూ

ఒంటరిగా ఉన్నా తనచుట్టూ
పదిమంది నిలచి ధైర్యమిస్తున్నట్లున్న;
కోపంతో ఎర్రనైన ముఖంలో సైతం
చిరునవ్వు వెన్నెల చిందినట్లున్న
నిప్పులుక్రక్కే మంచుకొండలలో;
ముందుకుసాగే సోదర సైనిక బృందం!
ఈ దేశం అభిమానం ఆత్మగౌరవం
మూర్తీభవించిన మహా తేజశ్శిఖరం !

★

# పద పద !

పదపద ప్రళయం
భీకర వలయం
ఛేదించుక పద !
పదపదంలో ఒక క్రొత్త లయ
ఎదలో స్పందింపగ క్రొత్త సృష్టి

ఆడుగు జాడ వెనక వదిలి
సాగిపో ముందుచూపు నిలిపి
నిదురించకు, నీ మస్తిష్కం
రాట్నంవలె మారును తథ్యం

ఒకరిలోని దౌర్బల్యం
మరొకరికి సౌబలమై
సాగుతున్న సమాజపు
సరిహద్దులు చెరిగిపోయి
ఉదయించు నవచరిత్రకు
అవరోధం హతమారుస్తూ
పద పద ! సమరం
దుష్కర సమయం
సాధించుక పద!

అబలసబలయై కలికాలంలో
వ్యోమవిహారం సాగిస్తున్న
ఈ ఇరవయ్యో శతాబ్దంలో
''కోమా'' వదలని అసంఖ్యాక జనం

దీర్ఘ నిద్రపోతున్న కొండలు !
రాత్రి నడవ నేర్చిన చీకట్లు!

పద పద ! దీ ప్తమతి !
తమిస్ర వలయం
చీల్చుక పద!

పద పద ప్రళయం
భీకర వలయం
ఛేదించుక పద !
పద పదంలో ఒక క్రొత్తలయ
ఎదలో స్పందింపగ క్రొత్తసృష్టి

# యుగసంకేతం

Donated in memory of

Dr. Sripada Gopalakrishna Murthy

శ్రీపాద గోపాల కృష్ణమూర్తిగారి

బహూకరణ

## మాదిరాజు రంగారావు

శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయము

సుల్తాన్ బజార్, హైదరాబాద్ – 1

# సాహితీ బంధు బృందం

హనుమకొండ, వరంగల్లు—1.

# స్వేచ్ఛా కవిత్వం

## యుగసంకేతం

ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

YUGA SANKETAM

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: జనవరి 1970

విజయ ప్రైస్, వరంగల్లు

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

# అంతర్నాదం

ఆధునిక యుగంలో నవ కవిత్వం విస్త తృ వైవిధ్యమూ పొందుతూంది. అందులో ఒక ప్రవాహం పురోగమన శీలంతో సూక్ష జీవనరీతీ, అంతస్స్వభావ స్వరూపమూ పొదిగికొని విశ్వజనీనభూమికలో సాగుతూంది. ఈనాడు ప్రతి చోటా మతాల బాహ్యాడంబరాలు, అంధ విశ్వాసాలు అంతరిస్తున్నాయి. సారభూతమైంది మానవ సంస్క తృలో భాగంగా మిగిలేదే, రాజకీయంగా చైతన్యమూ విస్తారంగా కలుగుతూంది. శాస్త్రీయ దృక్పథమూ అలవడుతూంది. వ్యక్తిలో మేల్కొన్న స్వేచ్ఛాభావన క్రియాత్మకమౌతూంది. వీటి ప్రభావం అనివార్యం. ఈనాటి వరకు మానవునికి సంక్రమించిన సంస్క తృలోని మేలిమి విలువలు రెక్కలు విచ్చుకోవలసి ఉంది. ఒక ప్రక్క వైజ్ఞానికంగా శిఖరాల నందుకుంటూ, మరొక ప్రక్క అనేక విధాలుగా వైక్లబ్యం, సంక్షోభం పొందిన ప్రస్తుత సమాజంలో మానసిక సమున్నతికి కావలసిన వివేకం అవసరమూ గుర్తింపుకు రావలసి ఉంది.

విశ్వాంతరాళంలో గోళాలు మనకు చేరువ అవుతున్నాయి. భూమిపై మానవుడు, దుఃఖం అజ్ఞానం అసహనం దారిద్ర్యం అంతరించి, ఆనందం విజ్ఞానం శాంతి సౌభాగ్యాలకు నిలయమె నిలువవలసి ఉంది. ప్రతి ప్రగతివాదీ కోరేదే, ఆదర్శ సమాజానికి భౌతికావసరాలతో పాటు మానసికమైన ఉన్నతి. ఆత్మగతమైన సంస్కారం అవసరం.

ఇవి ఈ గీతాల రూపరేఖలు. అందునా చిత్రణలో బాహ్యస్వరూపంకన్న అంతస్స్వరూపాని కధికప్రాధాన్య మీయబడింది. ఆనందించడానికి అనుభూతి శీలంతోపాటు ఆలోచనా అపేక్షిస్తాయి. కొన్ని గీతాలలోని మూల భావాన్ని స్పృశిస్తూ, కొన్ని ప్రతీకలను తెలియజేస్తూ చివర వివరణలు ఇవ్వడమైంది.

అనుభూతి ప్రమాణంలో, ఆవేశపు పొంగులో మనోగతినిబట్టి శబ్దసంయాజనమూ, వాక్యరీతీ, భావ విన్యాసమూ రూపొందిన రచనలివి. ఇందులో ఏ ఛందస్సూ ఉద్దేశించ లేదు. అంతర్లయకన్నా అంతర్నాదం అనుభవానికి వచ్చే స్వేచ్ఛాకవితగా భావిస్తాను.

**– మాదిరాజు రంగారావు**

# ముందు మాట

డాక్టర్ మాదిరాజు రంగారావుగారికి ఆధునిక కవితా లోకంలో విశిష్ట స్థానమున్నది. ఆ మార్గంలో ఇదివరకే అనేక కావ్యాలు ప్రచురించి లబ్ధప్రతిష్టులైనారు. వర్తమాన మానవ జీవిత వైవిధ్యాన్ని శీస్త్రయంగా దర్శించి, ప్రతీకాత్మకంగా కళామయంగా ప్రకటించడం వారి కవితా లక్షణం. పత్రికల్లో ప్రచురింపబడిన వారి ఖండికలన్నీ సంపుటీకరించి ప్రకటించడం అవసరంగా భావించినాము. అందుల కంగీకరించిన శ్రీ రంగారావుగారికి మా ధన్యవాదాలు.

ఈ గ్రంథ ప్రచురణకోసం రు. 500/—లు విరాళంగా ఇచ్చి ప్రోత్సహించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారికీ, ముఖ్యంగా సహృదయులైన కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికీ మా హార్దిక కృతజ్ఞతలు.

తగు సలహాలనిచ్చి సహకరించిన డాక్టర్ కోవెల సుప్రసన్నచార్యులుగారికి మా కృతజ్ఞతాభివందనాలు.

అందంగా ముద్రించిన విజయ ప్రెస్ అధిపతులు శ్రీ పల్లా రామకోటార్య గారికి, దాని సిబ్బందికీ మా ధన్యవాదాలు.

— డాక్టర్ పేర్వారం జగన్నాథం,

హనుమకొండ

ది. 16—12—1969.కార్యదర్శి.

అంకితం

ఆప్తమిత్రులు

డాక్టర్ కోవెల సంపత్కుమారాచార్యులకు

విషయసూచిక

యుగసంకేతం –


| | పుట | రచనా కాలం |
|---|---|---|
| యుగసంకేతం | 1 | 1969 |
| నేను మేల్కొని ఉంటాను | 2 | ‘67 |
| హృదయంతో మాట్లాడే చెట్లు | 6 | ‘66 |
| ఎవరది దూరంగా | 8 | ’67 |
| అంతమవని కథ | 11 | ‘67 |
| రెక్కలుదాల్చిన కొండలు | 16 | ‘66 |
| ఆఖరికి దేవుడై నాసరే | 19 | ‘69 |
| ఈ గీతం | 20 | ‘67 |
| అంతమవని రాత్రి | 25 | ‘67 |
| భగవంతుడు విడిదిచేసిన లిప్త | 28 | ‘66 |
| కాలం గురించి మాట్లాడకు | 30 | ‘68 |
| ఎవరిదారి వారిది | 32 | ‘67 |
| అంతంకాని నాటకం | 36 | ‘68 |
| ఆరని తెలివి నీటిలో మునిగాక | 39 | ‘68 |
| విత్ రిగ్రెట్స్ | 41 | ‘68 |
| మిగిలిన కోరిక | 43 | ‘68 |
| కాలంలో కరగిపోతూ | 45 | ‘67 |
| సైవెన్ స్టార్స్ | 48 | ‘68 |
| అందుకే అతడు | 49 | ‘69 |
| క్షమించాలి పాత్రను విస్మరించలేను | 50 | ‘68 |
| వెలుగు చూపులో | 54 | ‘68 |
| నేనూ నీ రూపమే | 56 | ‘68 |
| నేనెరుగని ఆత్మబంధువు | 58 | ‘69 |
| మనశ్చిత్రం | 61 | ‘69 |
| నగరంలో ఉదయం | 64 | ‘66 |
| నీవు నాలో బ్రతికి ఉన్నట్లే | 68 | ‘68 |
| నిజం చెప్పు | 70 | ‘69 |

| | | |
|---|---|---|
| అగ్ని గానం | 72 | ’69 |
| రావద్దు ఆ సమయం | 75 | ‘69 |
| అమృతవర్షం | 76 | ‘67 |

మేల్కొన్న ఆకాశం –


| | పుట | రచనా కాలం |
|---|---|---|
| కాంతి సింహం | 81 | 1957 |
| మూసుకున్న ఐదువ్రేళ్ళు | 83 | ‘60 |
| నెక టై | 86 | ‘58 |
| గాజు గది | 87 | ‘60 |
| సంధి పత్రం | 88 | ‘57 |
| పతాక వార్త | 90 | ’59 |
| నేను | 91 | ‘56 |
| గాలులు | 92 | ‘57 |
| కాంతి గీతం | 94 | ‘58 |
| శైశవం | 96 | ‘62 |
| నిప్పు పూలు | 98 | ‘55 |
| స్నేహ వీచి | 99 | ’55 |
| కీర్తి స్తంభాలు | 100 | ‘55 |
| లౌకిక శ్రీ | 101 | ‘62 |
| ఈ మాట ఈ చేత | 103 | ‘61 |
| ఎవరు మీరు | 105 | ‘56 |
| ఇరవై ఒకటో శతాబ్దంలో చంద్రుడు | 106 | ‘58 |
| దేవునితో టెలివిజన్ గోష్ఠి | 109 | ‘57 |
| కదలండి శతఘ్నులవలె | 113 | ‘62 |
| శ్వేతేతర విహంగాలు | 115 | ‘55 |

# యుగసంకేతం

నిరాశలో మేల్కొంటాను
ఆశతో జయిస్తాను
నే నీ యుగసంకేతాన్ని.

పగలు చెమటలో తడిసి
రాత్రి అలసట క్రమ్మిన
ఈ ప్రపంచ కక్ష్య రేఖను.

దీపమె వెలుగుతాను గుండెలో
తోరణమె వ్రేలుతాను తలపై
అణువణువున నర్తించే శక్తిని.

బొగ్గును రగుల్పుతాను
మట్టిలో ప్రాణం తెస్తాను
నేను జీవన సంగీతాన్ని.

నాకు దుఃఖం లేదు
నేను పుట్టినందుకు
తీరికా ఓపికా ఉంది
విషాద శ్రుతి వినడానికి.

నాకు తృప్తి ఉంది
నేను చేస పనిలో
ఆరని అగ్ని ఉంది
దీపం వెలిగించడానికి.

ఈ నాటి అశాంతి ఆక్రందంలో

రేపటి అభ్యుదయం కోసం
అగ్నియె మేల్కొంటాను
వర్షమె బ్రతుకుతాను

చంద్రునిపై సోదర మానవుడు
ఆర్మ్ స్ట్రాంగ్ అడుగు మాపిన క్షణం
గంతువేసిన యుగ ప్రభాతాన్ని
ఒకే ఒక మహా హృదయమై
స్పందించిన సర్వ ప్రపంచం
బింబించే టి.వి. యంత్రాన్ని.

నిరాశను ఎరువుచేసి
విశ్వాసం పండిస్తాను.
నేనీ యుగ సంగీతాన్ని.

నిరాశలో మేల్కొంటాను
ఆశతో జయిస్తాను
నేనీ యుగ సంకేతాన్ని.

# నేను మేల్కొని ఉంటాను

బ్రతుకులో మార్పుల ఊర్పులతో
పయనిస్తూ గాలుల కదలికలో,
పగలు మరపు మగతలో
రాత్రి ఆరని తెలివితో ఉంటాను.

నాపై పగటి ముద్రలు
పూర్తిగా వదలవు, రాత్రి.
నాపై రాత్రి ముద్రలు
పూర్తిగా వదలవు, పగలు.

అందుకే అందరిలా సూటిగా కాకపోయినా

మీతో మాట్లాడగలుగుతున్నాను.

గొంగళి పురుగునుండి
సీతాకోకచిలుకవలె
రాత్రినుండి అవతరించిన ఉదయం,
బలంగా గాలితెర వేస్త
ఎక్కడికక్కడ తునాతునకలై పోతుందా
అన్నంత సుకుమారంగా ఉన్న ప్రపంచం,
ప్రొద్దు ఎక్కినకొద్దీ
వేడిమి హెచ్చినకొద్దీ ప్రశంసలు పొంది
మొండిఘట మనిపించుకొంటుంది.

ఉదయం కావడంతోనే అంతటా
సన్నని కన్నీటి తెరవలె
కన్పిస్తుంది నాకు మంచుపొర.

అంతగా మండే సూర్యుని క్రింద
చెమటోడ్చుతూ పరుగెత్తుతూంటే,
అంతగా విసరే చలి, వానలో
శరీరం ముడుచుకొని
పని చేస్తూంటే ఎందరెందరో –
నీవు చూస్తున్నావుగా
నేనింకా నిదుర పోతూ ఉన్నాను.

ఈ నిదుర మృత్యువుకన్న
కొంత తేలికైంది, అంతే.
ఈ ప్రపంచం మృత్యువుకన్న
చాల బరువైంది ఇంతే.

పగలంతా ప్రపంచం ఎందుకో
సముద్రంలో పడబోతున్నట్లు ఉంటుంది.
పగలంతా ప్రపంచం ఎందుకో
అగ్నిలో ఆహుతి కానున్నట్లు ఉంటుంది.

ప్రతిమూల ప్రతిధ్వని తప్ప
ఎక్కడోకాని అసలు ధ్వని వినిపించదు.

ప్రతిచోట ప్రతిరూపం తప్ప
ఎక్కడోకాని అసలు రూపం కనిపించదు.

కాలు పెడితే కంఠదఘ్నంగా
కూరుకపోయే ఇసుక దిబ్బలు.

శూన్యంలోకి దృక్కులు ప్రసరిస్తూ
కూర్చున్న పెద్ద మనుషుల
లాంతరు ముఖాలు, దూర దూరంగా
ఇప్పుడివి ఎవరికి కావాలి?

మన భుజాల పైనుండి
శవాలు నిక్కి చూస్తుంటాయి
మన పాదాల వెనకాలే
నీడలు నక్కి వస్తుంటాయి.

పిచ్చి ఊహలకు రూపాలు చిత్రించి
వట్టి మాటలకు అర్థాలు తీసి
గ్రుడ్డి చూపులకు అందాలు కల్పించి
చెవిటి దొప్పలకు సంగీతం సృజించి
ఎంతకాలం ఇలాగా
ఎక్కడినుండి ఎక్కడికి పోతున్నామో
ఎందుకో ఎవరికీ తెలియదు.

అవును
మన గమనం నాకు తెలియకపోదు.
ఊళ్ళూ, పట్టణాలూ, మైదానాలూ
పొలాలు, ఎడారులు, సముద్రాలు దాటి
ఇంకా గగనంలో చంద్రుని పైకి
ఆపై, ఆపైన--

మన గమనానికి హద్దులు లేవు

మన ప్రతిభకు పరిధులు లేనట్లే.

మన ప్రవర్తనకు తీరూ తెన్నూ లేదు
మన మనస్సుకు రూపం లేనట్లే.

ఈ పగటి బ్రతుక్కి
వ్రేళ్ళు దన్నుకొని అలవాట్లు
ఎంత లోతుగానో
పాతుకపోయి ఉన్నాయి.

రాత్రి అంతా ప్రపంచం
శాంతిని వరించనున్నట్లు అనిపిస్తుంది.
రాత్రి అంతా ఎవరో
దేనికోసమా అన్వేషిస్తున్నట్లు ఉంటుంది.

మానవుడు ప్రసరించవలసిందీ
అతడు గమనం సాగించవలసిందీ
స్థూల ప్రకృతినుండి సూక్ష్మస్వభావం వరకు
వైయక్తిక వలయంనుండి విశ్వాత్మలోకి.

నేను తప్పకుండా మేల్కొని ఉంటాను
పగటి మగత పోయితీరుతుంది.

ఈ భూమి పూలతో పండ్లతో పంటలతో
కంటికి నిండుగా ఉండాలనే అందరి ఆశ.

ప్రతి మనిషీ ముఖ్యంగా తనలో తాను
మేల్కొనవలసిన అవసరమూ ఎంతో ఉంది.

చావు నేలలో భయంవలె
శత్రుముఖంలో దాపరికంవలె
ఆవరించిన నిరాశ జయింపబడుతుంది,
ఆశ అగ్నివలె ఉద్వేజితమై.

రాత్రి వెనుక కాంతి స్వప్నంవలె

మానవుని కన్నీటి తెరల వెనుక
అణగిఉన్న ఊహలు, వాంఛలు,

భవిష్యత్తులో మొగ్గ తొడిగి
వికసించి ఫలరూపం ధరిస్తాయి.

ఒక తరంపోయి మరో తరం వస్తూంది.
అసహజమైన పగటి భయం పోయి
మనస్సు ఆనందరూప మందుకుంటుంది.

పగటికలల కవకాశమీయని
నవోదయం వెల్లివిరిసిన మనోరూపులు,
వసంతం చిగిర్చిన కాలసీమలు,
నా ఆశారూపానికి జీవకళలు.

వీరి కన్నులలో రెక్కలు విప్పి
ముఖంలో పరచుకొనిఉన్న కాలం
అమృతం వర్షింప జేస్తుంది.
నేను తప్పకుండా మేల్కొనే ఉంటాను.

# హృదయంతో మాట్లాడే చెట్లు

చెట్లు సందేహిస్తున్నవి
మా ఇంట్లోకి రావడానికి.
కిటికీ ప్రక్కగా వ్రాలి
తొంగి తొంగి చూస్తున్నవి.
''నేను ఒక చెట్టునైతే?''
''చెట్టునే మనిషిగా మారేస్తే?''
అవును–చిత్రమైన ఊహ,
ఒక సమయంలో సహజం.

ఎంత కాలంనుండో
రాళ్ళు, చెట్లు జంతుకోటితో

భూమిపై ఒక భాగస్వామిగా
ఆకాశం క్రింద ఒకే కుటుంబంగా
పరిణామం చెందుతూన్న నేను
వీటికంటే విడిగా
మడి గట్టుకొని ఒంటరిగా
బుద్ధి కలిగి ఉన్నందుకు
నిర్మించుకొని గోడలు వరుసగా
ప్రతిష్ఠించుకొని ఊహలు అందులో
ఇంతవరకు ఎంతదూరం వెళ్ళాను,
పరమపద సోపాన వ్యూహంలో.

పైకి పైకి ఎదుగుతూ
దూర దూరం విస్తరించి కొమ్మలు
తమకు తెలీకుండా
మన మనుగడకు గొడుగులవలె
మన బ్రతుకుల కంకితమైనవి.

నేను బయటికి రాగానే
తలలు వంచి చేతులు చాచి
ఆహ్వానిస్తూ కన్పిస్తవి ఆప్యాయంగా
దేని బ్రతుకు అది బ్రతుకుతూ.

మెలకువలో స్వప్నంవెంట
పరుగెత్తే మనం,
మన కాళ్ళు
భూమిపై నడచి పోతాయి.
నిదురలో మెలకువతో
బ్రతికే చెట్లు,
వీటి వ్రేళ్ళు
భూమిలో పాతుకొని ఉన్నాయి.

నేను వెళ్ళుతాను

మెలకువ రహస్యం

తెలుసు కునేందుకు
హృదయంతో మాట్లాడే
కదలలేని ఈ చెట్ల వద్దకు
నేనే వెళ్ళుతాను.

# ఎవరది దూరంగా

ఎవరది దూరంగా
చెదరిన కేశరాజితో
బొప్పికట్టిన ఫాలంతో
విసరే వాయుఛురికలకు
కందిన కపోలపాళితో
దెబ్బతిన్న భుజాలపై
మాయని గాయాలతో
అడుగులో అడుగు వేస్తూ సాగే
గ్రహణం విడువని చంద్రబింబం
ఎవరది దూరంగా

ఆడినమాట తప్పక మెప్పుకై
అవసరమైతే సముద్రంలో దూకి
చావడానికైనా వెనుదీయక
వచ్చే వరదల్లో కొట్టుకొని
పోవడానికీ సిద్ధంగా ఉన్న
శాంత సహన భావరూపం
తాకితే కాల్చని మణిదీపం

ఎవరది దూరంగా.

ఆకలి దారిద్ర్యపు టెండలలో
కాలుసాగని ఇసుక దిబ్బలపై
గమనం సాగిస్తున్న సాహసమతి.

నిన్న వేసిన తప్పటడుగు పరిణామం,
ఇవాళకైనా తెలిసి రావడం లేదు.

గడచిన ఏ ఒక స్థితినీ
తిరిగి ఎవడూ కుర్చలేడు
ఆఖరికి ఆ భగవంతుడైనా.
కాలం ఎవరి చెప్పుచేతలలోనూ ఉండదు.
కాలం ఎవరినీ ఎన్నడూ లక్ష్యపెట్టదు.

భోజనంవేళ టేబిల్ పైనుండి
క్రిందపడి ముక్కలు ముక్కలైన
గాజుపాత్రపై ఆశ వదలి
క్రొత్తదానికై ప్రయత్నించు.
లేనిపోని మమకారం పెంచుకొని
పగిలిన గాజుముక్కల నేరి కూర్చుతూ
తల వాల్చి, ఆవేదన పడేకన్నా
అలౌకిక మేముంది? జీవితంలో.

ఇంతకు ఎవరది?
జ్ఞాపకం రావడం లేదు.
చితికిన సౌందర్య దీపం,
తెలివివచ్చి ఊడిన స్వప్నం.
గంధం ఇగిరి, వెలుగు తరిగి
వర్ణం మాసిన ఊహావలయం.

ఎక్కడ చూచానో పూర్వం?
గుర్తుకు రావడంలేదు.

ఋుతువులు వచ్చి పోతూనే ఉన్నవి.
దొడ్లలో, బయళ్ళలో, గడ్డిపోచలు !

అక్కడక్కడా ఉద్గమిస్తూన్నవి పూలు.
తెల్లవారి పోతూన్నవి బ్రతుకులు.

కాలం కదలుతూంది నదివలె.
క్రమిస్తున్నవి లిప్తలు తరగలవలె,
వయస్సు పైబడి వస్తూనే ఉంది.
ఆయువు తరగి పోతూనే ఉంది.

ఆకులపై చిగుళ్ళపై పూలపై పండ్లపై
ఉదయం ముత్యాల్లా మంచునీటిబొట్లు,
సూర్యుడు పైకి ఎక్కి రావడంతో
అంతలో ఇగిరి పోతూన్నవి ఎక్కడివక్కడే.
అక్కడికక్కడే కన్పిస్తూ ఆర్ద్రత బ్రతుకులో
ఎక్కడికక్కడే మాయమౌతూంది అంతలో

ఎండలో చలిలో వానలో
నిశ్శబ్దంగా నిలచిన రోదసి,
ఆత్మనేత్రంవలె తెరచుకొని
దాగిన రహస్యానికి సాక్షిగా ఉంది.

ఔజ్వల్యం సౌభాగ్యం సంస్కారం
పూర్వ చరిత్రలో ఆకాశమంత ఎత్తుగా
భవిష్యత్తు యాజనలో స్వప్నమంత సొగసుగా
వర్తమానంలో వాస్తవంగా పీడకలగా,
బరువు రెప్పలక్రింద
అణగిన వెలుగులతో,
వెలుగు చూపుల క్రింద
దాగిన చీకట్లతో,
మెడపై వ్రేలాడు ముఖాలతో
మండు టెండల మనస్సులతో
చీకటి క్రమ్మిన కన్నులతో

మొగిలు మెరపు చూపులతో
చెవులు దిబ్బళ్ళు వేయు గోడులతో

స్త్రీలు, పురుషులు, పిల్లలు,
ఈ దీపమూర్తి నాశ్రయించిన
ఎందరో దౌర్భాగ్య మహాభాగ్యులు.

శరీరంలో జీవం ఉంది, మృత్యువూ ఉంది.
మనస్సులో దైవత్వమూ, దానవత్వమూ ఉంది.
మానవునిలో దానవత తలయెత్తినపుడు
ఎవడికి వాడే, ఏ దేశమైతేనేం?
వేరువేరు పోతలతో అజ్ఞానరూపాలు.

మానవునిలో మానవత చివురెత్తినపుడు
ఎవడైతేనేం? ఏ దేశమైతేనేం?
అంతా ఒకే ఆకృతిలో చైతన్యశిఖలు.

# అంతమవని కథ

భూమి తిరుగుతున్నది.
భూమి పై తిరిగే మనకు
దివానిశా రూపాలలో
రవి చంద్రుల చలన భ్రాంతి.

ప్రపంచం ఆకర్షిస్తున్నది.
ప్రపంచంలో బ్రతికే మనపై
త్రివర్గ రూపాలలో
త్రికరణాధికార ముద్రలు.

మనో నేత్రం విప్పి చూడు, ఒక్కసారి

శాఖోపశాఖలుగా సంకీర్ణంగా
విస్తరించిన మహావృక్షం, ఈ ప్రపంచం.

పైన ఎక్కడో పాతుకపోయి
అదృశ్యంగా ఉన్నవి దీని వ్రేళ్ళు
క్రిందుగా ఆకర్షణీయంగా
కిసలయ పత్ర పుష్ప ఫల సంతతి.

మొగిళ్ళు చుక్కలు మెరపులు
మరపింపజేస ప్రేయారూపాలు.

ఆకుల కదలికలో సంగీతం.
రంగుల కూర్పులో చిత్రకళ.

అవిరళ మాధుర్య సౌందర్యంతో
ఆత్మను రసపదవీనదవీయసంగా
భ్రమింపజేసి, పరిభ్రమింపజేయు
వివర్త కళారూపం.

ప్రక్కనే ఇంకా పరిశీలింపదగినవి
ముండ్లు పురుగులు త్రుట్టెలు కోకొల్లలు.

ప్రాణం, మృత్యువు రెండూ
వికాస వినాశ దశలలో
ఒకేచోట కలసిఉన్న రూపం.

ఆకాశంలోకి చొచ్చిన శిరస్సునుండి
క్రిందికి జారిన చీకటి జడలు
ఊగిపోవగా గాలికి దిశలలో,
తరగలుదరిపడు కడలివలె
నిలచిఉంది సనాతన వృక్షం.

ఈ చెట్టు కొమ్మలపై ఏండ్లుగా
గూళ్ళు కట్టుకొని నివసిస్తున్నవి పక్షులు.
దప్పికగొని పిడుచకట్టిన నాల్కలతో
తపిస్తూ నిలచి ఉన్నవీ,

చలికి ముడుచుకొన్న శరీరాలతో

వణుకుతూ ఒదిగి ఉన్నవీ,
వానజల్లుకు తడిసి ముద్దఐ
వెచ్చదనంకోసం వగర్చేవీ,
వసంతం వచ్చేవరకు
ఆశతో బ్రతికి ఆనందించేవీ,
కలలు ప్రోది చేసుకుంటూ
బయళ్ళపై రోదసిలో దృష్టి బరేపవీ,
బహువిధ స్థితులకు ప్రతీకలుగా.

ప్రకృతిలోని అవరోధాలను నిరోధిస్తూ
ఘర్షిస్తూ లంఘిస్తూ లొంగుతూ జయిస్తూ
జీవనయాత్ర సాగిస్తూంది ప్రాణికోటి.

అనుభూతి సమార్ద్రమై హృదయం
అనుభవ పరిపక్వమె మనస్సు,
అవతరించే ఉదయారుణ రూపంతో
మంచు క్రమ్మిన తూరుపు దిశవలె
బహుదృశ్య పరంపరలు వహించి,
ఏ అనుకుల స్థితికైనా
చెట్టునీడ ప్రతిఫలించిన కాసారంవలె
తుఫానురాత్రి నెదుర్కొనే మహానదివలె
ఎప్పుడూ సర్వసన్నద్ధమే.

అడవులు పర్వతాలు నదులు ఎదురై
మానవుడు వెనుకాడి నిలచి పోయాడా?
యుద్ధాలు క్షామాలు దుఃఖాలు వచ్చినా
అతని జీవిత పారంపరి ఆగిపోయేనా?

ఈ చెట్టునీడ క్రింద
బ్రతుకు తెల్లవార్చే ఓ మనిషీ,

ఒక్కసారి అద్దంలో చూచుకో
నీ ముఖం !

ఎన్ని మంచు పొరలు !
ఎన్నీ చీకటి తెరలు !
వాటి వెనుకనే
ఎందరెందరు దేవతలు ! రాక్షసులు !
వాటి చాటునే
ఎన్నెన్ని జంతువులు ! మృగాలు !
ఈ కళ్ళు చెవులు మనస్సు మొదలుగా
వారి సేవకులు, వీటి అనుచరులేగా.

మనస్సు నావరించిన ముసుగుతోనే
మనిషి వ్యక్తిత్వ రూపం ఉంటుంది.
ఎన్ని సాహసకృత్యాలు చేయించి
ఎన్ని నాగరక రీతులు నిర్మించింది?

ఈ ముసుగు లేకపోతే
మానవు డే స్థితిలో ఉండేవాడో!
శిలగానా? కలగానా?
చీకటి ముద్దగానా? వెలుగు గీతగానా?

నీలదుకులం కప్పుకొని వస్తుంది రాత్రి.
నీలాకాశం వంగిపోయి
విశాల పృథ్వీఫాలం చుంబిస్తుంది.
చెట్టుక్రింద చీకటిలో
కనురెప్పలు వ్రాలి
మనస్సు విశ్రాంతి నభిలషిస్తుంది.
అపుడు నిదుర, స్వప్నం--

కనురెప్పలు విచ్చి
చెట్టుక్రింద వెలుగులో
మనస్సు వ్యాపార నిమగ్నమౌతుంది.
అపుడు మెలకువ, లౌకికం.

బంగరు పూవుల తెల్లని పట్టుశాలువ
కప్పుకొని వస్తుంది ఉషస్సు.

దిక్కుల కన్నులు చెమ్మగిల్లి
మధుపరాగ కింజల్కాలౌతవి చూపులు.

అనంత పృథివీ హృదయం
జీవకోటిని గుండెకు హత్తుకొంటుంది.
అఖండ గగన హృదయం
ఆనంద తరంగాలోలమె పరవశిస్తుంది.

ఒక్కొక్క లిప్త ఒక్కొక్క దీపంవలె
వెలిగి కాలం దీపతోరణమవుతుంది.
ఒక్కొక్క లిప్త ఒక్కొక్క పుష్పంవలె
వికసించి కాలం పుష్పదామమవుతుంది.

ఎప్పటికపుడు క్రొత్తగా
చెట్టుకొమ్మలను మేల్కొల్పుతాయి.
ఎప్పటికపుడు రాలిన ఆకుల స్థానంలో
క్రొత్తవి తలయెత్తి మెదలుతాయి.

బయట మంచుపొర తొలగి పోతూంటే
లోపల మసకతెర తరలి వస్తూనే ఉంది.
రవి శుభ వీక్షణాలు ప్రసరిస్తూనే ఉన్నవి
భువి స్వర్ణపథాలందరికీ లభించడం లేదు.

ఊహకు చేతకు
ఆశకు, ఆశయానికీ
సంబంధం చేకురీ చేకురకా
బ్రతుకు భోగభూమిగా శిల్పఖండంగా,
మారడంలోనే లేదు.
నిజస్వరూపావగతి, ఓ మనిషీ !

నాగరక సంపన్నంగా సాగిన
ఈ వృక్షాన్ని వదలగలవా?

నిదురపొరవలె ఆవరించిన
ఈ నీడను మరువగలవా?

సంస్కృతి, జీవన రూపానికి చిత్రకళ.
పరిణామం, సృష్టి అర్థానికి వ్యాఖ్యారూపం—
పగలు, రాత్రి అన్న భిన్నముఖాలు
ప్రకృతి పొందే పరిణామరూపాలు.
నిదుర మెలకువ అన్న స్థితులు
మనస్సుపొందే పరివర్తన దశలు.

దూసికొని సాగిపోయే గాలితరగలు
మలపులు మలగి, తాకే వెలుగు రేఖలు.
పగిలిన గాజువస్తువుల ముక్కలు.
కదలే మట్టిబొమ్మల నడవడికలు.

ఒక టేమిటి? ఈ ఆవరణంలో
ఎన్ని ధ్వనులు ! ఎన్ని ప్రతిధ్వనులు !
ఎన్ని రూపాలు ! ఎన్ని ప్రతిరూపాలు !
ఇవి అంకితమైన బ్రతుకులో
అహిపలె చుట్టలు చుట్టుకొని
పరున్న అహంకారం అట్టడుగున
పడిఉన్న ఆత్మ –
స్వస్వరూపం ఎరుగగలదా?

సంకల్ప వికల్ప శక్తిగల మనిషీ !
నిశ్చయ వివేచన జ్ఞానంగల మనిషీ!
అప్పటివరకీ చెట్టునీడ తప్పదు.
అప్పటివరకీ స్వప్నచిత్రం అవదు.

# రెక్కలు దాల్చిన కొండలు

వాయువు కదలిక లేక
మేఘాలెక్కడివక్కడ
స్తంభించి పోతున్నాయి.

ఈ ఖండం నిష్ఫల భూమిగా
మారే ప్రమాదం
ఎంతోదూరం లేనట్లుంది.

అక్కడక్కడా నిలవఉన్న నీరు
ఇంకిపోయి ఆవిరి ఐపోగా,
ఇంతకాలమూ ఉపయుక్తమౌతూ
అడుగుబట్టుతూం దిప్పుడు.

కృత్రిమమైన రెక్కలతో అమాంతం
కొండలెక్కడినుండి ఎక్కడికో ఎగిరి పోతూన్నవి.
కళ్ళపై నమ్మకం చావని కొందరు
కళ్ళప్పగించి తప్పుక పోచూస్తున్నారు.

సంతోషంతో వాటి వెంటబడి కొందరు
ఒళ్ళు మరచి అరవులతో గంతులు వేస్తున్నారు.
ఆశ్చర్యంతో నిశ్చేష్టులై కోలుకొని కొందరు
ఏమీ ఎరుగనట్లు మరోవైపు ముఖం పెట్టి నడుస్తున్నారు.

కిచ కిచలతో రుస రుసలతో
ఆగడాలకు ఆకతాయి పనులకు
దిగుతున్నాయి కోతులు.
వీటిని దండించడానికి
భయపడుతున్నారు పాలకులు.

ఇవి ఆంజనేయుని బంధువులని కాదు సుమా !
డార్విన్ సిద్ధాంతాన్ని అనుసరించి
తమ పూర్వీకులేమా అనీ ఊహించవచ్చు.
కాని అంతకన్నా బలమైన కారణం ఉంది.
మీకు తెలేస ఉండాలి ఈపాటి కది.
వీటి నివాసస్థానం ఆ కొండలే అని.

తృప్తిగా తిని యథేచ్ఛగా గంతులు వేస్తాయి.
అపుడపుడూ ఏదో కారణం పెట్టుకొని

మీదపడి రక్కుతాయి, భయపెడతాయి, అంతే.
ప్రాణాలు తేసటంత సాహసమూ, తెలివీ లేకపోలేదు

ఈ గలభాకు గాభరాపడి
హడావిడిగా పరుగెత్తుకవచ్చి
తమ ఉనికిని తెలియజేసే రక్షకులనుండి
ఈ పని కొంత జరుగవచ్చు.

మరచాను వీటికితోడు ఇంకా
తోడేళ్ళూ, నక్కలూ ఎన్నో ఉన్నాయి
అవి ప్రజల బ్రతుకును
చీల్చి పిప్పి చేసిగాని వదలవు.

వాటి ఊహను సరిగ్గా ఉపమేస్త ''నల్లబజారు''
వాటి ఎత్తులు పోకడలు చెప్పాలంటే
చదరంగాలు వైకుంఠపాళీలు ఆనవు.

కూర్పు విన్యాస ప్రదర్శనలలో పోటీపడుతూ
కొండల మెండు రూపాల చిత్రణలతో
వాతావరణం గురించి సూచనలూ
వర్షాలపై వ్యాసాలు పరంపరగా వెలువడుతూన్నవి.

వర్షఫలం కోసం మాటిమాటికీ బయటికి వచ్చి
ఆకాశం వైపు చూస్తున్నాడు, సామాన్యుడు
బరువు రెప్పలెత్తి, జలమాక్తికాలు విడిచి,
అడుగులు వేస్తున్నాడు లోనికి.

పెద్ద పెద్ద కుటుంబాలలోని ఇంటి పెద్దలే
కొడుకులపై నమ్మకం నశించి,
ముందుగా ఎవరి కర్మలు వారే చేసుకుంటున్నారు.
తండ్రులపై అభిమానం చచ్చిన కొడుకులు

ఎవరికైనా పైంపకం పోవడానికి సిద్ధమౌతున్నారు.

ఇదంతా ఎవరికి కావాలి
కందకులేని దురద చేమకు పట్టినట్లు
జీవంగల చెట్లకు
గమనంగల నదులకు
చైతన్యంగల మనసులకే నేమా?

చెట్లలో పచ్చదనం మాయమౌతున్నది.
నదులలో తరగలు అణగిపోతున్నవి.
ప్రస్తుతం మేఘాల స్థానంలో
ఎగురుతూన్నవి రెక్కలు దాల్చిన కొండలు.

## ఆఖరికి దేవుడైనా సరే!

చినుకు పడింది సముద్రంలో
దాని లోతు తెలుసుకునే
కోరిక కలిగింది.

జలధిలోని ఉప్పెన
సహించలేకపోయింది.
గాలి విసరుకు
నిల్వలేనిదయింది.

కోరిక గాలికి వదలి
బయటికి రావాలని
సతమతమె చివరకు
కలిసింది సముద్రంలో.

గ్రీష్మం వచ్చింది
అర్చావప్నులతో
జలబిందువు లావిరులైనవి.

మారింది కరాళ ఋతువు
వచ్చింది ప్రమీల ఋతువు.

చినుకు పడింది సముద్రంలో
దానిలోతు తెలుసుకునే
కోరిక కలిగింది.

మార్పులో నశించిన జ్ఞప్తి
తిరిగి ఊర్పు తీసికొనేనా?
మార్పు నాపగలిగేనా?
ఆఖరికి దేవుడైనా సరే !

## ఈ గీతం

స్వాగతం పలికి మీకు
ఈ వేదిక నలంకరించిన
తరుణ మనస్కులు! ఉత్సాహకళికలు!
మనో భూమికలలోని
రహస్య గవేషణమతులు !
భౌతిక జగత్తులోని
పరిణామ విచారణ చణులు!
ఈ గీతం వినిపిస్తున్నాను.

గతంలోని ఔజ్వల్యం
వర్తమాన వాస్తవికత
భవిష్యత్తు స్వప్నవలయం
చింతనలో, అనుభూతిలో
అదివసించి ఆకారం దాల్చిన

కళారూపం ఈ గీతం !
నేనెందుకు వినిపిస్తున్నాను?

అపశకునపుటూళలు, ఉద్రేకపుటరుపులు,
గుండ్రాళ్ళ దొర్లింతలు, గులకరాళ్ళ కలవరింతలు,
ముళ్ళకంపల ఈడ్పులు, నిదురలో కలవరింతలు,
సుడిగుండాల తిరుగుళ్ళు, ఆవలింతలు త్రేన్పులు

ఒక టేమిటి ? ఈలాంటివి శబ్దించే
ముఖయంత్రాలను నియంత్రించడానికి.
అవి ఇష్టంలేనివారి కొక వేదిక కల్పించి
అవి నిదురలో వినేవారిని మేల్కొల్పదలచి
ఈ గీతం వినిపిస్తున్నాను.

చైతన్య జగత్తుకు అవరోధంగా
మృత్యువు ఎప్పుడూ ఎదురై ఉంటుంది.
భీజనాశనంనుండి మొక్క
పుష్పపతనం నుండి ఫలరూపం
తమస్సునుండి ఉష ఆగమనం, సహజం.
వస్తువు ఒక రూపం పోయి,
మరొక రూపం ధరిస్తూ ఉంటుంది.
మార్పు నడిమి కాలమే మృత్యువు.

శవాలను తగులబెట్టిన శ్మశానాలు.
శవాలను పాతిపెట్టిన భూస్థలాలు
భౌతిక రూపాల గొప్పమార్పుకు స్థానాలు.

ఆనందానికి దుఃఖానికి
ప్రతీకలైన జీవనం, మృత్యువు
నిరంతర సృష్టికి ఇరుపార్శ్వాలు.

ఈ పరిణామ పరంపరారూపం

ఒక దశలో మృత్యువుగా ఎదురౌతూంది.

ఇది మార్పు రూపాలలో ఒకటిగా
ప్రచారిస్తున్నది లోకాన్ని,
ఒకవిధంగా చెబితే మృత్యువు
గతం యొక్క వర్తమాన రూపం.
అయితే వెలుగు ఊహరాని
చీకటి బొయ్యారం, కాదు గతం.

రోజూ రాత్రి గర్భంలోకి
నన్ను ప్రవేశింపజేయ చూస్తుంది, మృత్యువు.
నేను లోనికి వెళ్లి నిదురపోయి
స్వప్నచిత్రాలు తిలకించి
ఉదయం మేల్కొని బయటికి వస్తాను.

అప్పటివరకే తరుమబడి
చీకటిలోయలో దాగి ఉంటుంది.
ఇంతమాత్రానికే భయపడి,
మృత్యువు పేరు విని సామాన్యులు
సగం చచ్చిన బ్రతుకు గడుపుతారు.

ఓ మృత్యురూపమా ?
చీకటిచిమ్ము గతకాలమా!
ఒక విషయం చెప్పాలి నీతో
నా కాళ్ళు నేలలో పాతుకొని ఉన్నాయి.

నా హృదయం భూమి గుండెకు హత్తుకొని ఉంది.
ఈ భూమి ఎంతో ఆర్ద్రమైంది.
ఎప్పటికైనా ఇంత స్థానమిచ్చి
తనలో లీనం చేసుకొనేది,
ఆకాశంపై విశ్వాసమూ లేకపోలేదు.

నాకు తెలుసు బ్రతుకులో
మధ్య దారిలోనే,

తొండవలె వేచిఉండి
గ్రసింప జూస్తున్నావని.

నేను నిన్ను ఏలా తృప్తిపరచగలను?
ఇది నీ దురదృష్టం కాక మరేమిటి?
ప్రస్తుతం వినిపిస్తున్న దానికి
అడ్డురాకుండా ఉంటే అంతే చాలు !
ప్రక్కనే చేరి రాతిబండలు దొర్లించకు.
''ఇదేమంటే నా పని నేను చేసుకుంటున్నా'' నని
ఏవో కుంటి కొంటె సాకులు వినిపించకు.

ఎందరినో కష్ట పెట్టడానికి
వేసిన ఎత్తు కాదిది.
ఎవరినో సంతోష పెట్టడానికి
కనిపెట్టిన చిట్కా కాదిది.

శిశిరం వస్తుంది నీ ప్రభావంతో
తరువాత వచ్చేది వసంతం అని మరవకు.
రాత్రి వస్తుంది, నిదుర ఆవరిస్తుంది, నిజమే.
ఉదయమవుతుంది, మేల్కొనడమూ జరుగుతుంది.
ఈ చక్రనేమిక్రమణ నిరంతరగతులు
ఎవరి కనుకులంగా వారన్వయించుకోవచ్చు.

నాకు తెలుసు మృత్యువు
నా చెప్పుచేతల్లో లేదని.
నాకు తెలుసు మృత్యువు
శాశ్వతము, స్వతంత్రము కాదని.
శాశ్వతము స్వతంత్రము అనంతము ఐన
చైతన్యపుటంశనని నాకు తెలుసు.

అలా విరచుకపడుతా వెందుకు?
సముద్రంపై అగ్నివర్షంవలె.
అద్దాలవంటి నా కనుచూపులలో
నీ రూపం ప్రతిఫలిస్తూనే ఉంది.

ఆకాశంవలె విచ్చిన చెవిలో
నీ గమనం శబ్దిస్తూనే ఉంది.

రోదసివలె నిలచిన మనస్సులో
ఊహలు గాలుల వలె
అనుభవింప జేస్తూనే ఉన్నవి.

ఊడలు దిగిన మర్రి చెట్టువలె
ఏ మాత్రమూ కదలవేం ?
కలలో జడలు రేగిన పెనుభూతంవలె
అంతలో రూపుమారి పోయావేం ?

''గుడ్ మార్నింగ్'' అంటూ వచ్చి
''గుడ్ బై '' చెప్పకుండానే వెళ్ళవచ్చు.

ఒక్క గాలి తెర వేస్త
గొప్పతనం తెలియవచ్చే
సముద్రం, నా కంటికి
చిక్కని హాస్యపు నురుగుతోనున్న
మాటల తరగలతో
ప్రపంచ నాటకశాలలోని
గొప్ప హాస్యపాత్రవలె కన్పిస్తాడు.

నీ తలపుల తలుపులు మూసి
ఆటకట్టి వెళ్లిపోతూ పోతూ
నాపై చేప ప్రేమ ఏముంది ?
ఒక గులాభీ పుష్పం
నా శిరస్సుపై ఉంచుతున్నావు.
చుట్టూవున్న కంటకాలు
గ్రుచ్చుకుంటా యన్న ఊహతోనేనా ?

అడవిలో
క్రురకిరాతక చర్యకు బలియైన,
ముగ్ధ ముగ్ధంగా కాలాన్ని కత్తిరిస్తూ

ఎగిరే హరిణ శాబకం నెత్తురుతో
ఈ గీతం వ్రాస్తున్నాను.

వనంలో,
విపరీతపు గాలిచే విశీర్ణమైన,
సౌందర్య పరీమళభరితమై
కాలాన్ని మరపించే పూవుల
మధుపరాగ రేఖలతో
ఈ గీతం చిత్రిస్తున్నాను.

తల్లి కలల కానందరూపం కల్పిస్తూ
బ్రతికి బట్టకట్టి కాలాన్ని జయింప నెంచే
శిశువు హృదయ రూపంతో
ఈ గీతం స్పందింప జేస్తున్నాను.

వర్షధారలు భూమి పై విలీనమానట్లు
గాలిపిల్లలు దిశల చెరగులలో దాగినట్లు
వెలుగు కత్తులు రోదసి గుండెలో చొచ్చినట్లు
శబ్దరేఖలు గగనవీధి పరుగు తీసినట్లు,
నా మాటలు–మనస్సులో పొరలు దాటి
అంతరాత్మలో అర్థవంతాలై
మానవ జీవన వ్యూహంలో
అమృత కాంతి వర్షంతో
నవనవోన్మేష సృజనాకృతి;
ఆనందం నదింపజేస
అనుభవం స్పందింపజేస,
సహృదయ మనఃప్రీతి పరమ
నవతా గీతం
ఆవిష్క రిస్తున్నాను.

# అంతమవని రాత్రి

శవాలు లేచి తిరగడ మారంభించాయి.

ఆత్మలు ముడుచుకొని పడుక్కున్నాయి.

రాత్రి సాంతమవుతుందని శుభవార్త
శూన్య భాండంలో మధుబిందువు పడినట్లు
సముద్రంలో చూపుమేర నావ కన్పడినట్లు
హఠాత్తుగా ఊడిపడింది ఆశాకిరణం.

గాలికి రాలే ఆకులవలె
ఊహలు సాగిపోతున్నవి.
ఎవరో అమృతమూర్తికోసం నిరీక్షణ.
''ఎవరు వచ్చే సమయమిది?'' అని నిరాశ.
''ఎవరో వచ్చి ఇంత ధైర్యమిస్తారని'' తృప్తి.

ఆ వచ్చేది ఎవరు?
శవాల సోదరులు, నీడలు !

పగిలిన అద్దం ముక్కలవలె
స్వప్నాలు చెదరి పోయాయి.
ఇందులో ఏ రూపరేఖ
స్పష్టంగా కన్పించడం లేదు.

నిదురవేస్త హాయిగానే ఉంటుంది.
ప్రపంచాన్ని మరచిపోవచ్చుగా.
చావు మెలకువ రూపమైన గతానికి
చాల దగ్గరి బంధువు, మరపు.

ఉదయంకన్నా ముందుగా శవాలు లేచాయి.
నేను నవ్వి ఊరుకునేకన్న చేసదేముంది?
ఉదాసీనత నా స్వభావమన్నట్లుంది.
ఓరిమి నాకు గీటురాయివలె ఉంది.

కనులు మూసినా జీవి హృదయం స్పందిస్తూంటుంది.
అనుభూతి విడువకుండా సరిస్తూనే ఉంటుంది.

ఈ మహా జగత్తులో మానవుని రూపమెంత?
అయినా అతని ఊహాధీనంలోనిదే సర్వమూ.

విచ్చిన అసంఖ్యాక తారకలనుండి జారి
వెలుగులు శరీరాలు తాకి ప్రవహిస్తూన్నాయి.
నాటకరంగంపై యవనికవలె మృత్యువు,
దీని వెనుకనే బ్రతుకుతూంది జీవితం.

ఈ ప్రపంచం నాదై
నాది కాదన్నట్లుంది.
దీపపు వెలుగులో కొంత భాగం ఉంది.
దీపపు నీడలో కొంత భాగం ఉంది.

ఉన్న ఒక్క సత్యం – సూర్యుడు
ఆశలలోనే పాతివేయబడి
ఉన్న ఒక్క కాలం – చైతన్యం
మరపులోనే బంధించబడి
ఉన్న ఒక్క ఆనందం–ఉషస్సు
చీకటి తెర వెనుకనే ఉంది.

మానవత వధ్యశిలపై ఉన్నా
మానవ హృదయంపై నమ్మకముంది.
మానవ వివేకంపై ప్రత్యయముంది.
అందుకే ఇంకా బ్రతికి ఉన్నాను.

అంధకారంలో కన్పించనివి
వెలుగులో దర్శనమిస్తాయి.
క్రొత్త ఎక్కడ ఉంది?
వెలుగు చూపులో తప్ప !
మానవత ఎక్కడ ఉంది ?
అనుభూతి భావనలో తప్ప !

ఎవడికి వాడే మేల్కొని ఉన్నట్లు
ప్రక్కవారిని ప్రబోధిస్తున్నాడు.

మానవుడెప్పుడు మేల్కొనడం జరిగేను?

మనస్సు ఎప్పుడు ఉషస్సు నెరుగుతుంది?

ఆత్మలు ముడుచుకొని పడుక్కున్నాయి.
శవాలు లేచి తిరగడ మారంభించాయి.

# భగవంతుడు విడిది చేసిన లిప్త

ఆకాశంనుండి భూమివరకు
నిశ్శబ్దం నిలచి ఉంది స్తంభంవలె.
అమూల్యనిధి పోగొట్టుకొన్న
ముఖంవలె ఉంది వాతావరణం.

వ్రాలిన బరువు హృదయంతో
తెరచిన ఆశానేత్రాలతో
కాలం ఒడిలో పడుకొని
మృత్యురూపం బింబిస్తోంది రాత్రి

నీల సముద్ర తరంగంవలె
ఎదురౌతున్నది ప్రతిక్షణం.
రేకులు విచ్చనున్న పూలు
మాన శిఖలవలె నున్నవి.

దుఃఖం ప్రవహిస్తున్నది జీవనదివలె.
సుఖం బిగిసి ఉంది మంచుగడ్డవలె.
పెదవులపై కొడిగట్టినవి నవ్వు దివ్వెలు.
ముఖంపై క్రమ్మికొన్నది నీడకప్పు.

చేతులలో సత్తువ ఉడిగిపోతున్నది.
పెదవులుదాటి శబ్దం పైకలడం లేదు.

కనులలోని వెలుగు ఆరిపోతున్నది.
ముక్కులోని ఆవి ఆగిపోతున్నది.

సన్నని వస్త్రంవలె వ్యాపించి
గాలి శరీరాన్ని కప్పుతూంది.
ఊహాలో తిష వేసుకొని
బ్రతుకును పాలిస్తోంది రాత్రి.

జీవన సముద్రంలో ప్రయాణికులకు
దారి చూపుతూంది మృత్యు దీపం.
కొన ఊపిరితో నున్న ఈ రోజు
కనులలో ప్రాణం నిలుపుకొని ఉంది.

ఈ చీకటి దారులలో
ఈ విషాదచ్ఛాయలలో
నలుగురితోపాటు తిరిగి తిరిగి
పగిలిన గాజుబొమ్మల ముక్కలు
రంగు రంగుల అందమైన రాళ్ళు
ఏరుకొని ఒడి నింపుకొని,
చుక్కలు విరిసిన చీకటిచెట్టుక్రింద
అలసి సొలసి ఇంత సేపు విశ్రమించిన
నా ఫాల నేత్ర కపోలాధరాలు
వెలుగు వ్రేళ్ళు సాచి స్పృశిస్తూ
పరవశింపజేసె అమృతమూర్తి !
ఎవరీ మానదీపం ?

రాత్రి ఎదపై జ్యోత్స్నాకృతి.
మనో భూమికలో జ్యోతిర్మతి.

జడ ప్రకృతి అణువణువు పులకరిస్తున్నది.
చైతన్యం శివగంగవలె చెంగలిస్తున్నది.
గ్రీష్మకాల మృగతృష్ణ లంతరించి
వర్షచ్ఛాయ లలముకుంటున్నవి.

ఉదాసీనత క్రమ్మిన

సాయం సంధ్యాకాశం నుండి

దిగివచ్చి నిటారుగా
నా ఎదుట నిలచిన రాత్రి
నిశ్శబ్దంగా కరగి పోతున్నది.

ఇది కలకాదు కదా !
ఎవరి మాటో అలా ఉంచి
నేనే నా రూపం గుర్తించ లేనట్లున్నది.

అమృత సరస్సులవంటి ఆ కన్నులలో
మరణ సూచికలవంటి నా చూపులు
ప్రసరించి కలసి పోయినపుడు
ప్రళయం వచ్చి పడిందనుకున్నా.
కాని సుగమ సుందరంగా
అవతరించింది మరో సృష్టి.
ఇంతకు ఎవరీ మానదీపం ?
భగవంతుడు విడిది చేసిన లిప్త ఇది.

# కాలం గురించి మాట్లాడకు

కాలం గురించి మాట్లాడకు
దానిచావు దాన్ని చావనీ.

తలేస్తే చాలు
తలుపులు తెరచుకొని వచ్చేస్తుంది.
పిలేస్తే చాలు
పీట వేసికొని కూర్చుంటుంది.

కాలం గురించి యాచించకు

దాని దారిన దాన్ని పోనీ.

కాలం మాన శంఖం
దీన్ని ఊదినపుడు
అవతరించిన ధ్వని
ఈ మాట, ఈ పాట.

మాట ఊహకు ప్రతీక
పాట అనుభూతి మరీచిక.
మాట ఉందే చివురాకు
మాట ఉందే పదునైన కత్తి.
ఇంకా ఎంతైనా చెప్పొచ్చు
మాటను గురించి మాటల్లో.

మాట చెప్పలేనిదాన్ని
ఒక విధంగా నిశ్శబ్దం
సమగ్రంగా చెబుతుంది.
అయితే నిశ్శబ్దం కరువైంది.

జ్ఞానానికి దూరంగా
విజ్ఞానానికి దగ్గరగా,
తన చుట్టూతాను తిరుగుతూన్న
లౌకిక జీవిత వలయం.

ప్రవర్తనలో పరిణామ రీతితో
గడేప మనిషి,
ఊహలలో వివర్తవాదంతో
బ్రతికే మనిషి,
కాలానికంతం వూహించ లేనట్లే
జీవితానికీ స్థిరరూపం కన్పించదు.
అనుభవాలు కరగిపోతున్నవి
అనుభూతులు వెలిగి పోతున్నవి.

అర్థరహితంగా

పరచుకొన్న ఆకాశంలో

అర్థ సహితంగా
వెలుగుతున్నాడు చంద్రుడు.

కాలం గురించి మాట మరచి
ఈ వేళ నిశ్శబ్దంగా,
చీకటితో పోరాడే
వెన్నెలగురించి ఆలోచిద్దాం.
కాలం గురించి మాట్లాడకు
దాని చావు దాన్ని చావనీ.

# ఎవరి దారి వారిది

సాయంవేళ సాగించా నడక
వివిధ వాహన జన సంకుల వీధులు గడచి
మేడలు మిద్దెలు గుడిసెలు దాటి
వూరి పొలిమేరలో నిలచి చూచా, వెనుకకు.
మబ్బుక్రమ్మి మారిన నలుపు వెలుగులో
ముసుగుదన్ని మత్తుగా పడుకున్నట్లుంది
నా చూపుకి ఊరు.
మరలి ముందుకు నడచా.
నా వెంటా, చూపుమేరలోనూ
ఎవరూ మచ్చుకైనా లేరు.
ఎక్కడా మాటా ముచ్చటా లేదు.
అయినా నాలో ఎందరో
మనుషులు మసలుతున్నారు
అయినా నాలో ఎందరివో

మాటలు వినిపిస్తున్నాయి.

ఇంకా ముందుకు వెళ్ళాను

అంతా బట్టబయలు, మైదానం
అక్కడక్కడా కొండలు, చెట్లు, చెరువులు.

ఇంతలో విరచుక పడింది గాలి
హళాహళిగా, తూగిపడింది మబ్బు
పైళపైళగా, వచ్చిపడింది వాన
జర జరగా, ద్యావా పృథివీ ప్రియంగా.

విశ్వసౌధంలోని క్రింది అంతస్తులో
అల్లరి పిల్లలు చిందులు త్రొక్కుతూ
కసరి విసరి వస్తుసముదాయం
నేలకు కొడుతూ, గంతులు వేస్తూ,
నవ్వుతూ ప్రేలుతూన్నట్లుంది.

పై అంతస్తు ఆకాశంలోని మబ్బులు
తమతో రమ్మనే మెరపుసైగ కన్పిస్తూంది.
అక్కడికి పోకుండా ఇక్కడే ఉండిపోయా.
ఆకాశంపై నిర్లక్ష్యంతోగాక
భూమితో త్రెంచరాని బంధంతో.

వర్షం సన్నబడింది.
అగ్గి ఆరిపోవడం అంతమై
చలి ప్రాకడం మొదలైంది.
అంతటా పరిణామం,
మరోస్థితికి పరివర్తితమౌతూంది ప్రకృతి.

ఒక్క గాలి విసరుకు
చెట్ల ఆకులు డుల్లినాయి.
ఒక్క మబ్బు విదల్పుకు
చెట్ల కోర్కెలు చిగిర్చాయి.

రాతిబొమ్మనై ఉన్నవాడిని

మనిషి రూపంలోకి వచ్చి

అడ్డుపడిన కొండలు నదులు దాటి
మునుముందుకు సాగిపోయా.

చూస్తూ చూస్తూ ఉండగనే
చుట్టూ చుట్టలు చుట్టుకొని
అహివలె పడిఉన్న చీకటి
తోకపై లేచి నిలచింది.

నా కాలినడక చప్పుడుకు
నిదురపోతున్న ఊళ్ళుకనే,
నడచి వస్తూన్న మేఘపంక్తుల
కలలు చెదరి పోతూన్నవి.

రేకులు వీడి నిలచిన
పద్మకర్ణికవలె ఉంది ఆకాశం.
అలలు అణగి మణగిన
సముద్రంవలె ఉంది మనస్సు.

ఇంతలో వెలుగులు కురుస్తూ
ఉదయ మేఘం పొడసూపింది,
ఆశావేదిక, రోదసీ సీమలో.
కొన్ని వికసన్ముఖపద్మాలు
కొన్ని విచలత్ జీవరేఖలు
ప్రయాణంలో తారసిల్లాయి.

ఈ ప్రదేశంనుండి
మూడు నాలుగు దారులు చీలిపోతాయి.
క్షమించాలి
ఈ దారులన్నిటా అంతమందీ
ఒకేమారు ఏలా పయనించగలరు ?
అందరూ ఒకేదారి ఎన్నుకోనూ లేదు.

నామార్గం నాది

ఎవరి మార్గం వారిది.

కొంతదూరం నడిచాక
కన్పించాయి పూర్వం వలెనే
ఏవో గుడిసెలు, మిద్దెలు, మేడలు.
మొదటనే దూరంగా కన్పించింది
మబ్బు తీవెలు నింగిలోకి ప్రాకిస్తూ
నిటారుగా నిలచిన ఫ్యాక్టరీ గొట్టాలు.

తరువాత ఇంటిముందు
పందిరిపైకి ప్రాకి మొగ్గ తొడిగి
తులకరించు పూల తీగెలు.
కిటికీలనుండి కన్పించినవి
తిరుగుతూన్న రంగు వెలుగు బొమ్మలు.
ఈ ఊరు ఎప్పుడో చూచినట్లుంది.
అవును, ఈ జన్మలోనే.

ఇది భూమి గుండ్రంగా ఉందని
బూజువుపరచే ప్రయత్నం కాదు.

అంతస్తత్వంలోని వైవిధ్యం సామరస్యం
మానవ ప్రగతికి పరమం,
అనుభూతి పొందే శక్తి ప్రసారం వేరు.
మనస్తత్వం కలిగే రూపం, గమనం వేరు.

ఈ పురిలోకి ప్రవేశించి
ఇచ్చట వీచే గాలి పీల్చి
ఇచ్చట దొరికే నీరు త్రావి
అనుభవ వైవిధ్యంతో
అనుభూతి ప్రమాణంతో
బహుముఖ వ్యక్తిత్వంతో
ఇచ్చట కదలే వ్యక్తిలో

పరిణామం జీవసహజం.

# అంతంకాని నాటకం

ప్రొద్దు పొడిచాకా
మలపడం మరచిన వీధి దీపాలు
చంద్రుని ఫోర్జరీ సంతకంలోని
అక్షరాలవలె వెలుగుతూన్నవి.

సౌందర్యకళాముగ్ధంగా
ఆలోచనా కిర్మీర లలితంగా
పొందికగా అమర్చి ఉంది గది.
నింగిలో ఉదయం చుక్కలవలె
ప్రక్క పై నలగి వాడిన పూలు.

బైటినుండి ఒక ప్రక్క
కిటికీ చువ్వలకు ప్రాకి
లోనికి ఓసరిలిన పూల తీవెలు !
సగం ముడుచుకొన్న పూలు.
సగం విరిసిన మొగ్గలు.
గదిరూపం వాతావరణం
ప్రస్తుత రంగం స్థితి ఇది.

ఋతు దృశ్యాలు సంవత్సరాంకాలతో
నడుస్తున్నది జీవిత నాటకం.

మరోప్రక్క వికసించిన మందారం
చుట్టూ తిరిగింది తుమ్మెద.
రేకుల తలుపులు తెరచుకొన్నవి.
తలపు రెక్కలు విప్పారినవి.
తుమ్మెద ప్రవేశించింది.

ఇంతలో గదిలోని వెలుగు వంపులు
లేగులాభీనుండి తెలుపులోకి దిగి
అంతలో బూది రంగులోకి మారాయి.

ఎందుకో అతని ముఖంలో
నీడ గూడు కట్టుకుంటున్నది.

నగర ప్రధాన మార్గంలో
జనవాహన గమనధ్వని ధారాసారంగా
వర్షం ఊడిపడింది.
వానపొరలు చీల్చుకుంటూ
తుమ్మెద లేచింది.
ఈ వర్షం దీని పాలిట శత్రువైంది.

తుమ్మెద రాకడ
రేకులకు విప్పు కలిగించింది.
కాని దాని పోకడ
వాటిని మూయలేదు.

అంతలో వెలిసింది వాన.
దిశాళి క్రమ్మింది ఎండ.

మరో వింత ఘటన !
ఆ తుమ్మెదతోపాటు నా మనస్సు
నాలుగు దిక్కులమధ్య వ్రేలాడింది.

సాంధ్యవేళ ఆ గది
నిప్పంటుకున్న రీతి
జ్వాలామాలా ప్రచాలనంతో
జూలు విదల్చి లంఘించనున్న
సింహంవలె ఉంది.
ఆకాశాన హరివిల్లు విరేస ఉందా?
అందమైన ఇల్లు శూన్యంలో మిగిలేనా ?

చుట్టూ ఎవరెవరో మూగారు

జనం సందడి ఎక్కువైంది.

కన్నెత్తి చూడకుండా ఎవరినీ

ముందుకు నడచా డతడు,
హఠాత్తుగా కంటిముం దలముకొన్న
మసక చీకటిపొరలు చీల్చుకుంటూ.

ఎదపై వ్రాలిన ఉషస్సు,
ఒరుగువలె కులిపోయి,
పాదాలు పట్టుకొని వెనకాల
అనుసరిస్తూంది నీడని.

అపుడు తెలిసిం దతనికి
తాను నిలచిన నేల
తిరుగుతూన్న గోళమని.

సూర్యుని శవంపై
నిల్చున్నట్లున్నవి కాళ్ళు.
చంద్రుని రూపం
అవతరించినట్లుంది మనస్సు.

నక్షత్ర గోళాలు తిరుగుతున్నవి కళ్ళలో.
హిమశిలవలె ఘనీభవించింది బుద్ధి.

కాలం ఆగిపోయిందా?
అతనికేమీ జ్ఞాపకం లేదు.

ఇపుడు మాత్రం రాత్రి బోనులో
ఇనుప చీకటి కమ్ములపై
ఎదవాల్చి నిల్చొని ఉన్నాడు.

జగచ్చక్షువు న్యాయమూర్తి
ఇచ్చే తీర్పు—శిక్ష-తో
ఈ నాటకం ముగుస్తుందని
సామాజికుల అభిప్రాయం.
కాని అతనికి స్వేచ్ఛ దొరకంది

నాటకమేలా ముగుస్తుంది?

అతడే స్వయంగా మృత్యువు తెరవేసి
నాటకం అంతం చేయాలనుకున్నాడు.

ఏమైనా
గడచిన కాలం మరల చేకురేనా ?
చెదరిన బ్రతుకు పూర్వరూపం దాల్చేనా ?
ఆ నీడ ఉషస్సుగా మారేనా ?
ఎదపై ప్రేమతో వ్రాలేనా ?

ఈ నిర్బంధంతో
అందుకుంది మరో రంగం.
అతనికి స్వేచ్ఛ లభించేవరకు
నాటకం సాగుతూన్నట్లే.

గాఢమైన మనోవేదన
సూక్ష్మమైన అనుభూతిలో
పలికే స్వరలహరి వినలేనిది
తన్మరూభవన యోగ్యత ఎక్కడిది ?

ఈ సామాజికులందరూ
అశ్మకుడ్య సన్నిభులే ఐతే
నాటకమే ఆరంభం కాలేదు.

# ఆరని తెలివి నీటిలో మునిగాక

నీవు ఎవరో తెలియదు నాకు
ఎప్పుడూ రాత్రి ప్రొద్దుపోయే వస్తావు.

అప్పటికి నేను పడుకుంటాను.

నీ అడుగుల చప్పుడు వినిపిస్తుంది.

విని విని ఇప్పటికెంతగా అలవాటైంది ?
ఇది వినని రోజున నిదుర పట్టదు.

నేను లేచీ లేవకముందే, ఉదయం
నీవు వెళ్ళిపోతావు.
తెరచిన కిటికీనుండి వెతికే కళ్ళకు
నీ ముఖం కన్పించదు.

ఏదో పని ఉన్నట్లుగా పరుగెత్తి
నీకు ముందుగా నడచి మరలి
నీ ముఖం చూడాలనిపిస్తుంది రోజూ.
ఇంతకు కదలే ఓపికా లేదు.
ఇక పరుగెత్తడం కలలోనే !

నేను లేచి ఉన్నపుడు
ముఖ్యంగా పగలంతా
దానిమధ్య అంతరాయం
మేఘంవలె ఆవరించి,

శూన్య హృదయంలో
అనురాగపు మెరపులతో
ఏదో అలౌకికానుభూతి
అనిదంపూర్వంగా కలిగిస్తుంది.

నేను పడుకోగానే దొంగా !
తెలిసినట్లు నగ్నమతివై ప్రవేశించి
నేను మేల్కొనగానే, ఏమీ తెలియనట్లు
గడసరి వేషంతో వెళ్ళిపోతావు.
ఇప్పుడు తెలిసింది
నీ ముఖం చూడనిక.

అవును లీలగా గుర్తుకు వస్తున్నది,

విస్మృతమె అట్టడుగున పడిఉన్నది.

నీ అడుగుల చప్పుడు, దగ్గరైనకొద్దీ, రాత్రి
శరీరం మొగిలు ఉడుపుల్లో మసలుతుంది.

మనస్సు రెక్కలు విచ్చి
ఎక్కడికో తేలిపోతుంది.
నా ముఖం ! ఏమి జ్ఞాపకముంటుంది ?
ఆరని తెలివి నీటిలో మునిగాక.

# విత్ రిగ్రెట్స్

అద్దంముందు నిల్చిన
ఆమెచుట్టూ నీడలు
సముద్రంలో దారి తప్పి
తారాడు పడవవలె.

ఆమె ఉన్నంత సేపూ
దూరంగా ఉంటాయి,
దృష్టిపడని స్థితిలో
లేనట్లే అణగి ఉంటాయి.

అద్దంలో ఆమె ముఖం
చూస్తూ ఉండిపోవాలని
వాటి తీరని కోరిక.

కాసారంలో ప్రతిఫలించిన
చంద్రబింబం ఆ ముఖం
తాకజాలని మబ్బు తునకలు

తొంగిచూచే నీడ గుంపులు.

ఆ ముఖం ప్రతిబింబించగనే
ఒకదానిపై ఒకటి చొచ్చుకొని
అద్దంముందు చేరుతాయి
ఏదీ ముఖం సరిగా చూచుకోదు
ఆ ముఖం ప్రక్కకు త్రిప్పగనే
ఏదో పోగొట్టుకున్నట్లవుతాయి.

ఇంతకు ముఖం చూచుకోవడం
చేతకాదంటే సరేనా ?
ఇవి ఏలా చేస్తనేం గాని
కోతులకు మల్లే
వీటి ఆతురత కీచులాటలో
అద్దం పగిలిపోతుందని
నా అనవసరపు భయం.
దీనితోపాటు నాలో
కొంత నవ్వూ కలుగక పోలేదు.

అద్దంముందు నిల్చిన
ఆమె ఎవరు? తెలియదు?
అంత సేపు కిటికీ ప్రక్కనున్న
అతడెవరు? తెలియదు.

ఆ ముఖంకన్న ఆతనికి
ప్రతిబింబమే ఇష్టంలాగుంది.
ఆమె ముఖం, అమ్మయ్యా ?
ఆతనికి అగ్నిగోళం !
ప్రాణం లేచిపోదూ ?
శరీరం బూడిద కాదూ ?

ఆ ముఖంకన్న అందుకే
అతనికి ప్రతిబింబం ఇష్టం.

ఏ భయమూ లేకుండా

భద్రంగా ఉండవచ్చు.

ఈ సశేషమైన కథ చేస్త
నాకనిపించింది సందేహంగా
ఆమె యజమాని కావచ్చునని.
ఆమె అతని చూచింది కాని
అస్తిత్వం గణించినట్లే లేదు.

భయం నిండిన అతని కోరికలు
ఆ స్థితిలో దీపం ప్రక్కని నీడలు.

తరువాత కొన్నాళ్ళకు
సందేహం తీరింది.
( కథ సశేషంగానే ఉంది.
ఉన్నచోటునే)

చిన్నిమార్పు–ఏమంటే
'' అతడు బాస్ '' అని

– విత్ రిగ్రెట్స్.

# మిగిలిన కోరిక

చెదరిన వెంట్రుకలు
పైకి దువ్వుతూంది రాత్రి.
అరచేతిలో స్వప్నం
చూపిస్తున్నాడు చంద్రుడు.

గాలి వినిపించే సంగీతం
కాదనలేని చెట్లు
తలలూపుతున్నాయి.

ఔననలేని గుట్టలు

నిశ్చలంగా ఉన్నాయి.

ఆకురాలినట్లు గలగలా
రోదసినుండి దూసికొని
వస్తూన్న దెవరు?
తీరని సందేహం !

చివరి ఘడియలో ప్రాణంవలె
ధ్వని భయంతో గంతులేస్తున్నది
పిట్టలెగిరి పోతున్నవి.
గుంపులుగా కలకలమని.

నీలిరంగు మైదానంలో
ఒయ్యారం ఒలకబోస్తూ
సిగపై మల్లెచెండుతో
పరుగునవచ్చే రూపం చూచి.

దూరంనుండి
యువతి అనుకొని పాపం !
యువకుడొకడు
అర్పించాడు హృదయం.
భావగీతం పలికాడు.

దగ్గరలో–
రైలు అనుకొని పాపం ?
తల పెట్టాడు ప్రయాణం
అధివాస్తవికుడయ్యాడు.

యువతి, కాదు–రైలు
వెళ్ళిపోయింది.
ఇతని ఉనికే గమనించకుండా.

దారం తెగి
చెట్టు కొమ్మకు

చిక్కిన పతంగివలె
కోరిక మిగిలింది.

ఆకాశం మేల్కొంటున్నది.
ఇంకా కళ్ళు తెరవలేదు.
పాలవాడు పిలుస్తున్నాడు.
లోపలినుండి
తలుపు తెరచిన ధ్వని.

## కాలంలో కరగిపోతూ

మూతవడిన కనులు విప్పి
ఏదో వస్తురూపం చూడాలని
ఎత్తిన బలమైన కోరికతో
నడుస్తున్నా; నడుస్తున్నా –

ఆకాశ మందడ మెంత విచిత్రమా
ఈ కోరిక నెరవేరడమంత విశేషమా ?
అవును దానికొక ఆకారం లేదు.
అవును దీనికొక ప్రకారం లేదు.

ఈ విశాలమైన మైదానాలు
ఈ ఉన్నతమైన పర్వతాలు
ఈ పరుగులెత్తే నదీ నదాలు
ఈ తలలూపే లతా వృక్షాలు
జనగణ సంచలనం
వనమృగ సంచరణం
మనస్సుకు దీపిస్తూనే ఉన్నవి.

ఇంత కాలమూ చూచి చూచి

విసుగెత్తి విరక్తి కలిగేనా ?

మరపునబడి పోతున్నాయా ?
మదిలో తలలెత్తక ఉండేనా ?
కన్నులు మూసి ఉంటేనేం ?
మిన్నులు పట్టని ఊహ లేదూ ?

కోరిక రెక్క విప్పుతుంది
వానకాలం మబ్బువలె,
కోరిక చివుళ్ళు తొడుగుతుంది
వసంతకాలం తీవెవలె,
ప్రకృతి ప్రవర్తిస్తుంది
వీచే గాలిని బట్టి
అందే నీటిని బట్టి
పొందే శక్తిని బట్టి.

ఈ దారినుండి పోయేది
పూర్వం నే చూచిన మనుషులేనా ?
ఈ తెరవెనుకన ఉన్నది
పూర్వం నే చూచిన పాత్రలేనా ?

ఇప్పుడు కల్పన తప్ప ఏముంది?
అప్పటి స్మృతి స్వప్నంవలె ఉంది.
జగత్తు భ్రమాదిత స్వప్నం అని కదా
వేదాంతులు కొందరు పలకడం
జీవితం కాలోదితచిత్రం అని కదా
కొందరు లోకశీలురు అనడం.

మరి కాకపోతే ?
మీరెవరో నాకు తెలియదు.
ఏ జాతి మతం దేశం వారో ?
ఏమి ఏమె రూపొందుతున్నది
ఎన్ని విభేదవిపరిణామ కళలతో ?

ఇప్పుడున్న రూపం
మరో క్షణంలో ఉండదు.

ఇప్పుడున్న భావనలో
మరో క్షణమే మార్పు.

స్ఫటికంవంటి మనస్సుపై
అనుభవకాంతి ప్రసారంతో
ఎన్ని వర్ణాలు మారుతున్నది
జీవిత చిత్రకళారంగం.
ఎన్ని రూపాలవతరించి
ఎంతలో అంతరించి పోతున్నాయి.
ఏదీ స్థిరంగా నిల్వలేక పోతున్నది.
ఎన్ని వింతలు చూపిస్తున్నది
కాలరూప ఖండం.
ఒక్కటీ తృప్తినివ్వలేక పోతున్నది.

గ్రుడ్డివాని కనులంతా
ఏకాకృతి, చీకటి, జడరూపం.
కదలే మనస్సుకు ప్రతిదీ
నైక రూప పరివర్తన చైతన్యం.

నాగరక భావ రూపచ్ఛాయలలో
అకాలమృత్యువు ఆవరించి ఉంది.
అన్న వస్త్ర పరిమితితో మొదలైన ఆశ
అరచేతిలో స్వర్గం మెరపిస్తున్నది.

గాలి తీవ్రతకు రేకులు రాలిన పద్మంవలె
సూర్యరశ్మికి ఆవిరి ఐపోయే సముద్రంవలె
ఎండకాలం దాహంతో స్రుక్కే అవనివలె
ఉన్నది మానవత దైన్యంతో, ప్రమాదంలో.

ఈ లోకంలో బ్రతుకుతూన్న నాకు
మానవత పై విశ్వాసం సహజం.

ఇక్కడ అడుగిడి పోగొట్టుకొన్న
వెలుగుకై పరితాపం సహజం.

గగనంలో కదలివచ్చే జలదహృదయం
నీటిలో వికసించిన పద్మ వదనం
అపేక్షిస్తూ నడుస్తున్నా భూమిపై,
జనపదవననదీనదాలు

కొండలు మైదానాలు క్రమించి
ఆకాశపు వంపులు దాటి–
ఇంకా నడుస్తాను
సముద్రం వచ్చేదాకా ?
కాలంలో కరగిపోతూ–

# సైవెన్ స్టార్స్

కదలిక –

నీవు కదలవు కాలం ఆగదు.
నీవు మెదలవు బ్రతుకు నిల్వదు.

దొరకంది –

దొరకిందా ? ఆయువు పట్టు.
తెలిసిందా ? బ్రతుకు గుట్టు.

చిత్రం —

నమ్మదు నీ రూపం దింపించుకో చిత్రం
నమ్ముతారు చిత్రం ! తెలివిలో భద్రం.

రెండూ ఒకటే –

చూపు మెరుస్తుంది మెరపులా

తెలివి కురుస్తుంది వానలా.

జాగ్రత్త –

మలుపు తిరిగేవా మలగి పోతుంది –

గాలిలో దీపం హాలులో ఉంచకు

అమ్మయ్యా —

నన్ను వెలిగించకు ఆరిపోతాను.

నన్ను వెలిగించకు కాలిపోతాను.

కర్తవ్యం —

ఆగిన యుద్ధం సాగించు మరోచోట

చచ్చిన శాంతిని ఊరేగించు అంతటా.

# అందుకే అతడు

అతనికి చావు లేదని

అందరికీ తెలుసు.

ఎందరిలో నిజంగా

ఉన్నాడన్నదే ప్రశ్న.

కాలం గడుస్తూంది.

బ్రతుకు గడుస్తూంది

అతని నీడ అనుసరిస్తూంది.

జ్ఞాపకం వస్తాడు జాతికి

కష్టనష్టాల్లో, దుఃఖతాపాల్లో

దేవునితో సమానమని

అందుకే దూరంగా ఉంచుతాం.

మనం దూరం అయ్యేకొద్దీ
అతడు దగ్గరిగా వస్తాడు.

హృదయం విప్పి వెలుగువలె.
అందుకే అతడు మహాత్ముడు.

# క్షమించాలి

# పాత్రను విస్మరించలేను

ఉదయకాంతి పరిష్వంగం కోరే
హిమశిలా శ్రేణులపై, రాత్రి
చరించే నేను
ఎవరికోసరమూ
జోలపాట పాడలేను.
క్షమించాలి
పాత్రను విస్మరించలేను.

శిరస్సు పై గొడుగువలె ఉంది ఆకాశం.
కాళ్ళక్రింద శ్మశానంవలె ఉంటుంది భూమి.
ముఖంపై నీడ కప్పువలె ఉంది చీకటి.
కన్పించీ కన్పించకుండా ఉంది రాత్రి.

పూర్వపురాత్రి స్మృతులు
చిమ్మికొని వస్తూనే ఉన్నవి.
తలఎత్తనున్న వెలుగు ముఖం పై
చీకటి కత్తిపోటుకు వేచిఉంది.

గగన దీపం పాదాలకు

వేసిన నిశానిగళాలవలె

బ్రతుకును కదలనీయడంలేదు.

నిలువనీయడంలేదు అశాంతి.

ఎడారి హృదయ భూములతో
బికారి ముఖ కవళికలతో
ఎవరు వీరు ?
వీరిచుట్టూ తిరుగుతూన్నవి
తెల్లని దుస్తులతో చుక్కలు.

వేడిమి చావని యువ హృదయులూ
ఏడ్వనూ చేతకాని శిశిరమూర్తులూ
ముడుచుకొని పరున్న వృద్ధమతులూ
వెలుగుకై వేచిఉన్న స్ఫటికశ్రీలురూ.

ఉదయం వచ్చింది
ఉదారచరితునివలె.
వెలుగులు వేంచేస్తున్నాయి
ఎడారిలో కెరటాలవలె.
పిల్లల కనులలోని కలలబొమ్మలు
వారి ఊహలలోని పూల సింగిణులు.

చెట్లపై గుట్టలపై మైదానాలపై
అంతటా విరిసిన వెలుగులు
అయినా చీకటి ఉండనే ఉంది.
కుండపగిలి జారిన క్షీరంవలె
జగత్తుపై సోకిన వెలుగులో
నీడ జాడ అంతకంటే చీకటి
అంతరించి నట్లనిపిస్తుంది.

చల్లనిగాలి ఎద చీల్చుకొని
హఠాత్తుగా దూసికొని వచ్చే
మృత్యువు అట్టహాసం !
మారణ యంత్ర ధ్వని.

కులిపోతున్న

సంస్కృతీ శిఖరాలక్రింద

గొంగళి పురుగువలె
సగటు మానవుడు.

ఉన్మత్త ఝుంఝూ సంగీతంలో
జ్వలదహంకారానికి ప్రతిఫలంగా,
అగ్నికాపుతియా భవనాలు
శ్మశానాలుగా మారే పట్టణాలు.

చిమ్మిన నెత్తురు గీతలలో
క్రమ్మిన పొగల సైగలలో
మానవుని వెలుగు రూపం వెదకుతూ
ఇంకా నడుస్తూనే ఉన్నాను !
కనుదొప్పలలో కన్నీటిలో
కాలి బూదియైన ఎదదిబ్బలపై
ఉల్లోల కల్లోలంగా ప్రవహించే
గాంగఝురీ చైతన్యం ఊహిస్తూ.

మతాల విచ్చుకత్తుల మెరపులలో
బ్రతుకును వెలిగించలేను.
ఇజాల చిక్కుటుచ్చుల తలపులలో
బ్రతుకును బంధించలేను.

దుఃఖ వేదన నిండిన
రాత్రిపై జాలి ఉంది.
సుఖ సంతోషం విరిసిన
ఉదయంపై కోపంలేదు.

శైశిర మూర్తులను చూచి
హిమవర్షం కురుస్తాను.
వసంతాగమనంపై
ఆశ ఎన్నటికీ చావదు.

అపజయ పరంపరలో

అపుడపుడూ విజయ గీతం వింటూ

ఎంతదూరం వెళ్ళాను ముందుకు?
ఎంత కాలం సాగింది వెనుకకు ?

ఉన్న చోటే ఉన్నామా ? మనం.
ఉన్నచోటే ఉన్నదా ? కాలం.

ఉచ్ఛ్వాస నిశ్వాస పరంపరలు
హృదయ స్పందన గతులు.
పాములు ప్రాకినట్లు గాలులు
కాలం కదులుతూంది కాబోలనిపిస్తూంది.

దేనికైనా తప్పదు నాశనం
ఇదొక పరిణామంలోని భాగం.
దేని పరిణామగతీ ఎవరికీ
నిశ్చయంగా తెలిసి చావదు.

మృత్యువు పై అధికారం లేదెవరికీ
ఏ జ్ఞానమూ సర్వ సంపూర్ణం కాదు.
ఎక్కడికక్కడే అవధిగా కన్పిస్తుంది.
ఎంతకంతగనే నిండుగా వెలుగుతుంది.

వెనుకనే అజ్ఞాన విహంగం
చీకటి రెక్కలు విచ్చుకొనే ఉంది.
భయం తుఫానువలె తరలి వస్తూంది
మృత్యువు కొంత ఆలస్యంగా వచ్చేది.

ఈ తుఫాను గాలులకు
ఎవడికి వాడే భయపడుతున్నాడు.
సముద్రం ఉప్పొంగుతుందని
ఎవడికి వాడే శంకిస్తున్నాడు.
అశాంతి ఎవరూ కోరరు
శాంతి ఎవరికీ చిక్కదు.

విషమ వాయు పరంపరతో

ఉదరిపడు ఈ గోళంలో

నా మనస్సు భావిస్తూంది
మరో సృజన రూపం.

భుగ్న భావంతో భూమిపై చేరువగా
ఆశలు అవనతమై ఉన్న ఆకాశం,
తిలకిస్తూ నడుస్తూన్న నేను
అనుభవ పరంపరకు దూరంగా
మట్టి బొమ్మలకు రంగులు దిద్ది
సంతలో వ్యాపారం సాగించలేను.

వర్షాజలపరేషచనం కోరే
గ్రీష్మకాలశిఖరంపై, పగలు
నిలచిన నేను
ఎవరికోసరమా
ఈలపాట వేయలేను
క్షమించాలి
పాత్రను విస్మరించలేను.

# వెలుగు చూపులో

ఎవరికి తెలుసు
రేపటి ప్రయాణం సంగతి ?
భవిష్యత్తు అవిదితం
దాని సీమ లనంతం.

అదృష్టం పై భారం వేసి
అకర్మణ్యత నవలంబించకు.

జరుగుతూన్న దుర్విధిపై
చింతాశ్రువులు రాల్చకు.

రేపులో విశ్వాసముంచు
నిన్నను విస్మరించకు.
గతజల సేతుబంధనలో
జీవిత లిప్తలు గడపకు.

ఉదాసీనత క్రమ్మి వాతావరణం
కొడిగట్టిన దీపంవలె ఉంది.
ఈ రాత్రి దుఃఖీతులది నిజమే
రేపటి ఉదయం ఆశాజీవులదే.

భగవంతుడెవడో
ఎక్కడున్నాడో అక్కడే ఉండనీ
నీలోని చైతన్యరేఖను గుర్తించు.
నీలోని జడత్వాన్ని వదలించుకో.

ప్రసరించు మనఃప్రపంచంపై దృష్టి
ప్రవేశించు సుక్షేత్రాలలోనే గాక
ఎడారులలోనూ, గుడారాలలోకీ,
సుఖ దుఃఖ తీరాలలో అడుగిడు.
అనుద్విగ్నంగా పయనించి దర్శించు
అనుభవ దృశ్యాలు, అనుభూతి దశలూ.

విషం నిండిన భాండంకాదు జీవితం.
అమృతం నిండిన కలశమూ కాదు.
పరమ యధార్థం, కేవల స్వప్నం కాదు.
వాస్తవాదర్శాల సంయుతమైన రూపం.

దిక్కులలో చూడనరూన వెలుగులు
నీలో సాక్షాత్కరింప జేసికో.
శవాలలో ప్రాణం ఏలాగా రాదు.
ఉన్న ప్రాణులను శవాలు గానీయకు.

క్రమ్మనీ తలపై నీల మేఘచ్ఛత్రం

మండుతూంది కాలిక్రింది భూమి.

అయితేనేం మార్గం కఠినం
తెలిస్తే చాలు చేరాలిసిన గమ్యం.

దాగనీ మనస్సులో యుగాల ఆలోచనలు
అవసరమైనకొలది చాలు మాటలు.
ఉన్నా నేను లౌకిక బంధంలో ఒంటరిగా
నా గీతం మ్రోగుతుంది స్వేచ్ఛగా అందరిలో.

అలమనీ ఉదాసీనత బ్రతుకు చిత్రంపై
వెలుగు చూపు నీయకపోదు కళారూపం,
జ్వలించనీ విప్లవంతో ఈ దేశం
అవతరిస్తుం దింతకన్న మంచిదే సత్వరం.

# నేనూ నీ రూపమే

అంతంలేనిది కాదు రాత్రి
జననం లేనిది కాదు ఉదయం.
కాలగమనం అఖండమైనది.
మానవ సంతతి విచ్ఛిన్నం కానిది.

దుఃఖ గీతాల మడతలలో
చుట్టలు చుట్టుకొని పరుండకు.
వీచే గాలులవలె రేగే ఊహలు
పూలు రాలుస్తాయి, నిప్పూ రగుల్చుతాయి.

గతంలోని తప్పిదాలను
నెమరువేస్తూ కుర్చోకు.

దుఃఖీతుల కన్నులలో

దాగి ఉంటుంది రాత్రి.
వారి ఆశలలో
పరచుక ఉంటుంది ఉదయం.

ఉదయం భూమి పై మంచు
నవ్వు మొలకవలె ఉంది.
ఆశల ఆకులలో వెలుగురేక
మొగ్గ తొడుగుతూంది.

గతకాలపు భూమిపై నిల్చి
వర్తమాన పవమాన పంక్తికి
కదలుతూన్న చెట్ల వరుసలు
స్వాగతం చెబుతూన్నవి.

అగ్నికుండం వంటి బుద్ధితో
వర్షరూపం వంటి మనస్సుతో
విజయ గర్వం బింబించిన ముఖంతో
అపజయం తొంగిచూచే కన్నులతో
తల్లివలె పొదిగిఉన్న సంస్కృతితో
రాముడు గాంధి, రావణుడు హిట్లరుగా
క్రీస్తు బుద్ధుడు మహమ్మదు శంకరుడుగా
అవతరించిన మానవుడా !

కాల రథవేగ గతి కెగసిన
ధూళి క్రమ్మిన శరీరంతో
ప్రయాణించే స్వేచ్ఛామతీ !
కాలమాంత్రికుని చేతినుండి
తప్పించుకున్న అపాయానివి.
అనంత కాలముఖంలో
విభాసించే క్షణ రేఖవు.

పిడికిలి విప్పి చేస్త

కన్పించేదేమిటి?

పిడికిలి మూసి వేస్త
కన్పించని దేమిటి ?

నీ అడుగు జాడలలో
ఆదర్శంగా నిలచిన కాలం
నీ చరిత్రలో నిర్మితమై ఇతిహాసం
నీ రూపాన్ని ప్రతిబింబించే దర్పణం.

ప్రతిఘటన నీ చరిత్రలో భాగమే.
ప్రతి జీవితం నీ ప్రపంచ రూపమే.
నీ గురించి మనో భూమికలలో
పాడుతూన్న నేనూ నీ రూపమే.

## నేనెరుగని ఆత్మబంధువు

ఒక వృద్ధు రోజూ వెళ్ళుతాడు
మా ఇంటి ముందుగా.
నేనూ బయలుదేరా–
ఒకనాడేదో పనిమీద,
అతడొచ్చే సమయంలోనే.
అతడు నడచి నడచి మెల్లగా
ఒక పాత ఇంట్లోకి వెళ్లాడు.

వీధిలో వచ్చిపోయే జనం
అంత సందడిగా ఉంది.
కిటికీ తలుపులు తెరచాడు

దాని చువ్వలు పట్టుకొని వంగి
చెంపలు వాటి కానించి,

వీధిలోకి చూస్తూ నిల్చున్నాడు.
పసివాడై పోయాడా కేసపూ,
కిటికీ తలుపులు మూసి
బయటికి వచ్చాడు.

ఇంటి తలుపులు
మీద పడేట్టున్నాయి.
మెట్లూ అంతంత మాత్రమే.
లోనికి అడుగు వేయడానికే
భయం వేస్తుంది నాకైతే,
గతానికి దగ్గర బంధువై.

వీధిలో ఒక ప్రక్కన నిల్చొని
చూస్తూన్న నావద్దకు వచ్చి
'బాబూ ! ఎవరు మీ ' రన్నాడు.
నేను నా పేరు చెప్పి వెంటనే
'ఈ ఇల్లు మీదేనా ?' అన్నాను.
'అవు' నన్నాడు.
'అమ్మేయక పోయారా' అన్నాను
తలూపి నవ్వి ఊరుకున్నాడు.

కళ్ళలో మెరుపు మెరసింది
ఆరిపోతూన్న దీపం స్ఫురించింది.
కొంచెం సేపటికి చేస్త, కళ్లు
ఎర్రగా కాలి చల్లారిన
ఇనుపబంతులవలె వున్నవి
అంతలోనూ మంచుతెరలైనవి.

ఒక క్షణం ఆగి
'నాతో వస్తావా ?' అన్నాడు.

'లేదు పనిఉంది' అన్నాను.

ఎక్కడికని అడగకుండానే.

'ఏం పనిలే ?' అన్నాడు

బహు సామాన్యంగా
నా పని తెలిసిన వానికిమల్లే.
నేను మాట్లాడలేదు.

హఠాత్తుగా, నావైపు చూస్తూ
'శ్మశానానికి వెళ్ళుతున్నా' నన్నాడు.
కోపం వహించి ఉన్నాడనుకుంటూ
'అమ్మో ? భయం నాకు' అన్నాను.

నా భుజంపై చేయి వేశాడు.
క్రుంగి పోతానేమో నన్నంత
భయం వేసటంత బరువుగా,
ఒక్క ఊపు ఊపి
'ఏదో అన్నాను చమత్కారంగా
అలా ఉలికిపడతా వెందుకు ?'
అంటూనే గబగబా నడచాడు.

అమ్మయ్య ! వదలాడురా
ఇంకా నయం,
తనతో పాటు
శ్మశానాని కీడ్చుకొని పోలేదు !
అతని పేరు వగైరా
అడగడం మరచినందు కెంతో చింతించా
ఈ మారు కన్పిస్తే
మరవనని సమాధాన పరచుకున్నా.

ఆనాటి రాత్రి కన్పించి
మళ్లి, తనతో రమ్మన్నాడు
తోడూ నీడా ఎవరూ లేరేమో !
నాకు భయంవేసి కేక వేశా.

మళ్లి, కన్పించి

అదేమాట అన్నాడు.

ఈసారి మర్యాదగా తల ఊపి
'ఆలాగే తప్పకుండా' అన్నాను.
అతని ముఖం మొగ్గ తొడిగింది.
ఆ ఇల్లు నాకు వ్రాసి ఇస్తానన్నాడు.

ఎలా లాభించేను ?
అమ్మేయాలా ?
మరమ్మతు చేయించి అద్దెకివ్వాలా ?
ఆలోచనలో తెల్లవారింది.

లేచి కిటికీ వద్దకు వెళ్లి
చువ్వలు పట్టుకొని
చెంపలు వాటి కానించి
నిల్చున్నా బద్ధకంగా వంగి.

శ్మశానంలో మండుతూన్న
చితివలె ఉంది నా కంటికి
ఉదయాకాశం.

''అబ్బ! అప్పుడే ఎంత ఎండ ?''
అంటూ వెనుకకు తిరిగా.
''ఏడు గంటలయింది మరి ''
అంటూ ఎదురైంది శ్రీమతి.

# మనశ్చిత్రం

వర్షం పడుతూంది.
గోటి చివర

సిగరెట్ నుసి దులిపి

దమ్ములాగి పొగ వదలుతూ

రింగులు రింగులుగా
వరండాలో నిలచిన
ఆతడు కర్మ కాలినవాడు.

బాల్కనీలో చల్ల గాలికి
కుర్చీలో కూర్చొని
వీధి దీపం వెలుగులో
పరలోకపు చింతనలో
కనులు సగం మూసి ఉన్న
ఈతడు పెట్టి పుట్టినవాడు.

ఆతని దృష్టి అమాంతం
ఈతనిపై పడింది.
అతడు క్రింద, ఇతడు పైన
ఇద్దరిమధ్య అంతరం
బహు దూరం ! దుస్సాధ్యం.

మెట్లులేని మేడలోకి
ప్రవేశించి ఊహతో
''బాగా సంపాయించాడు
అదృష్టవంతుడు'' అని
ప్రశ్నగా రూపొందాడు.

వర్షం వెలిసింది.
జేబులు తడుముకొని
నిటారుగా నిల్చున్నాడు.
సిగరెట్ దమ్ములాగి
వీధిలోకి అడుగు వేసి
దగ్గరలో పడుకొని ఉన్న
కుక్కపై గిరాటు వేసి

చీకటిలో జారిపోయాడు.

కంయ్మంటూ లేచింది కుక్క,

ఎంతో సేపు కాలేదు
పెద్ద చప్పుడు ?
'దొంగ దొంగ !' అరపులు.
జనం పరుగిడుతున్నారు.
కుక్కలు అరుస్తున్నాయి.

దారిన వెళ్ళుతూన్న
మనిషి వెంటబడి చీకట్లో,
తీసుకొచ్చారు వెలుగులోకి,

'దొంగ దొంగ !' అని చూపారు
ఎవరో 'ప్రయాణికుడ' న్నారు
బాగ్ విప్పి 'ఏమీ లేద' న్నారు.

పొరపాటు జరిగినందుకు
పశ్చాత్తప్తు లయ్యారు కొందరు !
అతడెక్కువ మాట్లాడలేదు
పట్టీపట్టనివానికి మల్లే.
'పెద్ద మనిషి' 'పోనీండి' అన్నారు.
అంతా ప్రజలే, ప్రజలు,

అతడు వెనక్కు తిరిగాడు.
ఆపైన, అదే–దూరంగా
అక్కడే ఉంది కుర్చీ ఖాళిగా.

అంతా వెళ్లిపోతున్నారు.
దొంగల కథలు చెప్పుకుంటూ.
'ఇంతకు దొంగ ఏమైనట్లు ?'
ఒక కౌతూహలి ప్రశ్న
'రేపు ఉదయం
పోలీసు స్టేషనుకు వెళ్లి

రిపోర్టు చేస్త సరి'

సమాధానం వచ్చింది వెంటనే.

వెండితెరపై నీడబొమ్మవలె
ఉందీ రాత్రి దృశ్యం.
ఏదో సరిగా జ్ఞాపకానికి
వచ్చీ రావడం లేదు.
చెరువులో కదలే
చెట్ల నీడవలె.

ఇతని నెక్కడో చూచాను !
థియేటర్ లోనా ?
కొంపతీసి సినిమాలోని
ఒక పాత్ర కాదుగదా ?
ఇక్కడెలా ఊడిపడ్డాడు
చెప్మా, అయితే ట్రూకాపీ
ఇటువంటివి ఒకటా రెండా ?
ఎక్కడబడితే అక్కడే !
ఆకాశంలో మబ్బులవలె
ఆశ్చర్య చిత్ర పరంపరలో
గొలుసుకట్టు ముడివడింది
అనుమానంతో మిగిలిన సమస్య.

# నగరంలో ఉదయం

సదస్య లోక విరహితంగా
ఆడబడే నాటకంవలె
ఇటు అటు వెనుకాడి కొంత సేపు

రాజాదరణకై తారాడే కవిరత్నంవలె

అవతరించింది నగరంలో ఉదయం.

రవి ప్రయాణానికి దారులు తెరచిన
దివాదుహిత, యజ్ఞకేతువు, ఉషస్సు
ఎవరో ఇక్కడ ఎవరికీ తెలియదు.
కళ్ళువిప్పితేగా చూచే ప్రశ్న ఉదయించేది.
చీకటి ఎడారి బ్రతుక్కి ఈ వెలుగు
ఒక ' ఒయాసిస్ ' అని తెలిసి వచ్చేది.

ఇక్కడ గడియారమే కాలరూపం.
బ్రతుకుతెరువు, భోగభావం
రెండే రెండు దృష్టి రేఖలు.
చుట్టూ ఎత్తైన మేడలు,
చూపు కెక్కడికక్కడ అడ్డు తగిలి
ఆకర్షించి బంధించి వేసవి.

విశ్వపరిధులు స్పృశిస్తూ ఊహలు
ఆకాశంవలె పరచుకొని మనస్సు
చాపచుట్టవలె చుట్టుకొని బ్రతుకులు
తమపై ఒరిగిన ప్రపంచ భారంతో
క్రుంగిపోయి నడుస్తూన్న మనుషులు.

ఎక్కువగా దాదాపు అంతా
క్షణం తీరికలేని యంత్రాలే.
గుండె డాక్టరుకు అప్పగించి
బుద్ధి ఎవరికో తాకట్టు పెట్టి
సరస్సులవలె లేదా పడియలవలె
ఎక్కడబడితే అక్కడ ఎదురౌతారు.
ఎప్పుడుబడితే అప్పుడు ఎప్పటికపుడు
సమస్యా చిహ్నాలతో, పరిష్కార సాధనలతో.

సూర్య చంద్రులు ఇక్కడ
రిటైరైన ఉద్యోగులతో సమానం.

పాపం చంద్రుడు మరీ ‘ ఔటాఫ్ డేట్ ’
మ్యూజియంలో భద్రపరచిన

అమూల్య వస్తువుక్రిందే లెక్క
అయినా ఏదో నెట్టుక వస్తున్నాడు
పైపైని సద్యోయోగంతో.

ప్రణయ దౌత్యేత్యాది గిరాకీ తగ్గినా
' మూన్లైట్ డిన్నర్ ' కు అవసరమే ఐనా
అంతకుమించి ఈయన కొరత తీర్చే
' లైట్నింగ్ ' అవకాశమూ లేకపోలేదు.

కాలాభిజ్ఞతకు హేతుమూర్తులు
ప్రపంచానికి సాక్షీభూతులూ
ఐన ఒకనాటి పెద్దలస్థితి ఇది.

ఇక వసంతం గిసంతం మాట
పూర్వ కావ్యప్రపంచంలోనే
ఎక్కడా కోకిలమాటే విన్పించదు.
హారన్–సైరన్–బహువిధ యాంత్రిక
చలనధ్వని సమ్మేళనం తప్ప !
ఎప్పుడైనా ఒక కవి వేషధారి
ఆ సరంజామా పట్టుకవేస్త
మర్యాదా యవనిక చాటున,
అదొక విచిత్రశ్రీయే.

అథవా రాత్రి చంద్రబింబం కన్పించినా
ప్రేయసీ ముఖం తలపుకు రాదెవరికీ
స్ఫుట్నిక తీవ్రవేగ గమనం
అస్ట్రోనాట్ ఉత్పథ విహరణం
చంద్రోపరితలంపై మృదు సంచారం
మానవ విజయకేతన ప్రచాలనంతో
మనఃఫలకంపై నిలుస్తుంది భావరూపం.

రేపు తామూ తమ బంధుమూర్తి
పృథ్వీ సోదరునివద్దకు వెళ్లే

సమయపుటూహలో, నిరీక్షణలో
వాస్తవాని కాదర్శంగా
కాలానికి లోచనంగా
ఆలోలితమవుతుంది మనస్సు.

కవిత్వమూ ఈనాడు
వల్లమాలిన ఓపికతో
చెల్లని నియమ రేఖలతో
గణ యతి ప్రాసల కట్టుబాట్లలో గాక,
ఉద్వేగపు కొలతలో
ఆవేదన శీలంతో
అనుభవ పరమార్థంగా
స్వేచ్ఛాభావన పొందిక రూపం.
విచ్చిన కాలలోచన దర్పణం
మానవ గమన సూచీయంత్రం.

వ్యక్తికి వ్యక్తికి మానసిక తత్త్వంలో వ్యత్యాసం
అనుభూతిలో విభేదం ఉంటుంది తప్పదు.
వ్యక్తికి వ్యక్తికి సమంగా పోలిక లేకపోయినా
మాననతా సామ్యం ఏకంచేస్తుంది తప్పక.

ఆ“, ఉదయంమాట మరచాను మాటల్లో
తీగ కదలడంతో డొంక కదలి
పోనీ ఎవరికుంది గనక తీరుబాటు
మంచిది విరమిస్తా చివరి మాటలతో.

వస్తురూప విన్యాసం ఎప్పుడూ ఒకలా ఉండదు.
జీవితరూపం గమనం ఎప్పుడూ ఒకటిగా ఉండదు.
ఆత్మ అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఒక్కటే.
చైతన్యం అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఒక్కటే.

ఉదాత్త సంస్కృతి
జీవిత చిత్రానికి కళారూపం.

ప్రపంచ పరిణామం
సృష్టి మహార్థానికి వ్యాఖ్యారూపం.

# నీవు నాలో బ్రతికి ఉన్నట్లే

నీవు దూరమవుతున్నావా ?
భూతకాల స్వరూపానివి.
మంచుతెర పై స్వప్నానివి.
నా వెనుక నిలచిన వటవృక్షానివి.
నా ముందు వెలసిన నిశ్శబ్దరేఖవు.

నీవు దూరమవుతున్నావా ?
నీ ప్రత్యక్షంలో
నా పాత్ర మరచిపోతాను.
నీ సమక్షంలో
నా ఊహ నిలచిపోతుంది.

నీవు దూరమవుతున్నావా ?
తెలీని తనం తెలీకుండా
తెలీని మలపులలోకి
తెలీనివానికి మల్లే
తీసుక వెళ్ళుతావు.

నీవు దూరమవుతున్నావా ?
ఏదో విశ్రాంతికై
కొంత సేపు నావనిలచే

నివాసయోగ్యత లేని
దీవ్పానివి కదూ ? ఇప్పుడు !

నీవు దూరమవుతున్నావా?
నీకు పెద్దతనం వచ్చింది
నాకు చిన్నతనం పోలేదు.
నీవు కదలవు పర్వతంవలె
నేను నిల్వలేను నదివలె.

నీవు దూరమవుతున్నావా ?
మనస్సులో ధర్మచింతన
శిరస్సుపై ఉష్ణీషం
చేతిలో కృపాణంతో
కాలం ఇక కన్పించదు.

నీపు దూరమవుతున్నావా ?
తలుపులు తెరచే ఉన్న ఖైదులో
ఉన్న నిన్ను రోజూ కలుస్తాను.
సాంధ్యవేళల తప్పనిసరిగా
కంటిలో గంగతప్ప ఏమీ ఎరుగవు.

నీవు దూరమవుతున్నావా ?
ఈ ఆవరణంలో తిరిగేప్పుడు
'' జాగ్రత్త ! ఇచ్చట కుక్కలున్నాయి ''
చేతికర్ర మరచిపోకు !
ఇప్పటి కెంతగా చూచావోలే !

నీవు దూరమవుతున్నావా ?
నా ఊహలో వచ్చింది మార్పు.
నా ప్రవర్తనలో వచ్చింది మార్పు.
నా ఆత్మలో లేదు మార్పు
క్రొత్త దుస్తులు ధరించిందంతే.

నీవు దూరమవుతున్నావా ?

నీవు నానుండి దూరం కావు
నేను నీనుండి దూరం కాను.

నేడు నీవు స్మృతిలో నిలచేవు,
రేపు మేము స్మృతిలో మిగిలేము.

నీవు నానుండి దూరమయ్యేవా ?
ఏదీ నాముఖంలోకి చూడు.
చెప్పరాని పోలిక లేదూ !
ఈ పోలికలున్నంతవరకు
నీవు నాలో బ్రతికి ఉన్నట్లే !

## నిజం చెప్పు

ప్రపంచం మనస్సు కల్పించుకున్నదనీ
జీవితం దేవుడిచ్చిన గొప్ప వరమనీ
నిర్మలాకాశంలో మాలిన్యం లేదనీ
వెలిగే సూర్యుని వదలి నీడ ఉండదనీ
అంటావా ? చెప్పు; చెప్పు నిజం !

గుడిలో పూజారి మడిలోకన్నా
కులివాని గుండెలో ధర్మం ఉందనీ
వేదికపై శాస్త్రి ప్రవచనంలో కన్నా
సామాన్యుని బ్రతుకులో సత్యం ఉందనీ
అంటాను, చెప్పు, నిజం చెప్పు !

కులివాని గొడ్డుకారపుమెతుకుల్లో
ఎన్ని విటమిన్లు ఎంతగా ఉన్నాయా
చంకలోని శిశువుకు స్తన్యమిస్తూ అరచే

బిచ్చుకత్తె నడకలో శృంగారమెంతో
కన్నది చెప్పు, చెప్పు నిజం !

చెప్పండి. ఈ దేశంలో సమృద్ధిగా ఉన్నది.
ఎక్కడ చూచినా అసంతృప్తి, ఆందోళన
విప్లవం రెక్కలు విప్పిన వాతావరణం
ఎవడికి పుట్టిన బిడ్డరా–ఈ స్వాతంత్ర్యం ?

పోరగాండ్లా? చావనీ దేనికీ విద్య –
ఉద్యోగులా? అమ్మయ్యా ! ఇప్పటికే
పడి తింటున్నారు. తెగ దండుగ్గా.
కార్మికులో ? అంతా అలగా మూక
కర్షకులో ? అమాయక సంతానం

దేశ సౌభాగ్యానికి కావలసింది
రాజకీయాధికార పదవీ వైభోగం.
వీరు లేకపోతే రాజ్యాంగ రక్షకులు
ఏలా నడుస్తుంది ప్రజాస్వామ్యం ?
అంటావా చెప్పు ! నిజం చెప్పు !

తలలు దన్ని త్రాటి కెక్కుతూంటే
కలలుగంటూ ముసుగుదన్ని పడుకునే
సామాన్యునికేమి పట్టింది చెప్పు
రాజకీయ సిద్ధాంతాల మెప్పు.

పోరాటంనుండి పలాయనం చిత్తగించే
సమస్య లంటని పరమ పవిత్రులకు
మెలకువ అంటే భయం.
నిదురే ఎంతో భద్రం !

ఇపుడు ఏమిటి మన కర్తవ్యం
మనస్సు విన్నది కన్నది పలకడం,
ఈ మరుభూములపై ప్రతి వ్యక్తీ

ఉల్లోల తరంగమై ప్రవహించడం !

# అగ్ని గానం

ఇవే విద్యాలయాలు
వెలుగు ఆశలు పెంచుకొన్నవి.
వీరే నా సోదరులు !
రంగు వలలు క్రమ్మిన స్ఫటికాలు
ఈ దశాబ్ది ప్రపంచంలో
సమస్యలకు నిలువుటద్దాలు.

వారే తెలీదూ !
మన పై తిరిగే గ్రహాలు !
నరాల్లో నీరుతప్ప నెత్రులేని వారు
అరచేతిలో వైకుంఠం నిలిపి
పిడికిలిలో కైలాసం బిగించి
భవిష్యత్తు భద్రపరచు తంత్రకర్తలు !

అదిగో ! సామాన్యులు
కనులలో కమలిన పూవులతో
ఎదలలో దాగిన వాసనలతో
సోలుతూ కదలే తీవెలు !

అయ్యో ఈ దేశం ఇపుడు
చల్లారని శ్మశానంవలె ఉంది.
దట్టంగా పొగక్రమ్మిన రాజకీయం
ఎన్ని వికృత రూపాలు ధరిస్తూంది
మనిషికి మానవుడు కన్పించడంలేదు.
మనస్సులో మానవత ఇగిరి పోతూంది.
సూర్యుడుదయించి ఎంతేసపో అయింది
చీకటి గుడారం వదలడంలేదు

మంచు ముసుగు వీడడంలేదు.

ఒక వేళ ఈ ఇరుకునుండి

బయటపడినా పొరపాటున

ఎక్కడికి వెళ్ళగలడ మనిషి ?
ఉన్న కళ్ళు మూతపడినట్లై.
అయినా వెళ్ళుతూనే ఉన్నారు
ఒకరి నొకరు ఢకొంటూ
దగ్గరి సందు గొందుల గుంతలు
మూకలు మూకలుగా! ఎక్కడికి ?

ఈ ఎత్తిన చేతుల పర్యవసానం ?
ఈ వేసిన అడుగుల పరిసమాప్తి ?
ఏముంది ఇన్నాళ్ళకి
ఈ నేలపై – బురదా ! బుగ్గి !
తరాల సంస్కృతి ఎపుడో
చీలింది పాయలు పాయలుగా
మారింది పడియ పడియగా
నిలచింది ఎక్కడిదక్కడే.

ఎన్నో యుగాలు వెలిగించిన సంస్కృతి
ఇపుడు వెలిగిస్తూంది శ్మశానాన్ని.
చస్తూంది ప్రతిక్షణం ధూమంతో
బ్రతుకుతూంది అనుక్షణం ఆశతో.

పరమార్థం కోల్పోయింది బ్రతుకు
అంతకంటే కళలూ,
నైతిక వైక్లబ్యం పొందిన
అనుచిత రాగోద్రేకంతో,
కత్తులు మెరసాయి కన్నులలో
చీకటి వెలిగింది దిక్కులలో.

అవమానం ! ఆత్మహత్య !
ఆటవికం ! అగ్నిగానం !

ఝుంఝానిలం వీచి ‘ రవీంద్ర సరోవరా ’ న
కులిపోతున్న సంస్కృతీ శిఖరంక్రింద

ఎటని పరుగెత్తేరు అబలలు !
నీటిలోకా? వీటిలోకా? ఏ ఒడ్డుకి?
ఇది మన ప్రజాస్వామ్యం తెలీదూ !
కాదు కాదు ! ప్రభుకాలం భారతమూ.

ఎందరి తలలపైనో కాలూని
చరిత్రలో సంస్కృతి గబగబా
ఎన్ని పుటలో గంతులేసింది.
కొండవలె ఎత్తుగా ఉన్నచోటే
పడిఉంది నిజ జీవితంలో.

ఎత్తిన ముఖాలు దించేయండి.
నీటిలో వెలుగు లేదు
ఎత్తిన చేతులు వాల్చేయండి
వీటిలో సత్తువ లేదు.

భగవంతుడా ! ఎక్కడున్నావు ?
ఇందుగలడందు లేడన్న సందేహం
తీరేట్టుగా ఇక్కడే !
నీ ముఖం చూపించకు
దోషగ్రహణం పడుతుంది.
నీవు ఎదుట పడినా
గుర్తించే దెవరీ సమయంలో.
వెళ్ళనీ మేం పోదలచుకొన్న చోటికి.

క్షమేస్త ఒక్కమాట చెప్పనా ?
మానవతపై విశ్వాసంతో
నా మనస్సులోని మాట
మళ్ళీ తిరిగి రావచ్చు –
ఆటవిక యుగంనుండి
అనుభవం వెలిగించిన జ్ఞానంతో

నీవున్న చోటికే

భాషా సీమలూ జాతి వలయాలూ
చెరగిన మనోభూమికపై
అహంకారమూ అంధకారమూ
తొలగిన వెలుగు దిశలో
సమభావం, సుఖశాంతి అందరికీ
కలిగిన నవ సమాజ నిర్మితిలో
నదీ తరంగాలవలె చెంగలిస్తూ
వచ్చి నిన్ను కలుసుకోవచ్చు.

ప్రస్తుతానికి సైలవు
అగ్నిగానం మానలేం.

# రావద్దు ఆ సమయం

రావద్దు ఆ సమయం
ఉదాసీనత ఉద్యోగం చేస
ఆ సమయం రాపద్దు
దీనికన్న నిద్ర మంచిది.

వద్దు కదలికలేని శాంతి
రానీ విషపాత్రగా క్షణం.

నిరాశ నిటారుగా పెరిగిన
నింగిలో తలదూర్చి మనుషులు
మనసులు పీడకలలు కనే
ఆ సమయం రావద్దు.

రేపటి నదిబడ్డున విశ్వాసంతో
తిరిగే వ్యక్తిని వెల్లువలో ముంచే

గత విషాదం జ్ఞప్తికి తెచ్చే
ఆ సమయం రావద్దు.

వ్యర్థంగా కనులు పరచుకొని
దిక్కులుచూచే ఆ సమయం
హృదయశిల పూసిన పూలతో
దీర్ఘ రాత్రి హ్రస్వమా వెలుగుతో
రానీ ఆ సమయం
భగవంతుడా రానీ !

# అమృత వర్షం

సాంధ్య రోదసి క్రమ్మికొని,
నవ వాస్తవిక కవితవలె
మధురవర్షధారాపాతంతో
ఆశామేఘం కురుస్తున్నది
అమృత వర్షం !

ఎక్కడో ఆగిపోయింది
ఇక్కడ తూగిపడింది.
రండి ఇట్లా బయటికి
గదులు వీడి, ఎదలు విప్పి.

ముసలి మొగం వలె
నెరియలుపడ్డ భూమి,
జలబిందు పరిస్పందితమై
పసిపాప నవ్వు మొగమైంది.

జలధారా పరిష్వంగంతో

ముగ్ధప్రియా హృదయమైంది.

మసృణమై, ఆర్ద్రమై, సుగంధియై
మారింది పురా భావరూపం.

ఎన్నిపూలు విరబూచింది నా హృదయం
అనంతకోటి నక్షత్రాలవలె,
అన్నీ మాలలుకట్టి,
గగన దీర్ఘ గళంలో
వేయాలని ఉంది రాత్రి.
అన్నీ ప్రోవుచేసి
జలధిలోల వక్షంపై
అమర్చాలని ఉంది రాత్రి.

ఇంతలో మెరపు మెరసి, మరపు వచ్చి
సుఖస్వప్నం చెడి, తెలివి వచ్చి
ఆహ్వాన పత్రంవలె ఎదురైంది
ఉదయ తరణి.

పురాభావ నగ్నమైంది మనస్సు.
ఇంకా అమృతవర్షం కురుస్తూనే ఉంది.

నడవండి, ఇందులో తడిసినవారి
మనస్సులు వినిర్మలంగా ప్రకాశిస్తాయి.
తడవండి, ఇందులో నడచినవారి
గమనం చైతన్యవంతంగా ఉంటుంది.

భవిష్యత్తు స్వరూపమంతా
ఆశాప్రభావంలోనే ఉంది.
అదీ ఆనంద సౌందర్యమయంగా
ఉండాలనుకోవడం మానవ సహజం.

గతంలో నిద్రపోయే
ఓ చెట్లూ ! కొండలూ !

ఇంకా నే మరచినవారూ !

అమృత వర్షంచే పునీతులు కండి.
సృష్టి రహస్యానికి వ్యాఖ్యానాలవండి.
వర్తమానం లేంది భవిష్యత్తు ఎక్కడిది?

విచ్చిన కంటికి కన్పిస్తుంది
మింటినుండి మంటికి సాగిన
సూర్యకిరణ కాంతిచక్రం.
మేల్కొన్న మనస్సు అనుభవిస్తుంది
వర్షా మధునాద రూపంలో
ఆశా మేఘం కురుస్తున్న
అమృత వర్షం !

# మేల్కొన్న ఆకాశం

# కాంతి సింహం

నీలాకాశ గుహాముఖంనుండి
బయల్వెడలిన కాంతి సింహం[1]
నిర్మల కాసార దర్పణంలో
తన ముఖం చూచుక మురుస్తూ,
రోదసీ వితర్దికపై
బంగారుపూలు విరబూచిన
కాంతివల్లీ నికుంజంలా
సంతోషంగా కూర్చుంది.

రోదసీ వితర్దికపై కూర్చొని
పకాలున నవ్వే కాంతి సింహం
నాకెంతో చూడ ముచ్చటై
సుఖసంతోష తరంగితంగా
కాలం గడపాలని
చేయి చాచి సైగచేసి పిలిచా.
నా పై జాలి కలిగి కాబోలు
నా ప్రక్కనే నీరు? నిండి[2] ఉన్న
గాజు గ్లాసులోకి[3] దూకింది
నీటిచుక్క తొణకలేదు.
గాజుగ్లాసు పగుల లేదు.

అపుడు నిదుర నిషా ఎక్కిన వేళ
కాలం ఆగిపోయినట్లు గుర్తు.

వ్రేలాడే మంచు తెరలు
రవి కిరణాలకు తెగిపడునట్లు
గాలికి కాసారంలో
తరగలు లేచి పడునట్లు
పగలడానికి తగిన ఎత్తునుండి

గాజుగ్లాసు క్రిందపడినట్లు
నా ఎదలో సన్నని ధ్వని.

కనుమరుగున స్పృశించిపోయే
గాలి తెరవలె
కనులముందు గర్జనలతో సాగే
మేఘ పటలంవలె
ఆకాశానికీ చంద్రునికీ
ఎంతదూరమో అంతదగ్గరగా
నా వెనకాల నడచి వచ్చి
ఎంత సేపటికో,
అంతసేపునూ మరపించి
గాలితెరల మంపులపై
తుమ్మెద కాలిజాడలవలె
నీటి అలల వంపులపై
కదలు గాలి తరగలపలె
గుండెలో పొరలనుండి
ఎగిసే రాగ మాలలవలె
వ్రేళ్ళకు చిక్కక కదలే
పాదరసపు గుళికలవలె,
నా హృదయాకాశ మావరించి
నిలచింది కాంతి సింహం.
ప్రయత్న నైష్ఫల్యాన్ని
అంగీకరింపనీయని రూపం.

అసంతుష్ట కామనాత్మక మనస్సులో
అర్థ సుషుప్తిలో, జాగ్రదవస్థలోనూ
అపుడపుడూ కాంతిసింహాలు
ఇంకా మాట్లాడితే చీకటి దెయ్యాలూ
వారివారి అభిరుచి, సంస్కార దశనుబట్టి
మానవులతో స్నేహం చేయడం కద్దు.

కొంత సేపలాగే ఉండి

నిష్క్రమించిన నేస్తం.

అనంతాకాశ వలయంలో

అరుణకాంతి పతాకవలె
రెక్క విప్పి నిలచింది.

చీకటి గుహలో దాగి
మెరపులా దూసికొని వచ్చి
నిండు ప్రాణం తీస్తుందని
ఎవరో చెబుతున్న మాట
నిజమైనట్లు తోచదు.

అయినా శాంతంగా వచ్చి
కొంతసేపు కాలం గడపి
హృదయాన్ని సమాకర్షించి
ఊహావలయ మాక్రమించిన
కాంతి సింహానికి భయపడి
చీకటి గుహలో
దాగిపోవడం కన్న
మృత్యువు నయం !
భయపడడం అజ్ఞాన లక్షణం
దాగిపోవడం తిరోగమన వర్తనం.

# మూసుకున్న ఐదు వ్రేళ్ళు

లోకంలో తనకుగల మమతాభావం
పూర్తిగా వదలజాలని వెలుగులదొర, ఆశలు
గ్రీష్మంలో పలాశాలవలె ఇంకా
[1] దిక్కుల చివరలు పట్టుక వ్రేలాడే సమయం.

అసివాళ్ళోవ్వరూ ఎదురెదురుగా
కూర్చున్నారొక రాతి పరపుపై ఐదుగురు.

ఇంతవరకు సంపూర్ణంగా నెరవేరని
[2] కోర్కెల ప్రకటనలతో కాలం గడపుతూ.

[3] ఆకాశ మొక ఇంటికప్పు
ఎప్పుడు వేశారో తెలియదు.
కాని ఇప్పట్లో కులదని వారి నమ్మకం.

మానవుడు జన్మించడంతోనే లభించిన
స్థిరాస్తి–దిక్కుల గుండెలలోకి చొచ్చిఉన్న భూమి.
చరాస్తి–జీవితగతిని పరిపాలించే ఊహాశక్తి.
ఒకరిమీద వేరొకరికధికార మసలే లేదు.
ఎవరికిష్టమైన పని వారు చెయ్యవచ్చు.
మృత్యువు ఎక్కడో లేదు.
తమ ఊహలలోనే ఉందని తెలుసు.
అయినా క్రమంగా ఒకరిమీద
వేరొక రధికారులై
ఒకరి మృత్యువుకు
మరొకరు కారణభూతులైనట్లు
నడుస్తుంది ప్రపంచం.

అందరికీ వెలగబెట్టాలని ఉంటుంది
కాని అందరికీ తగిన అవకాశాలేవీ ?
అందరూ ప్రభువులే ఐతే !
ఏలా సంభవిస్తుంది ?
కాబట్టి ఘర్షణ, విభిన్న రూపాలలో
సాక్షాత్కరించడం జరుగక తప్పదు.

ఇంతకు చేప్పదేమంటే
వీరు, అంటే ఆ ఐదుగురూ
‘ దేవుని కాలివ్రేళ్ళు ’ అని అంటారు కొందరు.
కాని రాక్షసుల చేతి [4] వ్రేళ్ళు — ప్రస్తుతం.

ప్రయోజనం మేర
రీతి క్రమం మారు మైనపు బొ[5]మ్మలు,
ఇంతకు వ్యంగ్యరేఖా శరీరులు.

వినిపిస్తవి అపుడపుడూ
అరపులు, చప్పట్లు, ఈలలు.
బహు విచిత్రధ్వని సమ్మిశ్రిత
విపరీతపు టూళలూ.
ఇది వారి సంగీతం, సాహిత్యం.

సర్వం సన్యసించి జగన్మిథ్యా భావనతో
తత్త్వ పరమార్థ శోధనచేస వేదాంతి
అధికారం హస్తగతం చేసుకొని దర్పంతో
లోకాన్ని శాసించాలని కోరే పెద్దమనిషి,
విద్యాబుద్ధి ప్రచాలనంతో లౌకిక పదవిలో
యశఃపద జీవితం గడపగోరే హితవాది
పరలోకమున్నదో లేదో ఎవడికెరుక ?
ప్రస్తుతం భోగవాంఛలో తృప్తిపడు మరొకడు.
శ్మశాన పదవికి వెళ్ళే క్షణంవరకు ప్రాణం
ధనానికి ఘనంగా లంకెవేసికొని ఉన్న శరీరి.

జీవితంలో వారివారి కోర్కెల ప్రకటానంతరం
ఎవరికివారు లేచి వెళ్ళాలని ఉద్యమించగనే
[6] బుసకొడుతూ ప్రాకుతూ సర్వ శరీరం
కరవడ మారంభించినవి [7]గాలులు, పాములవలె

చాచిన ఐదు వ్రేళ్ళు
క్రమంగా మూసుకపోయినవి.
[8] మీద మింటికప్పు కులి పడినట్లున్నది.
అక్కడే ఉండిపోయారు వారు
[9] చెల్లని రూపాయి నోట్ల వలె.

# నైకట్యై

చుట్ట చుట్టుకున్న పాము పరుపుపై
రాత్రి నిదుర పోయి
సగం నిదుర మత్తులో ఉదయంలేచి
నడవడ మారంభించిన
నా వెంటబడి పరుగిడి వచ్చి
మెల్లగా శరీరం ప్రాకి
మెడలో మెలికలు తిరిగి చుట్టుకుంది.

కనులనుండి జారిపడు నీలి నీడలు
కదలకుండా కాళ్ళను పెనవైచుకున్నవి.
గాలిలో రెపరెపలాడు పమిటలా
గమనం సాగని స్థితిలోనున్నవి ఊహలు.

కనురెప్ప వ్రాలే అవకాశం లేకుండా
ఆలోచనా పరాగంతో నిండినవి నేత్ర పద్మాలు.
దట్టంగా చుట్టూ మంచుపొరల క్రమ్మిక
నైకభావం మరపించింది.

గాలికి ఆరని, నీటికి తడవని
దివ్యదీప శిఖవలె, మేల్కొని ఉండి
అనాదినుండి ఆకర్షిస్తున్న
స్నిగ్ధమూర్తి ! ఛాయారూపం.

లోకానికానందం, దుఃఖం
విధిగా కల్పిస్తూ ప్రేయా రూపంతో,
ఎన్ని యుగాలు గతించినా నశించని
ఏనాటికీ తరుగని ప్రభావరూపం.

ఆమె లేనిది సృష్టికే స్థితిలేదు.
ఆమె లేనిది సృష్టికి శోభ లేదు.
జాగ్రదవస్థలో బుద్ధినాక్రమించి

కంటికి కన్పించేది, ఇంతకు
మెడలో వ్రేలాడే '' నెక టై. ''

# గాజు గది

మనలో ప్రతివాడు తనకు తాను ఒంటరిగా
ఒక గాజుగోడల గదిలో చిర నివాసం.
అవతలి మనిషిని గమనించడం, పరీక్షించడం
తనకు తానతి గోప్యంగా ఉన్నానని ఊహించడం.

దరవాజాలు కిటికీలు లేనే లేవీ గదికి.
లోపలినుండి మనిషి రా వీలులేదు బయటికి.
బయటినుండి లోపలికెలా వెళ్ళగలరని ప్రశ్న ?
అద్దాలు పగులగొడితే ?

బయటికి రాగలడని నమ్మకం
[1] సరోవరంపై నీటి పొర లొకటొకటీ ఒలిచి
అందులో ఉన్న చంద్రుని పట్టుకొని
ఆనందించడానికి యత్నించినట్లు.

ఒక మేరలేని అవసరాల కల్పనలతో
అపుడపుడూ ఒకరి గదిలో వేరొకరు చొరబడి
ఏమున్నదో ఏమిలేదో ఏలాగో చూడాలని
మరీ మరీ ఉబలాటంగా ఉంటుంది.

ఎంతదూర మెన్ని గదులు దాటి వెళ్ళినా
నాకు ఆవలి లోకానికీ మధ్య ఎపుడూ
కనీసమొక గది నిలచి ఉంటుంది.

అడుగువేసి ముందుకు సాగినపుడు
ఎదురెదురుగా ఒకటొకటీ చంద్రునివలె

ఎంత ప్రహ్లాదమయంగా ఉంటుంది.
వేసిన అడుగు తీయడం మానినపుడు
ఎక్కడిదక్కడే నిలచినట్లై సమాధివలె
ఎంత భయావహంగా ఉంటుంది.

సృష్టి కదలికలోనే ఉన్నది ఆనందం.
ఎంత పరిణాహ జీవితమైనా
ఒక మానసిక వ్యాపారం.

మానవుని కోర్కెల సాగుదలకు
చిట్ట చివరి మెట్టు;
మృత్యుపదవి, చీకటిముద్ద, జడస్థితి.
అందుకే అంత భయం !

# సంధి పత్రం

అడుగుతీసి వేసేలోపల
కాలాన్ని హత్యచేసి కాలం
దాని స్థానమాక్రమించి
[1] తిరిగి కాలంచే హతమౌతుంది.

[2] అడుగు తీసి వేసేలోపల
ఉషస్సుకు తమస్సుకుగల దూరమనల్పం.
[3] వేసిన అడుగు తేసలోపల
తమస్సుకు ఉషస్సుకు గల దూరం అంతే.

కాలం సాగినకొద్దీ క్రమంగా
చంద్రుని కిరీట మెగురగొట్టి
[4]

పదవీభ్రష్టుని చేస్తాడు సూర్యుడు,

కాలం మారినకొద్దీ క్రమంగా
చంద్రుని కిరీటం వెలసి, తిరిగి
5 పదవీ పూర్ణత్వం లభిస్తుంది.

అయితే ఈ లోకంలో
అడుగుతీసి వేసేలోపల కాలం,
మనిషికి మనిషికి మధ్య సామీప్యం
దూరదూరమై పోతే పోనీ.
రాక్షసులకు రాక్షసులకు మధ్య దూరం
దగ్గర దగ్గరై పోతే పోనీ.

అందరికీ ఆలోచించడం చేతకాదని
ఒకడే అందరి బదులూ యాచన చేసి
ఒక్కడి మాట అందరికీ శిలాక్షరమయ్యే
పూర్వపు నియంతల రాజ్యం మళ్ళీరానీ
చెట్లు గాలికి చలించడం మాని వెంటనే
గాలిలోనే కదలిపోవడ మారంభించనీ.
దొంగచాటు వ్యాపారం సహజమై
భయం జీవితాన్ని ఆక్రమించుకోనీ.

జంతువులు, కాదు మృగాలు గెలిచి
మానవులపై అధికారము సాగించనీ.
మన నీడలే మన పై తిరుగబడి
సహజశత్రుత్వం పెంచుకోనీ.

తలలూపు చెట్లగుంపువలె జనం,
మూతవడి వెలుగెరుగని కళ్ళతో
శిలాస్తూపాలవలె నడుస్తూ వీధులలో
అడవిలో వేణువులవలె రొదచేస్తూ
చీకటి బ్రతుకుల కలవాటుపడి
నిద్రలో మృత్యువుతో
6 సంధిపత్రం వ్రాసుకోనీ.

ప్రాణులం అందులో మానవులం కాకపోమూ ?
బ్రతికినంతకాలం జీవితమనిపించుకోదూ ?
ఊపిరి ఎక్కడిదక్కడే ఆగిపోదుకదా !
[7] అడుగుతీసి వేసేలోపల కాలం !

# పతాక వార్త

ఉదయంనుండి సాయం సమయం వరకు
మండిపోయే అగ్నిజ్వాలా తోరణాలతో
నిండిపోయి, రాత్రివేళకు మసిబొగ్గై
ఆరిపోయి, చల్లబడిన శ్మశానంవలె
ఉన్నది, చీకటి పొరలు క్రమ్మిన నీలాకాశం.

అక్కడక్కడా గాలికి చెదరిన
నిప్పురవ్వలవలె చుక్కలు.
పిండుకట్టిన భయంతో బిగిసి ఉన్న
నిశ్శబ్ద వాతావరణం చీల్చుకొని
ఒక్కమారు వెర్రికేక !

రివ్వున గాలి వేసిన ఈలలకు
చివాలున చప్పట్లు చరచినవి చెట్లు.
అలలులేని చీకటి నీటిలో
ఒడ్డునుండి ఏదో బరువైన వస్తువు
ఒరిగి పడిపోయిన చప్పుడు;
అంతలో నిశ్శబ్దంలో లీనమైన స్థితి.

ఝుటితిస్ఫూర్తి కలిగి మేల్కొన్న మనస్సులో
ఒకటి రెండు పురాస్మృతుల కదలిక.

కదలిక గుర్తుపట్టి ఎవరో మెలమెల్లగా
భయం భయంగా జారిపోయినట్లు గుర్తు.

అలికిడి విని గుంపులు గుంపులుగా సాగి
అలజడిగా ప్రతి అంగుళం మేర గాలించి
చివరకు కాలిజాడలైనా తెలియని స్థితిలో
విసిగి వేసారి ఉన్న గాలులు–సీత్కారాలతో
అక్కడక్కడా నిదుర మత్తులో తూగుతూ
సగం మేల్కొనిఉన్న చెట్లగుంపులతో
గుసగుసలాడుతూన్నవి, అదే పనిగా –
ఎప్పుడో ఎక్కడో భయంతో తలదాచుకొన్న
చంద్రుని పాదాలు కన్పించీ కన్పించడం లేదు.

మరో శవదహనానికి ఆకాశాన
సత్వర సన్నాహం జరుగుతూన్న చిహ్నాలు.
సృష్టి జరిగిన నాటినుండి మొదలుకొని
ప్రతిరోజూ ఇలా ఎంతకాలం సాగుతుంది ?

ఎవరో చిత్రవధ చేయబడినట్లు
ఉదయాకాశ ముఖంపై పతాకవార్త.

వెనుక ఈడ్వబడుతూ వచ్చే
క్రీనీడలతో వీధిలో నడుస్తున్న నేను
పునర్జన్మ ఉన్నదో లేదో తెలియదు, కాని
ప్రతి ఉదయం మరోజన్మ ఎత్తినట్లుంటుంది.

# నేను

పుంజీభూత తుహిన రేఖవలె
నేను ఎప్పుడు, ఎక్కడ విశ్రమేస్త
అప్పుడు, అక్కడ రాత్రి వెన్నెల.

[1]ప్రగాఢ నిద్రా సమాధిలో ఉన్నపుడు
[2]ఎవరో రాక్షసుడు, తమోమూర్తి
చల్లనిగాలి పీల్చడానికి బయటికి వస్తాడు.

వాణ్ణి చూచి భయపడి లోకం
విజ్ఞానేంధనాలు జ్వలింపజేసి
భస్మం చేయాలని యత్నిస్తే
వాడు కాష్ఠంవలె కాలి చివరకు
ధూమరేఖలా ఎగసి వచ్చి
మరో రూపంలో
కనులలోకి తొంగి [3]చూస్తాడు.

మనోజీవలక్షణాభిజ్ఞత లేని
రాతియుగంనుండి
మనో జీవ సంస్కార సాహిత్యం లేని
‘స్ఫుట్నిక ’ యుగం వరకు
తమ నీడ చూచి తామే భయపడి
తమపై తమకే నమ్మకం చచ్చి
ఆ రాక్షసప్రవృత్తికి లొంగిపోయి
మూర్ఛాసమస్థితిలో నున్నపుడు;
ప్రాభాతారుణ చైతన్య రేఖవలె
నిదురనుండి [4]మేల్కొని నేను
ఎప్పుడు ఎంతవరకు పయనిస్తానో
అప్పుడు అంతవరకు దివాభోగము.

## గాలులు

ప్రతి క్షణం,
ప్రత్యణువు శైలీరూపం దాల్చి
గతంలో లీనమా జీవిత సమాధిని

కదలించే గాలులు.

పొంగులుగా గుమ్ములుగా క్రమ్ముకొని
వచ్చి[1,2]పోవు వెలుతురు చీకటిలో
[3,4] తొలి మలి సంజవేళల
విరిసిన [5] మనసు మల్లెపొద పైనుండి,
[6] త్రాచుపాముల పూత్కారాలతో
[7] తుమ్మెద బారుల రొదలతో
[8] గుప్పున కమ్మని తావులతో
[9] ప్రాణ తర్పణంగా నిండుగా
[10] ప్రాణ ఘాతుకంగా తీవ్రంగా
కదలివచ్చు గాలులు.

యంత్రంవలె వేగంగా గడిచిపోవు
బ్రతుకులు విడిచే బరువు నిట్టూర్పులు,
నాగలివలె మెల్లగా కదలిపోవు
బ్రతుకులు వదలే కోష్ణ నిశ్వాసాలు,
మోసుక వచ్చి – సతతం
[11,12] సగం గాలిలో, సగం నీటిలో ఉన్న
[13] నా గుండె నూపి, ఊహింప జేయు
ధ్వనిగర్భిత పరీమళ సంభారవాహులు.

భూమికి మేఘాగమన రహస్యం తెలియజేసి
వృక్షాంగనలను కౌగిలించుకొని కబుర్లు చెప్పి
హృదయంలో అగ్ని రగిల్చి, దీపాలు వెలిగించి
కపాల రంధ్రాలను పూరించి సంరావం చేస్తూ
అంబుధి విలోల వీచీ తంత్రీ
మృదు నిస్వన రాగాలను వినిపిస్తూ,
పరిణాహ మేధా ప్రపంచ దిశల
ఆలోచనా కిర్మీర పరాగం చిమ్మే గాలులు.
బహు దూరదేశ సమాయాత వార్తావాహులు.
సృష్టిని మేల్కొల్పు ఉషఃకాల సాంగీతికులు.
బ్రాహ్మీముహూర్త మహిత వేళ
సృష్టి రహస్యం ఊహింపజేయు గాలులు.

శిలల ఒరపిడులతో కదలిపోయే
సెలయేళ్ళ చిరునవ్వుల సవ్వడితో
నా గొంతునుండి సాగివచ్చు
పాటలకు శ్రుతులు పోసి,
ఎత్తిన అలల తలలపై మెత్తని కాలూని
కదలివచ్చు గాలులు.
పసిపాపల పెదవులపై చిందులాడు
వెలుగు నవ్వుల గలగలలవలె
ఆరని ఎదమంటలతో శత్రువువలె,
మనస్సును కదలించి కవ్వించు గాలులు.
ఈ గాలుల నేనెలా మరవగలను ?

## కాంతి గీతం

చీకటి గుడిపై వెలిగే
తారల శిల్పసౌందర్యం
విలోకించే కన్నులలో
వెలుగురేఖలు తులకించేవేళ,
చైతన్య స్ఫూర్జితమైనప్పుడు హృదయం,
వెలుగు తలుపులు మూతవడిన
చీకటి కోటగోడలు దూకివచ్చి
ఎవడో సూర్యుడు చంపేస్తాడనే
అజ్ఞాతభయం తొలగిన వేళ –
ముడుతలు పడిన శరీరంతో

నడవలేని పండు ముసలి
సముద్రుని తరుణ హృదయంలో,

ఊగిసలాడి మలగిపోవు కామనలకు
ఉప్పెన రూపంలో ఆకృతి కలిగినపుడు –

గ్రీష్మాదిత్య జ్వాలలకు తపించి
వర్షాంబుద జలాధారా బంధురమై
భూదేవత విడిచే
సురభిళ నిశ్వాస పవన వీచికలవలె
ఊహలు బుద్ధిని అల్లుకొని
మనస్సులో మల్లెలు వికసించిన వేళ –
వినిపిస్తుంది కాంతిగీతం.

సూర్యతేజో కిరణలవమెరుగని స్థితిలో
జివ్వున నెత్రునాడులు లాగు చలిగాలికి
బిగిసిన మంచులా మారి,
చలనశక్తి ఉడిగిన నదివలె;

ముసరుకొన్న పేదరికపు దాడులకాగలేక
పొంగులతో పరుగులెత్తు
నెత్రు వాకలొక్కమారు ఆగిపోయి
ప్రేతాకృతులవలె మారిన
చీకటి మనుషుల గుండెలలో,
చైతన్యపు నిప్పులు చిందుతుంది
ప్రత్యణువు స్ఫులింగంగా
ప్రతి మనస్సు విద్యుద్దీపంగా
వెలుగు జేస కాంతి గీతం.

నీలి కళ్ళు తెరచిన చీకటిగుహలో
జ్యోతీరూపంలా వెలుగు శిల్ప విన్యాసంలో
ఆలోచనలనంతంగా సాగే మస్తిష్కంలో
సౌందర్యం సాహిత్యం ఎరిగిన మనస్సులో
ముఖ్యంగా సిలువ వేయబడిన వేళ

మందారాలు పూచిన క్రీస్తు ముఖంలో

విరిసిన కాంతి గీతం.

అందమైన పూర్ణచంద్రుని ముఖంపై
కాలం విసరిన కత్తిదెబ్బ!
తీక్ష్ణమైన సూర్యుని మనస్సులో

కంటికి కన్పించని గాయాలు
స్వచ్ఛమైన శరదాకాశంలో
కదలాడే నీలిమబ్బు తునక,
జీవితంలో నెరవేరక
మిగిలిపోయిన కోరిక,
వీనిలో దాగిన నైల్యరేఖ.
నీడలా వెన్నంటి ఉండి ప్రాణిని
తనలో ఐక్యం చేసుకోజూచు మృత్యువు.

బుద్ధుని ముఖంలో విరిసిన కళాచైతన్యం,
తనలో లీనీకరించుకున్న కాంతిచక్రం.
అతని పాదాలముందు మెట్లుమెట్లుగా
మలగి అణగిపోయిన చీకటి ముద్దలు.
చీకటి–సమగ్ర మాయారూపం
రాక్షసుల ముఖాలపైని జీవకళ.
వాళ్ళ ఊహలు చలింపజేయు శక్తి లేనిది,
దేవతాత్మకమైన వెలుగు కింత ప్రశస్తి ఉండేదా ?

# శైశవం

కాలస్థల జ్ఞానం మమకారం

ఎరుగని దశ శైశవం.
ఏ వికారమూ ఎరుగని
సృష్టి మొదటి రూపం.

హాలాహలలవ మెరుగని
అమృత భావనా క్షీరధి.
పితరుల ఎద కంటికి
మూర్తిగొన్న సుకృత రూపం
మొగిలు ఉడుపులలో పొరలి
మిన్ను మన్నులో ఆడి
మాసిన మేనితో తిరిగి
చీకటిలో మాయమవక
తిరిగే చందమామ
మెలగి తీరుతాడు ఎదుట
బాల్యం తలపుకు రాగానే మొదట.
ఇటలేవు స్వర్గ నరక రూపాలు
ఇటలేవు పుణ్య పాప భావాలు.

ఏండ్లు పైబడిన కొద్దీ
వికసించి బుద్ధి,
ప్రకృతికి దూరంగా
వికృతికి శేఖరంగా
కోపతాప సంతోష హాసాలు,
లౌకిక మర్యాదల మూసలో
దిద్దుకుంటాయి వివిధ భూమికలు.

శ్లిష్టమె క్లిష్టమై
విడదీయరాని చిక్కువలె
చూపుకందని ఆకాశంవలె
ఎంతలో మారుతాయి బ్రతుకులు.

స్వీయ బాల్య స్మృతులు
మనోవిశ్రాంతికి నెలవులు.
లోకంలో అలసిన మనస్సు
ఇంత ఊహాస్పర్శ కోరుతుంది.

మానవ జీవితంలోని శైశవం
ఊహలో ఇగిరిపోని గంధం.

# నిప్పు పూలు

అగ్ని దేవతామూర్తి చూపులలో
గ్రీష్ముడు నడచిన అడుగులలో
సూర్యుడు తెరచిన వేయికళ్ళలో
ఒక్కమారు అంతటా – పూలు
కణకణలాడే నిప్పు పూలు.

పూర్వం నియంతల హంతకుల నాజీల
గుండెల గోరీలపై విరబూచి
వెచ్చని నిశ్వాస ధూమం విడుస్తూ
సతతం మండి మండి మ్రగ్గే నిప్పు పూలు.

తమలో చల్లదన మెరుగవసలు
విద్యుత్తులా ప్రాకి సిరాపథాన
దిమ్మెక్కించి శిలవలె నిల్వజేసి,
విసరితే తాకి అగ్నివలె
దుస్తులను మాత్రం కాల్చని నిప్పు పూలు.
నవ్వులు చిందు అకాల మృత్యు రేఖలు.

ఇవో రీతి నిప్పు పూలు
అంతటా దొరికే రకంకాదు.
మధుర మధుర గర్జా నినాద
జలధారా స్నిగ్ధ మేఘం;

మృదుసుషీమ వాస్తరంగ జలధి,
కవి హృదయం, వాటికి నివాసం.
అతడు వ్రాసే ప్రతి గీతానికీ
ఈ నిప్పు పూలవాసన ప్రాణాధారం.

స్వేచ్ఛా వాయువు, కాంతి కిరణం కోసం
సతమతమౌ పరితపించు గుండెలలో,
అజ్ఞానపు టర్ధరాత్రి పన్నిన వలలో చిక్కి

ఉదయం మేల్కొని ఛేదింపగ యత్నించే
ప్రాణికోటి గుండెలలో విరబూసి;
మారణాస్త్రాలకు మాడిపోని నిప్పు పూలు.

# స్నేహవీచి

అంగారనిధి గ్రీష్మ దేవత
రక్తానలం చిమ్మే నాల్కలు చాచే వేళ
తడి ఆరిన పుడమి గొంతుక
చల్లని నీటికోసం తపించే వేళ
ఎండలు మృగతృష్ణ పెంచేవేళ
శిలవలె హృదయం ఘనీభవించి
ప్రపంచం శ్మశానంవలె మారే వేళ.

ఎక్కడనుండో ఏ కోననుండో
వేలాది మైళ్ళు వ్యాపించిన
అగాధ సముద్ర తరంగాలపై రవళిస్తూ,
వాటిని కబుర్లతో మురిపిస్తూ,
సై కతాలపైకి పొరలే నదీ తరంగాలను
కిలకిలా నవ్వులతో ముంచేస్తూ,
వృక్షాలను కుశల ప్రశ్నలతో
సంభావిస్తూ గలగల ఊగిస్తూ
మధ్య మధ్య ప్రేమతో
సమున్నత శైల శిఖరాలను
శీతల హస్తాలతో స్పృశిస్తూ,
తెల్లని నల్లనిజాతి జాడ్య మెరుగక

మతాల సూత్రాలకు కట్టుబడక,

రెక్క విప్పిన ఆనందపు లేజగా

వెన్నెల పులుగువలె
పూర్ణిమా చంద్రోదయ వేళ
సముద్ర తరంగంవలె వచ్చి
'' మనిషి మనిషి, మనస్సు మనస్సు
పరస్పర సౌహిత్య పరామర్శన
విశ్వశాంతికి సమర్చన '' అని
గుండెవిప్పి మాట్లాడగల
శిలా ప్రతిమల గుడిముందు
విశ్రమించిన నా చెవిలో
టీకాటిప్పణి వ్యాఖ్యాన ప్రమేయం లేకుండా
ప్రతి మనస్సున కవగతమయ్యే భాషలో
నిశ్శబ్దంగా రహస్యంగా ఊది
మృదువుగా కరచాలనం చేస్తూ
నిముసపు కదలికలో వెళ్లిపోయింది
నిశ్శబ్దపు కదలికలో మరో కోనకు.
నవశీతల మృదుల వాయేస్నహ వీచి.

# కీర్తి స్తంభాలు

ఒకనాడు సుజాతకుల
హృదయద్వార కవాటాల ముందు
ప్రేమావృత జిహ్వాలు చాచి
తారాడిన భుజంగాలు.

శత్రుపు కనులముందు దివారాత్రం
నటియించిన పెనుభూతాలు.

పాదమెత్తలేని నోరు కదపజాలని
కాల శ్మశానంలోని కీర్తి స్తంభాలు.

నాడు,
వేదనలతో కంపించిన హృదయాబ్జం
బాధలతో శీర్ణమైన తనూశిలం,
నేడు ధాళధళ్య స్ఫటికమయ
ప్రాంశుమూర్తియై నిలచి;
ప్రశాంత మౌన భాషలో
ప్రతి మనీషి గుండెనూపి
మాట్లాడే దెవరెరుగుదురు ?

నేడు,
శీతల చందన పరీమళ
వాయు పరీహాస శ్రీలతో
అపరిమాణ వజ్ర శరీరాలతో
అవిగో ! నిల్చిన కీర్తి స్తంభాలు.

గగన తలంపై వెలిగే సూర్య చంద్రులు
ఏ విశ్వనాథుని కీర్తి చిహ్న కేతనాలు ?

నా కనులనుండి మీ కనులదాక, నిండి
మంటినుండి మింటికెగసి నిలచి,
తాజ్ మహల్, అజంతా రూపాలవలె
ప్రత్యక్ష ప్రమాణాల కందని,
స్వచ్ఛ శ్వేత నిర్మల మూర్తులు,
కాల శ్మశానంలో వెలుగు కీర్తి స్తంభాలు.

## లౌకిక శ్రీ

నీవు నా ప్రకృతికి
వ్యతిరిక్తమైన రూపానివి.

నీ ఉనికి
నా లోకానికి ప్రతిలోకం.

నాకు నీకు ఉన్న సంబంధం
మింటికీ మంటికీ గల అంతరం.
ఎక్కడో దూరంగా మిన్ను వున్నా
కలసినట్లు కంటికి భ్రాంతి.
ఎంతదూరం వెళ్లినా అంతా శూన్యం.
ఎంతో దగ్గరిగా వచ్చినట్లు ఉంటావు.
అంతలో మ్రింగివేయాలన్న ఎత్తుతో.

ఒకప్పు డనుకులంగా
మరొకప్పు డభేదంగా
ఆత్మమూర్తివలె,
నాలోకి తీసుకోవా లనిపింప జేస్తావు.
నీ నుండి విడిపోవాలనుకున్నంతలో.

నీవు చేస గాలి రొద
చచ్చినట్లు పడిఉండి
అడవిలా వినమంటావు,
మేమంతా అంబేదలమనుకొని.
ఊహ వాచా చేస్త తెలియదు.
అనుకున్నది తు.చ. చేస్త తప్పవు.

నీ గాలి అక్కరలేదనడం తెలిసి
కోపంతో ముఖం కందగడ్డఐ
అంతలో మంచుగడ్డ ఔతుంది !
ఆ లోలోపల ఏమౌతుందో ?
ఆ భగవంతునికే తెలుసు.

కాని సేసమిరా వదలిపోవు

పీడా విరగడౌతుందనుకుంటే.

నీరులేని మబ్బు ముక్క ఒకటి
చాటు చేసుకొని నవ్విపోకు.
నీరు ఉన్న మబ్బుతునకలేమైనా
గాలికి వదలివేయి చాలు.
పిడుగులు మాత్రం మనసులోనే
భద్రపరచుకోవడం మరవకు.
క్షణం మెరపులిరువురునీ
ఎప్పటికైనా మాసగిస్తాయి.

ఉదయం వలె
ముక్కు పై ఎరుపుతో
కంటిలో వెలుగుతో
పోయే నా వెనుకనే,
రాత్రివలె
డొంక తిరుగుడు ఊహలతో
అపుడపుడూ వెన్నెల ముసుగుతో
వచ్చే నీవు
అబ్బో ! ఎంత లౌకిక శ్రీవి !

# ఈ మాట ఈ చేత

ఐదు వత్తుల్లా పొడవై
పొడి చేస్తాయి కలసీ, విడిగా
ఐదు వత్తుల్లా నిడివై
వెలుగు నిస్తాయి కలసీ, విడిగా

ఆటంబాంబు విసరి

జీవితం త్రుంచేవి

ఆశీర్వచనం చేసి
ఆయుస్సు పెంచేవి.

ఇవి కలసి నిలుస్తాయి
శక్తికి ప్రతీకగా
నేనూ నీవూ గుర్తించేవీ
నీకు నాకు తప్పనివీ.

రావచ్చు ఆరోజు
కత్తులు బూజు పట్టేదీ
వత్తులు ఆరిపోయేదీ
ఇష్టమొచ్చినట్లు చెప్పొచ్చు.

దేశమంటే ఏమిటి ?
ఒక చిటికెడు మట్టి
మట్టిలోని పరిమళం
మనకు మిగిలే సంస్కృతి.

కవిత్వమంటే ఏమిటి ?
ఒక విలు వైన మాట.
మనసుకందే అనుభవం
చేయి దాటిన శక్తి రూపం.

ఆకులు గాలికి మాట్లాడినట్లు
హృదయం మమతా లోలమై
కత్తుల మెరపులో, మెరపు వెలుగులో
నడచే మనిషి గుండెలో, సూర్యుడు

ప్రగతిశీలం నా వర్తనం
మెలకువ నా విప్లవం
ఈ చేయి శక్తికి ప్రతీక

ఈ మాట నా ఎదమ్రాత.

# ఎవరు మీరు?

అస్తమించే సూర్యబింబంతో
ఆనందం విడిచే ఆకాశాన్ని,
నా కళ్ళలోకి తొంగిచూస్తూ
మౌనంగా నీడ బొమ్మలవలె
వెళుతూంటారు ఎవరు మీరు ?

ఉదయించే చంద్రబింబంతో
విషాదం విడిచే ఆకాశాన్ని
అవలోకించే సమయంలో
నా కనులముందు తారాడుతూ
దీనంగా నీలి నీడలవలె
భ్రమిస్తూంటారు ఎవరు మీరు ?

వెలిగే తారాదీపశిఖలు
ఆకాశంలో విడిది చేసవేళ
వృక్ష వర్షీయసి
కోర్కెల ఆకులు విడిచే వేళ
కాలాన్ని మ్రింగే చీకటివలె
శైశిర విచార వాయువువలె
వస్తూంటారు ఎవరు మీరు ?

మిమ్ములను చూడగానే
నా గుండెలో పూచిన పూలు
కళ్ళనుండి జారి రాలి పోతాయి.

గగనవీధి పాలవెల్లివలె
మస్తిష్కంలో విరిసిన ఊహలు

చలించడం మానివేస్తాయి.

దైన్యభావం రూపుగొన్న మీరు
దెయ్యాలా ? ఎవరు మీరు?

దీపానికి నీడ ఎంతదూరమో
నాకంత దగ్గరిలో
వెలుగు మేడక్రింద
చీకటి నిచ్చెనవలె నిల్చిన మీకు
నామాట వినిపించడం లేదూ!
మీరంతా చీకటి మనుషులా ?
అరె ! ఎక్కడా కన్పించరేం,
ఇంతలో ఏమయి పోయారు ?

భానూదయ సమయం ఆసన్నమైంది.
ఉదయవేళా శిల్పమైంది శరీరం.
నటత్ కాంతి ధునీ ప్రావారం
నా భుజాంసవీధి నలంకరించింది.

# ఇరవై ఒకటో శతాబ్దంలో చంద్రుడు

అనాదినుండి నిన్నగాక మొన్నటివరకు
నీవొక దేవతవు, అంటే చెబుతా
మా మనస్సులో కలిగే ఆహ్లాదమంతా
ఒకచోట గూడుకట్టిన రూపానివి.

బూషులచే దర్శింపబడి
దేవతల కమృతాన్నంగా,
చిబుకంపై పుట్టుమచ్చ అందం మరచిన
ఈ దేశపు కవులచే
ఊహింపబడి ప్రేయసీ ముఖ బింబంగా,

ఆకాశాన వెలిగే అమృతమూర్తి !

చీకటి సెమ్మెపైని వెలుగు వత్తి !

నీ నిదుర యొక్క ఛాయారూపం, చీకటి.
నీ మెలకువ యొక్క వెలుగుచాలు, వెన్నెల.
సందేహ భీజాలకు, సమస్యా వృక్షాలకు
ఆకరమైన ఆకాశాన జీవితం గడుపుతూ,
ప్రణయ కోవనులకు దౌత్యం కొనసాగిస్తూ
ఆలాగే ఉన్నావు కళల మార్పుతో
ఇంతవరకు –

సరే ! ఆ సంగతి అలా ఉంచుదాం.
రేపు అంటే ఇరవై ఒకటో శతాబ్దంలో —
మేఘం మనస్సులో, సముద్ర గర్భంలో
అరణిలో, అగ్నిని దర్శించి మానవుడు
దేవతగా భావించిన నాటినుండి
గోళ స్వరూపంగా నిర్ణయించిన నేటివరకు,
జిజ్ఞాసా పరిశోధనల చరమదశ
నీ శిరస్సుపై కాలూనడంతో సరి.

హద్దుల అతిక్రమణ జరగడానికి
ప్రక్కన పరాయివాడంటూ ఉంటేగా నీకు.
ముఖంపై కత్తిగంట్లు పెట్టడానికి
ఎవరికీ అందని ఎత్తులో ఉన్నా వింతవరకు.

ఇకముందు వెలుగు కెరటంలా తేలుతూ
గాలిబంతిలా ఎగిరే శరీర నిర్మితితో
ప్రతి మనిషీ కాంతిగోళంగా మారి
ప్రతి మస్తిష్కం టెలివిజన్ యంత్రమై,
మేమంతా మీ స్థానమాక్రమించి
పూర్వం నిన్ను గురించి ఈ లోకంలో
వ్యాప్తమైన అభూతకల్పనలకు స్వస్తిచెప్పి

సాగించి పరిశోధనలు

ఆయుర్దాయం తేల్చి

కొండజాతికి చెందిన వాడవనో
రాతి నేలవనో నిశ్చయించి
ప్రకటనలు జరుపవచ్చు.

అపుడు నీ చుట్టూ రక్షణకై
అమర్చబడిన యంత్రాలు.
నియమింపబడిన సోల్జర్లు.
పైన తిరిగే విమాన ధ్వనులు.
క్రింద ప్రేలే బాంబుల ధ్వనులు.

నీ జీవిత స్వరూపం మార్చడానికి
అహమహమికతో పరుగిడి వచ్చే
పరిశోధకులు, రాజకీయ డాక్టర్లు.
తెలియని భాషలలో ఏవో ప్రసంగాలు.
తమలో కలుపుకోవడానికి సాగే తంత్రాలు.

హద్దులు కలిగిఉంటేనే దేశాల ఉనికి.
హక్కులు కావలసివేస్తనే ఊహలో విభేదం.
మనస్సులో పొరలుంటేనే ఏర్పడేవి జాతులు.
సూర్యుడున్నంతవరకు నీ వెలుగు నశించదు.

నిను గూర్చి పూర్వం
పగటి కలలు కన్న మేము.
నిన్ను రాజకీయ వేదికగా లేదా
వ్యాపార సంస్థగానో మార్చవచ్చు.

కాలపరిమితి దాటిపోయిన
హక్కుల పత్రం చెల్లుతుందా ?
కాంతి గోళంవలె వెలుగు నీకు
మా అధికారంలో వ్యక్తిత్వం ఉండదూ ?

చలికి బిగిసిన మంచు మనిషిలా

ఒంటరిగా గగన వీధి
బిక్క మొగంతో బీదతనంతో

పాలిపోయి కన్పించిన చంద్రుని చూచి,
ఊగిసలాడిన హృదయం
సృష్టించుకున్న ఊహాత్మక చిత్రం.

# దేవునితో టెలివిజన్ గోష్ఠి

ముఖ్యంగా ప్రతినిత్యం నేను
ఆనందం విషాదం అనుభవించే ప్రపంచంతో
ప్రగాఢ సంబంధం కలవాడిని
బ్రహ్మైక్య భావన చేసి, మీకందకుండా
ఎక్కడో దూర దూరంగా ఉండి
మాట్లాడే ఇష్టంలేదు.

కాబట్టి –
భయంతో కూడిన గట్టి నమ్మకంతో
తమ కీర్తిని కాపాడే మనుషులకోసం,
బ్రతికే దేవతలు నివసించే ఆకాశంపైన,
లోకాలను ఆగ్రహంతోను, అనుగ్రహంతోనూ
కాంతి బాహుపంజరంలోకి తీసికొని
ప్రేమించే సూర్యుడు, కామించే చంద్రుడు
వెలుగు, వెలుగు లోకాలలో — ఆపైన
సర్వం భస్మసాత్కృతి చేసి జ్వలించే అగ్నిలో
లోకాన్ని మాయంచేసి మాట్లాడని చీకటిలో

ఇంకా భూమిలో, గాలిలో నీరులో నీలో నాలో
అణువులో ఒదిగి బ్రహ్మాండం విస్తరించి,
పూర్వం చాలమందికి

వారి వారి సంస్కార దశలనుబట్టి

అనుభూతి రీతులనుబట్టి

భిన్న భిన్న రూపాలలో, బహుస్వభావాలతో
కన్పించి, హేతువుకతీతంగా ఉండి
సిద్ధాంతాలలో ప్రమాణ సహితంగా
స్థిరత్వ మేర్పరచుకొన్న దేవునితో,
ఇరవయ్యో శతాబ్దంలో
ఆధునిక నాగరకతలో బ్రతికే మనిషికీ
టెలివిజన్ గోష్ఠి జరిగిందని చెబితే
ఇందులో ఎవరూ విశేషంగా ఆశ్చర్యపోయి
సశేషంగా ఊహించి
అనుమానాల కేమాత్ర మవకాశమూ
ఇవ్వనవసరం లేదని మనవి.

ప్రపంచం విజ్ఞాన యంత్రశాలగా మారి
వ్యక్తి జీవితం రాజకీయ తత్త్వంలో లీనమై
సైన్సు వెలుగువలె బ్రతుకులు రక్షించేదై
మతం మనిషికి చీకటి లోయలా కన్పించి
జీవితానికి క్రొత్త వ్యాఖ్యానం బయలుదేరి,
ఊహల స్వభావం దానితో క్రియా పర్యవసానం
మారి–మానవ పరిణామ చరిత్రగతికి
క్రొత్త విలువలేర్పడుతూన్న సమయం.

చరిత్ర అట్టడుగున నిటారుగాదిగిన
చీకటి లోయలో నీడలో కలిసిన నిన్ను
పూర్తిగా మరవడానికెంతో కాలం పట్టదు.

ఏ ఆకారమూ లేని నీకు రూపం కల్పించి
నీ రక్షణ వ్యాజంతో
జరిగిన అవమానాలు, హత్యలు, యుద్ధాలు
చరిత్రలో అసంఖ్యాకాలు.

నీ రూపకల్పనలు మలచడమే
పరమ ప్రయోజనంగా మారి

జీవిత యాథార్థ్యం, సాంఘిక చైతన్యం
కోల్పోయింది కళా ప్రపంచం.

మాయలో మాయకతీతంగా మౌనంగా
ఎవరికీ కన్పించకుండా కాలం గడేప నీకు
రానున్న శతాబ్దాలు మృత్యు మహాసోపానాలు.

భూకంపం, యుద్ధం, క్షామం, నియంతృత్వం
అన్నీ దురదృష్ట హేతుజనిత సంఘటనలుగా
నీ దయారహిత కృత్యాలుగా చెప్పుకొని,
ఇష్టంలేని బాధ్యతలనుండి తప్పుకొని
బ్రతుకులు తెల్లవార్చే జనసందోహం !

నీ ఇష్టానుసారం మాపై ఇంతవరకు
ప్రయోగింపబడిన భయంకరాస్త్రాలు
దారిద్ర్యం, రోగం, దుఃఖం, మృత్యువు.
విజయం సాధిస్తూ వీటిపై
వంచిన తలయెత్తి క్రమంగా
స్ఫుట్నిక దశకు చేరుకున్న మానవుడు
ఇరవయ్యో శతాబ్దంలోని విజ్ఞానమూర్తి.

ఆతని ఉన్నచోటునుండి కదలనీయకుండా
అనాదినుండి పరంపరగా వస్తూన్న కర్మసిద్ధాంతం.
వారసులకు సంక్రమించకుండా చేయడం
ఇరవయ్యో శతాబ్దంలోని ప్రధాన ప్రయత్నం.

గతానికి కొందరు చాల దగ్గరి బంధువులు.
వర్తమానం, అందులో శిలానిద్ర వదలించే
విప్లవం క్షమించరాని శత్రువు వారికి.
జడ జగత్తుకు వారికీ అనాదినుండి మైత్రి.
తోటి మానవుడే ఈ మైత్రిని భగ్నం చేయగలడు.
అతనికీ కాలానికీ సముద్రమంత శత్రుత్వం.

అక్కడక్కడా చీకట్లతో వెన్నెలతో నిండి
లోయలతో ఎడారులతో అడవులతో,

జంతు సమూహాల యథేచ్ఛావిహారంతో
నిండిఉన్న ప్రపంచం, దశలుగా వ్యత్యస్తమై,
సిద్ధించిన స్వాతంత్ర్యం సమభావం స్వేచ్ఛతో,
కిరీటాలు అగ్నిలో మండి భస్మమై
సామాన్యుని హృదయం ఉదయకాంతి చక్రమై
ప్రతివదనం విప్పారిన సుమస్తబకమవడం
ఇంతవరకూ సాగివచ్చిన శత్రుత్వ ఫలితం.

ఒక దేశంలోని యుద్ధ జ్వర భయం
విజ్ఞాన పురోగమన వేగం,
ఒక జాతి సంస్కృతీ విశిష్ట లక్షణం
ప్రపంచం సమంగా అనుభవించనున్న యుగం.

వదలబడిన అణ్వాస్త్రంవలె ఎదురులేక,
మైదానంలో విసరబడిన బంతిలా సూటిగా
వేగంతో పరుగిడుతూన్న కాలం.
భవిష్యత్తును సూచించే జాతకచక్రం.

కాలాన్ని నియమించలేడు దేవుడు.
కాలానికి తల ఒగ్గక తప్పదు.

ఉదయవేళ తూర్పున
మంచుబొమ్మవలె పెదవి కదల్పక
మౌనంగా ఉన్నా వేం ?
ఇక నీతో జరేపదెలా గోష్ఠి ?
నీకు నాకు ఎంతదూరమో తెలియదు.
ఇక్కడే ఉన్నట్లున్నది నీవు నా ఎదకంటికి.

''నేనెవరినో నాకు
నీవిప్పుడు చెప్పేదాకా తెలియదు, కాని
నిజం చెబుతున్నా విను.

నీవూ, అంటే మానవుడూ
ఒక దశలో దైవరూపమే.''

# కదలండి శతఘ్నులవలె

ప్రొద్దుపోవడానికి బదులీ రోజున
హఠాత్తుగా యుద్ధం వచ్చిపడింది,
మన ముఖాల ముందు.
యుద్ధవార్త వినిపించిందో లేదో
జ్వాలలెగేస పూలనదులవలె
నిప్పులు చిమ్మే గోళాలవలె
చైతన్యం విరిసిన స్త్రీలు, పురుషులు.

ప్రళయ సముద్ర తరంగాలవలె
బుసలుకొట్టు త్రాచులవలె
ఘోషలతో, ఫూత్కారాలతో
నేల ఈనినట్లు ఎక్కడ చూచినా
నలుమూలల వీధుల్లో, మైదానాల్లో
ప్రతీకార వాంఛలు ప్రకటించే
సమరభావనాయుత జనసందోహం.

భరతజాతి హృదయం
శాంతి కపోతీ నివాసం
నివాసంపై తుపాకులు ప్రేల్చే
హంతకుని మరవకండి !

మనం పీల్చేగాలి
అప్పుడే బరువెక్కింది.
లేవండి మహోగ్నులవలె,
కదలండి శతఘ్నులవలె.

మబ్బు మెరపులకు భయపడి

సహజ గమన వ్యవహారం విడుస్తుందా ప్రపంచం !

మెషిన్ గన్లకు ఉలికిపడి

భూభాగం గౌరవం వదలుతుందా భరత దేశం!

పిడుగులు పరిహరింపజేసి
యంత్రశక్తి మేఘానికెంత తెలుసో?
పన్నిన భూకబళన వ్యూహం
సాగి చావదని శత్రువుకంతే తెలుసు !

లోహ రాక్షసుని కుతంత్ర వ్యూహం
విచ్ఛిన్నంచేసే దీక్షలో
నిమగ్నులైన నా సోదరులారా !
స్వేచ్ఛా సమాజ బలం సర్వం
మనదేశం వెనుకే ఉన్నది.

మంచు కొండలలో విద్యుత్ప్రవాహంవలె
మండే శక్తులతో నిలచిన సోదరులారా !
దేశ భవిష్యత్తుకై వెలుగు దివ్యజ్యోతుల్లారా !
విషవ్యూహం ఛేదించే అమృతమూర్తుల్లారా !

గుండెలో బాకు రువ్వి
కీర్తి పతాక ఎగుర వేసి
శత్రువు వీడనిదే భూమిని
జయింపనిదే వారిని
సమర ప్రతిజ్ఞ వీడక
సమర సన్నాహం మానక
లేవండి మహాగ్నులవలె
కదలండి శతఘ్నులవలె.

బరువు నడకలతో, మూగ ముఖాలతో
ఆక్రందన స్పందించు అమాయక శీలంతో
నగవు హరించిపోయిన పెదవులు బిగించి
ఎక్కడో వంపులు తిరిగిన ఆకాశంలో
ఆశలు భద్రపరచుకొని

ప్రాణాలరచేత బట్టుకొని
పిల్లలతో, పశువులతో,

స్తంభించిన గాలిని కత్తులవలె చీల్చుకుంటూ
తరలివచ్చే కాందిశీకులు!

మానవతా సంస్కార స్పర్శలేని
ఇనుప హృదయాని కెదురు నిల్చి
దేశాన్ని రక్షించడానికి
దేహాన్ని డాలుగా ఉపయోగిస్తూ,
దేహంపైని రక్తసిక్త వ్రణాలు
గులాబీ పుష్పాలుగా భావిస్తూ,
ఒంటరిగా ఉన్నా
తనచుట్టూ పదిమంది నిలచి
ధైర్యమిస్తున్నట్లున్న
మంచుకొండలలో, అగ్ని శిఖలవలె
పదపదంలో ప్రళయలయ
ఎదలో స్పందింపగ ఖడ్గసృష్టి,
సాగే సోదర సైనిక బృందం.
జాతి ప్రతిష్ఠకు ప్రతిరూపం.
మూర్తీభవించిన తేజశ్శిఖరం.

# శ్వేతేతర విహంగాలు

భవిష్యద్ రేఖాగమనం మార్చే
ప్రజాహస్తాలలో చిక్కిన
తమ జాతక ఫలాల కోసం
'క్యూ' మార్కు ముఖాలు చూచి;

రాత్రివేళ భూమికంటక తిరిగే

భూతాల మలిన దేహచ్ఛాయలవలె,

మూకలు మూకలుగా ప్రతిచోటా
విహరిస్తున్నవి శ్వేతేతర పక్షులు !

కాంతి హస్తాలక్రింద వెలుగు
శాంతి హృదయ వాటికలో
అంటు చీకటిచెట్లు నాటి
నిప్పుపూలు పూయించాలని,
నింగినిండా చీకటి నావరింపజేసి
భ్రమగొల్పే తెల్లని రెక్కలు చాచి
మిన్ను అన్నుబట్టి పోయేట్టు
వినాదారభటీ శబ్దాలతో
రేపటికి వేసే బాటలకన్నా ముందు
మాపటికాడే ఆటలో రక్తి కట్టాలని
అహరహం వీలై నంత శక్తి సమీకరిస్తూ,
ఏకంగా ధాత్రినిండా వాలిపోయి
సొంతం రాత్రిమయం చేయాలని
ఉద్రేకంతో రివ్వు రివ్వున వేగంతో
ఉరికి ఉరికి వస్తున్నవి పక్షులు !

పన్నిన కాంతి ఖడ్గజాలంలో
అన్నీ హాయిగా విశ్రాంతి తీసికొనేనా?
విహరించే శ్వేతేతర పక్షులన్నీ
కన్పించే స్వేచ్ఛేతర కక్షలోవి.

# వివరణ

## • నేను మేల్కొని ఉంటాను

పగలు జీవన వృత్తి, రాత్రి విశ్రాంతి మానవ సహజం. దుర్భరమైన ప్రవృత్తులతో దుస్సహమై ప్రపంచం పగలు భయం వేసటంతగా వికృత రూపం ధరించింది. ఈ స్థితిలో మనస్సు పగలు నిదుర, రాత్రి మెలుకువ వాంఛిస్తుంది. కారణం రాత్రి శాంతమైంది. దీనికి కారణమైన స్థితులలో, క్రమంగా మన స్థితులు–ఆశాజీవి పరంగా వచ్చే తరంపై విశ్వాసమూ ఇందులో చిత్రితం.

## • ఎవరది దూరంగా

అవివేకం, అశక్తత, అవమానం, దారిద్ర్యంతో మ్రగ్గే దేశస్థితి చిత్రితం. వ్యక్తి, దేశం, ప్రపంచం క్రమంగా ఒకదానికన్న వేరొకటి ఉన్నతంగా భావితమె చివర మానవత ఆవిష్కృతమైంది.

## • అంతమవని కథ

'ఊర్ధ్వమూలోఽహ్యావాకశాఖ ఏషోఽశ్వత్థః సనాతనః'

కఠోపనిషత్తు (తృతీయవల్లీ)

ఈ ప్రపంచం సనాతన వృక్షము. దాని నీడ జీవనవృత్తిగా భావితమైంది. జీవన వృత్తిలో — మానవ యత్నం, వీడని బంధం, దాపని ప్రేమ మొదలైన ప్రేయా రూపాలు, వీటికి విరుద్ధ ఘటనలు క్రమంగా చిత్రితమైనాయి. ఈ నీడలు వీడనంత వరకు మానవుడు వెలుగులోకి రాలేడు. అప్పటి వరకు కథ అంతం కాదని — ఎప్పటికీ అంతమవని ఈ కథ సూచితం. అద్వైత భావన అంతర్వాహినిగా ఉంది.

## • రెక్కలు దాల్చిన కొండలు

వాయువు – కాలంయొక్క ఆనుకుల్యము; మేఘాలు — ప్రతిభ, సామర్థ్యము కలవారినీ, కొండలు— అసమర్థులను సూచించేవి.

## • ఆఖరికి దేవుడైనా సరే

సూఫీతత్త్వంలో రెండు దశలు ఫానా; బాఖా – బిందువు సముద్రంలో పడుతుంది. మొదట సముద్రాన్ని తనలో ఇముడ్చు కోవాలనుకుంటుంది. బిందువుల సమాహారమే

సముద్రం, అందులో కలసి పోయింది. గ్రీష్మం రాగానే నీరు ఆవిరియై వర్షాకాలంతో తిరిగి అవతరిస్తుంది. పునరావృత్తి — ఉపనిషద్భావనతో గీతం ముగుస్తుంది.

**• భగవంతుడు విడిదిచేసిన లిప్త**

లౌకిక సమస్యలచే సంకీర్ణమైన మనస్సు — వీటిని వదలిన లిప్త, దివ్యమైన స్థితిలో పొందిన అనుభూతి రూపకల్పన చేయబడింది.

**• అంతమవని రాత్రి**

సంఘంలో అవినీతి, దురధికారం, విలయతాండవం చేస విషాద వాతావరణ చిత్రం, శవాలు — హృదయంలేని జడప్రకృతులను ఆత్మ— హృదయంగల చైతన్య ప్రకృతులను సూచించేవి. దీపపు వెలుగు— పగలు, దీపపు నీడ — రాత్రి; వెలుగుచూపు జ్ఞానానికి ప్రతీకలు.

**• అంతంకాని నాటకం**

Lexican Rhetoricae లో Kennethe Burke చెప్పిన Qualitative Progression అన్న కవితా రూపాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసింది. ఇందులో ఘటనలు ప్రధానంగా గీతం ఆరంభించి చదువుతూంటే అనుకోని విధంగా మలపులు తిరుగుతాయి.

**• ఆరని తెలివి**

Lexican Rhetoricae లో Kennethe Burke చెప్పిన Syllogistic Progression అన్న కవితా రూపాన్ని దృష్టిలో పెట్టుకొని వ్రాసింది. ఇందులో ఘటనలు పైదానికి వ్యతిరిక్తంగా, గీతం చదువుతూంటే కలిగే ఊహల కించుమించు ఒదిగిపోతూ వుంటుంది.

**• అమృత వర్షం**

సాంధ్యరోదసి అంతశ్చైతన్య స్థితికి; సూర్యుడు జ్ఞానానికీ ప్రతీక.

**• కాంతి సింహం**

1. విప్లవ భావానికి ప్రతీక 2. ఊహలు 3. మనస్సు విప్లవ భావ విస్తరణం.

**• మూసుకున్న ఐదు వ్రేళ్ళు**

సంఘంలోని ఐదు విధాలైన జీవిత రూపాలకు ప్రతీకలు, చేతికి ఐదు వ్రేళ్ళవలె, వీరు సంఘాస్తిత్వానికి హేతువుగా భావించబడింది.

1.చివరి దశ సూచితం. సూర్యుడు వెలుగుల దొర ఐనా, అస్తమించక తప్పదు. అట్లాగే పైవారి విషయమునూ, ఆరంభంలో సాయంవర్ణన, ప్రకృత విషయాన్ని సూచించేది.

2.మరణ పర్యంతమూ ఏవో కోర్కెలు మానవులకుంటూనే ఉంటాయి.

3.వారు ఐదుగురూ ఉన్న సాంఘిక వ్యవస్థలో భద్రత్వం భావించే స్వభావం చిత్రితం.

4.రాక్షసుల పని అపకారం చేయడం – అలాగే వీరు సామాన్యులను పీడించేవారు.

5.అవకాశ వాదులు.

6.సంఘంలో వచ్చిన విప్లవాత్మక పరివర్తనం సూచితం.

7.పరిస్థితులు.

8.శాశ్వతమనుకున్న వ్యవస్థ కులి పోవడం.

9.పూర్వపు సాంఘిక రూపంతో పాటు, ఆ ఐదుగురూ నామమాత్రంగా నిలచిన స్థితి.

- **నెక్ టై**

స్త్రీకి ప్రతీక (ఫ్రాయిడ్).

- **గాజు గది**

తన విషయం ఇతరులకు తెలియదు, ఇతరుల విషయం తనకు తెలుసునన్న ఊహలతో ఆవరించిన మనస్సుకు ప్రతీక.

1. సరోవరంలో నీరు ఉంటేనే చంద్రుని ప్రతిబింబం కనిపిస్తుంది. గోడలుంటేనే గదికి రూపం. ఊహలతోనే మనస్సుకు స్థితి. అద్దాలు పగిలిపోతే (గోడలు లేని) గదివలె, మనస్సుకు ఊహలు లేనిది స్థితి లేదు.

- **సంధి పత్రం**

1. వర్తమానం భవిష్యత్తుచే అంతమొంది గతమౌతుంది. అపుడా భవిష్యత్తు వర్తమాన మవుతుంది. ఇది చక్రనేమిక్రమణంలా జరిగేది. కాలం అఖండమైంది. ఈ త్రికాలాలూ మన ప్రయోజనార్థం ఏర్పరచుకొన్నవి.

2. ఉదయ కాలం 3. సాయంకాలం 4. కృష్ణపక్షం — సూర్యకిరణ ప్రసారం జరుగకుండా చంద్రుడు ప్రకాశించలేడు. 5. శుక్లపక్షం 6. ప్రస్తుత సామాజిక పరిస్థితులు

చిత్రితం. ఒక నిస్సహాయ స్థితిలో చేయగలిగిందిలేక, మనస్సులో ఆశాభావం కలిగి ఉండి, వ్యంగ్య ధోరణిలో ప్రకటించే కోపస్వభావరీతి ఇందులో కన్పిస్తుంది. 7. భవిష్యత్తుపై ఆశాభావం, వర్తమాన స్థితి నిరాసనం, కాకువు వలన స్ఫూర్తి కడుతూంది.

**● పతాక వార్త**

ఉదయాలూ, రాత్రులూ వస్తూ పోతూ ఉంటాయి.

''కాలాన్ని హత్యచేసి కాలం దాని స్థానమాక్రమించి తిరిగి కాలంచే హతమౌతుంది.''(సంధి పత్రం) సాయం సంధ్య, రాత్రిచే, రాత్రి ఉదయంచే చంపబడడం ఈ చిత్రణలోని భావసూత్రం. దీనికొక ఆకృతి ఇవ్వడానికి ఉదయం వెనుక రాత్రి హంతకుని మనస్థితి, అప్పటి ప్రకృతి స్థితి ప్రయాజింపబడింది. హత్య, మృత్యువు చుట్టూ కల్పన సాగింది. ఉదయం పరమాహ్లాదకరమైంది. ఈ మహానుభూతి – మానవునికి ప్రతి ఉదయం ఒక జన్మ ఎత్తినట్లుగా ఉంటుందని చివరి పాదాల్లో వ్యక్తమయింది.

**● నేను**

1. అజ్ఞానం 2. దుష్ట ప్రవృత్తికి ప్రతీక 3. అజ్ఞానానికి చివరలేదని– ఈ భావ చిత్రణలో సూచితం 4. అజ్ఞాన వలయందాటిన జ్ఞాన మూర్తికి ప్రతీక.

**● గాలులు**

గాలి ఒక మనస్థితికి ప్రతీక. 1. సుఖం 2. దుఃఖం 3. జీవితంలోని మొదటి రోజులు 4. జీవితంలోని చివరి రోజులు 5. సహజమూ, స్వచ్ఛమూ ఐన మనస్సు 6. దుష్ట ప్రవృత్తి 7. గమన లక్షణం— చలన స్వభావం 8. సౌందర్యానుభూతి కలిగించేది 9. ఆనందానుభూతి కలిగించేది 10. దుఃఖ దాయకమైంది 11. ఆధ్యాత్మిక భూమిక 12. భౌతిక భూమిక 13. అనుభూతి — తద్వివేచనా లక్షణం.

**● కాంతి గీతం**

మంచి – చెడు, జ్ఞానం – అజ్ఞానం, వెలుగు–చీకటి ఈ పరస్పర విరుద్ధ గుణ భావరూపాలు పరమమైన చైతన్యాంశ ప్రకృతి పరంగా లోక వృత్త రీతిలో చిత్రింపబడినాయి.

**• నిప్పు పూలు**

i. అగ్ని దేవతా.............విప్లవాత్మక భావనలకు ప్రతీక

ii పూర్వం.............రాక్షస ప్రవృత్తులకు ప్రతీక

iiiఇవో రీతి.............వేదనామయమైన ఊహలకు ప్రతీక

iv స్వేచ్ఛా.............స్వేచ్ఛాతత్త్వానికి ప్రతీక

**• కీర్తి స్తంభాలు**

సమాజ శ్రేయస్సుకోసం — ఒక మహాలక్ష్య సాధనలో కష్టాలు సహించి, నష్టాలు పొంది తనువులు చాలించిన వారు — కీర్తి కాయులకు ప్రతీక.

**• స్నేహ వీచి**

విశ్వ మానవ భావనకు ప్రతీక. ప్రకృతి రూప చిత్రణలు మానవమనో అంతర వివిధ దశలు సూచించేవి.

**• లౌకిక శ్రీ**

జీవితంలో ఏ ఒకరికీ చిక్కకుండా పబ్బం గడుపుకొనే మనస్తత్వరూపానికి ప్రతిబింబం.

**• ఎవరు మీరు**

మానవునిలోని చెడు చీకటి, మంచి వెలుగుగా భావరూపం చిత్రితం.

**• ఇరవై ఒకటో శతాబ్దిలో చంద్రుడు**

ఆధునిక మానవుడు వైజ్ఞానికంగా సాధించిన పురోగతి, చమత్కారంగా చంద్రునితో సంభాషణా రూపంలో కల్పితమైంది.

**• దేవునితో టెలివిజన్ గోష్ఠి**

నేడు జీవితంలో మానవుడు కోల్పోతున్న సాంస్కృతికమైన విలువలు; ఆధునికమైన అతని మనస్తత్వమూ – స్ఫూర్తి కట్టిస్తూ దైవంతో సంభాషణ కల్పితమైంది.

**• శ్వేతేతర విహంగాలు**

స్వేచ్ఛేతర వాదులకు ప్రతీక.

# ముక్తకాలు

# ఉష ఆగమనం

# మాదిరాజు రంగారావు

సాహితీ బంధు బృందం

హనుమకొండ

వరంగల్

**ఉష ఆగమనం**

# స్వేచ్ఛా కవిత్వం

## ముక్తకాలు - ఉష ఆగమనం

ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

MUKTAKALU - USHA AGAMANAM

by

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: అక్టోబర్ 1970

సాధారణ విజయ దశమి

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

# ముక్తకాలు

# ఉష ఆగమనం


| | పుట | రచనా కాలం |
|---|---|---|
| ముక్తకాలు | 1 | 1962—70 |
| ఉష ఆగమనం | 29/31 | ‘62 |
| సౌందర్య శిఖ | 35 | ‘61 |
| రసాకృతి | 45 | ‘60 |
| హిమజ్వాల | 56 | ‘62 |
| ఛాయ | 59 | ‘57 |
| ఆ వెనుకనే | 62 | ‘62 |
| మొగిలు విరిసి... | 64 | ‘62 |
| ముక్తకాలు | 65 | ‘70 |

# ఒక మాట

డాక్టర్ మాదిరాజు రంగారావు ఆధునిక వచన కవితా ప్రక్రియలో బహు
కావ్యాల్ని ప్రచురించి ఆ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సుప్రసిద్ధ
కవులు.
ఆధునిక మానవ జీవితాన్ని మనో విశ్లేషణ ఆధారంగా వివిధ కోణాల
నుండి
దర్శించి మధురానుభూతుల్ని చిత్రించడం వీరి కవితా లక్షణం.

ఇంచుమించు పదిహేను సంవత్సరాల నుండి ఈ కవితా ప్రక్రియలో
వ్యాసంగం
చేస్తూ ఈనాటి తరం కవులకు కుందుర్తి తరువాత ప్రేరణ కలిగించిన
వారనడంలో సందేహం లేదు.

ఇదివరకే వీరి ''యుగసంకేతం'' ప్రకటించి సాహిత్యాభిమానుల
ఆదరాభిమానాల్ని పొందగలిగినాము. ఇప్పుడు మళ్లి ''ముక్తకాలు — ఉష
ఆగమనం'' ప్రకటించుటకు అనుమతించిన శ్రీ రంగారావుకు మా కృతజ్ఞతలు.

హనుమకొండ

**సాహితీ బంధు బృందం**

ది. 10.10.1970

# ముక్తకాలు

క్షణక్షణం మార్పునొందు ఈ జగత్తు
ఎవరి హేలకోగాని ఏ రోజున కారోజే
ప్రశ్నాపత్రంవలె ప్రత్యక్షం కంటిముందు
జవాబు కోసం మనిషి మారును మనీషిగా.

ఏ పెదవులపై విరిసిన హాసగ్రీలీసుమాలు
సంజవేళ వన్నెతో, మరునాటికి మన్నులో
శ్మశానగతి నొందేవి క్రొత్తవాటి కిచ్చిస్థలం!
నాశనస్థితి ననుసరించి నవ్యసృష్టి అనుక్షణం.

దూరంగా ఆకాశం ఎక్కడనో
భూదేవిని కౌగిలి పూనిన రీతి
మనసు నల్లుకొను మమతలు
మనిషిని వదలని గొలుసులు.

మల్లీ సౌరభాలు ఝుంఝూమారుతాలు
స్రేయానిదానాలు, ప్రళయాదగ్రగతులు
మనిషి ప్రకృతిలో రెండుగా ఒదిగి ఉన్న
అమృత సరోమూర్తులు, అగ్నిగోళ వర్తులు.

రోజులు పక్షాలు ఋతువులు వత్సరాలు
పునఃపునరావృత్తమా కాలచక్రం
కోపాలు ద్వేషాలు ఈర్ష్యలు కలహాలు
అవే ఊహలు చేష్టలు, అదే మనస్తత్వం.

మనసులోతులు వెదకు కన్నులు కొందరివి
మనిషి రూపం చూచు కన్నులు కొందరివి
కనులే ఉంటవి చూపు తప్ప కొందరికి

గ్రుడ్డివారివలె కన్పడు వారికే చూపు జాస్తి.

## ముక్తకాలు

ఉదయం నిశామృగాన్ని వేటాడుతూ రవి
గగన వనంలో అవతరించాడో లేదో
మేల్కొని నిదురించే పర్యంతం భూమిపై
మనిషిని వెంటాడే మనిషి, నీడను నీడ.

మహాకాల కాసారంలో వికసించిన
కనక శతపత్రం సూర్యుడు — కాదు;
అంధకార వలయంలో అనేకాబ్దాలుగా
పరిభ్రమించే హృదయాగ్నిగోళం.

కాలదేవత మనసులో విరిసిన మల్లెలు
ఉబికిన సంతోష తరంగాలు చుక్కలు — కాదు;
భాగ్యహీనుడు రాల్చిన బాష్పకణాలు
హృదయం ఎగజిమ్మిన అగ్నిస్ఫులింగాలు.

దుఃఖమయ జీవితంలో హ్లాదైకబింబం
గగన తమోపథంలో పారాడే శిశు శశి;
అవును పాషాణ హృదయం భేదించుకొని
ఉద్గమించిన సౌందర్యకళా సృజన.

భాగ్యహీనుని కంటినుండి జారిన బాష్పకణం
చీకటిలో చివుకు బ్రతుకునెత్తి చేప దీపం
బాష్పకణంలో నినదించే బాడబాగ్ని సంగీతం
శిథిల మనఃకుటిలో నీడల అడుగుల చప్పుడు.

చెట్లు కనే కలలు పూలు పండ్లు
వాని ఊహలకు ప్రతి రూపాలు, నీడలు
నదులు కనే కలలు పంటలు పైరులు
వాని ఊహలకు ప్రతినిధులు తరంగాలు.

# ముక్తకాలు

మనిషి కనే కలలు ఆశా మరీచికలు
అతని ఆలోచనలకు ప్రతిబింబాలు
అజంతా హిరోషిమా బూక్కులు స్ఫుత్నిక్కులు
పైన దేవతలు, క్రింద రాక్షసులు.

సూర్యుడు ఆరిపోడు, భగవద్భావన చావదు.
తమస్సు ఉండదెపుడు, ఆశలేక బ్రతుకు లేదు.
యుగాలు గతించినా ఆదియుగ మనస్తత్వం
వస్తుంది పరంపరగా ఏదో ఒక రూపంలో.

చావు జయింపబడదు,అందుచే అంత భయం.
గతం చచ్చినా రాదు, అందుకే దురభిమానం.
మెలకువయే వర్తమానం, అందుకే అంత ఇష్టం.
భవిష్యత్తు భద్రమైంది, అందుకే ఎంతో ఆశ.

గ్రీష్మం వచ్చింది నిప్పు రెక్కలు విప్పి
బంగరు కుప్పవలె భాసించింది జగత్తు.
రాత్రి వచ్చింది మసక కన్నులు విప్పి
బూది కుప్పవలె మారిందదే లోకం.

దీపశిఖచుట్టూ దూరంగా ముసరిన
దారి తెలియని గ్రుడ్డి వెలుగులు
దీపశిఖను స్పృశించలేవు సరికదా
చీకట్లకు దారైనా చూపలేవు.

కొందరికి చీకటిలో పయనించడంకన్న
వెలుగులో నిదురించడ మభిమతం.
కొందరికి చీకటిలో నిదురించడంకన్న
వెలుగులో పయనించడమే ఇష్టం.

# ముక్తకాలు

నావ ఇసుకలో కూరుక పోయింది
నావికుడు మానం వహించాడు
ప్రయాణికులు కలత జెందేరు
అలల ఉద్రేకం తగ్గనే లేదు.

కనులముందు జారింది నీలి తెర
వల్లకాడు ఐంది జగత్తు.
కనుల ముందు వెలసింది వెలుగు తెర
వెండికొండ ఐంది జగత్తు.

దాహంతో చావనున్నవారు
మహానదిలో దింపబడ్డారు
దాహం మాట దేవుడెరుగు
తిరిగి కంటికి కన్పించలేదు.

గుండె గాయంతో జ్వలించునపుడే
తెలుస్తుంది జీవితమెంత విలువో!
పత్తి కాలుతూ ఉన్నంతేసేప
చూపగలదు వెలుగు ప్రపంచానికి.

ఖైదునుండి విముక్తులిద్దరు హంతకులు
ఒకరినొకరు చూచుకొని సాగారు ముందుకు.
ఒకరికళ్ళలో పరచుకొన్న నిర్మలాకాశం
మరొకరి కళ్ళలో పరివర్తించు అగ్నిగోళాలు.

మృత్యువు మరో రూపమే గతం
అనుభవాత్మకం, వర్తమానం.
ఆశాఽభాసం భవిష్యత్తు
ఈ మూడిటి సంపుటి జీవితం.

# ముక్తకాలు

మహామతికి కాలమొక జవాశ్వం.
కొందరికి ఆకులు కదలు వృక్షం.
మందమతికి నిశ్చలన పర్వతం.
అనుభూతి వ్యక్తినిషం, మానసికం.

నీలిమబ్బువలె క్రమ్మిన దుఃఖం వెనుక
చంద్రబింబంవలె దాగిన ఆనందం.
బ్రతుక్కి లేదొక నియతమైన ఆకృతి.
కలసివేస్త పుష్పశయ్య, లేకపోతే శరతల్పం.

గ్రుడ్డివాడు అద్దంలో చూచుకొని ముఖం
ఆనందంలో లీనమై మురిసినట్లు
కళ్ళు ఉన్నవాడు ఎదుటివాని ముఖంలో
మనస్సు చూడాలని తహతహ ఎంతో.

వెలుగు చీకటి ఎన్నటికీ కలవని
మహా కాలనదీ తీరాలు.
స్వర్గ నరకలోక సంకేతాలు
మనసులోని ఆనంద విషాదాలు.

కొన్ని చెట్లు పూలు ఎరుగవు
కొన్ని పూలకు పరిమళం ఉండదు.
కొందరికి హృదయముండదు, బుద్ధిఘనులు
కొందరికి అనుభూతి పట్టదు, అదృష్టవంతులు.

నిదురలో గడచింది రాత్రి
సముద్రంలో ఓడవలె
ఉదయం కనువిప్పగనే
తీరభూమి— పర్వతాలు, లోయలు.

# ముక్తకాలు

ఒక్కొక్క మనిషి జీవితం
వ్యాఖ్యానింపదగిన ఒక్కొక్క సూత్రం
చివరి అక్షరం చదివే వరకు
అర్థం గ్రహించడం సులభంకాదు.

ఉదయం మొగ్గయె అవతరించి—
సాయం వాడినపూవు ఈ రోజు !
రాత్రి సముద్రంలో మునిగే నౌక
చివరకెటు చూచినా అంతాశూన్యం !

చుక్కలు చీకటిలో బ్రతుకు గడేపవనీ
తరంగాలు చలించి తక్షణం నశించేవనీ
విచారించడం మానవహృదయ స్వభావం
వివేచించడం అతని బుద్ధి లక్షణం.

వెన్నెలకు కులంలేదు, అనుభూతి ప్రశ్నలేదు.
మనిషికున్నది మనస్సు, దానితోనే అన్ని ఉన్నవి.
ఇవి లేనిది యాగులకే, అంతకన్న అలౌకికులకు
లేదని నమ్మించడం లౌకికమూర్తులకే సాధ్యం.

నీనా కళ్ళముందు పుట్టి పెరుగు శిశువు
నీనా కళ్ళముందు పండుబారిన వృద్ధు
ఒకరి ఆగమనం మరొకరినిష్క్రమణం.
ఇరువురి చూపుల కలయిక ఎక్కడో ఒకచోట.

సామాన్యుడి గుండెలో గూడుకట్టి
బిగిసిన హిమశ్రేణులవలె బాధలు
సామాన్యుని బ్రతుకులో ఎదురై
మారిన మరుభూములవలె ఆశలు.

# ముక్తకాలు

స్నేహం పరిమళించెడి ఎదలో
పూవులో జ్వాలవలె ఆవేదన
సంపైగ రెక్క విప్పు చూపులో
సంజవేళ రక్తిమవలె ఊహలు.

చంద్రబింబం వెనుక జ్వలించే హృదయం
చంద్రవదనం వెనుక తపించే హృదయం
వీచే గాలి పొరలలో ఒదిగిన వెన్నెల
తోచే అడుగుజాడలు వదలని కన్నులు.

రాత్రి నిదురించిన సూర్యుని మనస్సులో
ఉదయించిన స్వప్నవలయం చంద్రబింబం.
తన శరీర సౌందర్యం అందులో
చూచుకొని పరవశమా నిశాదేవి!

అనంతాబ్దాలుగా నిదుర ఎరుగని
కీర్తి సముద్రం, ఈ ప్రపంచం
నిరంతర చలనంలోనే దానికానందం
తన అస్తిత్వంపై తనకే అనంత విశ్వాసం.

బ్రతుకు ఇంకా ఇంకా బ్రతకాలంటుంది
నదిపై తేలివచ్చే అలలవలె ప్రియంగా
దూరం నుండి మృత్యువు గాలివలె
వచ్చేకొద్దీ ఉద్వేగమధిక మౌతుంది.

బ్రతుకు గడుస్తుంది యంత్రంవలె కొందరికి
మలగని దీపతోరణంవలె కొందరికి
క్రమ్మిక వదలని నిదురవలె కొందరికి
అవిచ్ఛిన్నయజ్ఞంవలె మరి కొందరికి.

# ముక్తకాలు

కన్ను తెరచి మేసలోపల ప్రతిదినం
మిత్రంవలె ఉదయం ఎదురుపడి
శత్రువలె సాయం అతిక్రమించి
వెళుతుంది మృత్యు రహస్యమూది మెల్లగా.

ఏ గమ్యం చేరుటకై సాగుతూన్నవి నదులు?
ఏ ఖండ మార్ద్రపరుప తరలుతూన్నవి మొగిళ్ళు?
ఏ విధిననుసరించి భ్రమిస్తూన్నవి గోళాలు ?
ఆ మహార్థధ్యేయంగా వెలుగుతూన్నవి బ్రతుకులు.

బూదియె ఎగిరి రేణువులు రేణువులుగా
మట్టిగా ఒకనాటికి మారే మానవుడు
క్రీనీడల చెరసాలలో బంధితుడై ఖైదీవలె
బ్రతికినంత కాలం మానవునికే ఎక్కువ శత్రువు.

జీవితం ఎగసిపోయే కాంతి విహంగం.
బహు దూరం వెళ్ళుతుంది, గతిస్తుంది.
వెనుకకు తిరిగి రావడమంటూ ఉండదు.
భవిష్యదాకాశంపైనే సదా ప్రయాణం.

ప్రతి వస్తువు కళాన్వితం,
ప్రతి వస్తువు పరిశీలనాయాగ్యం.
ప్రతి భావం మనోఽను భవనిషం.
ప్రతి మనిషి ఊహా జగత్తు భిన్నం.

ఆనందమతిలో స్థాన మేర్పరచుకుంటుంది స్వర్గం.
విషాదహృదిలో అవతరించి ఉంటుంది నరకం.
మృత్యుభావనతో సాగుతుంది ప్రపంచం.
మృత్యు పరిణామంతో అంతమవుతుంది జీవితం.

# ముక్తకాలు

కష్టజీవి మేనిపైని స్వేద బిందువులు హరింప
శీతలసమీర హస్తాలతో వచ్చింది ఉగాది,
ఈనాటికైనా అతని బ్రతుకు చిగిర్చిందని
యుగాలు గతించినా వీడని ప్రాణబంధువు.

ఒకచోట ఒక మేరలో నిల్వదు ఊహాలోకం
ఒకనాటి కొక దశలో అంతమవదు అజ్ఞానం.
ఎప్పటికపుడు సమస్యలు తీరిపోనున్నట్లు
అప్పటికపుడు భాసింపజేస్తుంది విజ్ఞానం.

నిదురపట్టడంతో కాటికి కాళ్ళుచాచి
రెక్కలు విరిగి కుప్పగా కూలిన కాలం
మేల్కొనడంతో భూమి పైని పాదమెగసి
రెక్కలు విచ్చి ఎగసిపోయే విహంగం.

ఉషస్సు ఊర్పులో, తమస్సు కూర్పులో
జనుషానందంలో, మృత్యువిషాదంలో
మూల మనస్తత్వంలో కాలగతి రూపంలో
లేదు మార్పు సృష్టి ఉన్నంతవరకు.

ఒక గాలి విసరుకు వాలిపోయే చెట్లరీతి
ఒక ప్రభుతకు ఒదిగి ఉండు మనస్తత్వం
ఒక స్థితిలో మండిపడి కాల్చు అగ్నివలె
ఒక దర్పంతో ప్రభుత నెరపు అహంకృతి.

ఆశాజీవి మనస్సులో ఊహావధిగా
సుందర కాల్పనిక నిర్మాణ పరంపరలు
వాస్తవ రూపంలో గాలితెర వేస్త చాలు
గుర్తు తెలియక చెదరిపోయే ఇసుక మేడలు.

# ముక్తకాలు

ఒకడు దూదికన్న మిక్కిలి తేలిక చూపుకు
మతిలో పాముకన్న ఎక్కువ విసపు కోరలు,
ఒకని చూపు సన్నజాజి పూలదండ
అతని చేతం రాక్షసగణ క్రీడాస్థానం.

ఒకనాటికి తుది అవని గ్రంథం ప్రపంచం
చాలామంది చదవరు, కొందరు యత్నిస్తారు
పూర్తిగా అర్థమైనవారెవరూ లేనే లేరు
ఎవరేమన్నా ఎవరి ప్రపంచంమటుకు వారిది.

రాగంలేని మనిషి లేడు భువిలో
వర్ణంలేని వస్తువు కన్పించదు
ఒకస్థితి రీతినిబట్టి కలుగుతుంది
ఇతని కానందం, దాని కందం.

ఆకాశ మతిక్రమించే దురాశతో
తహతహతో పైకి పైకి ఎగిరే విహంగం
రవితేజానికి భగ్గున మండి బొగ్గై
ఏ మట్టిలో కలిసిపోయేదీ ఎరుగదు.

సృష్టి ఎన్నటికీ ఏమాఇ ఏమా అవదు
ఏమా అవనున్నట్లనిపిస్తుం దెప్పటికపుడు
జ్ఞానంతో పరాస్తమైపోయి అజ్ఞానం
తిరిగి దానినుండి అవతరించినట్లు

ప్రతిక్షణం, కాల సముద్రంలో
నిలకడ ఎరుగని తరంగం
ప్రవాహానికి మహాపథం
భవిష్యత్తుకు వర్తమానం.

# ముక్తకాలు

కాలం కనులుమూసి పబ్బం గడుపుకునే
అమావాస్య హృదయంగల మనిషి
కాలం నడకనంటి బ్రతుకు నడుపుకునే
మెరపు వెలుగు మనస్సు కలాడొకడు.

కాలం కనులు విప్పి జగతికి వెలుగునిచ్చే
సూర్యుని వెలుగువంటి బ్రతుకొకరిది
నాడు నేడు రేపు భేదంలేక చీకటివలె
చంక్రమించే 'తర్కంలేని ఎద్దులు' కొందరు.

కాలగర్భంలో కలసిపోయే మానవుడు
కాల ముఖంలో వెలసిన వర్ణరేఖ
బహువర్ణ విచిత్ర రేఖావలయం ప్రపంచం
ప్రతిక్షణం మార్పులతో వర్తించు చిత్రరంగం.

చపలత్వంలో స్థానమేర్పరచుకొన్న నరకం
కాలం వదలిన ఆరని కన్నీటి నిప్పుకణం
శాంత భావనలో అవతరించిన స్వర్గం
కాలముఖంలో విరిసిన ఆనంద పద్మం.

మానవుని సమార్ద్ర ప్రవృత్తి వివృతరూపాలు
సంగీతం సాహిత్యం శిల్పం త్యాగం
మానవుని కఠోర ప్రకృతి వివిధ ముఖాలు
అధికారోన్మాదం, అహంకారం, యుద్ధమహాదాహం.

వెలుగులో తమ వ్యక్తిత్వం స్ఫురింపజేసి
చీకటిలో లీనమా, ఆకాశం భూమి సర్వం
బ్రతుకులో దీపశిఖవంటి మనస్సునంటి
ముందు వెనుకల సుఖదుఃఖపు వెలుగు నీడలు.

# ముక్తకాలు

ముగిసిన కలవలె గతించింది రాత్రి
కలలు కనడం మాని మేల్కొన్నాడు మనిషి
ఒక వలయంనుండి ముక్తమైంది మనస్సు
మరొక వలయంచే సంగ్రహితమైంది సృష్టి.

విపదబ్ధి మునిగి ఒకని మనసు
నవనీత సదృశం మసృణమూ
సుఖాబ్ధి తేలుచూ ఒకని మనసు
అగ్ని సదృశం దాహకమూ.

చచ్చి బ్రతికి ఉండేవారికన్నా
బ్రతకడానికి చచ్చేవారే ఎక్కువ.
కొందరిని కాలం అమావాస్యవలె
కొందరిని పూర్ణిమవలె వరిస్తుంది.

కనురెప్పలు ముంచుకవచ్చే
సవేగ నిద్రా కురంగం
మిన్ను మన్ను ఏకంచేస
సుదీర్ఘ నిశాతరంగం.

బ్రతుకులోని చివరి ఘడియ
గతస్మృతులకు కేంద్రం
ఆ వేళ కదలే ఊహ
విష బిందుయుత మధుకోశం.

నిదురలో స్వప్నంవలె ప్రపంచం
భూమిపై తిరిగే బొమ్మలు ప్రాణులు
మనిషి మనసులో స్వర్గం, నరకం
పైన ఉన్నవో లేవో మన కనవసరం.

# ముక్తకాలు

ఆగకు నడువు ఆలోచనలతో ముందుకు
ఎదురు పడనీ పరంపరగా పెనుచీకట్లు,
విచ్చుకొని దారులవే ఇస్తాయి వెలుగుకు
గమ్యం తెలీనపుడు ఉన్నచోటు చాలు.

ఒక చోట నుండి కదల్లేరు కొందరు
వారి శరీరం వారికే బరువు.
వారి రాకడగాని పోకడగాని
ఎవరిపై ఏ ప్రభావమూ నెరపదు !

ఎంత వయస్సు వచ్చిందో పైబడి
అంతకాలం హరించి పోయింది
మెరపువలె గతించింది నిన్నటి రోజు,
విహగంవలె వచ్చి వ్రాలింది నేటి ఉదయం.

ఏడుపు ఏడుపు ఎక్కడ చూచినా ఏడుపు !
పొందడానికి ఏడుపు పోగొట్టుకొని ఏడుపు!
బ్రతకడానికి ఏడుపు చావడమై ఏడుపు
ఏడుపుతో పుట్టుక, ఏదో ఏడుపుతో చావు !

నిప్పులు చెరగుతూ వచ్చే గ్రీష్మం
మండించింది తానూ మంటగలిసింది.
ఓడిపోయిన లోకం, గెలిచిన తాను
చివరకందుకునే ఫలితం ఒకటే.

ఉదయం వెలుగుతో సూర్యుడు
రాత్రి చీకటిలో చంద్రుడు.
వివృత సంవృత రూపాలలో
సృష్టి వికాసం, పరివర్తనం.

# ముక్తకాలు

ప్రతి వస్తువులోని అందాన్ని తెలిసికోవడం
ప్రతి మనిషికీ సాధ్యంకాని మాట నిజం.
ప్రతి మనిషినీ సంతృప్తి పరచడం
ప్రతి వస్తు ప్రకృతికీ అతీత విషయం.

ప్రతి క్షణం నశిస్తున్న జగత్తులో
అనుక్షణం జరుగుతూంది సృజన.
ఉదయం కరగిపోయే మంచువలె
మనస్సులో సరిస్తూంటవి ఊహలు.

ఒకప్రక్క అంతరిక్ష శోధనలో విజయం
ఒకప్రక్క అంతర్బహి క్షోభలతో జీవితం.
ఎప్పటికపుడు దాటవలసి ఉండే కాలం.
క్రమ్మి భయపెట్టే నీడలు !విచ్చి ఆకర్షించే వెలుగులు !

మనిషికన్న మనిషి ఉన్నతంగా బ్రతుక దలచినపుడు
నాటికి నేటికి ఏనాటికీ నశించదు సాహిత్యం.
మనిషికన్న మనిషి అధికంగా బ్రతుకదలచినపుడు
ఏనాటికైనా విజానానిదే అధిక ప్రాబల్యం.

రాత్రి వెలుగు చుక్కలవలె
కనులలో దీపించే ఆశలు.
పగలు, రాత్రి రోజు వెంట రోజు
బ్రతుకు విసరు రాయి మాస్తరు.

పగలు రాత్రి వచ్చిపోతూనే ఉన్నవి.
యుద్ధాలు క్షామాలు వచ్చిపోతూనే ఉన్నవి.
ఇంకా మేల్కొనని జన సందోహం
గాయాల బాధ ఎరుగని కళేబరం !

# ముక్తకాలు

అగ్నినార్పుతూ తిరిగేవారు కొందరు
అగ్ని రగుల్చుతూ తిరిగేవారు కొందరు !
సాగరం నిండా ముత్యాలే ఉంటాయా ?
భూమి అంతా బంగరు గనులేనా?

వీరుని రక్తసిక్త దేహంవలె
జ్వలిస్తూంది సంధ్య.
ఒక దీపం ఆరింది
మరో దీపం వెలిగింది.

జీవిత నాటక మెంత వరకు ?
మృత్యువు తెర పడనంత వరకు.
బ్రతుకు భేషజమెంత వరకు ?
ఆశకు ఆఘాతం రానంత వరకు.

స్వప్నం వచ్చింది
బ్రతికి ఉన్నట్లు తెలిసింది
తెలివి వచ్చింది
చచ్చి ఉన్నట్లు బూజువైంది.

ఈ లోకంలోకి రావడమంతా
సమానంగానే బహు సామాన్యంగానూ
ఈ లోకం వీడి పోవడమూ అంతే
ఈ మధ్య పాత్రలోనే విశేషమంతా.

నిన్నటి పరివర్తనం
నేటి దృష్టిలో సంప్రదాయం !
రేపటి పరివర్తనం
నేటి దృష్టిలో అభ్యుదయం.

# ముక్తకాలు

ఉదయించిన చుక్కలు మదిలో
ప్రసరించిన వెన్నెల హృదిలో
అహంకార రూపం దాల్చి
కనుల ముందు, అంధకారం !

మహా నది స్త్రీ, రసాకృతి
పురుషుని కామం, ఆరని అనలం.
ఒక పరిధిలో స్త్రీ స్వతంత్రురాలు
ప్రవహించ లేదు, ఆధారం భూమి లేక.

చలికి బిగిసిన జీవితం అంగారం కోరుతుంది.
మరో ఉదయం కోసం బ్రతుకుతూ మనిషి
హృదయ హాసంతో వెలిగించేను చీకటి రాత్రులు
మృత్యువును జయించడమే చివరకు మిగిలేది.

గతిస్తుంది మానవయుగ పరంపర
మేధా విలసనలతో, హృదయ స్పందనతో,
స్ఫూర్తినిస్తూ మానవ క్రమ వికాసం
నిలుస్తుంది చరిత్రలో మెట్లు మెట్లుగా

శిరస్సుపై వెలుగు చిమ్మే సూర్యుడు
కనులముందు దారులు విచ్చిన ఆశలు
పాదాల క్రింద తిరుగుతూన్న భూమి.
మనస్సులో, దారి తెలియని నీడలు !

మానవుని ఊహ చివరి బిందువు, ఈశ్వరుడు.
ఈశ్వరుని సృష్టి చివరి రూపం, మానవుడు.
ఎవరికోసం నిర్మితమౌతూందో భవనం
వారి చేతలలోనే అవుతూంది వినాశనం !

# ముక్తకాలు

గులాభీ హృదయం చుట్టూ కంటకాలు
దూరం నుండి ఆనందింపజేస నెత్తావులు
దానిని త్రుంచడం తెలియడం లోకజ్ఞత.
దానిని వశపరచుకొనడం లౌకికం.

ఇసుక రేణువులు లెక్కపెడుతూ
కాలక్షేపం చేయకు జీవితమంతా
ఎడారి విప్పిన ఎద రూపం చూడు.
ప్రవాహ తరంగ పంక్తుల నూహ చేయి.

నీ మనస్సులో నీడలు లేనంత వరకు
నా ముఖంలో వెలుగు కన్పిస్తుంది.
సముద్రంలో సాగినట్లు ఓడ నడక
వెలుగులో తెలుస్తుంది నీడజాడ!

ముందుగా శిశిరం వేస్తరానీ దైన్యంతో
దాని వెనుక వసంతం వచ్చే ఆశ ఉంటే చాలు.
కనులుమేస చీకటిరానీ పరవా లేదు.
కనులు తెరచే వెలుగు నీలో ఉంటే చాలు.

ఎప్పుడూ ఎక్కడా ముఖమెత్తి చేయిచాచి
ఆకలి గొన్నవానివలె పయనించకు !
ఎప్పుడైనా ఎక్కడైనా ఎద విప్పి చేయి ఎత్తి
తృప్తిపడిన వానివలె వర్తించు, చాలు.

మబ్బు నశిస్తుంది వర్షం విరిసి కురిసి
పూవు రాలుతుంది అందం, గంధం చిమ్మి,
గాలి కదలుతుంది ప్రాణం స్పందింపజేస్తూ
బ్రతికి నీవు ఇచ్చేది? తోటివారికి దుఃఖం !

# ముక్తకాలు

మనిషి ఒక పూవు, ప్రపంచం ఒక తోట
ఈ పూవులెన్ని విధాలంటే చెప్పరానన్ని.
రంగుపై మాజు ఉంది, పరిమళమూ కావాలి
రెండూ కలిగిన మానవులంటే మరీ ఇష్టం.

నా కనులలోని నీరు ఆవిరిఐ పోయింది
బయటికి రాకముందే వేదనకెపుడో
అదృష్టం మేల్కొన్న గులాభీ వదనంపై
ఉదయం మంచునీటి ముత్యాల వరుస.

కదలెడి సరస్సువలె మనస్సు
వదలని నీడలవలె ఊహలు !
ఒక దానివెంట వేరొకటి రాకడతో
నా ముఖం చూచుకునే వీలే లేదు.

నేను ఓడను ! అయితే
భూమిపై ఎలా పయనిస్తాను !
నేను నీడను ! అయితే
వెలుగులో తేలగలను.

గ్రుడ్డి రేయి అద్దంలో
ముఖం చూచుకున్నా
నా రూపం మినహాయించి
కన్పించాయి ఎవరెవరివో.

రాలిన పూవు శీర్ణమై
కలియడానికి మట్టిలో
ఎంత కాలం పడుతుందో?
అదే నిజంగా చావు సమయం !

# ముక్తకాలు

నరకం పాపిని శిక్షించింది.
పాపం అడుగునే దాగి ఉంది.
దేహ మందుబాటులోనిదాయె
ఆత్మ అంతు చిక్కనిదాయె.

లేదు విశ్రాంతి నీకు
నాకు లేదు విశ్రాంతి
ప్రపంచాని కంతకన్నా లేదు
దేవుని కంతకన్నా లేదు.

తండ్ర! నిన్ను కీర్తించడానికి
నాకు సమయం లేదు !
నేను భయపడ్డ తుపాను
అపుడే వచ్చే సూచన లేదు.

ఇది కాసారమా? మృగ తృష్ణో తెలీదు.
ఇది సర్పమా? రజ్జువో? అంతకన్నా
ఇది రూపమా? ప్రతిరూపమా తెలీదు.
ఇది అదా ? అది ఇదా ? రెండూ ఒకటేనా ?

నిదుర వదలిందో లేదో
ఎక్కడ చూచినా ముఖాలు
ఒక దాని నొకటతిక్రమించే
మంచు తెరలు, నిప్పు ముద్దలు.

ప్రతి మనిషిలోని భావరూపం వేరు
ప్రతి మనిషిలోని అనుభూతిగణం వేరు
అందుకే ఆగదు అన్వేషణ జీవితంలో
ఎప్పటికపుడు క్రొత్త రేకులు తొడుగుతూ.

# ముక్తకాలు

శబ్దం పిలుస్తుంది ఎలుగెత్తి
హృదయం డలువడింది విసుగెత్తి
వస్తూ పోతూన్నారు మహా జనం !
తల చేతులూ కాళ్ళూ ఒకటే.

గాలి విసరుతూంది
సృజిస్తూ అగ్ని చిత్రాలు.
జ్వాల విజృంభించింది
పొగులిస్తూ రగిలిస్తూ పూల గుండెలు.

అగ్ని పర్వతంపై గుడిసైవలె ప్రపంచం
అగ్ని గురించిమాని, అగ్నిగా మార్చు ! పాట —
రాత్రి కెదురుగా ఉదయం వలె
నిరాశ కెదురుగా మానవత.

మృత్యువు ప్రతి లిప్తలో ఉంది
జీవమూ ప్రతి లిప్తలో ఉంది
మృత్యువు నీడలో బ్రతుకు
జీవం వెలుగులో బ్రతుకు.

సూర్యుని మెలకువతో సంతోషం
చంద్రుని వెలుగులలో ఆహ్లాదం, సరే
చీకటిలో, సానుభూతితో
స్పందించనీ, హృదయం కాస్త.

ఎండ ఒక ఋతువులో
వాన ఒక ఋతువులో
గ్రీష్మం, వర్షం ఒకదాని వెంట మరొకటి
ఒకటి వినా లేదు మరో దాని మనుగడ.

# ముక్తకాలు

తిరిగి తిరిగి చివరకు
అక్కడికి చేరాడు మొదటికి
ఎవరి పైనా నమ్మకం లేదు
అందుకే ఎవరూ నమ్మరు.

వాన చినుకులు నవ్వుతూన్నవి
అవని పై పడక ముందే ముత్యాలు.
పైన పక్షీ క్రింద శిశువూ
పరవశంతో పరుగు తేసరు.

బంగారు రేకుపై పేరూ ఊరూ చెక్కి
సముద్రంలో వదలి వేశాడొకడు
శాశ్వతంగా ఉండిపోతుందని పాపం !
అవును, ఉందేమొ! ఎవరికి తెలుసు !

భీటలు వేసిన కాలపు సందుల్లో
ఇరుక్కొని పోయిన కోరికలు !
వర్షా సమయం లిప్తల కదలికలో
వినిపించ ప్రయత్నిస్తాయి సంగీతం !

రేపటి ఉదయంపై ఎంతో ప్రేమ
అయితే చీకటి నెదుర్కోవలసి ఉంది
రేపు మేల్కొనడం కోసం
ఈ రాత్రి విశ్రాంతి, అవసరం.

మన మెక్కడ కలిసామా తెలీదు
విడిపోయింది గుర్తుంది బాగా.
ఆలోచిస్తే, ఆశ్చర్యం! మనిషీ, మాటా
మట్టిలో గాలిలో కలిసేవేనా!

# ముక్తకాలు

రేపు ఉంటే మంచిదే
వివేకం కోల్పోక,
ఈ రోజు ఉందే దీన్ని
అధ్వాన్న పరచుకోకు.

వేచి ఉన్న కొద్దీ
ఓరి మెక్కువౌతుంది నాలో
ప్రవహించిన కొద్దీ
ఉరవడి తగ్గినట్లు ప్రవాహం.

బ్రతుకులో తప్పనిసరి నిర్వేదం
అప్పటి నిశ్వాసం భూగోళమంత భారం
మనం కోరని మృత్యువు
మనలోనే ఉంది చిత్రం.

వెలుగు ముద్దు పెట్టుకుంటుంది
ఆకునీ పూవునీ పండునీ
చీకటి బుద్ధి చెబుతూనే ఉంది
ఊహకు ఆశకు మనస్సుకు.

ఇదొక మహా శ్మశానం.
దేనికో ఒకదాని కేడ్చేవారే, అంతా
లేదు ఒక్క క్షణమైనా
ఏదో ఒక చావు లేకుండా, ఎపుడూ.

రోజు వచ్చిపోతూంది బ్రతుకులో
రాత్రి తారాజల నేత్రాలతో
ఉదయం హిమరుక పాతంతో
మధ్యాహ్నం నిశ్వాస పరంపరతో.

# ముక్తకాలు

ప్రతివాని మనసులో ఉంటుంది వేదన
అది అతనికి కోవెలలో మ్రోగే సన్నాయి.
ప్రతి వానికీ తన మనస్సు ధవళపద్మం.
ప్రతి వానికీ తన వేదన మహాపర్వతం.

భూమి గాఢ నిద్రలోనున్న వేళ
ఆశలు హ్రస్వమైన సమయం
ఎక్కడి నుండ నిశ్శబ్ద రోదనం?
మంట గలేస మానవతదేమా!

ఏకాంతాన్ని భగ్నం చేస
తలపులో వేయి ఊహలు.
మెలకువను మాపివేస
యత్నంలో వేయి స్వప్నాలు.

నీ ముఖం కన్పించదు
అద్దంలో చూచుకుంటే
కనబడుతుంది చూపుకి
లోతు తెలీని సరస్సు.

నా ఎద కన్పించదు నాకు.
అనుభూతిలో తలచుకుంటే
గోచరిస్తుంది బుద్ధికి
తీగెలు సరిచేసిన వయొలిన్.

రాత్రి వ్రాలేను నాపై బరువుగా
పగలు తప్పుకునేను ఒడుపుగా
ఎడారిలోనూ ఎక్కడో పచ్చదనం !
విషాదంలోనూ ఎక్కడో మాధుర్యం !

# ముక్తకాలు

మృత్యుసీమ లనంతం
ఊహ చివరలూ అనంతం
తెలియదెక్కడ మొదలై
ఎక్కడంత మొందుతాయా?

కాలం మరపు గతం
కాలం తెలివి వర్తమానం
తెలివితో ప్రయాణికులు
ఎవరికి వారు సర్దుకుపోతారు.

ప్రతివాడూ అంతో ఇంతో మంచివాడే
ప్రతివాడూ అంతో ఎంతో చెడ్డవాడే
ప్రవాహం మమతను స్ఫురేస్త
పర్వతం ధైర్యం కలిగించేది.

బ్రతుకంటే ఏమీ లేదు
ఒక దోసైడు నీరు
పనికి వస్తుంది త్రాగడానికీ
తర్పణం విడువడానికీ.

నిదురించే శిశువువలె ఉగాది
ఆకతాయి కావచ్చు రేపిది
ఆ పైన ఏమవుతుందో పెరిగి ?
వేయాలి సుమీ జాతక చక్రం !

రోజు పుట త్రిప్పుతోంది
చావు ఎరుగని రాత్రి
ఇంకా ముగియలే దధ్యాయం
ఇది సమాప్తిలేని గ్రంథం.

# ముక్తకాలు

యుద్ధ భయంలేని వాతావరణం
ఎప్పుడు సిద్ధించింది చరిత్రలో !
వచ్చే తరాలు మనలోని
మంచితో పాటు చెడుకీ వారసులే !

మృత్యువుకి మనపై ఎంత ప్రేమ !
ఎపుడూ వేచి ఉంటుంది పాపం !
మనకు దాని పై అంతో ఇంతో
అభిమానమూ లేక పోలేదు.

ఎవడూ ఇక్కడ చావుకు సిద్ధంగా లేడు.
అయినా వస్తుంది చావు తానై సిద్ధంగా
బెజ్జం ఉన్న నావ అయినపుడు
నిలుస్తుంది సాగినంత కాలం; జీవితం.

మన ప్రయాణంలో మైలురాయి
వస్తుంది ఉగాది తడిపొడి గాలులతో
కాలం ఊపిరి తీసుకుంటుంది తెరపిగా
బ్రతుకు చేదు రుచి చూస్తుంది తీపిలో.

యంత్రాలు మారణ యంత్రాల
అభ్యుదయంతో రూపొందిన నాగరికత
మానవ ప్రగతికి ప్రతి బింబం.
తప్పించరాని చరిత్ర గతి రూపం.

గాలికి నిశ్చలంగా ఉండేనా చెట్లు ?
మ్రోడులు బండలు, గుట్టలు తప్ప !
సంగీతం విరమించి ఉండగలదా సముద్రం ?
గుంటలు, పడియలు కాల్వాలు తప్ప !

# ముక్తకాలు

ఏ ఒక్కరి బ్రతుకు
నీడలేని వెలుగు దివ్వె కాదు.
ఏ ఒక్కరి బ్రతుకు
వెలుగులేని చీకటి ముద్ద కాదు.

బ్రతికి ఉన్నంత కాలమూ
తామొక శిలాశ్రేణి యేనా?
చచ్చాక మరి దేనితో సమానం?
మట్టితో, అదీ మార్పులో భాగమే !

ఆలయ గోపురాలకు, విగ్రహాలకు
బంగారపు తొడుగులు, ఆభరణాలు.
ప్రక్కనే విలువలేని బ్రతుకులు
ఉడుపులంతకన్నాలేని శరీరాలు.

దివ్వియ ఒడిలో పడుకున్న నాకు
తెలీదెప్పుడు వస్తుందో ఉదయం.
దివ్వియఎదలో వెలిగే నాకు
తెలీదెప్పుడు వచ్చేది రాత్రి.

పస్తువుకు కదలికకు
మనస్సుకు ఆలోచనకు
జగత్తుకు మానవునకు
సమకురే సంబంధం, చరిత్ర.

భయం మాయకు చిహ్నం.
మాయలో మనిషి అజ్ఞాన శిఖరం.
తెలీనితనం తప్పిస్తుంది దారి.
ఏదారెక్కడ తెలీదు తేలీదు.

# ముక్తకాలు

కాలం పరిణామకారి.
కాలం పరివర్తన శీలి
సృజన శక్తి, కాలం
నాశన గతి, కాలం.

శప్త కంఠాలతో వస్తూపోయే జనం
ఎక్కడా చూపు మేరలేదు పచ్చదనం
భగ్గున సంస్కృతి మండే మంటలలో
తెలుపు విరిగి ఎరుపైక్కిందవనీకపోలం!

కాదు నేను జలధి తరంగం
అవును నేను కదలే కన్నీటి కెరటం
కాదు నేను కదలనేని విగ్రహం
అవును నేను రూపంలేని ఆకాశం.

దుఃఖం సముద్రం వంటిదంటారు
పల్లం నుండి చూస్తే కన్పించదు
చెలియలికట్ట నధిరోహిస్తనే
కన్పించి అనుభూతి నిస్తుంది!

రాత్రి పగలు నిజంగా నా సేవకులు
యజమానులవలె ప్రవర్తింప జూస్తాయి
నిదురించిన వేళ ప్రత్యక్షంగా
మేల్కొన్న వేళ పరోక్షంగానూ.

చంద్రుడు వచ్చినా రాక పోయినా
రాత్రి నిల్వదు, అనుభవం ఆగదు
రేపు కన్పించేను, కన్పించక పోయేను
ఎగురనీ జీవితం ఉషస్సై.

# ముక్తకాలు

# ఉష ఆగమనం

# ఉష ఆగమనం

పరివర్తన సీమలలో
పరిభ్రమిస్తూన్న నేను
ఆ ముఖం కోసం చూస్తున్నా
ఆ హృదయం కోసం వెదకుతున్నా.
నా కనులలో వెలుగై వెలిగేదీ
నా హృదయంలో ప్రాణమై ఉండేదీ.

పక్షి జంతు మానవ రాక్షస దేవతలలో
భూమి నీరు తేజస్సు గాలి ఆకాశంలో
మబ్బు మొక్క పూవు పండు స్వప్నంలో
సామ్యం గమనించేదీ, భేదం గుర్తించేదీ,
అంశలెరిగి తాదాత్మ్యం పొందేదీ
అనుభూతి కొలతలో అంతరార్థ మెరిగేదీ.

పంట దిరిగిన ముఖక్షేత్రాల నవలోకిస్తూ
మ్రోడువారిన వృక్షాలను పరామర్శిస్తూ,
దుఃఖం దుర్మార్గం సంతోషం సన్మార్గం
ఆశ ఐశ్వర్యం, క్షామం నిరాశ
విజయం అపజయం, బ్రతుకు చావులో
నను ప్రశ్నిస్తూ సమాధానం కోరేదీ
నను ఊహింపజేస్తూ అనుభూతి నిచ్చేదీ.

ఎక్కడో వెదకుతున్నా
ఇక్కడే ఉంది !
అరుణ కిరణ శ్రీ సరణి రూపం
ధరించిన అమృత దీపం!

ఈమె నెక్కడో చూచినట్లుగా ఉంది
ఎంత కాలమో అయినట్లుగా ఉంది
నా ముఖ దర్పణంలో పూర్వం
ప్రతి బింబించిన చంద్రబింబం.
నా మనః కాసారంలో పూర్వం
విహరించిన రాజహంస.

చలచ్చంచలోన్మీలిత జలదపంక్తి,
గగనం ప్రతిఫలించిన గభీరజలధి!
జ్ఞాపకం వస్తూన్నవి వరుసగా,
ఈమె, ఆమె ఒకటేనన్న భ్రాంతిజనకంగా.

మూర్తీభవత్ శిశిరంవలె వస్తూన్న ఈమె
ఎవరో మొదట సరిగా తెలియ లేదు.
అందుకున్న హృదయస్పందన వేగంతో,
క్రొన్నెత్తురు నిండి, వాసంతశ్రీకమై
వెలుగుతూంది, నవన్నవతాకృతి.

అప్పటికి ఇప్పటికి ఎంతగా మారింది ?
మానవ జీవితం; ప్రపంచ రూపం !
ఆశ్చర్యంలో దాగిన ప్రశ్న,
సమాధానం వలె,
ఊహలో ప్రతి ఫలిస్తూంది
నే కోరిన రూపం.

# ఉష ఆగమనం

కాలం తెచ్చిన మార్పు
గుర్తించనీయలేదు మొదట.
ఉదయం మంచు తెరవలె
ఇపుడు వీడింది నిదురపొర.

2

నీవు చైతన్యసీమలో
ఊహాశిఖవలె అడుగిడేప్పుడు
నాలోని అభిమతి నీ కెదురై
తోడ్కొని వస్తుంది కౌగిలి పూని.

అరణి నుండి అగ్నివలె
నీ నుండి మరో రూపం.
నాలోని విశ్వాసం తెచ్చి
ఆశకు ఇస్తూంది ప్రాణం !

సుడి గాలులు రేగుతున్నవి మతిలో
సుడిగుండాలు భ్రమిస్తున్నవి నెత్తురులో.
కాసారంలో నౌకవలె
హృదయంలో చరిస్తున్నావు నీవు.

నీ కళా సౌందర్యం
కన్నుల మెరపులలోనే కాదు
తరువాత తెలిసింది
కన్నీటి చినుకులలోనూ ఉందని !

వెనుక అసంఖ్యాకంగా
స్వప్న కథలతో వచ్చేదానివి
ఇప్పుడంతకన్న ఎక్కువగా
వాస్తవ స్థితులతో వస్తున్నావు.

# ఉష ఆగమనం

వెలుగుతో ఎదురౌతున్న నీకు
స్వాగతం పలుకుతున్నా రోదసినై
ద్యావా పృథివీ దేవతలు
ఆశీస్సులు ప్రసరిస్తున్నారు.

నీ గురించి ఎన్ని కలలు కన్నాను
నీ నిజరూపం మరచి పోయేటంతగా
నీ గురించి ఎంతగా కలలు కన్నాను
ఇక మేల్కొను స్థితికి రాలేననుకున్నా.

అన్ని దిశలు తెరచుకున్నాయి
నీవు వచ్చే దిశలోని వెలుగుతో.
చీకటి చీరలు తొలగి
మంచు రవికలు జారి
గాలి పొరలు ఒదిగి ఒదిగి
వెలుగు దారి ఏర్పడుతున్నది.

భూమివలె నీవు కన్పించినపుడు
సృష్టికి మూలశక్తి వనుకున్నా.
ధ్వనిలో స్ఫూర్తి పొందినపుడు
ప్రణవ రూపమనుకున్నా.

గతంలో వ్రేళ్ళు దన్నుకొన్న
పురా వృక్షానికెక్కడో పూచిన
పూవుగా ఉన్న నీవు,
స్వప్నంలో ఊపిరి నిలుపుకొని
స్వర్ణఖచిత రూపంలో
గగన విహరణం సలేప నీవు,
వర్తమానంపై చూపులిడి

# ఉష ఆగమనం

జీవిత చిత్రానికి జీవరేఖవై
వచ్చేవు భూమిపై అడుగులు వేస్తూ.

చైతన్యం విరిసిన ఆత్మ రోదసిలో
భామతి ఉషస్సు అవతరిస్తూంది!
సహమతి అగ్నిమూర్తి, సూర్యునివలె
ప్రసరించి పరీవృతుడనై ఉన్నాను.

## సౌందర్య శిఖ

వచ్చింది ఆమె కాంతిమతి
నీడ ఎరుగని దీప శిఖ.
అంధకార శిలా పంక్తులు
చందన వృక్ష సమితిగా,
జీవన శకలం స్వర్లోకంగా
భావింపజేయు శక్తి రేఖ.

ముఖంలో అలలుగా హాస పంక్తి
కనులలో అమృత బిందువులు
ఉదయం తీసుకొన్న మొదటి నిశ్వాసంలోని
ఆశా పతాకల ఉత్సాహ దీప్తితో
వచ్చింది ఆమె కాంతిమతి.
నీడ ఎరుగని దీపశిఖ.

వర్షాగమన వేళ
శీతల సుకుమార వాయువువలె

# ఉష ఆగమనం

లిప్తల మెట్లపై సంగీతలహరియె
వస్తూన్న ఆమె పాదాల ముందు
బారులుగా విచ్చినవి వెలుగులు.
దృగ్వీథి గుర్తులుగా
ప్రబ్బికొన్నవి నీలిమబ్బులు.

హృదయంలో పల్లవించి
పెదవి పై కుట్మలించి
వాక్కులో సుమించు
దివ్యమైన అనుభూతితో,
కాంతిమయం చేసి వాయువలయం,
లిప్తలు పరిమళితంచేయు వెలుగు దివ్వె.

ఝుంఝానిల తీవ్రత్వం నైశిత్యం
ఎరుగని మొదటి వాసంత క్షణం.
పరిమళ వదనంపై రోచిర్హాసంతో
విచ్చిన హిమ స్వప్న పద్మం.
సర్వధ్వనులూ తనలో విలీనం చేసుకొన్న
అఖండ శాంతి రూపం.
మూర్తీభవత్ అమృతలహరి.

నా అంతఃకరణంలో ఆమె కదలిక
కాల చక్ర లయాత్మక గమనం.
ఆశా పరివేషితమె అఖండ శాంతి
ఆమెతో వచ్చింది నాలోకి, మూర్తి కట్టి.

రవి కిరణం భూమిపై అడుగిడే ముందు
పల్చని గాలి తెర పై,
ఊహా చిత్ర పరంపర సృష్టించుకొనే

ఆకాశ శతపత్రం వలె ఆమె.

**ఉష ఆగమనం**

గగన తలంపై చంద్రబింబ మవతరించగనే
స్వాదు తర సంగీత ధునీ విలోలమై,
తనలో తా పరవళ్ళు త్రొక్కు
రోచిరుదార సముద్రంవలె నేను.

ii

దివి నుండి అవిచ్ఛిన్నంగా కురియు
దివ్యామృత కాంతి ధార !
భూమిపై తరగలొత్తుకొని
వ్యాప్తమౌ పరీమళఝురి!

దిక్కులేని దిక్కువలె,
చీకటి రాయివలె పడి ఉన్న
నన్ను ఉజ్వలితుని చేయు
ఉదయ తేజోలతికలు, నీ కళ్ళు.

గ్రీష్మవేళ వాయు మండలం
చందన వాఃపూరమైనట్లు,
నా భావ జగతి నీ అవతరణ
మొట్టమొదటి వసంతోదయం.

చంద్ర రేఖా బింబితమై
పై కెగయు కెరటాలవలె,
దిగ్వసనం ధరించిన
సముల్లసత్ వక్షోజాలతో
స్మిత సుమరుక్ దీపంతో
శరన్మేఘ శిల్పాకృతి,
నవనీత పాత పదగతితో,
వీణానాద ఝురీ తరంగంవలె

# ఉష ఆగమనం

మెయి వంపుల హొయలతో
ఎదురుగా వచ్చు సౌందర్యశిఖ!

ఆవిష్కృత నాద రూపమై
కదలి వచ్చు నిన్ను చూచి
అలలు తలలు వంచినవి
గాలులు స్తంభించినవి.

లే మంచుపొర సోకిన
గులాబి రేకు పెదవులపైని,
ఇంద్ర చాప వర్ణాలను;
విశ్రాంతి నెరుగని గాలి
సముద్రంపై కెరటాలను వలె
సమీకరించి, మేళవించి
సౌందర్యం ప్రోది చేస్తూ;
సుప్త కళికలవలె
అవిదితంగా గడచు
లిప్తలెన్ని అర్పించా
నీకు సమర్చనంగా.

రవి దీపం అస్తమించగనే
నాకు కన్పించినది నీవు.
ఊహ బిందురూపం, చంద్రబింబం !
దీపం ఉన్నపుడు, ఆరినపుడూ చూచా.
ఆ నవ్వు,
తరంగవల్లి, హిమ స్వప్నం.

ప్రాణవంతమైన నాదలహరివలె
చకచ్చకిత కాంతి వలయంవలె

# ఉష ఆగమనం

విచ్చిన కనక శతపత్రంవలె
నీ రూపం అవతరించినంతనే
నిద్రిస్తున్న లిప్తలు మేల్కొని
సుస్వర సంగీతకులైనవి.
మందీభవదీహాలు కదలి
జ్వాలా రుచిరములై నవి.

గాలికి అంచెలు అంచెలుగా తేలివస్తూ
నీటి ఒరపిడికి అణగి, వడికి ఉబికి
లేచి ఎగసిపోవు కెరటంవలె,
నిశా నేత్రాల నుండి దూకు
దృక్చంద్రికతో వచ్చి
నాలో లీనమై ?

కాలం విప్పిన
తీవ్రమైన కనుచూపు నుండి
తెలివిగా తప్పించుకొని,
నను మరపులో బంధించి
ఏ నీడ, రహస్యం బైట పెడుతుందోనని
శంకతో, చేతిలో ఒదగకుండా
జంకుతో, చూపులో నిలువ కుండా
సాగిపోవు చలన్మతి!
చంచల వర్షాంబుద రమ్యతనూ !

గాలి వంటి ఆలోచనతో
పటంవలె తిరుగుతూ
నీ కోసం వేచివేచి, ఎన్ని అబ్దాలు
మంచు కొండలవలె నిలచి పోయినవి.

ఉష ఆగమనం

ఎన్ని వసంతాలు ముగ్ధ ముగ్ధంగా
తొంగితొంగి చూచి పోయేవి?
దుఃఖ హంసతికలై మండుతూన్నవి?
లిప్తను ఘనీభవించి ఆగిపోయినవి.

నీవు మాత్రం —
ఎక్కడో ఆగిన మొగిలు జంట మాదిరి
వంగిన కనుబొమలతో,
ఆకాశంవలె వహించిన
మౌన ముద్ర సేసమిరా వీడవు.

వెలుగు వత్తులు వేసుకొని
వేయి కనుల నుండి
జలజల మంచు బొట్లు రాలుస్తూ
నిశ్శబ్దంగా కరగి పోతున్నది కాలం.

iii
నిద్రా సరస్సులో వికసించిన
స్వప్న కల్హారంవలె నీవు.
జాగ్రదావస్థా తీరంలో
చంద్రునివలె భ్రమిస్తూ నేను.

కొండలు చీల్చుకొని వస్తుంది నది.
మబ్బులు దూసికొని వస్తుంది మెరపు.
విత్తు పెకల్చుకొని వస్తుంది మొక్క.
మనస్సు విచ్చికొని నీవు రావు.

సముద్రమవతల నీవు, ఇవతల నేను.
నీటిపై తేలు చంద్ర నౌకలో రానా?

# ఉష ఆగమనం

ఈ దిశనుండి ఆ దిశకు వ్యాపించిన
శశి రశ్మలు పట్టుకు రాకూడదా ?

సుందర దివ్యానుభూతి
మౌన్నత ప్రమాణం, స్వర్గం.
స్వర్గ వికాసం, నీ రూపం
లయమెరుగని సంగీతం,

క్రమ్మిన మంచు పొరలు చీల్చుకొని
కదలివచ్చు ఉదయ కిరణంవలె
స్మృతి వలయంలో భ్రమించే నీవు.

సముద్రంలో తరంగం వలె
మబ్బులో మెరపు వలె,
కన్పించి కనువిందుగా
అంతలో మాయమౌ నీ రూపం.
కనులలో బింబించి
హృదయంలో సాక్షాత్కరిస్తుంది;
గభీర నిశ్శబ్దంలో జనించి
ఉచ్ఛ్వాస నిశ్వాసపుటంతరంలో
ఒడ్డున విరిసిపోయే
కడలి తరగలవలె
అడుగుల చప్పుడుతో.

ఆకాశంలోకి నిలువునా
నిలచి చూచే వృక్షాల వలె
సముద్రంలోకి అడుగులు వేసి
కదలిపోయే నదులవలె;
నిను పరివేషించిన

**ఉష ఆగమనం**

స్వర్లోక గవేషణలో
విభిన్న ఛలాకృతులు దాల్చి
తిరుగుతూంటివి ఊహలు, వాంఛలు.

ప్రభాత వేళ రోదసి ధరించిన
వెలుగు ముసుగువలె నున్నది.
మనస్సులో ముగ్ధముగ్ధంగా పొడిచిన
నీ భావగత సంతోష తరంగం.

సంధ్యా రాగంతో ఆర్ద్రమైన
పూల మబ్బు కదలేప్పుడు,
నీవే వస్తున్నావని మ్రోగుతుంది.
నిశ్శబ్దం నిండిన హృదయం.

గ్రీష్మం కను స్వప్న సముద్రం నుండి
సాగిన మేఘ మాలిక !
భూదేవత పెదవులపై నవ్వు మొలక
లెత్తించు వర్షధార!

అబద్ధపు వంపులొరసి ప్రవహించు
నిత్యసత్య జలవాహిని వలె,
బ్రతుకులోని లోయలు నిండి
పూల నదివలె విరియు వెలుగువు!

ప్రేమ పూర్ణ కాంతిశ్రీ!
ఆసీమాంతం చెంగలించు రసధుని!
వర్తమాన శిశిరం వెనుక
వేచి ఉన్న వసంత రేఖవు!
కాల వృక్షం పూచిన పూవులో
దాగి ఉన్న ఫల రూపానివి!

# ఉష ఆగమనం

సృష్టిగత నవోహాలో
ఒదిగి ఒదిగి సుప్తాకృతి,
వ్యక్తిగత పరిధిలో
స్వప్నాకృతి పరిణమించే
మనోగోళ పరిధిలోని
జ్యోత్స్న స్నిగ్ధతనూ!

యుగ యుగాల నుండి సౌందర్యతృష్ణ తీరక
స్త్రీ రూపంలో మలగిన ఉదయ కిరణం.
నేత్ర వీధి కుసుమించిన కాంతి వల్లిక !
ఊహ జగతి నిండిన పరిమళఝురి!

నిశ్శబ్దంగా కాలం వేస్తున్న అడుగుల
చప్పుడులో లిప్తానేక మంజీర ధ్వనులు.
ధ్వనిలో హసించు నవోహాలో
అనురణించే సౌందర్య కళానుభూతివి.

ఏదో ఒక వర్ణంలో వాక్కులో రూపంలో
నీ విచారణ ప్రవహింపజేసి బ్రతుకులో
కల్పన గావించని ఊహమతి లేదు.

సన్నని మంచు పొరలు కప్పిన
సూర్యుని తేజశ్చక్ర పరిధిలో,
ఒక ఉషస్సు, ఒక ఋతువు, ఒక ఉగాది
మనోజ్ఞ తరుణంవలె అవతరించే నీవు.
యుగాలుగా ఆత్మనంటికొని యుండు
సుందర ఛాయా రూపానివి!

# ఉష ఆగమనం

జివ్వున వెలుగు కెరటంవలె వచ్చు నీకు
సంగీత మాధురి సంతరించే వాయువును.
పగలు రాత్రి పేరిట ఎన్ని దీపాలారినవి?
కాలగమనం కన్పించనీయదు నీ ముఖబింబం !

నీవు అందవు అపుడపుడూ,
అయినా పరుగిడు తూంటవి
చంద్రునివెంట మేఘాలవలె ఆలోచనలు.

నేను కన్పించను అపుడపుడూ
అయినా వెదకుతూంటవి,
దిక్కుల వెంట గాలులవలె నీ ఊహలు.

జలధి మధ్య ద్వీపం వలె
నీ వియాగ పరీవృతుడనై,
నీడ మధ్య దీపం వలె
నీ వియాగ సమావృతుడనై,
పై కెగసి పోవాలని
ఆకాశం వైపు చూస్తూన్న క్షణం,
మనస్సులో జ్వలించే వేదనతో
పెదవులపై బింబించే సంధ్యతో
రోదసి దూకిన ఉషస్సు వలె
నా ఎదపై వ్రాలుతుంది నీ రూపం.

సమాకర్షించి నన్ను
బధిరుని, అంధుని చేస
ఈ వాయు సంగీతం
సౌవర్ణ కళా శిల్పం!
పద పదంలో ప్రత్యణువున
మాధుర్యం సౌందర్యం,

# ఉష ఆగమనం

నదించు రసాకృతి.
స్పందించు వసంతమూర్తి.

కనుచూపులలో విరిసి నక్షత్రకాంతులు
పెదవి వంపులలో ఒదిగి సంధ్యాలహరులు,
చిరునవ్వులలో హసించి వన్నెల వత్తులు
చక్షు రమ్యాకృతి మలగిన ప్రకృతి రేఖ.

శంపాలతలు సుమించు కన్నులతో
ఆశాశిఖలు వెలిగించు చూపులతో
వేదనా జ్వాలలెగయు పూలనది !
అమృతకాంతి ప్రసరించు సౌందర్యశిఖ !

# రసాకృతి

గుండె లోతుల నుండి త్రవ్వుకొని వచ్చు
సౌందర్య రసాపగాఽవిష్కారము నీ యాకృతి.
చైతన్య శక్తి మూర్తీభవించిన కళా శిల్పం,
నా స్మృతి నాక్రమించుకొన్న నీ భావన.

నిశ్శబ్ద నిద్రావస్థ నుండి మేల్కొని
నైల్య స్థితిదాటే సమయం,
నా మనోరోదసిని ప్రాభాతమయం చేస
మోదార జ్యోతిస్సాహితి.

# ఉష ఆగమనం

వాడిన కనుచూపులు పెనవైచుకొని
ఏ పురాజనూ రహస్యాలనో స్మరింపజేసను,
శరన్నీల గగన రేఖలు బింబించుకొన్న
సరశ్శోభా తరంగములుబికి వచ్చు నీ కన్నులు.

అశ్రుకణ సమూహం రాతి రూపు చెందినట్లు
గ్రీష్మమరుద్వీతతి పెనవైచుకొన్న అగ్నివలె
ఆర్తరవము మ్రోగి మ్రోగి నిల్చిన మ్రోడువలె
భూమిపై ఒక మూల నిశ్చలంగా పడి ఉన్న నేను–

అనిర్ణీత ప్రపంచ పరిధి
మానవతా మృదు జన్మ ఎత్తి
ఎదో ప్రవృత్తి మిడుకుచున్న
నాకెన్ని జన్మలకో కలిసి,
బ్రతుకు లోతులు స్పృశించి
వెలుగులు త్రవ్వి తలకెత్తే నీవు
ఒక వసంత వాయువు వలె
సాగిరావొ ! శిశిర మూర్తిని నేను.

ఆకాశంవలె అందీ అందని
నీ స్పర్శానంద భావనలో
మైనరాల పరవళ్ళు త్రొక్కు
అమృత భరోత్సాహంతో
దీప్తమైన ఆత్మ ముఖమెత్తి
దీర్ఘమైన ఊహల రెక్కలు చాచి,
నీ నీడనైనా అందుకొనగా
అ! ఎంత కాలం యత్నించా,
ప్రతి దినమొక నిశాధూమ
పిహితానన మండలమె హసింపగా.

# ఉష ఆగమనం

ఎంత కాలం నుండో
హిమశిలంవలె బిగిసి,
ఎంత లోతుననో
అట్టడుగున దిగబడి ఉన్న,

నన్నొక్కమారు వెలుగు గడ్డకెత్తుకొని పోయి,
రసధునివలె ప్రవహింపజేస ఉదయమూర్తి!

నా మనశ్చక్షవునకు
నీ రూపమెంత దగ్గర అంటే ?
వెలుగుకు నీడకు మధ్య
ఎంత దూరమో అంత !

అవిచ్ఛిన్న కాల గమన స్వరూప
వ్యాఖ్యాన మతులు,
రవికీ శశికీ గల సంబంధం
మనకు గల బాంధవ్యం.

సంధ్యా సమయం
ఆసన్నమయ్యే వరకు నిత్యం,
లజ్జారుణ హసన్ముఖ దీపమై
వెలుగు రెక్కలతో ఎగిరి వచ్చి
కనులు మూసి నాలో లీనమైన
నీ రూపం మరలినట్లే తెలియదు.

మలిసంజవోలె వ్రాలిపోవు
నా కను రెప్పలలో
తొలి సంజలందు నింగివోలె
దూకు నీ ఆకృతి.

()

ఉదయాకాశం వలె

# ఉష ఆగమనం

విప్పారిన నా కనురెప్పలలో
ప్రతి బింబిస్తుంది!
దృగ్ రేఖాతీతమైన నీ భావన.

అద్దం ముందు నిలువగనే
బింబించిన నా ముఖానికెదురుగా
వికసన్మృదూజ్వల పద్మం
కాల ముద్రలు స్ఫురించని ముఖం !

నిశ్వాస పవన రేఖలతో
ఎదురుగా వచ్చి విశ్వాసంతో,
చాంద్రీహాస గగనంవలె నీవు,
చుట్టూ నిరంతరం శ్రుతి పోస్తూ
కదలే నాదవాయు పరిషత్తులు.

ప్రాణ దఘ్నంగా ముంపుగా
విరిసిన చాంద్రీ రేఖలతో
సాగే పరిమళ వాయువులు
చీల్చుకొని వచ్చి నాలో
లీనమా తుషారదీధితి!

అపుడపుడూ నా ఎద ఒర నుండి
దూసిన మాటల కత్తి పోట్లకు
గాయపడిన హృదయం
నింపుకొని పూలు గుత్తులుగా
కదలివచ్చు నవనీతాకృతీ !

బహు పూర్వజనూ రహస్యాలను
స్మరింపజేయు స్మృతి కేంద్రం.

# ఉష ఆగమనం

జీవనాడులు తంత్రులవలె స్పందింపజేయు
గాంధర్వం రూపొందిన కళామూర్తి!

రమ్యబుద్ధి, వెన్నెలల మృదూహలతో,
గగన మండలం, వాయుపథం, భూవలయం
సత్త్వభావ రమణీయ సీమలుగా మార్చే
ఆత్మ భావనాంబుధి శశి.

అద్దంలో చూస్తే కన్పించి ముఖంలో ముఖంపెట్టి
అద్దం తొలగేస్తే ఊహవలయ మాక్రమించి
జాగ్రత్ సుషుప్తి స్వప్నంలో సదా
ఆత్మ నంటియుండు ఆనంద రసాకృతి.

ఈ సంకీర్ణ ప్రపంచంలో మసలుతూ
ఏ వర్ణపు దుస్తులూ, ఏ రాగస్పర్శ ఎరుగని
నా నగ్న మనఃప్రకృతిలో
సూక్ష్మాతిసూక్ష్మంగా మలగిన
సుందర శివ రూపం, నీ ఆకృతి.

ii

కాంతి పూలు ప్రసరింపుము కనుల నుండి
మెరపురేకలు చెంగలించు మబ్బులవలె,
మనసువిప్పి మాట్లాడుము అమృత భాష.
ఉదధి పొంగ వినిపింతును కాంతి గీతం.

సప్తవర్ణ కిరణ రూపంలో కదలి రమ్ము
వెలుగుంగరములవలె సాగిపోవగా ఊహలు
సన్నని వెన్నెల వత్తివలె ప్రకాశించు నా పైకి
పాడు గాలిలా, కారు మబ్బులా రాకు.

# ఉష ఆగమనం

గగనుని సిగపై వ్రేలెడు
వాడని చాంద్రీ దామంవలె
ప్రతి నిశీథి బింబింపుము
నిభృత కళా మనోసరసి.

మెరపు తీగె సోనవోలె
వెలుగుచు రా నా మదిలో
నీలి మొగిలు గుడి వోలె
ఈ శరీరమును మలచెద.

కదలిపోవు నీటిపై
రాతి వంతెనగా
మలచివైతు ఈ బ్రతుకును
కదలిరమ్ము కాల రథము పైన.

ఎగసివచ్చి రివ్వున దూసైడు
కాలపు కరకు కత్తి వాదరచే,
రెక్కలు నరుకబడిన గిరివలె
దిక్కులు చూస్తూ ఉండలేను.

కోతపెట్టు శిశిరకాల
నిశిత వాయువులకు తాళ లేక
వణకుతూ వృక్షంవలె
దేహం ముడుచుక ఉండలేను.

ప్రసరింపుము కాంతి రేఖ నాపై
హృదయం విప్పారగ మురువుగ
చైతన్య కళామూర్తి స్ఫూర్తివి
నీ వే దేవతవో నే నెరుగను.

# ఉష ఆగమనం

పొరలు పొరలుగా మలగిన
చీకటి గుడిలా రూపొందిన ఎదలో
వేయి వెలుగు రెక్కలు విప్పి
తిరుగు వెలుగు దొరవనే తెలుసు.

వెలుగు వాక ప్రసరింపుము
విప్పిన తెలి కనుల నుండి,
మంచు తుంపురులు రాల్చు
తొలి సంజలందు నింగి వోలె.

కాంతి పూలు విరజిమ్ముచు కనుల నుండి
కదలి రమ్ము ! గుండె గొంతుకనువిప్పి
వినిపింతును కాంతి గీతం
ధ్వనిమయ రసధునీ తరంగం.

iii
జ్వలదూహ శిఖలతో నిను ఆహ్వానిస్తా.
పవమాన పంక్తివలె రివ్వున ఎగసిరా.
కలసిపోయి ఇరువుర మొకటిగా
నిలచి పోదాం ప్రకాశమాన
ద్యావా పృథివి వలె.

మన కంటిముందు బూదికుప్ప సర్వసృష్టి
గగన పదవి వ్రేలాడే మబ్బుగుంపు స్వర్గావళి
అణువున కతీతంగా సర్వాంతర్లీనంగా
స్ఫురించుదాం శైవతనూ సుషమా రూపం.

నీ కనురెప్ప వ్రాలితే ఆరిపోవు సూర్యుడు
చీకటిలో పరిభ్రమించు దారితప్పి చంద్రుడు

# ఉష ఆగమనం

కనురెప్ప తెరవడంతో తిరిగి అంతా మొదలు,
భూమిపై ఆకాశంపై వినూత్న ప్రభా ముద్రలు.

ఊహలో తిరిగే భూమిని విభజించి
కాలానికొక క్రమ పరిణామం కల్పించి,
నీ కంటి చూపులో కదలిపోవు సూర్యుడు.
అతని ననుసరించి గమనం సాగించు నేను
ఆకాశంవలె వదలిపోను దిఙ్మూర్తిని నిన్ను.

సర్వ శరీరం విప్పారిన నేత్ర గోళమై
నీ దర్శన స్పర్శ కోసం ప్రతీక్షావ్యగ్రమై,
సన్నని నీలి మొయిలు నీడల బరువులు
ఓర్వజాలని అలసమృదుల పక్ష్మాలతో
గాలి తాకిడికి ఊగిసలాడి
ఉరలు ఫేన తరంగ పంక్తుల వలె
నిదుర బ్రతుకులో నిను గూర్చి కలలు !

శిథిల స్వప్న ఫలకంపై నీ రూపం
చెదరిన చీకటి నుండి వచ్చే ఉదయం.
ప్రభవింప జేస్తుంది మతిలో మందారం
అనుభూతి శిఖరం చేరుస్తూ నీ జ్ఞాపకం.

నిశ్శబ్ద రాత్రం దీపశిఖ వలె
వెలుగుతూంది ఎదలో నీ రూపం.
స్వప్నంలో గీతమె పలుకుతావు
గీతంలో స్వప్నమె వెలుగుతావు.

ఆదర్శ వాస్తవికతల మధ్య
ఉన్న రేఖ చెదరింది నీ రాకతో

# ఉష ఆగమనం

అసత్యం సత్యం మధ్య
ఉన్న పొర తొలగింది నీ రాకతో.

నీ రెప్పలు వ్రాలి ఉంటాయి నాపై
సరస్సుపై ఆకాశపు వంపులవలె
నీవు తెరచినపుడు కనురెప్పలు
కన్పించరు రవిచంద్రులు నా కంటికి.

నిద్రా గృహం నుండి నీవు వస్తావు
మెలకువ రూపంలో రోజూ
నీవెంత దూరంగా ఉంటే
అంత విలువౌతుంది పరిమళం !

దేవతాత్మ పరిధి వరకు
నడచి మనం విడివిడిగా
ఆవల ఇరువుర మొకటిగా
సంవిలీన మాదాం.

iv

ఉదయం – రోదసిలో దూకిన
సూర్యుని మొదటి కిరణంవలె
నా ఎదపై వ్రాలినపుడు నీవు
వేరొక రాత్రి వచ్చి పోవాలని
మనస్సులో ధ్వనిస్తుంది ఊహ.
ముగ్ధ ముగ్ధంగా
నిశ్శబ్దపు నడకవలె
తుమ్మెద ఝుంకారంవలె
జలపాతం రువలె
బహుగతి భేదంతో
బహు విధ రీతులలో.

# ఉష ఆగమనం

సాయం–
సూర్యుని చివరి కిరణంవలె
దూరం దూరంగా సూక్ష్మాతిసూక్ష్మంగా
విడిపోయిన నీ వెవరవని అడిగితే,
ఏమని చెప్పను ఈ చీకటి నీడలకు
ఉదయం వరకు వేచి ఉండే
అదృష్టముంటేగా—

ఆనంద విషాదం సమంగా అనుభవించే
చంద్రుడు కన్పించగనే
నిలచిపోయేది నీవే స్మృతిలో.

నీలాకాశ తమస్సముద్రం దాటి
ఏలా రావాలనా?
నిశ్చల దృశాశ్రేణి నిర్మితమైన
వెలుగు వంతెనపై రా.

బడబానల గర్భితమైన మహాసముద్రంవలె
విద్యుత్కాంతి నిహితమైన నీల పయాదంవలె
ఊహాస్ఫూర్తి శోభ పొందిన శబ్దరూపంవలె
ప్రణవ తరంగం భరించు విశ్వాంతరాళంవలె
మనోవాయు వీధి కదలాడు సురభిళమూర్తీ!

ఈ జన్మలో నిను పొందిన నేను
నీకొక రూపమిచ్చి
నను నేనొక పరిధిలో
శాశ్వతంగా బంధించుకోజాలను.

అమృత వర్షధారా పరిష్వంగం కోసం
నిబిడౌత్సుక్యంతో ఎదురుచూచే

# ఉష ఆగమనం

గ్రీష్మానల తప్త వాయు గోళంవలె
నిత్య జాగ్రద్ వ్యగ్రమై ఉన్నది
నా జీవ స్థితి.

దేహం అగ్నిలో జ్వలించి
భస్మ సాత్కృతమై,
ప్రాణం గాలిలో లయించి
గగన గతి సాగిపోనీ.

ఆకాశం విప్పిన
వెలుగు చీకటి రెక్కల క్రింద
దీపశిఖవలె నున్న నన్ను చుట్టుముట్టిన
ఈ తలపుల నీడలెలా వదలును ?

లౌకిక కర్మగతు లతిక్రమించి
ఆసన్నామక జ్యోతీ రూపంలో
విలీనమైతే తప్ప !

అదిగో ! తెరచుకుంది.
ఆకాశ స్వర్ణ కవాటం
శిశిర నాశన హిరణ్యా నేత్రం !

**ఉష ఆగమనం**

# హిమజ్వాల

ఈ ఉషస్సాహిత్య వీధుల
రెక్క విప్పిన మొగిలు నీడలు.
ఈ నిశా నిద్రాంబరమ్మున
సాశ్రు శిఖల విషాద స్వరములు.

ఈ ప్రశాంత మహాకాశ మొక్కసారిగ
మృత్యుతాండవ రవము విన్పించు నేమిది?
ఆ హిమాలయ కందరాసీమ మ్రోగెడి
కృతఘ్నతా భర శతఘ్నిచయ యత్నములు.

ఈ గడ్డపై వీచు శీతల వాయువులు
సదా సుమనోభిరామములు,
రివ్వున దూసి చను పదను కత్తులవోలె
ఎదకు భాసించునవి యేమి?
ఆ హిమ భూమి కదలు
సైనిక నేత్రములు వదలు
సర్పదృశాగ్నికీలా చయమ్ములో !

పురాణ వీధీ చరన్మనోజ్ఞ దేవతా
సమూహ సమూహ దీపించు నివసనము.
హత్యా బుద్ధి నిట చరించెడి జీవులెవ్వరు?
సూర్య తేజము మ్రింగనెంచెడు మబ్బు మూకలు !

శతపత్ర ముగ్ధ వదనము పైని
నెత్తురు గంట్లవలె, అంతలో
హిమ శీతల స్వచ్ఛ భూమిపై

# ఉష ఆగమనం

అగ్ని కణములవోలె, భాసించి
మూకలు మూకలుగ వచ్చిపడు
కాల ముద్రా మూర్తులెవ్వరు?

శాంత తేజోలీన రేఖాదేవి
హిమాచ్ఛ సుషమా ఫాలతలమున,
అగ్ని కీలలు రక్త ఝురులు సృజింప
నెంచెడి చీకటి ముద్ద యెవ్వడు?

ప్రతి భారతీయుడు విడిచిన
ఒక్కొక కోష్ణ నిశ్వాసమ్ము,
తమా రాత్రివలె భయదమై
దీర్ఘమై, హిమ భూమి చుట్టినది.

ఒక్కొక్క హృదయమ్ము
రవిబింబ సదృశ తేజస్ఫూర్తి,
చీకటి శవము కాల్చగా
పండు నిప్పులను చెరగినది.

ఉదయాస్తమయ దివారాత్రములు
ఋతువులు కామనల కాష్ఠానములు,
క్షణములు; త్రుటిలో మరచి స్వరము,
దీప్తమతియె, గగనమెత్తున
ఫణసహస్రము విప్పి, నా జాతి
నిలచినది కాలభుజగము రీతి.

నిప్పుగప్పిన నివురు గాలికి లేచెను.
ఎవనిచూచిన ఒక్కొక డగ్నిగోళము.
ఎవని హృదయము నెంచిన దుఃఖభరితము.
బాడబాగ్ని వహించు మహాసముద్రము.

# ఉష ఆగమనం

స్వేచ్ఛా సమాజ రిరక్షా వ్యగ్రమై
నా దేశమే చైతన్య సంభృతమై
మేల్కొని జ్వాలవలె శతకోటి ముఖీయై
తేజోఽసహ్య మయ్యెను శత్రుకోటికి.

కొండవలె నిలచి కదలికలేక
కలలతూగెడు జాతి కాదిది.
చెలియలికట్ట ఎరుగని వార్నిధి.
నిత్యభాస్వర దేవతా మతి.

మహాదాహము గొన్న కాలము
రక్తఝురులను కోరుచున్నది.
కాలమును కబళింపనీయము.
ఖడ్గ వ్యూహము విభేదింతుము.

ఎదపై నిప్పుల కుంపటి
దింపిన ఆ కృతఘ్నులను
తుద ముట్టింపగ త్వరగా,
హిమ జ్వాలలను ఆర్పగ,
జ్యోతిర్ధూమ జలసంభృత
నవ ఝుంఝూ పుంకృతితో
ఉరుములతో మెరపులతో
రణవ్యూహ నవమతితో
కదలండి 'నీఫా' ప్రాంతము
తరలండి 'లడక' భాగము.

# ఉష ఆగమనం

# ఛాయ

ఎవరొహో ! నిదురించినదిట !
నీలాంబుదమాలా స్నిగ్ధతనూ పల్యంకిక!
ముహుర్ముహురాగత వీచీ చయ
సంచాలిత పుష్పంధయ పక్షాలక!
త్యక్తాశా కాంతి చేల!
దుఃఖ ప్రావరణావృత!

సరభసగమన పవమాన విధుతమై
గగనాంస సంస్రస్తమై
పొరలాడు నవనీరదాంశుకము వోలె,
భువి జారిపడిన
యామినీ కర్ణమున వ్రేలాడు
పూర్ణిమాచంద్ర తాటంక
ఖచిత నీల మణివలె,
భూదేవి పృథుల నితంబమున
అంకిత నఖాంకుర పంక్తి వలె
ఆ పవ్వళించిన దెవరు?

అరుణ మయూఖములకు వాడి
శార్వరీ జలద కైశికభరము వీడి
శీర్ణమై ఇట బడిన
మానోజ్ఞ మందార పుష్పగుచ్ఛమొ?

ఇట నిదురించిన దెవరీ
మసృణ తమాలవల్లరీ మతల్లికా
సుషమాంగన!
నిస్తరంగ యామునధుని!

# ఉష ఆగమనం

సాంద్ర జలకణ మౌక్తిక చయ
ఘనాఘన చైత్య మండపమందు
మార్మ్రోగు ధ్వని తరంగములకు బెదరి
ఇట బడిన దుఃఖాగ్ని సందగ్ధ మోహనమూర్తి
శంపా కళా లాసికయో !

నవారుణాదిత్య మూర్తి
గాత్ర పరిష్వంగమున పరితప్తయై
తనూకాంతి వీడి, వాడి
సంయంత్రిత భుజము వీడి
తోరమై యిట బడిన ఛాయా కాంతయో !

సౌరమార్గ పరిచ్యుతయు
వాయు హత జ్వాలయునై
మృత్యుశయ్య పరచుక ఇట
శాశ్వతముగ సుషుప్తి గన్న
తారా దీపశిఖా సుందరియో!

ఏ వృక్ష వర్షీయుని
దుఃఖ సంవృత మలీమస వర్ణ
జీవిత చిత్రమొకొ !
ఈ దీర్ఘ ఛాయా రేఖ !

జీవదాన విచికీర్షా హృదయుడు
సదయుడు, ద్రుతతర గమన శీలి
జలధర వర నిశ్వసిత
ధూమపరిమ్లాన దేహివై
భువి దిగజారి, ప్రియు నెడబాసిన
త్రపాతరళయౌ శంపావల్లికవా?

# ఉష ఆగమనం

స్వీయ ముగ్ధ లావణ్య రూపమీ జన్మలో
పొంద లేవుగా–
మమతా భావమూర్తియా జన్మ సీమ
దివి కేగలేవుగా–

ఎవరవీవు?
రహస్తీరముల నృత్య మాడి
మిసిమింతురాలవై
శ్రాంతి కోసరము మెయి వాల్చితివా ?

కాంతి మండలపుటంచులపై
దిగజారుచు నిరాలంబయె
నిరాశతో తమకము నొందుచు
తనుకు తొగ చీకటి కన్నెవొ?

ఏ కోరిక సుడుల ముడుల విడిపోవ
ఏకతమ తిరుగాడి. కడు డస్సి
ఇటబడి దుఃఖ నిమ్నగ మున్గితివి?

ఎవర వీవు? ఏకాంతముగా
కఠినశిల పల్యంకముపై
ధూళిరేణుకా రూషితవై
మలిన వస్త్రమును దాలిచి
శీతవాత పరిపీడితవై
వన్నెమాసి ఈ మన్నులోన
వివర్ణమైన ప్రస్నని దేహము
నల్పిష్ఠ తమస్తరంగిణివలె
కుంచించుక, ఎందుల కెవరికై
ఆచరింతు మానవ్రతము !

# ఉష ఆగమనం

దుఃఖ శలాకాగ్ర విదారిత హృదయంతో
దృఙ్మనోజ్ఞతరకాంతులు
దిక్తటముల విసరుచు,
ఏ సాగరతీరము వెదకుచు,
ఏ నాకపథము నాశించుచు
ఏ సుందర స్వాప్నిక సౌర పదవి
కూహా సోపానాళి వినిర్మింతువు.

జఘున మండల విసర్పిత
నీల వసన సంశోభిత !
మలినీకృత దేహాంచల!
విరజీకృత నీలాలక!

త్యక్తాశా కాంతిచేల!
ముక్తచ్ఛాయా సుందరి !
మసృణ నీల నీరద సుషమా
వల్గత్ కాంతి తనూ !

## ఆ వెనుకనే

సముద్రపు కెరటాల్లో
ఘర్షిస్తూ నౌక వలె
తుఫాను గాలులలో
వణకుతూ వృక్షం వలె
ఉన్న నన్ను చూచావు.

# ఉష ఆగమనం

వేడి నిట్టూర్పులు విడుస్తూ
గ్రీష్మంలో అవని వలె
వడగాడ్పులకు కదలుతూ
చేతులెత్తిన వృక్షం వలె
ఉన్న నన్ను చూచావు.

నిశ్శబ్దపు గుండెపై అడుగులేస్తూ
నేను నడచి నపుడు నడుస్తూ
నా మెలకువ నిదుర మధ్య
మనశ్చిత్రం వలె
ఉన్న నిన్ను చూచాను.

సూత్రానికి వ్యాఖ్యానం వలె
ఆవరించిన ఆకాశాన
జలదంలో మెరపు వలె
నాలో జలదరించు
నిన్ను నేను చూచాను.

రాలే ఆకులు పూలు పండ్లు
కాల గతిని జ్ఞప్తి చేస్తున్నాయి
లిప్తను క్రమిస్తుంది లిప్త
శక్తిని హరిస్తూంది శక్తి.

నా వెనుకనే వెలుతూన్న
మృత్యు దీపం బింబిస్తూ
అద్దంవలె ముందు నీవు
ఇంతకు ఎవర వీవు?

# ఉష ఆగమనం

# మొగిలు విరిసి కురిసే వేళ

మొగిలు విరిసి కురిసే వేళ,
మెరపు మొలక నవ్వులతో
పూవు రెక్కల ఆలోచనలతో
వర్షాధ్వని ఝురీ గమనంతో
నీవు అవతరిస్తావు.

మొగిలు విరిసి కురిసే వేళ,
నాపై ఒదిగి పోయి
పరిమళ వీచిక వలె,
ఊహాలో పరచుకొని
ఉదయ గగనం వలె,
హృదయంలో వెలుగుతూ
ప్రాణ దీపం వలె,
నీవు నిలుస్తావు.

మొగిలు విరిసి కురిసే వేళ,
ఊహా పత్రాల చాటు నుండి
శబ్ద విహంగమై వచ్చి,
నీలాకాశపు వంపులలో నుండి
సాంధ్య మేఘ శకలమై తరలి
సౌందర్య జ్వాలలచే
మండించు శతపత్రమై విచ్చి
నీవు కన్పిస్తావు.

పూర్వ స్మృతుల సౌరభంతో అవనియై
భవిష్యత్ కల్పనా చిత్రంతో ఆకాశమై
వర్తమాన రూపంలో మధుధారాధునియై

నీవు మెదలుతావు.

మొగిలు విరిసి కురిసే వేళ.

**ఉష ఆగమనం**

# ముక్తకాలు

i

తెలుసు నాకు ఒకటేనని
మల్లె పూవూ, చంద్ర వంకా
కాలం విరిసిన నవ్వు మొలకలు
ఒకటి క్రింద మరొకటి పైన.

భూమి ఎదపై పరిమళంతో
మల్లె పూవు
గగన మతిలో ప్రసన్నంగా
చంద్రవంక.

గాలిలో ఒకటి ఊగుతూ
చీకటిలో ఒకటి తూగుతూ
సుఖ దుఃఖ సమయాల్లో
మనిషికి సమన్వితి సూచించేవీ.

ii

మబ్బులు ఎగిరే ఊహలు
భయపడవు చీకటికీ వెలుగుకు
నిలబడవు ఎదురైనా కొండలు
ఎదలో అమృతం వర్షించేవీ.

# ఉష ఆగమనం

భీటలు వారిన మనిషి గుండెలో
ప్రవహించే ఆర్ద్ర పంక్తులు
ఆకురాలిన బ్రతుకు చెట్లలో
చైతన్యం పొంగించే జీవకళలు.

ఎండలో వెలిగే వనం
కోరేది, మబ్బు గుంపులు
వేదనతో మండే మనస్సు
కోరేది ఊహల రక్తిమ.

iii

ప్రసరించి నిశాదృక్కులు
ధూమ శిఖలై లేచినవి.
అందులో ఒకటి నిలచింది
నేలపై వ్రాలి నీడయై.

కాలం కమరి పోయింది నల్లగా
వేషం తీసిన నటునివలె ఉంది
క్షణాలు సంచరించే విమానాలు
మనోముకురంపై రాత్రి బింబాలు.

మలగుతూన్న ప్రతి క్షణం వెనుక
నిలచి ఉంది అంధకారం.
వెలుగుతూన్న ప్రతి క్షణం వెనుక
వేచి ఉంది అంధకారం.

**ఉష ఆగమనం**

iv

గాలులు స్పృశిస్తూ కదలుతూన్నవి
అంతరాలను, అంతరాళాలనూ
నీడలవలె తొట్రిలుతూన్నవి
మనస్సు కందనివి, అనుభవాలు.

వెలుగులు ప్రసరిస్తూన్నవి స్పృశిస్తూ
అంతరాలను, అంతరాళాలనూ
ఈదుతూన్నవి హంసలవలె
అనుభూతులు, ముంచినవి మనస్సును.

సమాధులు, శ్మశానాల కంఠం నుండి
పైకలి రాలేక అణగింది శబ్దఘోష
ముఖంలో సగం సగంలో రివ్వున
ఆగలేక బయటపడింది ఊహ నృత్యం.

v

దిగ్దర్పణంలో ప్రతి ఫలిస్తూంది.
నడుస్తూన్న నా రూపం.
నా నుండి ఉద్గమించిన రూపాలు
నడుస్తూన్నవి దిక్కులలో.

**ఉష ఆగమనం**

నలువైపుల రూపాలతో
వింతలు మొలకెత్తినవి దిక్కులు
అన్నీ నడిచేను, ఎక్కడికి నాలోకి
నా నుండి దిక్కుల్లోకి, అటనుండి నాలోకి.

క్షణం నుండి వెడలి చిత్రం
అంతా క్రమ్మింది విచిత్రం
సంధ్యా దర్పణంలో బింబించి
సూర్యుణ్ణీ, చంద్రుణ్ణీ గెంటింది.

**ఉష ఆగమనం**

# మానవీయం

మాదిరాజు రంగారావు

# స్వేచ్ఛా కవిత్వం

# మానవీయం

## ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

MANAVEEYAM

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: జూన్, 1971

పునర్ముద్రణ: జూన్ 2026
అనుపమ ప్రింటర్స్
శాంతినగర్, హైదరాబాద్
ఫోన్ : 040–23391364

పితృదేవులు మాదిరాజు నారాయణరావు గారికి అంకితం

ఈ జీవన మార్గాన గమ్యమెరిగిన ప్రయాణికుడు

ఈ వివర్త జగత్తులో నీడ క్రమ్మని దీపకళిక.

**మానవీయం**

**మొదటి భాగం**

ఉదయం ............................................... 1

ఉదయం తరువాత ....................................... 5

జీవిక మొదలు ......................................... 9

బ్రతుకు వంతెన పై నుండి ............................ 17

**రెండవ భాగం**

అశాంతి ............................................ 30

యుగదర్శనం ......................................... 42

యుగదర్శనం II ...................................... 51

## మానవీయం - మొదటి భాగం

# ఉదయం

ఉదయ తరణి కెదురుగా
నిలిచి ఉన్నాను నేను,
కొండకొమ్ము మీదినుండి
రసధుని పరుగిడినట్టు
ఇసుక దిబ్బపై ప్రవాహం
తళ తళ లాడినట్లు
వెలుగుపొంగు ఎపుడువచ్చి
జగత్తును ముంచెత్తిందో? తెలియదు.

చైతన్యపు వెలుగులతో
రోదసి మనోజ్ఞ రూపం దాల్చి
శవాల వలెనున్న

ఆశలకు ప్రాణం వచ్చి
బహువర్ణ సుమ పరాగం విరజిమ్మిన రీతి
మారింది గగన వలయం.
అనిదంపూర్వ మహానుభూతిలో
ఇంద్ర చాపంవలె
పరచుకొంది మనస్సు.

తెరచుకొన్న ప్రాగ్దిశా స్వర్ణకవాట
కలధ్వనికి విప్పారింది మానవం
మంటి నుండి మింటికి నిల్చిన
సప్తవర్ణ నిశ్రేణికవలె
భాసించింది జీవితం!
ఉదయం వచ్చింది
ఉదార చరితునివలె

అమృతలిప్త వెలిగింది
ఆత్మ ప్రకాశం వలె.

దినమణి దీప కాంతితో
హర్ష ధారా వీక్షణాలతో
ఆకాశం భూమీ కౌగలించుకున్న క్షణం
సన్నని దారంతో
సాలీడు అల్లిన పటంవలె ఉంది ప్రపంచం

మబ్బులో మెరపువలె
ఊహ కదలిక.
మనస్సులో చెలగిన
పూర్వపు చీకటి స్మృతులు.

మృదుల రాగ కరస్పర్శతో
నిదురనుండి మేల్కొల్పి
భూమికీ ఆకాశానికీ
బంధం కుర్చే సూర్యుడు, పైన.

ప్రత్యణువును పులకరింప జేయు
వెలుగు వాకలు,
గుంపులు గుంపులుగా విసరిన
తెలి పూలదండలు.

గగన పదం వీడి
బ్రతుకలేని మబ్బులు పైన,
పాదాలు పట్టుకొని
వదలని క్రీనీడలు, క్రింద.

మృత్యుముఖంవలె ఆవరించి
రాగంతో ఆకర్షించే నీలాకాశం,

చాచిన దేవతా హస్తాలవలె
విచ్చిన వెలుగుల బారులు.

**మాదిరాజు రంగారావు**

నిర్మలాంతః కరణంలో ఊహల సాగుదల వలె,
స్వర కల్పనలో నదించు మాధురీ ఝురి వలె
కళావర్ణంతో సౌందర్యం చిమ్ము చిత్రం వలె,
కదలిపోయే మోహోపాదక కాంతులు!
మనస్సముద్రోర్మికలపై తూగుతూ
తేలిపోయే ఆనంద దీప కళికలు.

రివ్వున దూసికొనివచ్చి
నడవలేని చెట్ల భుజాలపై చేయివేసి
కుదుపుతూ సంతోషంతో
కదలిపోవు మృదు శీతల వాయువులు.

అనిర్వచనీయ స్థితిలోని
దివ్యానుభూతి కదంబాలు
క్షణక్షణం పొందుతూంది వర్ణ సామరస్యం
చూపుమేర మీరి ఉన్న ఆకాశం.

తీవ్రమైన ఆకర్షణకు లొంగి
సంతోష చకితమైంది భూమి.
మేల్కొనీ మేల్కొనని దశలో
కలల వరుసవలె దీపించింది సృష్టి.

కాంతి వర్షంలో తడిసి శరీరం
స్వర్ణమయమైంది.
మధునదంతో నిండి హృదయం
సమార్ద్రమైంది
వెలుగులు వెల్లి విరిసి ముఖం
పూలబంతి ఐంది.

ఆనందంతో చిందులు త్రొక్కు శిశువులవలె,

ఆకాశంలో యదేచ్ఛగా విహరించు మబ్బులవలె,
రసానుభూతి పరవశింప జేయు ఆలోచనలు.

చూస్తూ చూస్తూ ఉండగనే
కాల శ్మశానంలో దగ్ధమైనవి, లిప్తలు.

గగన మార్గాన ప్రయాణం చేసి
అలసిపోయిన సూర్యుడు
పశ్చిమ దిగ్వేదికపై విశ్రమించాడో లేదో,
అనంతమైన వెలుగులు సొంతమైపోయి
ప్రపంచమొక పరిధిలో బంధితమైంది.

కనురెప్పల అంచులపై
వ్రాలింది నిదుర బరువు బరువుగా,
విశ్వాంతరాళంలో ప్రణవంవలె
నిశీథి చంద్రికవలె,
నిదురలో స్వప్నంవలె
శబ్దంలో అర్థంవలె
పురుషునంటుకొని స్త్రీ.

అగాధమైన మనస్సులో పొరలలో నుండి
ఊహల ఔల్బల్యం అధికాధికమై,
గభీరమైన తమస్సులో పొరలలో నుండి
వెల్గుల ఆగమనం అత్యంతావశ్యకమైంది.

నిదుర పట్టడంతో కాటికి కాళ్ళుచాచి
రెక్కలు విరిగి కుప్పగా కూలిన రాత్రి,
చివరి ఊపిరి కాస్తా వదిలింది.

నిదుర వదలడంతో
కంటిముందు ప్రత్యక్షం మరో ఉదయం.
అరె! ఎంతలో వచ్చింది
ఆహ్లాదకరమైన ఉదయం

మానవ లోకానికి

శుభోదర్కమైన సమయం.

సనాతన కాంతి చిమ్ము
నా దృష్టిముందు
స్వర్ణ వలయ సమాక్రాంత
త్రరూ తనుతేజశ్చక్రం!

## ఉదయం తరువాత

తూరుపు టద్దంలో సూర్యుని ముఖం కన్పించి
భయంతో నివాస స్థలాలు విడిచి,
దూరాకాశ తీరాలకు చేరినవి చీకట్లు.

రువ్వబడిన రాళ్ళవలె రివ్వున
ఎప్పటి కపుడు మనస్సు నాక్రమింప
తిరుగు మృతభావనామూర్తులు,
వెలుగు లారి కొడిగట్టిన వత్తులు.

చీకట్ల సమావేశంలో ఏకగ్రీవంగా
ప్రకటించిన నిరసన పత్రం,
తుహిన యవనికా రూపంలో ప్రత్యక్షం—
చదవడానికి యత్నించే చెట్లు,
చెరిపివేయ ఉత్సహించే వెలుగులు.

రవి దీపం క్రింద నీడలంటి తిరుగు రాత్రించరులు
ఈ దీపపు వెలుగులు తామె వెలుగు దివౌకులు.

చీకటిలా ఒకమారు మందంగా
వెలుగులా ఒకమారు వేగంగా
ఒకమారు కదలీ కదలని మేఘంలా

కంటి చూపు నుండి జారి పోవు కాలం,

విడిచే నిట్టూర్పులలో తూగుతూ
అవ్యాహతంగా సాగిపోవు ప్రపంచం.

ఆకాశం డొక్కలో
పర్వతంవలె నిదురపోయే
చీకటిని రూపుమాపు
సూర్యచంద్రుల ప్రభా ప్రసారం,
వీరి పాలనలో ఒదిగిఉంది జగత్తు.

II

జన్మించిన వేళనుండి ముఖంలో బింబించి
ప్రతి క్షణం సమయం కోసం వేచి ఉంటుంది భవిష్యత్తు.
వదలిన ఊరుపుతో పేర్కొన్న మనస్సుతో
అంతమొంది వర్తమానం, అవుతుంది గతం.

ఆకాశం మేల్కొన్నది.
ఎటు చూచినా ప్రాణి చలనం
నిదురకు జడానికీ అనుబంధం.
మెలకువకు చలనానికీ స్నేహం.

అందం విరిసి, గంధం చిమ్ము
విచ్చిన పద్మదళ పంక్తులు
ప్రాణం పల్లవించి, రాగం రవళించు
వివిధ జీవిత వలయ దశలు.

ఝుంకృతి తిరుగు తుమ్మెదలతో
శోభారుణ పద్మంవలె,
మనుషుల కదిలికతో నిండారింది ప్రపంచం.

సూర్యుని ఆశీః ప్రసార కిర్మరీకృత భూమిపై
ఒక వలయ మతిక్రమించి పోయే లోపల
వేరొక వలయంచే పరీవృతమౌతున్నాయి పాదాలు,

విడదీయరాని దుఃఖత్రయంచే
ఎపుడో బంధింపబడింది జీవితం.

**మాదిరాజు రంగారావు**

అవిఛిన్న పరిణామకాలం
రెండు చెక్కలుగా ప్రయ్యలైన రూపాలు.
ఒకదాని ముఖంచూచి వేరొకటి
ప్రక్కకు తప్పుక ఒదిగిపోయే దివానిశలు.

నిదుర ముంపు వెల్లి విరిసి
మెలకువ కలిగే లోపల,
కనులు మూసి తెరచే లోపల
మాట పైకలి పచ్చేలోపల
ఊహలు వాగ్రూపం పొందే లోపల
ఉషస్సు తూరుపు గడపదాటి
బయటి కడుగు వేస లోపల,
పాదరసపు గుళికల వలె
జారిపోవు లిప్తాంశలు.

అడుగు వేయడంతో
లిప్త గమించక ముందే
ఆకర్షించు ఆశా శబలిత జీవితం
అడుగు తీయడంతో లిప్త గతించగనే,
క్రమ్మికొను నిరాశామయ మృత్యువు.

భయ శోక మోహ కోపాలకు
లొంగిపోయిన అశాంతి జీవితాలు,
క్రమంగా హరించే ఉదయాలు,
ప్రాణికోటి కెంత ఆహ్లాద రూపాలు?

శిశువువలె ప్రత్యక్షమై
వృద్ధువలె నిష్క్రమించే సూర్యుడు.
ప్రతి ఉదయం అవతరించు
నిత్య నవ్య పురాణమూర్తి

మొదలు తుది నాశన మెరుగని

మహా కాంతి పుంజంనుండి

అవతరించిన భాగం ప్రపంచం.
అగ్ని శిఖలవలె సంచరించు మానవులు.

ఉదయ దిశా స్వర్ణకాంతి దేహళి పై దృష్టి నిలిపి,
రాగనిభృత, వర్ణ మహిత మనస్సుతో
సుందర రూపంలో, శివతాతిపథంలో
ఊహాశక్తిచే సృష్టింపబడిన దేవతలు.

ఎన్ని ఏండ్ల గ్రహణం నుండో
విడిపించి నభోమణిని,
మరుద్గణంతో దుస్స్థితి పారద్రోలి
సుస్థితి కల్పించు వజ్రి
శతక్రతువు, శచీపతి, ఇంద్రుడు.

హిరణ్య వర్ణుడు, నిత్య పవిత్రమూర్తి
దేవతలకు మానవులకు దగ్గరి బంధువు
ప్రతి ఉదయ మవతరించు
కవిక్రతువు, అగ్నిమూర్తి.

సవితృ బింబ నేత్రంలో
సకల సృష్టి పర్యాలోకనచేస్తూ
హస్త విధృత పాశాలతో
సువర్ణ పక్షాలతో వెలుగు
క్షమామూర్తి ధృతవ్రతుడు వరుణుడు.

సర్గ స్థితి లయాలకు హేతువులుగా
నిలచిపోయిన త్రిమూర్తులు
బ్రహ్మ విష్ణు శివులు.

అహంకారం అంధకారం అశాంతి
అలముకొన్న హృదయావరణంలో

దివ్యానుభూతి కలిగిస్తూ కరుణతో
నిలచి ఉండు జ్యోతిః ప్రతీకలు.

# జీవిక మొదలు

రోజూ వస్తాడు సూర్యుడు
శ్యేనం వలె గమిస్తూ
కాంతి కేతన ప్రచాలనంతో,
ఆశలు కళ్ళు తెరుస్తాయి.

పూవు రాలుతుంది
మొగ్గ పొటమరిస్తుంది
ఒక దానిలో విషాదం
మరో దానిలో ఆనందం.

పూలతో పరిమళించే సమయం
పండ్లతో పరిణామమందే కాలం,
రోజులలో వికాసమందే జీవితంతో
ఘటనలలో చరిత్ర పొందే జగత్తులో,
ప్రయాణించేను మనిషి రాత్రీ పగలూ
ఉదయ మధిరోహిస్తూ, సాయ మవరోహిస్తూ.

బ్రతుకొక అగ్నిగోళమై
ఎవరి దారిన వారు శాంతికై
కాలు సాగు మార్గాన పయనించి,
ఒంటరితనం సహించలేక
జంటలుగా గుదులుగా తరలి,
బహుస్థలాలలో బహువిధ జీవితాలతో
హృదయం స్పందించి, బుద్ధి వికసించి
ఆనందం ఇచ్చే అనుభూతితో
విజ్ఞానం పైంపొందించే అనుభవంతో

సంచరించేరు మానవులు.

పరిభ్రమించి సుడిగాలివలె
అతిక్రమించి అదృష్టసీమలు
గుర్తించి అపాయపు గుర్తులు
ఉత్తరించి అసాధ్య సముద్రాలు,
సన్నివేశాన్ని బట్టి నటనవలె
కాలవేగ దీప్తితో
మర్మమెరుగని దిశవలెనున్న
బ్రతుకులో పరివర్తనం.

గాఢమైన అనుభూతుల పారంపరిచే
హృదయం విశాలతరమై,
తీక్ష్ణమైన భావనా స్వాతంత్ర్యంచే
బుద్ధినైశిత్యం పెరిగి,
అధమ స్థితినుండి పరమస్థితి వరకు
బహుముఖ మనఃప్రవృత్తులతో
బ్రతుకు గడేప జనసందోహం.

ఒకప్పుడు మృగంవలె, పక్షి వలె,
మరొకప్పుడు పామువలె, పురుగువలె,
పెరిగి తరిగి ఒదిగి మలగి, నశించు
బహుగుణ రూపాల్లో దాగిన, మనస్సుతో,
మనిషిని హతమార్చి క్రోధాగ్ని తనుపుకొని
మనిషిని భక్షించి క్షుధాగ్ని చల్లార్చుకొని
మనిషిని రక్షించి మానవత్వం నిలుపుకొని
మనిషివి క్షమించి దైవత్వం పొందిన మానవుడు.

ఒక భయధ్వని కనిశ్చయంగా ఎగిరి
ఎక్కడో అవిజ్ఞేయంగా వాలిపోవు పక్షులవలె,
ఎప్పుడో ఎక్కడో దూరదూరం విసరబడి

కుప్పకులి చివర కసువులు కోల్పోయి
చరిత్ర దృష్టిలో స్థానంలేని మానవులు,

ఎంతమందిని చావుపాలుచేసి జయించి
ఎంతవరకు విజయం సాధించిందీ ప్రధానమై
ఎంతమందికి ప్రాణంపోసి రక్షించి
ఏ దుస్స్థితి నుండి సుస్స్థితికి తెచ్చిందీ గౌణమై.

సముద్రంపై ప్రయాణం చేస నావపై
గాలికి రెపరెపలాడు తెరచాపవలె
జీవితంలో అలజడి కలిగించు ఆశతో,
మెరుపుకత్తివంటి బుద్ధికి భాసించు.

నిశాగుహా ప్రాంగణంలో
మృత్యు సామీప్యంలో
ధూమావృత శిఖలవలె
స్వస్థిస్తితి తెలియని దుస్స్థితిలో
సంచరించే మానవులు.

ఈనాడు నిశ్చితంగా విజ్ఞాతంగా
రేపటి కనిశ్చితరూపంలో ఆశ్చర్యంగా
జరుగు ఘటనలు, వీనిలో చిక్కుకొని
అసువులు కోల్పోవు త్యాగమూర్తులు
బయటపడి తమ ప్రయోజకత్వం
చాటుకొను స్వార్థమూర్తులు.

అమాయక శైశవదశనుండి
అపరిహరణీయ మృత్యుదశవరకు
పొరపాటు అలవాటై, మరచిపో శక్యంగాక
మానసిక బానిసత్వం, దర్పంగా భావిస్తూ
చావుకైనా వెనుదీయని స్వభావంతో
జీవితమొక వ్యాపార సరణి
గడిపివేస సమాజం-

అధికార పిపాస, కీర్తి కాంక్ష ప్రబలి
అంతరింపబడిన ఒక రాజవంశ రక్తంతో

తడిసిన వేరొక రాజవంశ మావిష్కృతమై
అణగద్రొక్క బడిన ఒక జాతి మతస్థానంలో
జరిగి పోయేను వేరొక జాతి మతాభ్యుత్థానం.

ఆక్రమించి అవనీతలం, ఆకాశ మండలం
ఆచంద్రార్కం యశోబింబాలుగా నిల్వడానికి
జరుపబడు సర్వతోముఖ ప్రయత్నాలు.

అపుడే ఉదితమైన
విజయ కేతన ప్రచాలనం,
ప్రక్కనే పతితమైన
శీర్ణ కేతన పరాభవం.

జీవిత విస్తృతి నెత్తిచూపు
లౌకిక ప్రతారణ నీతితో
చరిత్రలో నిలిచిన వెలుగుమెట్లు!
అట్టడుగున పడిన చీకటిముద్దలూ!

మనోఽంతరాళంలో
అణగిన జంతు తత్త్వం
విభిన్న రూపాలలో
ప్రకటితమా స్థితిరూపం.

ఇదమిత్థమని నిర్ణయింపగా
వీలులేని విపరీత సృష్టిలో
రాక్షస జీవితంలోనూ
భయాత్మక మృత్యుసామీప్యంలో
మూర్తికట్టు దేవతాభావమూ!

ఇదమిత్థమని నిర్ణయింపగా

ఊహ శక్తిలేని జీవితంలో
మాసు లెత్తకుండా దేవతాభావం,

విడదీయరానంతగా అల్లుకొని
ఎప్పటి కపు డణగద్రొక్కు రాక్షసత్వమూ,

v v v

మనిషికి మొట్టమొదట కావలసింది
ఉనికి. కొన్ని అడుగుల మేర నేల.
ఆహారం తరువాత సంపద అధికారం;
వీని సంపాదనలో రక్షణకై
తలలెత్తిన ఆలోచనా పరంపరలు,
క్రమ పద్ధతిలో తాల్చిన ఆకారాలు
ఈ కోటలు, సామ్రాజ్యాలు.

దాహం క్షుధ, విషయవాంఛలతో పాటు
అలౌకికానంద ప్రయోజనాల గుర్తింపూ
పుణ్యాపాపాలు, స్వర్గ నరకాల సృజన.
ఈశ్వరుడు, ఆపై పరబ్రహ్మభావన.

జీవితంలో ఆనందాన్వేషణలో
సంగీతం, సాహిత్యం, శిల్పం మొదలుగా కళలు
సృజించుకొని సంస్కృతీ శిఖరాల నంటుకొని
అధికార మర్యాదలతో, సవ్యాజ మనస్తత్వంతో
లౌకికవ్యూహాల్లో ప్రవేశింపజేసి జీవితం;

అహర్నిశలూ జరిగే సంఘర్షణలో
విజయానికి లేదా దానినుండి విముక్తికి
సర్వశక్తి సమీకరించి సంసిద్ధమా మానవుడు.

ఆచ్ఛాదన జ్ఞానం కళాన్వితమై
బంధుభావం సూత్రబంధమై
దేహ మేధాశక్తుల భేదం గుర్తించి
ఉషస్సులో దర్శించిన స్త్రీమూర్తి

అమృతకళకు ప్రతినిధియై,
ఆవరించిన భయచ్ఛాయలు

అజ్ఞాన నిలయాలుగా తోచి,
ఆత్మ నిత్యత్వం భావితమైన నాటినుండ
మనిషికీ ప్రపంచానికీ గల సంబంధంపై
ఆకాశంనుండి జారిన బంగరు గొలుసులవలె
ఎడతెగని ప్రశ్నలు; ఆలోచనా తరంగాలు.

ఏదో ఒక మతనియమంలేని మానవుడు లేడు
ఏదో ఒక బిందువునుండి మొదలుకాని రేఖలేదు
ఒక వలయాకృతి మేరలులేని ఊహలేదు,
అతడు పొందే వికాసం, పరిణతిలో
వైవిధ్యం వైశిష్ట్యం ఎంతైనా ఉండవచ్చు.

ఎన్ని మజిలీలు దాటినా
విజ్ఞాన సంస్కార శిఖరభూములలో
స్థిరపడి నిలిచిపోక చ్యుతమై
పునః పునః ప్రయత్న యాతనతో
ఒకవైపు పరంపరగా ఆవిర్భవిస్తూ
శైశవ యౌవన జరామృత్యు దశలతో
మరొక వైపు వరుసగా మట్టిలో కలిసే
నిరంతర మానవ సంతతి.

చిగుళ్ళు ఆకులు పూలు ఫలాల కలలు
భీజంలో నిక్షిప్తమైనట్లు
ఆత్మగత వాసనా మయమై
సుఖదుఃఖాలతో, భోగత్యాగాలతో
విస్తరించి ప్రకాశించే జీవిత గమనం.
గాలి విసురులో, గ్రీష్మ తాపంలో
వర్ష పాతంలో, చలికోతలో
పరిక్రమించే చక్రనేమి క్రమణం.

భవిష్యత్తుపై ఆలోచనతో

వర్తమానంలో అనుభవంతో
గజిబిజిగా క్రమ్ముకొని మేధను

**మాదిరాజు రంగారావు**

కలత పెట్టు ఊహల సాగుదలను,
ఒక క్రమపద్ధతి తీర్చే
విశ్వాస పరంపర కలవడింది జీవితం.

వెరగొందిన మృదుభావుక మనస్సునుండి
మెరపుతోడి మేఘంవలె జనించి
బ్రతుకంతా అలముకొని, అందనిపూలతో
ఊహాసుందరమె వాసించింది స్వర్లోకం.

మరపుగొన్న చపల కఠోరమతినుండి
అశనిపాతవేళా స్ఫులింగ చక్రంవలె
బ్రతుకంతా ఆక్రమించి, నిప్పులతో
హృదయ విదారకమై దీపించింది నరకం.

తనువొక వరణీయ దేవతా ప్రసాదమై
దివ్వెనుండి దివ్వెవలె అవిచ్ఛిన్న ప్రజాసంతతి.
దైవం పై భారంతో గడచే బ్రతుకులు.
ప్రేయస్స్వరం విని మృదురూపమూహించి
దివ్యభావం హత్తుకొన్న హృదయం,
కఠోర రావం విని ఘోరరూపమూహించి
క్రౌర్యబుద్ధి వర్తించు మేధతో మానవుడు.
తీవ్ర వేగ మృదుప్రచార దీప్తులతో
ఒకజాతి, మనిషి బ్రతుకంతా
నిప్పులు చెరగి మండించింది కాలం.
పచ్చని పైరూ పండించింది కాలం.

తల్లిపిలుపులో తండ్రి పలుకులో
శిశువు నవ్వులో, ప్రియుల చెలువులో
భక్తి భావనలో, శాంతహృదయంలో
ప్రతిధ్వనించింది స్వాదు సంగీతం.

కొండలో, ప్రవాహంలో రోదసిలో

ఊరుపులో, మనస్సులో, సర్వప్రకృతి

నిరంతరం సాగు నాదరేఖవలె
ఒక్కసారి గుత్తులు గుత్తులుగా తరలి
కిలకిల నవ్వులు విసరి విసరి
ఒడ్డున చప్పట్లు కొట్టి తరలు.
అంతరాఘూర్ణమాన జలధి తరంగాలవలె
మనః కుహరంలో లయాత్మక భావనలు.
ఎప్పటి కపు డడ్డుగోడ లతిక్రమించి
ముందుకు సాగిపోవు
ప్రగాఢ సాహసమతి, మానవుడు
ఎప్పుడూ నిలచిపోడు ఒకేచోట.

ఎంతదూరం వెళ్ళినా ఎంతకాలం గడచినా
పైకి ఆ పైకి వెళ్ళాలనే మానవుని కోరిక.
ఆదర్శ లోకాలతో పరిచయం
అందు ఆవాసం కోసం
ఆరాటం, ఆందోళన
తీరని అజ్ఞాతతృష్ణ సహజం.

ఎన్ని సహస్ర సమలు గతించినా
మృత్యు వెరుగని ఉదయంవలె
మమత చావని హృదయంతో
పతనంనుండి పునరభ్యుదయంతో
దివ్య దశా సంసిద్ధికై ప్రయత్నం
విరమించదు మానవజాతి.

దుఃఖత్రయ రేఖల సాగుదలతో మొదలై
యుగాలుగా సాగు సంస్కృతికి ప్రతినిధి మానవుడు.
అతని సుఖదుఃఖాత్మక జీవిత సర్వస్వం
బింభీకరించుకొని వెలసిన దర్పణం, కాలం.

జీవితపు మొదలు చివర బిందువులను

ఈ లోకంతో కలుపు దివ్యరేఖ, ఈశ్వరుడు.
ఆశ్చర్యానుభూతులనంటి వెలుగులోతులు త్రవ్వుకొని
అలౌకికంగా సాగు జిజ్ఞాసా ఫలితం, వేదాంతం.

**మాదిరాజు రంగారావు**

# బ్రతుకు వంతెన పై నుండి

మనో నేత్రం దర్శించు
ప్రపంచం ప్రతిబింబించిన
కాలదర్పణం ముందు, నేను.

దివా కాంతి చేలంతో
నిశా నీల నిచోళనంతో
చాంద్రీమృదూత్తరీయంతో

ఎటు ప్రసరించినా
దృష్టి నాకర్షించి,
మనస్సును భ్రమింపజేస
ప్రకృతి, శక్తి.

క్రింద, మృత్తికామయవస్తు సమితి,
దివా నిశలు చుట్టూ పరిభ్రమించే
గ్రహ కుటమి — పైన.

ప్రభు దయా విహీనమై
వన్నె మాసిన రాత్రి, ఒక వైపు
ప్రభుదయా ప్రసృతమై
వన్నె కెక్కిన ఉదయం, మరోవైపు

జీవితమొక చివర తెలియని
చీకటి వంతెన,
సంఖ్య తెలియని అనుభవాల
వెలుగు మెట్లపై
అడుగడుగునకు పునర్జన్మ ఎత్తినట్లు
అడుగడుగులో స్వర్గశకలమందినట్లు
గమనం సాగించే,

చీకటి ముద్దలు కొందరు
దీప శిఖలు మరికొందరు.

వంతెనపై నడచే మనిషిని
వెనుకకీడ్చు ఎవరివో యత్నాలు.
సముద్రంలో నౌకవలె
ముందుకు సాగిపోవగా
ఊర్మికలవలె ముందు
ఎవరివో హస్తవితతి.

వంతెనపై నుండి క్రిందికిచూచి
కళాభావన వ్యక్తపరచే సరసులు.
అంధులవలె కళ్ళుమూసికొనే విభీతులు.
మైమరచి ప్రాణాలర్పించే విముగ్ధులు.

వంతెన కివతల మరి అవతల ఏమున్నదో
ఇదమిత్థమని ఎవరికీ తెలియదు.
యుగాలనుండి పరంపరగా ధురాగతి వచ్చు.
ఊహా ప్రావారాలు, అనుమాన ప్రాకారాలు తప్ప.

ముందుకు వేసిన అడుగు
వెనుకకు తీయడ మసాధ్యం,
ముందు వేయక అడుగు
అక్కడే నిల్వడ మసంభవం.

ఎప్పటి కపుడు భయంతో
విచలితమె మనస్సు,
భవిష్యత్తును గాలివలె
కౌగిటబూను ప్రయత్నం.

ఈ వంతెనపై
అంకితమైన పాదముద్రలు,
చరిత్రలో నిలచిన స్మృతులు
కాలాని కాభరణాలు

వంతెన కిరుప్రక్కల

అసంఖ్యాక యశఃపతాకలు,

జాతిమత రాజకీయ విద్యా కేంద్రాలు.
నక్షత్రాలవలె అక్కడక్కడా
నీతివ్రతులు, త్యాగశీలురు.
ఇహపరలోక సత్ రూపులు

వెలుగు దూకుడుచే మేల్కొని
ఊహకు తప్ప మూర్తికట్టని రోదసి,
అతీంద్రియ శక్తిచే సంచరించు జీవసమూహం
కాలసూత్రానికి గ్రుచ్చిన జీవిత పుష్పాలు!

v v v

దూర ధరణీ కాంతారం నుండి
పరుగిడి వచ్చు మహా భుజంగాలవలె నదులు.
చుక్కల పూగుత్తులతో నిండిన
నీలగగన మహావృక్షం.

నీల వలాహక మసృణ రేఖలు
ప్రతిఫలించు కన్నులతో
చెలగు పయః పారావార
తరంగ మధు రసాకృతులు.

ముగ్ధ సరోవదనం పై
నతాకాశపు వంపులు.
తొలి మలి సంజలందు
గాలి పలుకరింతలకు,
మదిలో సుళ్ళు తిరుగు అమృతోహలతో
పులకరించి తూగు పూలసవ్వడులు.

హిమాంశువులు హత్తుకొని ఎదపై
కాలం ఒడిలో రెక్కవిప్పిన గులాబీలు.
వానిచూట్టూ కొనదేరిన కంటకాలు.

ఆకాశంలోని నక్షత్ర హాసం
శ్మశానంలోని నిప్పురవ్వవలె
భాసింపజేయు రాత్రి.
చీకటి కుచ్చెళ్ళలో దాగిన పృథ్వి ,
కొంగుచాటున కన్పించని దిగ్వలయం.

జగత్తు నాక్రమింప నెంచు
మానవుని ఆశా నిభృత వర్తనంవలె
దిక్కుల ముఖంలో వెలుగు!

ఆశాపతాక శిశువు, చెక్కిళ్ళపై ముద్దులతో
కన్నీటి చారలు తుడిచివేయు మాతృమూర్తివలె,
తమ్మిరేకులపై మంచుసోనలు
మలపివేయు ఉదయదేవి!

గోధుమవన్నె త్రాచువలె దిక్కుల కెగబ్రాకి
ప్రచండాంశు స్ఫారమూర్తియె అంతలో,
మింటినుండి మంటికి వ్యాపించిన గ్రీష్మం,
కణ కణలాడు నిప్పుకల హసంతీ హల్లీసకం.

అగ్ని శరాసారంవలె ఎడమేమాత్రమూ లేక
హత్తుకొన్న సహస్ర కరోజ్జ్వల దీప్తులు.
కుప్పలు కుప్పలుగా బూది చెరగిన నిప్పులు
సుడులు సుడులుగా తిరుగు వడ గాడ్పులు.

పెద్ద ఇసుకదిబ్బ వలె పగలు
నల్లని రాజిగుట్టవలె రాత్రి!
గాలిలో తేలు దూది పింజలవలె వెన్నెల
దూరంనుండి ఘన కాసారం వలె ఆకాశం
జలబిందువు కోసం మానవుని తహతహ !

కొడిగట్టిన దీప శిఖవలె గగనం
మసిబట్టిన అద్దంవలె దిఙ్ముఖం

అంటుకొని ఆరిన బొగ్గువలె భూమి
ప్రాణాధారం కోసం నడయాడు ప్రాణి.

వర్తమానంపై క్రమ్ముకొని దట్టమైన అతృప్తి
భవిష్యత్తుపై గూడుకట్టుకొని కోరికలు,
జలదశకలం కన్పిస్తేచాలు!
కళావిలసితమా ముఖ పంక్తులు.

శరీర స్పృష్టిగా చెలగితే శీతలవాయు రేఖ
ఒకడొకడు పొందు ఆనందం, బ్రహ్మపదవి చేరిక.
అక్కడక్కడ తిరుగు బుడగలవలె మనుషులు
వృధివీ దాహాగ్ని కర్పితమైన వర్షధారలు.

ఎక్కడి కక్కడే దూరదూరంగా వాలిపోయి
చూపుమేర మాయమా ఆకాశం.
అవిరామంగా అశాంతి గీతం వినిపిస్తూ
ఎప్పటికపుడు దూరదూరంగా పరుగిడు గాలులు.

నిల్వడానికి సూదిమొనంత చోటు సంపాదించి
ఆపైన విస్తృతికై పరితపించు బ్రతుకులవలె,
ప్రతి అంగుళం అంగుళం మేర నేలను
మ్రింగివేయడానికి మాటి మాటికీ
విజృంభించు తరంగ వేగాకుల సముద్రం,
ఉత్సహించు తరంగ సమాలోల సరసి.

ఇసుక ఎడారి నాలుక చాచి
దూరంగా సరస్సువలె కన్పించే
చంద్రునివైపు పరుగు తీస్తూ,
ఎంతకు అందుకో జాలని భూమి.

శిలామూర్తుల పాదాలముందు
పూల వరుస వలె కన్నీటి చుక్కలు.

పర్వత హృదయ కార్కశ్యానికి రోసి
రుస రుసలాడుతూ పరుగిడుతూన్న నదులు.

ఉన్మాద ప్రలాపాలతో తిరుగు వాయుగతికి
తలలూపు వృక్షాలు, అవతరించిన అగ్ని రూపాలు.
అశాంతిలో మైమరచి నగ్ననృత్యం చేయు
యుద్ధమూర్తి, దాహకమతి.

నీలిమబ్బులవలె గుంపులుగా ప్రబ్బికొన్న
స్పర్శగుణం, చలనశక్తి లేని నీడలు,
అగ్నికి భస్మమవని చీకట్లు,
వెలుగు పూడ్చలేని లోయలు,
మానవ ప్రగతి పథంలో

ఆనతి దూరంలో
ఈ వైకృత ప్రపంచ వీధులలో
అశాంతి దుఃఖ నిరాసనాకాంక్షుల
'శాంతి' వాగమృత ధారేసచనం.

II

అడుగు తీస్తే నుయ్యో గొయ్యో తెలియదు.
కదలితే ప్రక్కన జంతువులో మృగాలో
మనుషులో, రాక్షసులో, దెయ్యాలో?
సహస్ర జిహ్వాలతో
జ్వాలదగ్నులవలె ఆలోచనలు,
కర్ణవీధి కెగబ్రాకు
భిన్న ధ్వనులు, వర్ణరీతులు.

బాల్యం నుండి యౌవనం
యౌవనం నుండి వృద్ధాప్యం
ఆరోహణావరోహణల
క్రమం గల క్రియా కలనా జీవులు.

మౌఢ్యవిశ్వాస బలంతో

దరీ వాయు ఘోషలతో
వందలాది వత్సరాలుగా

వేరొక దశయే ఎరుగని
పురాణ ప్రబంధ శిలాపంక్తులు.

కొండలపై మెరపు చూపులతో
కన్నీరు కార్చు పయాద పంక్తులు.
ఎండకు తపించి, చివరకు నీటిచుక్కైనా
నిలువ ఎరుగని కొండరాళ్ళు.

కనులు మూసిన తల్లి ఒడిలో
చేతులు చాచి తడుముతూ,
వణకుతున్న చిరు పెదవులతో
వెలుగు మాసిన పసి చూపులతో
ఎండిన గొంతులతో
ఆక్రందించు శిశువులవలె
నేలపై గాలి బరువుకు
నిల్వలేక తూగు గడ్డిపోచలు.

బండలపై బోదెలపై విరిసి కురిసి
మృదుత్వం కోల్పోయిన వర్షబిందువులు.
గాలి రొద ప్రసారం చేయు వృక్షవితతి
దిగ్భిత్తికలకు వ్రేలాడు మబ్బు గబ్బిలాలు,
అక్కడక్కడా సనసన్నగ నీడబొమ్మలు,
సంచరించు ప్రేత భావేపత ముఖులు.

తక్షణమే ఉన్మనీచరమ దశనందిన
ఝుంఝూ సంగీతం.
వాయూచ్ఛల దుగ్రరావ భూత ప్రకృతి
పటుతర భీభత్స కథారచన.

తలకు మించిన వ్యూహంలో చొచ్చి

అసువులు కోల్పోవు విమతులు,
నదీ మహావర్తంలో చిక్కి
పల్లటీల్గొను నావలు.

నటనా చాతురీ నిగూఢ హాసం
పెదవుల పొందికపై
సదా ఒత్తిగిలి ఉండు
దుష్టోద్యోగి మనఃప్రకృతివలె
ఎప్పుడు విచ్చిపోవునో
తెలిసి చావని అగ్నిపర్వతాలు.

మనోఽంతర పదవి సుడులు తిరుగు
ఊహల స్వేచ్ఛా సంచారం,
కార్యదశకు చేరిన
భయ సన్నివేశం వలె
కల్లోలానిల వాతావరణం.

నవ్వు తెరలు కప్పి మానసిక హత్యలు జరిపి
పదునెక్కిన చేతులతో ప్రక్కన నడచే మనుషులవలె,
రివ్వున దూసికొనిపోవు మెరపు బాకులు నిండి,
వెలుగు జడితో చిందులుతొక్కు కారుమొగిళ్ళు.

అక్కడక్కడ వేసగి నీరసించి కృశించిన మొక్కలు,
దూరదూరంగా తప్పుక దాగిమలగు జీవులు.
బాటసారుల కళ్ళలో దుమ్ముకొట్టి
అమాయకంగా నిలచిన ఇసుక దిబ్బలు.

అక్కడక్కడ గొంతులు సవరించుకొను ఈలపిట్టలు
దగ్గరిదగ్గరిగా తూలి తూలి చను ప్రాణి సమూహం.
గీష్మమందుకుంటే చాలు తగులబడి పోవడానికి
ఎండిన మ్రోడులతో ఎదురుచూస్తూన్న అరణ్యాం!

సుత్తెల వ్రాత ఎరుగని కొండరాళ్ళు
వర్షపు చినుకులు చవిచూడని మట్టిదిబ్బలు

ఋతుపరివర్తన శక్తికి తాళలేక నశించే,
చిగుర్పు పెరుగుదల ఎరుగని గడ్డిపోచలు!

**మాదిరాజు రంగారావు**

అనియమిత మానవ ప్రగతి చరిత్రలో
పూర్వాపరిస్థితుల మధ్య ఏర్పడిన లోయలు!
కళేబరాలతో పూడ్చబడి, మారిన మట్టి దిబ్బలు,
ఈ దిబ్బలపై రప్పలవలె వసించు జనం.

వెనుదిరిగి చూడక ముందుకుసాగు
నదీ ప్రవాహం వలె,
అణగిన కోర్కెలతో
ఒకచోట నిల్చిన పడియవలె,
ఋతు మనోజ్ఞ వర్ణ సౌందర్యం
ఎరుగని, కాలచిత్రం వలె,
నదీ సమార్ద్ర కరస్పర్శ
సోకని చలన రహిత శైలం వలె
బహు విధ జీవిత రూపాలు
ప్రకృతికి ప్రతి బింబాలు.

పరిపాలింపబడి అనిదంపూర్వ స్థితిచే
విసరిబడి బహుదూరం విపరీతపు గాలిచే
ఊహ పరిధిలో మలచబడి విచిత్రరీతి
గల్లచేపటంవలె మ్రాయు వాయు ధ్వనులవలె
వాయువీధిసాగు మృదు కఠోర స్వరాలవలె
చరించే మానవ రాక్షస తత్త్వానేకమతులు.

వర్షధారలచే ఆర్ద్రమైన భూసారం గ్రహించి,
ఉద్గమించి పుష్పఫలభారంతో వంగి,
శిశిర వాయువులకు ముడుచుకొని
ఆకురాలి ఎండిన లతాతరువుల వలె

జీవన సంతోష రేఖలూ
మృత్యు విషాదచ్ఛాయలూ

బింబించిన రూపాలతో
స్పందించు ప్రవర్తనలతో

ఆయుః పరిమితి వెళ్ళబుచ్చు
చైతన్యం దాగిన లౌకిక మూర్తులు,

ఒక వాయు ఝుంఝు, ఒక రాక్షస కృత్యం
ఒక దిశలో ఒక స్వభావంలో ఒదిగినట్లు,
స్వప్న ఘటనలు, సముద్ర ఘోషలు
ఒక అనువర్తనం, ఒక లయలో సాగినటు,
కలతలో అలజడిలో నిదురలో చావులోనూ
నియతరేఖ ననుసరించి నడుస్తుంది;

అవిజ్ఞేయంగా అనిశ్చితంగా
కన్పించే సంకీర్ణ మహాసృష్టి.

III

రెండు కనులు విప్పి
ఎంత చూచినా తృప్తి చెందక
నా ముఖానికెదురుగా
సూర్య చంద్రులు గుర్తుగా,
వంగిన ఆకాశంలేచి
విశాలమై భూభాగం ఇచ్చిన
అవకాశస్థలి నిశబ్దంగా,

వినబడు సంగీతం వింటూ
కనబడు దృశ్యం చూస్తూ,

పొలాలు ఎడారులు కొండలు
అరణ్యాలు నదులు జనపదాలు
తిలకిస్తూ ఎంతదూరం వచ్చాను?

వికసించిన పద్మంవలె
నిశ్చల గగన రేఖలు

హత్తుకొనేంతటి దగ్గరగా.

**మాదిరాజు రంగారావు**

నగ్నంగా వృక్షాలు నావైపే చూస్తున్నవి
ప్రేమతో నదులు పరుగిడుతూన్నని.
చేతులు చాచి ఎదురైనవి గాలులు.
గతకాలస్మృతులవలె రాలుతుంది మంచు.

ఆకాశాన కారుమొగిళ్ళ గుంపులు
భూమిపై నల్లని త్రాచుపాములు.

కొంత దూరంలో దూరదూరంనుండి
కపాల నిర్గత వాయు స్వరాలు విని
హర్షంతో ఎగిరిపోయే పిట్టలు.
భయంతో ముడుచుకొనే మనుషులు.

దూరం సుదూరం సాగిపోయిన
నా మేధలో ఒక ప్రక్కకొరిగి
తిరిగే భూగోళం, ఊహావలయం.

ఊహాగతంగా వేదన పెంచుకొని
మానవులను చూడడానికెంతగా
తపించి పోతున్నాను?
అడుగడుగునా కంటి నాకర్షించేవి
రంగులు వేసిన మట్టిబొమ్మలేగా?

నలువైపులా పరికిస్తూ
గమనం సాగిస్తూన్న నేను,
నేనుగా గుర్తు పట్టడానికే
ఇంత కాలం పట్టింది?

ఎక్కడ ఎవరిని చూచినా
వారిలో నా రూపమే.
ఎక్కడ ఎవరు పలికినా
అందులో నా ఊహాయే.

కనబడు వినబడు జగత్తును
పరిపాలించే మానవ మేధ.

కనబడని వినబడని దానికి
ఆవర్జితమైపోయే హృదయం.

గడచిన రోజులు వెలగుకంబాలవలె
తలచిన స్మృతులు నిదురలో స్వప్నాలవలె
గుంపులు గుంపులుగా ఊహలు మబ్బులవలె
మనస్సు నాక్రమించి క్షణం నిలిచా.

అంతలో మహాధ్వని!
అంతలో నిశ్శబ్దం!
నా చుట్టూ నాల్కలు తెగిన గంటలవలె
గాలి పిలుపుకు పలుకలేని
ఆకురాలిన చెట్లు!
గాలి స్పర్శకు పులకరించలేని
ఎండిన నదీనదాలు!

మనస్సులో ఆవేదనా సంగీతం
కనుల యెదుట మాన రోదసి!

నా శిరస్సు ఆకాశం వలె
అందని మేరలో నున్నది
నా పాదాలు నదీ తరంగాల వలె
ఒక చోట నిల్వలేకున్నవి

నా మనస్సు గాలివలె వెలుగు వలె
ఆడుతూంది అంతటా
నా చూపు కత్తివలె పక్షివలె
దిక్కులలో దూసి ఎగురుతూంది.

అన్ని ఋతువులకు ఒదిగిపోతూ
వాయు మూర్తులతో కలిసి

ఎంత దూరమైనా సాగి
వెనుకకు మరలిరా స్ఫురించదు;

ఆకాశం గొంతులో గొంతు కలిపి
వినిపించే పృథ్వీగీతం వింటూ.

ఎన్ని రోజులు గడచిపోతే
అన్ని రెక్కలు మొలచినట్లు నాకు.
అన్ని రేకులతో వికసిస్తుంది
నా జీవితకాల పద్మం!

# మానవీయం

## రెండవ భాగం

## అశాంతి

వాయుసంగీత వికంపితమై
సమార్ద్రమై లయించి నదించు
గ్రీష్మవేళా హిమశిలంవలె,
సూర్యకిరణ తీక్ష్ణతకు వాడిపోక

వెన్నెలల మృదూహలకు మెత్తబడు
నీలగగన వలయం వలె,
తాకితే భగ్గున మండించు
అంతా రూపసౌందర్యశిఖవలె,
నిశ్చల సమరేఖాస్థితిలో నున్న
మనస్సులో ఎక్కడిదీ అశాంతి.

దీర్ఘ భుజగంవలె బుసకొడుతూ
నటత్తరంగిణివలె చెంగలిస్తూ
మలకలుగా మెలికలుగా తిరిగిపోవు
మనస్సులో ఎక్కడిదీ అశాంతి!

జీవితమే కళాకృతిగా
మారిపోవడానికి నాంది !

వెలుగు అహంకారంతో
ముసరు చీకటి గుంపులో
విసరు చురుకు గాలిలో
ఆకారం మలచుకొన్న అశాంతి.

ఆనంద లోకాధిపతులపై

రహస్య హత్యా ప్రయత్నం.
సముద్రంలో ఎగిసే తరంగాలవలె
మనస్సులో తీవ్రాలోచనలు.

**మాదిరాజు రంగారావు**

కాలచక్రార ఋతుపరివర్తనతో
స్వభావం మారిన ప్రకృతి స్వరూపంలో
రాతిరికళ్ళలో గగన మస్తిష్కంలో
మనోరోదసిలో దాగిఉంది అశాంతి.

రున విరచుక పడు
వార్షక ఝుంఝూ మూర్తివలె
మనస్సులో స్త్రీ స్ఫులింగమై
మేల్కొన్నపుడు అశాంతి.

మానవతా కేంద్రం నుండి సాగిన
ప్రగతిశీల పరిణామశక్తుల ఆక్రమణతో
సమాజపు సరిహద్దులు చెరగి పోయేప్పుడు,
దైనందిన జీవిత సమస్యలకు స్వస్తి చెప్పి
ఎంతవరకు తీరని సందేహాలతో
ఆకాశపుటవతలి లోకంపై ప్రశ్నలతో
విశ్రాంతి కలవడిన గుండెలలో
అశాంతి! హాహాకారహసంతులు!

సంధ్యా సమస్యలే సమస్యలై
చుక్కల ప్రశ్నలే ప్రశ్నలై
కంటికి వెలుగుకరవై నపుడు
సంప్రదాయరేఖ లధిగమించి
చీకట్లను సహస్రధా చీల్చు
కాంతి విప్లవం రెక్కచాచిన
అశాంతి! శాంతికై అశాంతి.

అశాంతిలోని వీరకృత్య చిహ్నాలు,
చరిత్రలోని ప్రగతి సోపానాలు–
పూర్వం వెలసిన అశాంతి స్థితులు

రాజుల కీర్తి గౌరవాలకు కొలతలు.

తెరలు తెరలుగా జారిన భిన్నభిన్న వర్ణోహలు,
పొరలు పొరలుగా ఒదిగిన సామాజిక శ్రేణులు

మనోవ్యాపారం, క్రియాకలాపం లేనిది,
నిజంగా శాంతి లేదు, మానవునికి.

హృదయంలో సూక్ష్మ సూక్ష్మంగా
తీవ్ర తీవ్రంగా చెలరేగిన
మాయని అశాంతి చిహ్నాలు,
మనోజీవి ప్రతిభా స్వరూపాలు.

శాంతి! శాంతి! శాంతి!
అశాంతి సమావరించని
స్థలరేఖ, కాలాంశం ఉన్నదా?
అనంత విశ్వంలో?

రాతియుగం నుండి అణుయుగం వరకు
నియంతృత్వం నుండి సామ్యభావన వరకు.
సాగిన చరిత్ర పరిధులన్నీ
అశాంతిలో రూపొందినవే.

II

ఊహల ఉన్మేషంతో రూపొందిన సృష్టి.
కదలికతో గమనం,
అభిరుచితో జీవితం
అనుభూతితో పరమార్థం
సాధించే మానవుడు.

ధూళిక్రమ్మికతో రంగులుగా భాసించే
వాయుగోళాలవలె పరిస్థితులు.

ద్యావాపృథివి మేల్కొన్న క్షణంనుండి
ఏ ఒకరి మృత్యువుతోను అంతమొందక
అవిచ్ఛిన్నంగా సాగే సంస్మృతులు, అనుభవాలు,
సృష్టి క్రియాంశలు, పరివర్తన రూపాలు.

**మాదిరాజు రంగారావు**

మృత్యువు కివతలనున్న ఈ లోకంలో
అడుగుతీసి వేసే లోపల
నా దృష్టి పరిధి నాక్రమించి,
ఒకదాని నొకటి మించిన వేగంతో
కొన్ని మించని వేగంతో కదలిపోయే
భిన్నభిన్న రూపాల అసంఖ్యాక ముఖాలు.
ఆడబడుతున్న చదరంగాలు, వైకుంఠ పాళీలు.

ప్రొద్దు పొడవగనే
సంక్షుభిత విభుగ్న పరికుంచితములై
వేదనా విదీర్ణ పరిపాండురములై,
రాత్రి కురిసిన చీకట్లకు తడిసి చివికి
కోర్కెల కుబుసం రాలిపోయి,
విచ్చిపోని ప్రశ్నల సంకెలలతో
కదలెడి సంకెలల గల గలలతో
గుప్పిళ్ళు గుప్పిళ్ళుగా విసరిన చీకటిలో
నింగి బూది కుప్పనుండి క్రిందికిరాలే
తూర్పార పట్టిన నిప్పు కణాలవలె
కన్పించు చూపులతో,
జేవురించి మసిబట్టి పాలిన ముఖాలు.
పరిభ్రమించు అశాంతి గోళాలు.

ఎదురెదురుగా జంటగా మూకలో ప్రతిచోటా
ఎప్పుడు చూచినా ఒంటరిగా సామాజికంగా
నిన్నటి గురించి నిరాశ, నేటిగురించి అతృప్తి
రేపటి గురించి అందమైన కలలబొమ్మలు.

మనిషిలో మరొకరికి కన్పించక
తిరుగు అసంఖ్యాక రూపాలు.
ఒక నీలితెర తొలగిపోయి

అవతరించు ఉదయంవలె,
ఒక ఘటన ముగియగానే
బహిర్గతమా నిజరూపం.

పెదవులపై చిరునవ్వులు, ముద్దు మాటలు,
ఏడుపులు, అరపులు, తిట్లు, ఆక్రోశాలు.
మంచు, చలి, వేడి, ఎండ, గాలి తెరలు.
తెలుపు, నలుపు, ఎరుపు, రంగు విరుపులు.

అనందం విషాదం సంయోగం వియోగం.
అవధిలేని కాలం ప్రకృతిలో పరిణామం.
రాత్రి పన్నెండుగంటలు, జాతకంలో మార్పు
నిన్న ఈ రోజు రేపు వెనువెంటనే
ఒక స్థితి అవసానం, పునరావృత్తం.

కాలు జారినపుడు గాలి నవ్విన సవ్వడి,
కాలు సాగినపుడు గాలిమెచ్చిన ధ్వని.

పలుచనినీడ తెరలవలె ఊహలు.
వాని వెనుక రమణీయాకృతి, స్త్రీ.
తిరిగి తిరిగి వచ్చిపోవు ఋతువులు
మలగి మలగి సాగిపోవు బ్రతుకులు.

అడవిలో పొలాలలో పల్లెలలో పట్టణాలలో
చేతికందని ఎత్తులో గాలికి మ్రోగు
ధ్వజస్తంభ ఘంటికలవలె మనుషులు.

జన్మజన్మాల పరంపరగా వచ్చు
అనాది వాసనాత్మక కల్పనలతో
మలగిన వివిధాకృతులు.
ప్రేక్షకుల మనోవృత్తులతో
సంబంధంలేని సినిమా చిత్రాలు.

అణువునుండి అజాండ పర్యంతం,
అలముకొన్న అశాంతి ఆవరణంలో,

కాలం చేతులుచాచి ప్రతిక్షణం

రూపుమాపుతూ వచ్చినా,

**మాదిరాజు రంగారావు**

మాటిమాటికీ శాంతి రేఖలు
గీచుకొని బ్రతికే ఆశాజీవులు.

దేహ పోషణకై ఆరంభించి పోరాటం
కుడు గుడ్డ పదవి కీర్తిలో ఎన్నటికీ
తృప్తి యెరుగని శరీరులు

ఆలభ్యమైన దానికోసం
జీవితం పిండి, విసిగి వేసారి
ఆవేదనా హృదయంతో చివరకు
ఈ జీవితానంతర భావనలో
పుణ్యలోకాలు సృజించుకొను
లోక హితైషులు, ఆనందమూర్తులు.

ఋతువు శోభ, పవమానస్పర్శ
ఆశ్చర్య ఘటన, దుఃఖసమయం
ఆనంద స్థితి, కళా సౌందర్యం
చైతన్య ప్రకాశనం, వేదాంత భావన;
సూక్ష్మ తీవ్రదశలలో జీవితంలో
అనుభూతులు గుములుగా చుట్టుముట్టినా
కదలని మెదలని మనోనైశిత్యం తెలియని
పోతపోసిన లోహఖండాలు.

ఆకలిగొన్న ఆశతో కసి బలిసిన కళ్ళతో
ఆరని హసంతికవలె కణకణలాడు హృదయంతో
నవోహలు మొలకెత్తని మరుభూమి మస్తిష్కంతో
ఎండకెండి వానకు తడిసి చలికి బిగిసి
మాటుబారిన శరీరాలతో ద్రిమ్మరుతూ,
రాత్రివేళ ఏగోడ పంచనో చెట్టు క్రిందనో
శారీరక కామన తీర్చుకొని బయటపడి

చౌర్యం సాగించి క్రౌర్యం కనబరచి,
నిశ్శబ్దం రూపుకట్టి నివ్వెరపోయిన స్థితిలో

నీడలవలె పడి ఉండి, తృప్తిగా నిదురపోవు
దిశిబొమ్మలు, వెలుగు సహించని తమామతులు.

దైవబుద్ధి చేతులెత్తి శూన్యంలోకి పరుగెత్తి
రాత్రితప్ప దిన మెరుగని పుట్టంధులు,
ముందు వెనుక ప్రక్కల జఘన్యస్థితిలో
బ్రతుకులో వెల్గుపోచ ఎరుగని భాగ్యహీనులు.

ఎన్నిమారులు యుద్ధం వచ్చిపోయినా
ఎంతకాలం శాంతి నెలకొనియున్నా
పాలన తలక్రిందై పాలకులు మారినా
మరుభూములలో చెక్కుచెదరని దిబ్బలవలె
ఎక్కడబడితే అక్కడ సంస్కార హీనదశలో
దాదాపంతా మగత నిదురపోయేవారే.

రాజకీయ సాంఘిక మత తీవ్రశక్తుల
ఆకర్షణ కోల్పోని, సంఘర్షణ వీడని
విప్లవ మనస్తత్వంగల అగ్నిమూర్తులు.
దివ్యదశల నూహచేయు శాంతివర్తులు.

నవ్వుతూ ప్రేలుతూ కోపిస్తూ నటిస్తూ
వివిధ రీతులలో రంగులలో వెలుగుతూ,
మంచు మబ్బు చీకటి
గాలి నిప్పు వెలుగు
తెరల చాటు నుండి
పరిక్రమించు ముఖ పంక్తులు.

సూదుల వంటి చూపులతో
క్రీపెదవి బిగబట్టి నడచు పురుషులు,
ఎరుపెక్కిన చెక్కిళ్ళతో
బరువు రెప్పలెత్తి చూచు స్త్రీలు.

జీవితంలో సమార్ద్ర పరిష్వంగంతో

అమృతం వర్షించు, నిప్పులు పండించు

మసృణానల విస్ఫమర శృంగార కళికలు.
దేవతను రాక్షసునిలా, రాక్షసుని దేవతగా
వెలుగు — చీకటిగా బ్రతుకులు తీర్చగల
జీవన — మృత్యు కళా రూపులు.

హృదయాకాశం నుండి కురియు
ప్రేమ వర్ష బిందువులను
ఎప్పటికపు డింకింపజేయు
ఇసుక దిబ్బలు కొందరు.

అందం మట్టిలో
ఆనంద మాకాశంలో కలిసి
నిలుకడ ఎరుగనిదై మనస్సు
దూదికన్న తేలికై బ్రతుకు
అగ్ని రూపస్థితి కాపుతియె,
గాలిలో లయించి ప్రాణచ్చట
కాలగర్భంలో ఆశ్రయం పొందిన
అభిమాన మూర్తులు.

తమలో ఎంత లోతుగా
అసురాంశు నిద్రాణమె యున్నదీ
తమపట్ల ఎంత గాఢంగా
భవిష్యత్తు దాసభావం వహించిందీ
తెలియని అమాయక హృదయాలు
తెలిసిన విజ్ఞులు, ప్రతారించు లౌకికులు.

అగ్నిపర్వత శిఖరం పగిలినట్లు పట్టపగలు.
ఎక్కడ చూచినా తీవ్రగమన వైఖరులు.
తమపై మమకారం, లోకంపై మహాతృష్ణ.
ప్రక్కవాడితో అజ్ఞానంలో పోటీ.

సాయం సమయం
పాములు విడిచిన పుట్టవలె

కోర్కెలు ఫలించని ఇసుక దిబ్బవలె
సంధ్యానలకీలలకు పొగబారిన ఆకాశం.

జాతులు జాతులుగా మాలలు మాలలుగా
ఇతస్తత ఉడ్డీన విహంగమ సమాకీర్ణమై,
చివరలు నీలీకృతమైన విలోచన పథం.
విశ్రాంతి కోరు యాత్రిక సమూహం.

ప్రాణమున్నంత వరకు,
త్రైగుణ్య విపర్యయంతో
అసంపూర్తి కామనలతో
రగులు మనఃశ్మశానంతో
సతమతమౌ మానవుడు.
అతని ఇష్టాపూర్తికి చిట్టచివరి దశ
ఈశ్వరుడు ఆపైన బ్రహ్మపదవి.

ఈశ్వరుని పాదాలముం దవనత
మస్తక సోపాన వలయం.
అతని శిరః పదంమీరి
బ్రహ్మ పదవి చేరగల
తమలోని ఆత్మ రూపం
తెలియని జీవసమూహం.

రుద్రభూమిలో శివతీర్థం
యుద్ధభూమిలో స్వర్లోకం
మృత్యుముఖంలో పునస్సృష్టి
నిద్రాలోకంలో స్వప్న ఖండం
ఆశావిస్తృతిలో తృప్తి రేఖతో
వెలుగు ఆనందపరీతాత్ములు.

మింట గాలి కౌగిలిలో తేలి
ఎప్పుడో ఎక్కడో వర్షించి
భూమిని పులకరింపజేసి

లేదా తునాతునకలై పోవు
చలచ్చంచల మేఘ పంక్తులవలె
స్త్రీ పురుషులు.

విషాద వైరాగ్యజిజ్ఞాసతో
భయ సందేహ పరిశీలనతో
వేదాంతం విజ్ఞానం నూల్కొల్పి
విద్య ధనం కీర్తి అధికారంతో
అందం మోహం ఆనందం ముక్తితో
ఆరాటం పోరాటం ఆటుపోటులతో
విజృంభమాణ విస్తరణశీల అహంతో
సమశక్తుల సంఘర్షణలో
దుర్బలుల ఆక్రందనతో
సంధ్యారుణ రక్తిమలో
శాంతికోసం మానవుని తాపత్రయం.

* కేవల మేధా శక్తితో
ఆహార వ్యవహార సమస్యలు తీరి
ఇచ్ఛామరణశక్తు లరచేత బట్టి,
భూమిపై యంత్రంవలె
వ్యోమంలో విమానంవలె
సముద్రంలో నౌకవలె,
తెలిమబ్బుకన్న తేలికైన
సంకోచ వ్యాకోచ శరీరాలతో
విశ్వగోళం బింబిచే మస్తిష్కాలతో
ప్రేరణాత్మక సహజశక్తుల నెరుగకయే
వేదనానుభూతిచ్ఛాయలైనా లేకయే
సమాజావసరాలకు మించని సంఖ్యలో

* A brave new world అన్న గ్రంథంలో Aldous Huxley విజ్ఞానశాస్త్రం బాగా అభివృద్ధి చెందిన నాటి స్థితి నూహించి చిత్రించిన సమాజ స్వరూపం,

ఆధారంగా

భిన్న రీతుల్లో నిర్మితులై ప్రవర్తించు,
రసాయనిక ద్రవ్య సముద్భూత భౌతికరూపులు.
ఆగామి యుగంలో అవతరించనున్నవారు.

చీకటిని రూపుమాపు కాంతివలె
సృష్ట్యాద్యంతాలు కొలిచే చూపులతో
నిశ్చితంగా తరగతులుగా విభక్తమైన
సహజోన్మీలనమతిలేని వారు.

అశాంతినంతరింప యత్నించు
వినూతన విజ్ఞాన మహాయుగం.

III

సూర్యుని పాదముద్రలెంత వరకు సాగినవో
అంతవరకు ఏవో ఆకృతి విశేషాలు తప్ప
ఎక్కడా ఎవరి నిజస్వరూపమూ కన్పించలేదు.

ప్రక్కనున్న చెట్లకు నాభాష తెలియదు
వాటిలో ఒకరి భాష వేరొకరికర్థం కాదని
తరువాత తెలిసింది.

ప్రక్కనున్న కొండలకు నా రూపం కన్పించదు.
వాటిలో ఒకరిని వేరొకరు చూడనేలేరని
తరువాత తెలిసింది.

వెనుక నడచే నీడలకు నా ఉనికే తెలియదు.
వాటికి చెవులు నోళ్ళు కళ్ళు లేవనుకున్నా
కాని జీవం కూడ లేదన్న విషయం
తరువాత తెలిసింది.

వెలుగు గీతదాటని చీకటి బంతులవలె
ఎక్కడబడితే అక్కడ దాగిదాగి మలగు

జంతువులు తప్ప నాకంటికి ఎక్కడా
జ్ఞాన స్ఫూర్తి గల మానవు లగపడలేదు.

**మాదిరాజు రంగారావు**

దూరం బహుదూరం వెళ్ళిపోయిన
నా పాదాలక్రింద అణగిన ధూళి రేణుపులు.
బుద్ధిని వదలని తృష్ణతీరని కామనలు
కంటిముందు ఎదవిప్పి ఆహ్వానించు రోదసి.

మింటినుండి మంటికి జారిన
మంచు తెర చాటున ఎవరో,
నే సాగినపుడు ముందుకుసాగి
నే నిలచినపుడక్కడే ఆగి
మనోదఘ్నంగా ఆలోచనామూర్తిలా
కనుచూపు మేరలో నిలిచిపోతే
నా కాలిసవ్వడి నాకే భయంగా
నా ఊహ పడగ విప్పిన పాములా
నగ్నంగా వాంఛాసహితంగా కన్పించి
నా ఆకృతి నాకే రెండు రంగులుగా;

ముఖంత్రిప్పి చూతును గదా వెనుక
మలిసంజ వేళ జడలు రేగిన చీకటి.
నేత్రపరిధి నావరించిన నైల్యాకృతి
ఎటు చూచినా మానభావస్థితి.

దగ్గర దగ్గరగా దూర దూరం నుండి
గాలి నడకల పరుగుల సవ్వడి.
అది నవ్వుతెర, ఏడుపు రొద
ఏమైనా కావచ్చు.

ఈ ఎడారి, అడవులు
పొలాలు, మైదానాలు క్రమ్మిన
ఆ మంచు తెర చాటునుండి
కన్పించే దెవరా శాంత మూర్తి?

ఒక విధంగా భగవంతుడు

అవిద్యాప్రపంచంలో వెలుగు

జ్ఞాన రూపం. అవునేమో?
నా నీడ నిలుపు వెలుగు రేఖ!

లౌకిక జగదనుభోగంలో
ఆనందం విషాదం పేరిట
రసోద్విగ్నమతికి గోచరించు
అశాంతి వివర్తదృశ్యాలు.

కాల పరిమితి లేకుండా
అద్దంవంటి బుద్ధిలో బింబించి
హృదనుభూతి కాంతిలో కన్పించు
వివిధ మనో భూమికలు.

## యుగదర్శనం

ఈ పురోగమనమెంత వరకు?
దిక్కుల అంచుల వరకు.
ఎంతకాలం సాగుతుంది ప్రయాణం?
మరో ఉదయమయ్యే దాకా.

ఎక్కడికీ సాంధ్యవేళ?
మరో మనోలోకానికి.
ఆ శాంతిని పట్టుకోవడానికి.
ఈ రూపం మారిపోవడానికి.

సృష్టి రహస్యం ఇది ఇది అని
ఎవరు ప్రపంచించింది నిజం?
ఏదో ఎందరికో తెలిసినట్లుంటుంది.
ఎవరికీ సంపూర్ణంగా తెలియదు.

**మాదిరాజు రంగారావు**

ఎన్ని యుగాలు గతించినా
ఇంకా ఇక్కడే ఉన్నాం ఉన్నచోటునే,
మానసిక వైక్లబ్యంతో
యుద్ధభయోన్మనీ దశలో.

ఎన్ని తరాలు గతించినా
అక్కడే ఉన్నాం అజ్ఞాన స్థితిలో;
మానసిక వ్యాపారంతో
తెలివి మీరిన ముఖాలతో.

ఎంత దూరం ప్రాకినా
ఎంత కాలమాలోచించినా
అంతరిక్షం హస్తగతమైనా
గ్రహాలు స్నేహితులైనా
బ్రతుకు భోగభూమి ఐనా
మేరలేని వాంఛా పిపాస.
ఇంకా దేనికోసమా ఆవేదన.
తత్సాధనకై యత్నంలో అశాంతి.

చీకటి ఓటమి నంగీకరించలేదు.
ఆకాశంవలె విస్తృతమా
అజ్ఞానం తుది తెలియలేదు.
దివానిశలు ఋతువులు వత్సరాలు
ఒకదాని వెంట వేరొకటి
ఆగమనం నిష్క్రమణం పునరావృత్తం.

స్వర్గం, నరకం, మతం, రాజకీయం
పరాకాష్ఠ నందుకొన్న స్థితిరూపం
తిరిగి మరో మరో రూపంలో ప్రత్యక్షం.

ఒక ప్రాణి సన్నని చూపులో ఒదిగి
ఒక జీవి బరువు నిట్టూర్పులో తూగి,
సామాన్యుని కంటికొక మట్టి ముద్దవలె

విజ్ఞానానికి పరిభ్రమించు గోళంవలె
వేదాంతికి భ్రమాదిత స్వప్నంవలె,
స్పష్టాస్పష్టంగా సంపూర్ణాసంపూర్ణంగా
భాసించు సుఖదుఃఖాత్మక ప్రపంచం.
బహు విచిత్ర మనోభావ సంకలనం.

ఈ ప్రపంచ నిర్మాణ పరంపరకు
మూల కారణం?
నీరు ? మట్టి ? కాదు !
చైతన్యం ? అవునేమో !

ఇంకా ఇంకా ఏమైనా కావచ్చు
మరో నాటికి తలయెత్తు మరో సందేహం.
కొన్నాళ్ళకు పరిష్కార సూచనలు.
ఎప్పటికపుడు వ్యత్యస్తమై పోవు
సిద్ధాంతాలు, విలువలు.

గగన పదవి కదలు మబ్బులవలె
గాలి తాకిడికి వినిపించు ధ్వనులవలె
అంతటా ప్రసరించి తరగని వెలుగువలె
చేతికందీ అందని నీడలవలె,
ఆనంద విషాద మిశ్రిత రూపాలలో
ఎక్కడ మొదలై ఎక్కడ అంతమొందుతాయో
తెలియని ఆలోచనలు,
తదనుగుణ ప్రవర్తన గతులు.

విజృంభమాణ విభిన్నశక్తుల
పరస్పర ఘర్షణతో పతనమై,
మరల ఉదయాన్ముఖమై వికాసించి
ప్రతిష్ఠితమౌ సమాజ వ్యవస్థ.

అనాదినుండి సృష్టి రహస్య గవేషణలో
జీవితాల నంకితం చేసిన

**మాదిరాజు రంగారావు**

వేదనాజీవులు, మహితాత్ములచే
పరంపరగా రక్షింపబడుతూ
వస్తూన్న అఖండ మానవ సంస్కృతి.

మతం లేదా రాజకీయపు ముసుగులో
దాచబడిన మనిషి నిజరూపం.
బహువర్ణ రూపాలలో ప్రకటితమా
హత్యాభిముఖ రహః పూర్ణ మనోదశలు.

ఈనాటి వరకు హత్యా బుద్ధిలో
వేగ తీవ్రతలు సన్నగిలని మానవుడు.
ఈనాటి వరకు క్షమారహిత
శిక్షా నైశిత్యం మొక్కవోని నాగరికత.

ఎన్ని అవతారాలెత్తి
ఎన్ని మతాలు నిర్మించి
ఎంతగా సాహిత్యం సృజించి
ఎంతగా విజ్ఞానం ప్రపంచించి
కాలానికెన్ని మారులెన్ని విధాలుగా
స్వర్ణ కిరీటాలు ధరింపజేసినా
అశాంతి అంధకారంతో నిండి
మారని హత్యాభిముఖ చంచలమనస్థితి.
అసంస్కృత దశలోని అసాధారణ దుస్థితిలో
ఆయుః పరిమితి వెళ్ళబుచ్చు మానవులు.

ప్రతివస్తు నిర్మితి రూపంలో
సృష్టి రహస్యం శోధించి
ప్రతి చిన్న కదలికలో
కార్య కారణ మూహించి,
ఆకాశం పొరలొలిచి వేయు
నిశిత హేతు దృష్టితో

పైన ఆ పైన లోకాలు భావించి
విభిన్న శక్తులను దర్శించి

మనిషిలో పక్షిలో పాములో
జంతువులో పిపీలికలో వృక్షంలో
ప్రాణశక్తి గుర్తించి జనూరహస్యం శోధించి,
రోదసీయానంతో
గ్రహతల సంచరణం సాధించి
పురోగమనధ్యేయం వదలని
ఆశాజీవి, మానవుడు.

II

నిల్చి యాచిస్తున్న
పిచ్చివాని ఊహలవలె చుక్కలు.
చుట్టూ తడుములాడు
గ్రుడ్డివాని చేతులవలె గాలులు.

ఒకరి ఊహ వేరొకరు పలుకలేని
మూగజీవుల నిర్వేదం వలె,
అక్కడక్కడా ఒదిగిఉన్న మసక వెలుగులు.

ప్రకృతిలో మృదురూపం ధరించిన
ప్రశయం వలె,
మనస్సులో భయదాకృతి దాల్చిన
ప్రేమ వలె,
అంధకార మాక్రమించి నిల్వజూచే
వెలుగువలె, బ్రతుకులు
గ్రీష్మంలో ఇంకిన నదివలె
సూర్యుడస్తమించిన దిశవలె
చావుతప్పిన బ్రతుకుగడపు,
ఈ శతాబ్దంలోని సామాన్యుడు.

ఊహలో అదృశ్యమైన ఆశను

మేఘంలోని మెరపు జ్ఞాపకం చేస్తున్నది.
సూర్యుడు తమ ముఖాలలో
ఎప్పుడు పొడిచేదీ ఎవరికి తెలియదు.

**మాదిరాజు రంగారావు**

రాత్రివేళ భయనిద్రాసమాధి వలె
సంగీతం విరమించిన సముద్రంవలె
ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నిలచిన శరీరంవలె
ఆగినట్లున్నది కాలం, నిశ్శబ్దంగా.

అంతరిక్ష గోళాలలో ఆవాసానికి
విరివిగా జరుగుతూన్న ప్రయత్న సంరంభం.
భూగోళంపై ఒకమూల మానవుడు
తిండికీ బట్టకు అఘోరించే అభాగ్యం.

కొలిమితిత్తులవలె మండిస్తూ ఊపిరితిత్తులు,
చలికి బిగిసి ఏనాడో గడ్డకట్టిన ఆలోచనలతో
ఎక్కడవేస్త అక్కడే! మట్టిముద్ద స్వభావంతో
కబంధుని చేతులలో కీలుబొమ్మలు.

ఇంద్రియ తర్పణీయ భౌతిక సౌభాగ్యంతో
గ్రహాంతర విజ్ఞానంతో, నిస్సందేహంగా
పరిణతి చెందిన మానవ జీవితంలో,
వ్యయమెరుగని వెలుగువలె విజ్ఞేయ ప్రపంచం.
యాంత్రిక సౌభాగ్య దశలో
మరచిన ఆత్మ చైతన్యం.
సంఘశక్తి పీడన క్రింద
అంతరించిన వైయక్తిక వికాసం.

అణురజో రూపంలో రాలిపడు
రూబులు డాలరు విలువలు.
సైనికబల సంపదతో ఆకలి తీర్ప
యత్నించెడి తెలుపులు.

భూగోళం చుట్టిరాగల
అణుమారణ నవాస్త్రాలు.

వాని వశంలో తిరుగు
యుద్ధోన్మాదుల చిత్తాలు.

రాబోయే యుద్ధ జ్వరభయంతో
వణకుతున్న వాతావరణం.
మృత్యువు స్ఫురించేసరికి
శాంతిపాఠం వల్లించు కంఠశోష.

రాత్రి చీకటిలో తిరుగు
పెద్దపులి మెరపు కళ్ళు.
దగాపడి తెరపిడి పడి
ఎత్తిన జాతి నిప్పుకళ్ళు.

ఇసుక దిబ్బలపై ఎండుటాకులపై
మొండి గోడపై పాడుగుడులపై
సన్నని వర్షపు చినుకులవలె
శ్మశానంలో గడ్డిపోచలవలె,
చీకటి ముసురులో మిణుగురుల వలె,
పేదవాని బ్రతుకులో చిరుకోర్కెలు.

తలపై వెలుగు విద్యుద్దీప కిరీటంతో
వీడని ప్రాణమిత్రంవలె ఇనుప స్తంభం.
క్రింద కాలు విరిగిన కుర్చీవలె చీకటి.
కళ్ళు తెరచి వెలుగు కలలు కనే దైన్యరూపులు.

సగం చావుకు తయారై
దీనంగా కూర్చుంది రాత్రి.
రాకకు సిద్ధమై ఉత్సాహంతో
ఎదురు చూస్తుంది ఉదయం.

ఇంకా నిదురపోని నేడు
కలలు కనడం మొదలు పెట్టి
తలలు పోగొట్టుకొనే జనం.

నిజ స్థితికి రానున్న రేపు.

**మాదిరాజు రంగారావు**

నిప్పంటుకొని మండి మండి జ్వాలలతో
సముద్ర గర్భంలో మునిగిపోవు నౌకవలె
మృత్యువుచే సమాకర్షింపబడి
ముఖం జేవురించిన రాత్రి.
సర్వదిశల నంతలోనే
విప్లవాత్మకమైన మార్పులు.

ఎన్ని వేల యేండ్లో అయినట్లు
దట్టమైన నిదుర పొరలు క్రమ్మిన
అవని మేల్కొన్నది.

పద పదంలో కాంతి చిమ్ము
ఉదయ నేత్ర గగన మెదురుగా.
ఆగి ఆగి పరుగిడి పోయే
చీకటి పిల్లల గుంపులు ప్రక్కగా.

నడుస్తూన్న నా దృష్టి నుండి
తప్పించుకోజాలని
శిలా విగ్రహాలను స్పృశించు
స్నిగ్ధ పుష్ప మధురాధరాల వలె,
చీకటి కాటుక కొండపై
జారిపడు సూర్యుని దృక్కులు.

బహు దూరం నుండి ఒకడు దగ్గరదాకా
వినవస్తున్న విభిన్న కంఠధ్వనులు.
ఇంకా వదలని నిద్రలో తూగుతూ
కలలు గను చీకటి మనుషులు.
చుట్టూ దీపస్తంభాలవలె ఇంకా
కాపలాకేస తెల్లదొరలు.

ఒకటీ తిన్నగాలేని

పిచ్చివాని ఊహలవలె
అల్లిబిల్లిగా అల్లుకొని
చీలిన చీకటి బాటలు.

ఊహాలోకానికీ వాస్తవిక జగత్తుకు
సిద్ధాంతాలకు అనుభవ స్వరూపానికీ
మనిషికీ మనిషికీ వస్తువుకు వస్తువుకు మధ్య
విడదేస చీకట్లు కలేప వెలుగులు.

ఆరిన దీపాల పొగ క్రమ్మి
మూత వడిన కాలం కళ్ళు
ఇంకా తెరపిడి పడలేదు.
కళ్ళు ఉన్నా అంధులవలె
ప్రాణం ఉన్నా శవాలవలె
ఉండి తీరవలసిందే !
మనిషికి మనిషి మీద కన్న
జంతువు పైనే ఎక్కువ విశ్వాసం.

ఆలోచనల కవధులు లేవు.
ఉదయం మృత్యువు నెరగదు.

ఒక యుగం గడిచిపోయి
వేరొకటి వస్తున్నదెంత త్వరగా
ఒక మనస్స్వరూపం మారి
వేరొకటవతరించవలె సంపూర్ణంగా.

సృష్ట్యారంభం నుండి నేటి వరకు
ప్రపంచంలో భౌతిక శక్తుల
ఆకర్షణ సంసర్గం సంఘర్షణ
ఏనాటికైనా ఒకే తీరు.

గ్రహ సమూహ గమనంతో
ఋతు చక్ర పరిభ్రమణం
చైతన్య కళా సృష్టిపై
అఖండ కాల ప్రభావం.

ఒకతరం నుండి వేరొక తరానికి
అందింపబడి అవిచ్ఛిన్నంగా

మానవ సంతతి నాగరికత
తీర్చిదిద్దిన ఆత్మదీప్తి.

గగన కాసారంలో తలయెత్తి
సహస్ర కరాలతో ఈది వస్తూన్న సూర్యుడు.
ఒడ్డున మేల్కొన్న ప్రాణికోటి ఆశాపతాక
ఇంకా మేల్కొనని వారి స్వప్నద్వారం.

ఈ సూర్యుని వెలుగులెవరి కొరకు?
మేల్కొన దలచినవారి కొరకు.

నా మనశ్చక్షురుచిర కాంతి
ప్రసరించినంత మేర
అదే భూమి, ఆకాశం, గాలి, నీరు,
సూర్యచంద్రులు, నక్షత్రాలు, తేజస్సు.

అదే మానవుడు, సంపదలు, వాంఛలు
అధికారం కీర్తి లౌకిక ప్రతారణం.
అవే వచ్చిపోవు దివానిశలు.
అఖండ కాలచక్రనేమిక్రమణం.
అంతటా అనుస్యూతంగా ప్రవహించు
చైతన్యధారా విలసనం.

## యుగదర్శనం II

పునర్జన్మ ఎత్తాలి నీవు
తప్పదు సుమీ ఇక.
మరో మనో లోకాన్ని
కల్పించు కోవాలిప్పుడు.

దుఃఖంలో మ్రగ్గిపోక

కష్టంలో నిల్చిపోక
పతనంతో పారిపోక
మరణంతో మారిపోక

రాతియుగం నుండి
రాకెట్ యుగం వరకు
ఎన్నెన్నో రూపాలలో
అభ్యుదయం సాగిస్తూ
పురోగమన ధ్యేయం వదలని
సంస్కృతీ సంపన్నమూర్తీ!

పేదవాని కోరికలో కుంచితమై
ధనవంతుని ఆశలో విస్తృతమై
పొలిమేరలు చెరగిన విశాల ప్రపంచం
జగన్నేతల చేతులలో తిరిగే ఆటబంతి.

ప్రతి యుగానికొకే ఒక
మానవ ప్రతినిధి పూర్వం.
ప్రతివాడొక యుగవిధాత
సంపూర్ణంగా నేడు.

మౌఢ్య విశ్వాస బలంతో చెలరేగిన
ఒక జాతిమతాకాండ తాండవం,
పరస్పర ధాటీ ఘర్షణలో మారిమారి
నవీన రూపంలో ప్రకాశించిన నాగరికత.

అహంకారౌద్ధత్యం, అసహనోద్రేకం
రాపిళ్ళకు తాళలేక పరుగిడి,
కొండల్లో దాగి చీకటి ముసుగు ధరించి
రక్షోభావమూని మానవత కోల్పోయిన
మానవుడు.

శాంతికీ యుద్ధానికీ పురోగమన మార్గానికీ
సౌఖ్యానికీ దుఃఖానికీ తిరోగమన మార్గానికీ

జన్మకు మృత్యువునకు అల్పానల్పకృత్యానికీ
ప్రళయం వరకుసాగు మహా పరిణామానికి కేంద్రం.

**మాదిరాజు రంగారావు**

ప్రతి మానవ మనోఽంతరాలలో వ్రేలు
బంధు భావ జాతి వర్ణతోరణాలు.
ఆత్మ సంస్కృతీ ప్రవాహమింక జేయు
సికతా శ్రేణులవలె
జీవితకాల ఖండఖండాలు.

చారలు చారలుగా అట్టలు కట్టిన
నెత్తుటి గీతల బొమ్మల వరుసలు;
పిశాచ హృదయులు విలాసాలకై
భద్ర పరచుకొను ఆట వస్తువులు.

గాలికి రాలి ధూళి కలిసిపోవు
ఆకులవలె ప్రాణాలను
కోల్పోవు సామాన్యులు.

కసి మసిగిన మృత్యుక్రీడ,
రారాజులానందించే
ఒకనాటి పండుగ.

అవధులులేని కాలసముద్రం విడిచిన
మేఘ నిశ్వాస పరంపరలు సంఘటనలు,
ఏ భూమి సమార్ద్రమై, భోగమయమై
ఏ ఖండ బీడువడి, దారిద్ర్యదళితమై
బ్రతుకులు గడిపేదీ ఎవరికెరుక ?

ఈ దిశనుండి ఆ దిశవరకు
పుటాపుటిగా హఠాత్తుగా
గుమ్ములుగా ముట్టడించి ఒక్కమారు
ఊపివేయు ఝుంఝూ పవనం వలె
ఘోరాకృతి వచ్చి పడిన
యుద్ధాలకు క్షామాలకు భయపడి,

కష్టాల నెదుర్కొని, నష్టాలు సహించి
పరుగిడి, బంధు భావ బంధాలను

త్రెంచుకొని సంపూర్ణంగా శాశ్వతంగా
ప్రేమ పూర్ణ సౌహార్దం వదలుకోని

ఏ దేశం గర్భంలోనో
ఏ చల్లని నీడలలోనో
ఏ పచ్చని మైదానాల్లోనో
ఏ ఆకలితీరే చోటునో,

ఒంటరిగా గుంపులుగా తలలు దాచుకొని
బ్రతుకు సాగించిన మానవజాతి సమస్తం.
క్రమంగా సాగించి పోరాటం తన ఉనికికోసం
అలవర్చుకుంది అధికారపుటనంత విషవలయం.

ఒకనాటి అవసరం ఆనందంబట్టి
అలముకొన్న అభిరుచిలో ఊహలో
వేషంలో వర్ణంలో వ్రేళ్ళుదన్నుకొని
మనిషిని బహిర్ముఖుని జేసి
ఒక దిశ గాఢంగా ప్రసరించిన
ఒక ప్రత్యేక విధా మనస్తత్వం,
మార్పులు సహించక, చేర్పుకు తలవంచి
ఆకాశమావరింప ఆశగల జాతీయత్వం.

భిన్న భిన్న జాతులు భాషలు ఆలోచనలు
భిన్న భిన్న వ్యవస్థలు ప్రవర్తనలు విశ్వాసాలు
ఒకరికొకరికి పొంతనకుదరని జీవన మార్గాలు
వీటినధిగమించిన మానవతా సూత్రబంధం.

దారిద్ర్యం దుఃఖం క్షామం యుద్ధం
పరిణామాలకు గురియె, ఎవరికివారు విడివడి
నేల నాలుగు చెరగులా చెల్లాచెదరై,
తమ తమ బ్రతుకులు ప్రత్యేక చరిత్రలుగా

విశిష్ట సంస్కృతీ నిలయాలుగా నిర్మించుకొని
జీవిత గమనం సాగించే మానవ సంతతి.

**మాదిరాజు రంగారావు**

వేల యేండ్ల నుండి ఈనాటి వరకు
సాంఘిక రాజకీయ నైతిక మతవలయాల్లో
మానవుని అదే మూల మనస్థితులు.

రాసులు రాసులుగా రాళ్ళూ గుట్టలవలె
గుంపులు గుంపులుగా చెట్లూ చేమలవలె
ఎండకెండి, వానకు తడిసి
చలికి బిగిసిన మట్టిదిబ్బల వలె
బండలవలె మొద్దులవలె
జడ భరిత స్థితీ.

కశ్మల వాతావరణంలో
కంకాళపు దుర్గంధంలో
మానవ రూపాలలో నిలచిన బూదికుప్పలు
కళాహీన క్షుధాకర్శిత బానిసలోకం.

పురాదర్శసూత్రపు బరువుక్రింద అణగిమణిగి
భర్మహర్మ్యపు గోడల నీడల క్రింద ఎదుగుమాని
తమకు దొరికిన స్థలంతో తృప్తిపడి ఒదిగిపోయి
చీకటి కలవాటుపడి, వెలుగుకు వెరగొంది.

చీమలవలె దోమలవలె ప్రాణదఘ్న భయంతో
పుట్టిన క్షణంనుండి చచ్చే క్షణం వరకు
సంకల్ప నవోదయ మెరుగని
త్రపాహీన సేవామతి సంపన్నులు.
ఎక్కడ చూచినా అధిక సంఖ్యలో
'జీరో' విలువలు.
గ్రీష్మాతప శుష్కితమై
అగ్ని తేజో దగ్ధమై
రథ్యావీధి నడవ నేర్చిన

చెట్లవలె మౌనాలాపాలతో,

ఉదయ రథ చక్రపు

వెలుగుచాలు నంటి వచ్చు
నీడ బొమ్మల వలె
కదలిపోవు సంధ్యాజీవులు.

ఆకాశచ్ఛత్రం క్రింద
హద్దు మీరని ఆశలతో
తమ నీడే ఒక బొంతగా
చుట్టుకొన్న నగ్న జీవులు.

నాలుగు చక్రాలూ విరిగిన
ధర్మరథశకల పంక్తులు.
నిరంతరం పీడించే
చిక్కు విడని సమస్యలకు ప్రతీకలు.

ఆ రోజు గడచిపోతే చాలు
నిండా నూరేండ్లు నిండినంత
ఎత్తైన ఊహా గగనంలో
వాడిపోయి ఒరుగులవలె వ్రేలుతూ,
కాలిన కట్టెలవలె నేలపై
బ్రతుకు గడుపు జీవచ్ఛవాలు.

నరనరాల తేజస్స్రవంతులు ప్రవహించి
ఆకృతులు నవాగ్ని శిఖలుగా,
ఉత్తుంగ తరంగనటదు ద్వేగంతో
పరుగులు తీయు ఉప్పెనవలె విరచుకపడు
సమీకృత ప్రజావిక్రాంతిలో
కూలిన కోటలు ఎగిరిన సింహాసనాలు
హతమారిన అహంయువులు
అణగారిన అగ్నిగుండాలు.

దారిలో మేల్కొనవు శవాలు
గతి తప్పదు చరిత్ర భ్రమణం!

**మాదిరాజు రంగారావు**

తిండికి బట్టకు స్వేచ్ఛకు కరవులేని
సామ్యభావ సామాజిక వ్యవస్థలోనూ,
మానవజాతి సమగ్ర వికాసం
మరో మనోలోకాన్ని సృజించుకున్నపుడే.

ఒక మహా పథాన వేగదీప్తి సాగు
యుగరథ చక్ర విఘట్టితమె నలగికలగి
గాలికెగయు ధూళికి వెరగొందక
మానవతాపై విశ్వాసంతో పురోగమన శీలంతో.

ఎత్తకతప్పదు నేటి మానవుడు
వైజ్ఞానిక యుగ భూమికలో
వైయక్తిక వికాసంతో
విశ్వ సంస్కృతీ రూపం.

పదపదంలో ధ్వనింపగ క్రొత్త శక్తి
ఎద ఎదలో స్పందింపగ క్రొత్త సృష్టి.

**మానవీయం**

మానవుడు ఆదినుండి నేటి వరకు గడపిన వివిధ జీవిత గతులూ, బహు కాల గతులూ చిత్రితమైన కావ్యం.

**మొదటి భాగం**

**ఉదయం – ఉదయం చూచి మానవుడు మొదటిసారిగా పొందిన అనుభూతి**

స్వరూపం భావితమైంది.

**ఉదయం తరువాత – మానవుని నైసర్గిక తత్త్వమూ ప్రవర్తనా స్వరూపమూ**

పొందిన క్రమ పరిణామం కలది. బ్రతుకుపై విశ్వాసం భవిష్యత్తుపై ఆశతో, సుఖ సంతోషాలపై కాంక్ష కలిగి దేవతలను సృష్టించుకొని జీవితమొక క్రమ పద్ధతిలో వ్యూహ నిర్మాణంలో తీర్చుకొనే ప్రయత్నమూ ఊహశాలిత్వమూ స్పృశిస్తూ కొంత వర్ణన ప్రధానంగా సాగింది.

**జీవిక మొదలు – జీవికకై మానవుడు బయలుదేరడం అతడెదుర్కొన్న క్లిష్ట**

స్థితులూ, వాటి నధిగమించే తెలివి తేటలూ నాగరక దశకు చేరుకొనే సంధిలోని మనస్తత్వమూ రూపితమైంది.

**బ్రతుకు వంతెనపై నుండి – బ్రతుకొక వంతెనగా భావింపబడి దానిపై**

ప్రయాణం చేస వ్యక్తి వివిధానుభూతులు, అనుభవాలు ప్రధానంగా
ప్రాపంచిక
నిజస్వరూపావలోకనం కలది.

మానవ స్వభావమూ ప్రవర్తన రెండూ అతని ప్రయాణ సమయంలో కన్పించే వివిధ ప్రకృతి దృశ్య స్ఫోరకంగా సాగింది. నేరుగా కాకుండా ప్రకృతి పరంగా సంయోజించి జీవన రీతుల్లో ప్రగతి సోపానాలు తీర్చ బడినవి.

**మానవీయం – రెండవ భాగం**

**అశాంతి – అశాంతి స్వరూపం జీవితంపై నెరిపే ప్రభావమూ — దీని**

కారణంగా సమాజంలో వివిధ ప్రవర్తనల స్వరూపమూ, అశాంతిని పొగొట్టి

శాంతిని స్థాపించడానికి మానవుడుచేస కృషీ, వర్ణితమైంది.

**యుగదర్శనం – ఈనాటి వరకు మానవుడాధ్యాత్మికంగా వైజ్ఞానికంగా**

సాధించిన పురోగమనం లోకహితంతోపాటు లోకాపకారంగా పరిణమించడమూ – ఇందుకతని మేధ, ప్రవర్తన పోయే పోకడలెత్తి చూపబడినాయి.

**యుగదర్శనం II – మానవుడు భౌతికంగానే కాక మానసికంగానూ**

ఆత్మ సంస్కారంతో పెరిగినపుడే జీవితంలో ఆనందమూ శాంతి పొందగలడు.

ఈ ప్రయోజనం సిద్ధించడానికి జ్ఞానమూ, విజ్ఞానమూ ఈ రెండిటి సమన్వయ మవసరం.

నేటి సంఘర్షణలోని క్లిష్ట స్థితుల నుండి ఆగామి యుగంలో పునర్జన్మ వలె

కన్పించే మానవుని మోదార రూపం, ఉదాత్తమైన మరో మనో లోకాన్ని

సృజించుకొని విశ్వ సంస్కృతీ భూమికలో అవతరిస్తుందన్న ఆశతో కావ్యం ముగిసింది.

# ఆనందధుని

## మాదిరాజు రంగారావు

ప్రచురణ :

సాహితీ బంధు బృందం

వరంగల్లు.

# స్వేచ్ఛా కవిత్వం

# ఆనందధుని

ఆచార్య మాదిరాజు రంగారావు

SWECCHAA KAVITHVAM

ANANDADHUNI

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

Rasadhuni Sahithi Parishath, Hyderabad - 28

ప్రథమ ముద్రణ: Ananda Sankranti

D/ 13-1-1975

పునర్ముద్రణ: జూన్ 2026

అనుపమ ప్రింటర్స్

శాంతినగర్, హైదరాబాద్

ఫోన్ : 040–23391364

# అంకితం

సహృదయులు
డాక్టర్ వడ్లకొండ
వెంకట రామనర్సయ్యగారికి.

నీరు ఇగిరి పోతుంది
నిప్పు మండి పోతుంది
గాలి ఎగిరి పోతుంది
మనిషి బ్రతికి కలిసేను
మట్టిలో, ఆకాశంలో,
అవును గాని – మిగిలేది,
మనోజ్ఞ మానవతావిష్కారం
ఎద కంటికి కర్పూర చిత్రం.

# ప్రకాశకీయం

U

కొన్నాళ్ల క్రితం మేము
డాక్టర్ మాదిరాజు రంగారావుగారి ''వెలుగులో ఈ నేలపై''
కావ్యాన్ని ప్రచురించినాము. ఈ సంక్రాంతి కానుకగా
''ఆనందధుని'' సమర్పిస్తున్నాము.
సాహితీ ప్రియులు సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాము.
ఈ అవకాశాన్ని కలిగించిన
శ్రీ మాదిరాజు రంగారావుగారికి మా కృతజ్ఞతలు.

ది. 13-1-1975. సాహితీ బంధు బృందం


ఇందులో
ఆనందధుని
స్వేచ్ఛాబింబాలు
ఇటీవలి ముక్తకాలు
కొలతలేని కాలం
జ్వాలా రూపం

# ప్రస్తారం

ఈ కృతిలో చివరది జ్వాలా రూపం. ఇది మానవునిలోని వాంఛామతికీ, అహంక్రియా రూపానికీ ప్రతీక. దీని ప్రసారం ఇందులో ఆవిష్కృతమైంది. బహు పురాతనమైనవీ, సామాజిక స్మ తులు మనస్సు లోపొరలలో దాగి ఉంటాయి. ఇవి ప్రవర్తనలో, ఆలోచనలో ఆయా సందర్భాల్లో స్ఫుటం అవడం కద్దు.

‘‘తరతరాల వలయాలు క్రమించి
వచ్చి చేరిందా నన్ను
.....................................
ఉంటుంది అరణిలో
అనల తేజంవలె రహస్యంగా’’

అరణిని మథించినపుడు అగ్ని ఉద్భవించినట్లు, మనస్సు గాఢమైన అనుభవంతో ఒరపిడి పొందినపుడు జ్వాలాముఖం నిర్గతమౌతుంది. ‘అరణి’ అన్న శబ్దం పురాతన స్మృతిని కదలించేది.

Frued తో ఎన్నో సిద్ధాంతాల్లో విభేదించి క్రొత్త పుంతలు త్రొక్కిన Carl Gustav Jung ప్రతిపాదించిన collective unconscious అన్న సిద్ధాంతం ఈ రచనకు ఆధారం. ఎంత సంస్క తృ సంపన్నుడైనప్పటికీ మానవుడు చరిత్ర కందని ఎన్నో తరాల క్రిందటి ప్రవర్తనారీతీ, అనుభవశీలమూ భద్రపరచుకుంటూ వస్తాడు. దీన్నే D. H. Lawrence 'blood consciousness' అంటాడు. James Frazer (Scottish anthropologist) వ్రాసిన "The Golden Bough" అన్న గ్రంథంలో చరిత్రకందని దశనుండి మొదలుకొని అనేకమైన విషయాలు మానవ సంతతి గురించీ - (Sociological మరియు Psychological దృష్టితోనూ) కులంకషంగా చర్చించడం జరిగింది. ఈ గ్రంథాన్ని గురించి T. S. Eliot, ఒక చోట One which has influenced our generations profoundly I mean "The Golden Bough" అంటాడు. దీన్ని బట్టి ఈ గ్రంథం ప్రభావం నేటి భావనా ప్రపంచంపై ఎంత ఉందో ఊహించవచ్చు. ఈ విషయం ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే, ఈనాటి సాహిత్య విమర్శలో Psychological

దృక్పథంతోపాటు, Jung ప్రతిపాదించిన Archetypal theory దృష్టీ— భుజం భుజం కలుపుతూ పోవడం గమనించవచ్చు. ఇందులో Cultural Patterns, Symbolic actions — ఇంకా Conscious మరియు Unconscious దశల్లోని సంఘర్షణ మొదలుగా విశ్లేషణమూ ప్రాధాన్యం వహిస్తూన్నవి.

''ఈ మనోజ్ఞ జ్వాలా రూపం
అఖీల మానవాత్మకు సంకేతం'' అని

చివరకు మానవుడు ఎక్కడ ఉన్నా ఏ కాలంలో ఉన్నా— అతనిలోని Universal Pattern ను విశ్లేషించి చిత్రించడం జరిగింది.

''ఇది ఎక్కడికీ పోదు
ఉంటుంది గుండె తోపులో
గంతులేస హరిణ మృగం వలె.''

''ఇది ఎక్కడికీ పోదు
ఉంటుంది నిద్రావనంలో
జూలు విదల్చి నిల్చే సింహం వలె.''

స్థూలంగా హరిణ మృగం వాంఛా రూపానికీ, సింహం అహంకార లక్షణానికీ ప్రతీకలు. ఇంకా హరిణం— రమణీయ రూపాదుల్ని బట్టి మృదు ప్రవృత్తినీ, కళాత్మక శక్తినీ; సింహం— కఠోర ప్రవృత్తినీ వినాశన స్వభావాన్నీ స్ఫురింపజేసవి. దేనికది విడిగాకాక మానవునిలో ఈ రెండూ ఎప్పుడూ అనితరమైన అన్వయ రూపంలో కలిసే ఉంటాయి నిగూఢంగా. మనిషి అవసరాన్ని బట్టి ప్రకాశనాన్ని పొందుతూనే ఉంటాయి.

ఈ జ్వాలా ప్రకాశనంతో
ఉదయించిన సంస్కృతి
ఈ జ్వాలా సంచారంతో
కావచ్చు – చీకటి దిబ్బ.

గుండెతోపు, నిద్రావనం క్రమంగా Sub-conscious, Un-conscious దశలను వ్యక్తం చేసవి. రచన చదువుతూంటే మనస్సులో ఈ ప్రవాహకాంతి స్ఫురిస్తూనే ఉంటుంది.

మొదటి కృతి ఆనందధుని. ఇది స్థూలంగా అరవిందుల మహా కావ్యం సావిత్రి చదివాక పొందిన అనుభవ పరంపర అయినా, ఇందులోనూ ప్రధానంగా పైన పేర్కొన్న వస్తు రూపం పరచబడి ఉంది.

మానవునిలో మృత్యువును ఎదుర్కొనే ఇచ్ఛతోపాటు శక్తిని కూడగట్టుకునే సంకల్పమూ ఉంది. అందుకై నిరంతర ప్రయత్నమూ సాధనా, మానవ చరిత్రలో ఎన్ని విధాలుగానో కన్పిస్తుంది. చివరకు అతడు పొందే విజయసిద్ధి— సావిత్రి కావ్యంలో మనకు కన్పించే ఒక వెలుగు ముఖం. దీని చిత్రణమే ఈ రచన.

ఒక విశేష దశలో మనస్సు పొందే ఆరోహణల పరంపర మానవుని ప్రయాణ రూపంగా ఇందులో భావితమైంది. వైయక్తికమైన అనుభూతి కేంద్రంగా, Universal Pattern లో రచన సాగింది. ఈ రచన మూడు దశలుగా వెలువడింది.

1. పరీమళ వలయం 2. ఇక్కడ ఎక్కడా లేదు చీకటి 3. ఆదిత్య వలయం. ఇవి క్రమంగా ప్రధానంగా i.మనస్సు ii. అంతఃకరణం iii. ఆత్మకు ప్రతీకలు. మొదటిది –

''అవాలి
ఆనంద వలయం
చేరే నిశ్రేణిక
కావాలి
శుభ వాసనా రూపం
పొందే అవకాశం'' అనీ

ఉత్తమ సంస్కార లక్షణాన్ని,

రెండవది–

''భగవంతుని రాగ కర స్పర్శతో
మహితమైనట్లుంది జీవితం
లేదు ఇక్కడ ఎక్కడా చీకటి
ఏ ఒక్క బిందువులోనూ'' అనీ

చీకటి యొక్క అభావమే వెలుగు. ఇది ఆత్మకు సన్నిహితమైంది. కాబట్టి మనస్సుకు, ఇటు ఆత్మకు మధ్య స్థితినీ,

మూడవది–

''సూర్యగోళ హృదయంతో
ఇది
చావులేని ప్రపంచం'' అనీ

పరమమైన జ్యోతీ రూపాన్నీ సూచించేవి. ఇదీ కావ్యంలోని ప్రణాళికా స్వరూపం.

''తెరచుకొంది ఈ క్షణం
హిరణ్మయాజ్వల కవాటం
ఓంకారనాద సుందరంగా
హృదయ స్పందన లయతో''

హిరణ్మయ కవాటం, ఓంకారం— రెండూ పూర్వ స్మృతులను కదలించేవి. ఇవి భావనకు దీప్తినిస్తూ అనుభూతికి ఆకృతినీ, గతినీ కలిగిస్తున్నాయి. ''హృదయ స్పందనం'' జీవశక్తినీ, ''లయ'' – నియతినీ, గతినీ వ్యక్తం చేసవి. ''ఈ క్షణం'' నవోన్మిషితమైన కాల రూపం.

స్వేచ్ఛాబింబాలు, ఇటీవలి ముక్తకాలు అన్న కవితలు వివిధ స్థితుల్లో వెలువడిన అనుభవ రూపాలూ, మానసిక చిత్రాలూ బింబించేవి. ''కొలతలేని కాలం'' హిందీ రచనకు అనువాదం.

ఇది ఈ కృతుల్లోని ఆలోచనా ప్రస్తారమూ, అనుభవ ప్రసారమూ.

ఈ కావ్య ముద్రణ విషయంలో శ్రద్ధ వహించిన సన్మిత్రులు శ్రీ పల్లా రామకోటార్యగారికి కృతజ్ఞతలు.

**– మాదిరాజు రంగారావు**

# పరీమళ వలయం

I

ఈ క్షణం మేల్కొంది
కాంతి బిందువై
సాగింది రేఖలుగా
కరగిస్తూ తమోరాశి
కల్పన వాస్తవమైంది
స్థావరం జంగమమైంది
శూన్యం సంభృతమైంది
కాలం తెలివి పొందింది.

ఇంత వరకు అననుభూతంగా
అందని మనోజ్ఞ రూపం,
హిరణ్య గర్భం నుండి
ఓంకారం వలె
ఆవిర్భూతమైంది ఈ క్షణం,
ఆత్మకు ఇస్తూ ఆనందాకృతి.

లౌకిక వనమంతా ఇపుడు
చివురించింది క్రొత్త తెలివి
సూర్య కిరణ పంక్తుల్లో
ప్రకాశమాన కళ వలె.

అలలో కన్పించే కదలికతో
కలలో దాగిన వాస్తవంతో
కన్పిస్తోంది చంద్రకళ

ఏ శిరోఽలంకారమా ?

ఇది మాయ కాదు.
మృగతృష్ణ కాదు
విస్పష్టమైన అనుభవ దర్పణం
ఆత్మను బింబించే క్షణం.

చీకటి కలసి పోతూంది
వెలుగులో తహతహతో
రూపు మాపుకొనే ఆశతో
అగ్నిని గుర్తిస్తూ తెలివితో.

## II

క్షణాలు గడుస్తున్నాయి.
రెక్కలు సాచి నింగిలో
కదలిపోయే మబ్బుల వలె.
జీవిత చక్రనేమి క్రమణ వేగానికి
ఎగసి క్రమ్మిన దుమ్ము అణగి,
వెలుగుతూంది ఆత్మతేజం.

నిద్రా గుహ నుండి
బయటికి వచ్చిన మనస్సు
బ్రతుకుకై అన్వేషణలో
పొందిన అశాంతి వలయం
చెరగి పోతూంది
ఎక్కడి దక్కడ ఈ క్షణం.

నిప్పు నుండి వెలుగు
వేరరూపోయే లోపల
దిక్కుల్ని వెడల్పు చేయజూచే
ధూమవదనం వివర్ణమౌతూంది.

అహంకారం

దూకుతూంది సముద్రంలో

మహా భయం
కలుస్తూంది గాలిలో.

మొక్కకు కావాలి
వెలుగూ నీరూ –
మెలకువకు కావాలి
అనుభవం వివేకం.

జీవితంలో కన్పించే
సురాసుర శక్తుల సంఘర్షణ
కావాలి ప్రాణ భయం నుండి
జీవిత సత్యానికి మార్గం.

దైవాభిముఖంగా సాగే పథంలోని
మానసికమైన సుందర శిల్పాలే దేవతలు.

ఇక్కడ ఎక్కడ ఉంది
వివిధ వస్తు విభేదం
ఉంది ఇక్కడ ఒకటే
ఆత్మ కళా వైవిధ్యం.

మౌనానికీ ధ్యానానికీ
వ్యాఖ్యానంగా ఉందీ స్థితి
లౌకికమూ వాస్తవమూ
దాటుతున్నాయి మనో దశలు.

ఈ స్థితి ఎలా ఉందంటే
బరువు మోసుక పోయేవాడు
మధ్యలో దించుకొని కేసపు
పొందుతూన్నట్లుంది విశ్రాంతి.

ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసంలో

జలధిలహరీ స్పందనతో

ప్రతి క్రియా రూపంలో
మేఘ గమన విలసనంతో,
ఈ శరీరం మానవునికి
పరమ యదార్థ రూపమై
ఈ జన్మకాదు ఇక్కడ
ఎవరికీ దుఃఖభూరూషం.

అవాలి
ఆనంద వలయం
చేరే నిశ్రేణిక!

కావాలి
శుభ వాసనారూపం
పొందే అవకాశం.

III
ప్రకాశమాన ఆలోచనకూ
క్రియాత్మక వర్తనకు మధ్య
సూక్ష్మలోకం మంచుతెర వలె
మృత్యు నిరంకుశత్వం నుండి
స్వాతంత్ర్యం పొందింది మనస్సు

గగన రహస్యం బ్రద్దలైంది
శబ్దధుని ఆవహించింది
అడవిలో వాయుభ్రమణం వలె
కొండలపై నుండి జంపాతం వలె.

మనస్సు పొందుతూంది
సుందర ప్రవాహ రూపం

వెచ్చని మెరపు తలపులతో వచ్చే

వార్షుక మృదు భావనతో
ఎదలో సాగిన లత
పూచింది కళ్ళలో పూలు
విప్పారాయి ఆశలు
పసిడి మొగలిపట్టల వలె.
తల ఎత్తిన ఆశ్చర్యంతో
నిలచింది స్వర్గం
క్రిందికి దిగి.

వెలుగు పొరలు చుట్టుకొన్న
గాలి అంచుల్లో కదలుతూ
మనస్సు పొందుతూంది
అవిచ్ఛిన్న సంస్కార గంధం.

భూమిని ఆకాశం వలె
ఆకాశాన్ని కాంతి వలె
ప్రకృతిని అనంతశక్తి
స్పృశిస్తోంది పరుసవేదిగా.

ఆదర్శానికీ వాస్తవికతకు
ఆత్మకు శరీరానికీ
ఇంతవరకు ఎరుగని
సూక్ష్మబంధం చేకురుస్తూ.

జీవిత గమన రీతిలో
హృదయ స్పందన లయతో
శబ్దాలు తొలిచి చేసిన
రమణీయ రసాకృతి
దాటుతోంది మనోవలయం
మంత్రాక్షర ముఖంతో.

నిశ్శబ్ద వలయం వెనుక నుండి
వినిపిస్తోంది స్వర తరంగం

స్వర తరంగ వలయాల్లో
బింబిస్తోంది సంగీత చిత్రం.

స్వర్లోకం కదలి పోతూంది
స్పృశిస్తూ శారీరక జగత్తును.
జననాంతర సౌహృదంతో
వెలుగుతూంది హృదయాకాశం.

శక్తి సౌందర్య కాంతి
ప్రవహిస్తోంది నాలోకి,
ఆనందసుమ పరీమళం
ప్రసరిస్తోంది నా నుండి.

ఇక్కడ ఎక్కడా
లేదు చీకటి.

# ఇక్కడ ఎక్కడా లేదు చీకటి

IV

ఆలోచనా జలతరంగాలపై
శ్రేణులుగా రహస్య రూపాలు
వేసుకున్న ముసుగులు వదలుతూ
ఆలోచనా వాయు వీచికలపై
గుంపులుగా రహస్య రూపాలు
వేసుకున్న ముసుగులు తగలబడుతూ.

ఎన్ని సంతతుల నాటివో
సంస్కార వాసనలతో
ఆలోల వర్ణాలతో
విలోల శబ్దాలతో.

వర్తమాన గగన తలంపై
వెలిగే సూర్య గోళానికీ

మెరేస చంద్ర బింబానికీ
తెలుసు బాగా వీటి స్వరూపం.

కను చూపులు ఆక్రమిస్తూ
ఎద లోతులు స్పృశిస్తూ
వ్యూహాలను దేస శక్తితో
ప్రాణంపై నిలచిన రక్తితో
శ్రేణులుగా రహస్యవలయాలు
ఎన్ని యుగలనాటివో
జలధారా భావనతో
ఆలోల స్వరాలతో
విలోల రాగాలతో
మ్రోగే సంగీత చిత్రమై
నిష్క్రమిస్తూన్న మృదు ధ్వని.
★
అవనీ ముఖాన
నవజీవనం తెచ్చే తొలకరి వలె
మ్రింగింది ఆశ్చర్యాన్ని
ఆనందం, నృత్యంతో.

అర్ధరాత్రం గాలుల సవ్వడి వలె
మనో భూమి నుండి స్మృతులు
బయటికి తీస్తున్నాయి పరంపరగా
అడుగున దాగిన కవితా నిధులు.

భౌతిక రూపంలో వలయాలుగా
వికార దశ పొందిన ఆత్మరూపం
పొందుతూంది స్మృతుల కదలికకు
నవవర్ష రసోత్పుల్ల సృష్టి.

మలచుకొని మెట్లు మెట్లుగా

అవతరిస్తూన్నవి మబ్బులు
క్రింది నుండి పైకి పరంపరగా

ఎక్కడికి ? ఈ ప్రయాణం ?
అనుభవ సౌకుమార్యంతో
ఏ సూక్ష జగత్తులోకి!
ఒత్తిగిలి పోతూంది గాలి
వినయధురీణంగా ప్రక్కలకు.

నా ముఖంలో ఉదయం
గూడు కట్టుకుంది భద్రంగా
తలపిస్తూ శిశువు ముఖం
నాకళ్ళలో వెలుగులు
సాగేను పాయలు పాయలుగా
విరబూచిన తీవెల వరుసలుగా.

మంచు ముసుగు వదలింది భవిష్యత్తు
మృత్యు రహస్యం వీడింది జీవితం.
మనస్సు నృత్యం చేస్తూంది వెలుగై
ఊహకదలుతోంది అగరు ధూపమై

భగవంతుని రాగ కరస్పర్శతో
మహితమైనట్లుంది జీవితం.
లేదు ఇక్కడ ఎక్కడా చీకటి
ఏ ఒక్క బిందువులోనూ.

n

# ఆదిత్య వలయం

V

సూర్యగోళ హృదయంతో
ఇది,
చావు లేని ప్రపంచం.

ఎంత కాలం నుండో
ఉమ్మఖీకృతమైన మనస్సు
పొందుతూంది ఈ క్షణం
వాక అతీతమైన విభూతి.

కాలానికి దీప్తినిచ్చే
ఆదిత్య తేజోరాశితో
ప్రకాశిస్తోంది జీవితం,
తెర తొలగిన వర్ణచిత్రం వలె.

కరగింది లౌకిక భావన
పరీమళాంచిత కర్పూరమై
మిగిలింది లౌకిక రూపం
సౌవర్ణ కళా ప్రశస్తమై.

ఆలోచన కదలుతోంది
అవ్యాహతంగా నిబిడంగా
ఆర్ద్రమైన సముద్రంపై
వీచే పవమాన పంక్తి వలె.

జడంలో నిదురిస్తూ

ప్రాణిలో కదలుతూ

హృదయంలో రాగంతో
కదలే శక్తి రూపం,
ఆకాశాన్ని త్రోసికొని వచ్చేది
భూమిని చీల్చుకొని పోయేది,
ఒదిగింది అణువణువునా
అంభోబిందులోల సముద్రమై

వెలుగు కళ్ళ నుండి
రాలుతూ నవ్వు పూలు
ఎత్తిన గగనం వదనంవలె
ఉంది హృదయం– ఈ సమయం.

చావును వదలేసింది ఊహ
చీకటిని వదలిన ప్రభాతం వలె.

n

మట్టిలో ఆడుకునే పిల్లడికి
వీధిలో దొరకిన ఆట వస్తువువలె,
కలిగిస్తూంది ఈ ఉద్వేజితక్షణం
స్వర్గం కన్నా మహితమైన ఆనందం.

చీకట్లో నిన్నటి వరకు
మిణుగురులవలె మెరసిన కళ్ళు
మారాయి ఇపుడు–
సూర్య చంద్ర బింబాలుగా.

ఇక్కడ తల ఎత్తినవి
భగవంతుని ముఖాలే !
ఇక్కడ పూచినవి
భగవంతుని ఆలోచనలే !

వైకుంఠమూ కైలాసమూ రెండూ
రెండు భుజాలపై నిలచినట్లుంది

ఆవహించింది చైతన్యం
గాంగ ఝురీ సదృశంగా
ఆకాశాన్ని వంచి
భూమిని అణచి–నిల్చిన
శక్తికి సంకేతంగా.

వర్తమాన శిఖరంపై
నిల్చిన నా మతిలో
అనంతమైన గతమూ భవిష్యత్తూ
ఒకే రూపానికి రెండు ముఖాలుగా.

తెరచుకొంది ఈ క్షణం
హిరణ్మయాజ్వల కవాటం !
ఓంకార నాద సుందరంగా
హృదయ స్పందన లయతో.

ఎగసి వ్రాలింది ఉషస్సు
నా ముఖంపై శాశ్వతంగా
అవతరించింది షట్పదమై
నా ఊహలో ఝుంకృతితో.

VI

నిలచింది వాయు మండలం
చేతులు చాచి ఆహ్వానిస్తూ
నిలచింది సముద్రవలయం
మునివ్రేళ్ళపై నిరీక్షిస్తూ.

తొలకరి వానకు ముందుగా
వీచే చల్లని గాలికి తలెత్తి
ఒళ్ళు మరచి ఊగే

వనంవలె ఉంది మనస్సు.

ఎండిన నదిలోని ఇసుక వంపులవలె
మలపులు తిరిగిన విషాదం,
ఒక్కమారు మాయమైంది
వర్షధారా సంభరిత నది వలె.

గమ్యం చేరడానికి
తహతహతో సుళ్ళు తిరిగే
తుఫాను గాలి, శాంతించిన
ఆకాశంవలె ఉంది మనస్సు.

చీకటికి తెలీదు
సూర్యుని ప్రకాశ హృదయం,
గుహలకు పిచ్చుక గూళ్ళకు
తెలీదు ఆకాశ వైశాల్యం.

చీకటి నుండి గుహ నుండి
బయట పడిన మనస్సుకు
తెలుస్తుంది అంతో ఇంతో.

మేఘ జీవన సందేశం
వినాలని చెవులు రిక్కించిన దిశలూ,
సూర్యుని కళ్యాణ రూపం
చూడాలని కళ్ళు పరచుకొన్న ఆకాశమూ,
అవనతమైనాయి నా ఎదలో,
సంక్లుప్తమైన రూపంతో.

ఈశ్వర సంకల్పాన్ని
ప్రదర్శించిన మహాశక్తి,
ప్రకృతి నుండి మనస్సు దాటి
స్పృశిస్తోంది ఆత్మ సీమలు.

అమృత ధామం నుండి

వచ్చే వసంత కిరణాలకు

పునస్సంజీవితమై
వెలుగుతోంది నా రూపం.

సృష్టి ప్రథమ రూప
వాసనా భీజం నుండి
బ్రతుకులోని శిఖరభూత
సంస్కార వృక్షం వరకు,
ప్రకృతిలోని రూప వికాసం
ప్రాణిలోని జీవ స్పందనం.

దివ్య దశకుచేర్చే విజ్ఞానం
ఎప్పటికపుడు నవోహలో
పొందే పరిణామ రేఖలతో,
పునా రూపం పొందుతూంది
ఉజ్వల సిద్ధితో మనస్సు.

అస్తమయం ఎరుగని
ఆదిత్య కిరణాలు
ప్రసరిస్తున్నాయి నాలోకి,
వైవర్ణ్యం ఎరుగని
చాంద్రీరాగం
పరచుకొంది ఒక ప్రక్కగా.

నేనీ క్షణం,
అనేక వాసంత సూర్యుల
కల్యాణ కాంతికి
సంకేత స్థానం.

నేనీ క్షణం,
అనేక రస ప్రవాహాల
ఆనంద నృత్యానికి

అవనీ చక్రం.

# స్వేచ్ఛాబింబాలు

I

పడవను ప్రక్కకు నెట్టాలని
చూస్తుంది తరంగం
తరంగం తలపై కాలూని
దాట జూస్తుంది పడవ

నాకేమిటి ? ప్రతివాడికీ ఇదే
ప్రపంచంతో గల సంబంధం
ఎక్కడికీ వెళ్ళిపోదు సముద్రం
మానలేం చేయకుండా ప్రయాణం.

II

ఉదయం అడుగుతుంది.
రాత్రిచేసిన అపకారం ఏమని?
రాత్రి అడుగుతుంది.
పగలు చేసిన ఉపకారం ఏమని?

ఉదయానికి జవాబుగా
కళ్ళు తెరుస్తాను.
రాత్రికి సమాధానంగా
కళ్ళు మూస్తాను.

III

నేను లేచేంత వరకు
నిలచి ఉంటాయి ఓపిగ్గా
తలుపు వద్ద క్షణాలు.
ఉదయం కాగానే, లేచి
తలుపు తీయడంతో,
ప్రపంచం నుండి నా లోకి
ఉల్లాసంగా ప్రవహిస్తాయి.
రహస్య ప్రకాశనంతో
అలల అడుగుల సవ్వడితో
క్షణాలు, పిలువని అతిధులు.

IV

సంధ్యా వలయాల నుండి క్రమిస్తా
రవీందుమతి ప్రభతో.
జ్వలత్ అశాంతి శిఖరంపై
చరిస్తా వర్షా మేఘమూర్తినై.

నిదుర నుండి, రాత్రి నుండి –
యుగాల అంచుల దాటి పయనిస్తా
మంచువలె కరగి నీరై నదినై,
అగ్నివలె మండి వెలుగై తేజమై.

V

నేనెపుడో బ్రతికిన వాణ్ణి
ఏ శిలపైనో పడుకున్న వాణ్ణి

ఏ గుహలోనో నిద్రించిన వాణ్ణి
నేనిపుడు బ్రతికే ఉన్నానా ?

కాలం కదలుతూంది జలధివలె
ఎంత వాడికీ తెలీకుండా లోతు
ఎటు పోవడానికీ వీలు లేకుండా
పడవ దొరికితే ? ఒక రకం అదృష్టం.

VI

రోజు వెలుగుతోంది వత్తివలె
చుట్టూ ముసరికొన్నాయి పురుగులు,
దీప దైన్యం చూచేట్టు లేదు
చీకటి నవ్వు సహించేట్టు లేదు.

కొండ్లమధ్య పురుగును పట్టి
కుట్టడం మానేసిన తేలువలె
కాలం ఉపేక్షించిందా? నన్ను
కాలం క్షమించిందా ? నన్ను.

VII

అద్దంవలె ఎదురుగా
నిలచింది కాలం
బింబించే నా రూపం
ఎత్తుక పోయే ఆశతో,

ఇంతలో వచ్చి
అద్దాన్ని ముసరిన మబ్బులు
కురిసిన ప్రవాహగతిలో
నేను – ఒక నౌకను.

VIII

వర్షా నృత్యంలో
తెగిన పాద మంజీరంవలె
ఉంది సరస్సు నిశ్శబ్దంగా,
గత స్మృతుల కదలికతో.

కదలుతూన్నవి మెత్తని క్షణాలు
పసి అడుగులు పరుగుతీసినట్లు.
నవ్వుతూంది ఎండిన మ్రోడు ముఖం
స్వర్లోకం తొణికిసలాడినట్లు.

IX

వెచ్చని వాన, నిశ్శబ్దంతో,
రహస్య సంభాషణ చేసప్పుడు,
పచ్చని తలపులతో అవని
ఆకాశాన్ని అదుముకునేప్పుడు,

వెలిగే క్షణాలు ఎవరివి ?
మట్టి ప్రమిదల శరీరాలతో
ఎదలు వత్తులు చేసి వేచే
నీవీ, నావీ ! పూర్వంనాటి నుండ.

X

ఒక శతాబ్ది నుండి మరో శతాబ్దిలోకి
పయనించే లోపల మనుషులు,
ఒక నీడపోయి మరో నీడ ముందు
నిల్వజూస్తుంది క్రమ్మి మనసును.

ఈ నీడ నుండి బయటపడే లోపల
అవుతుంది ఒక యుగం పరిసమాప్తి.
ఒక్క వెలుగు మనసు సోకితే చాలు !
సంస్కృతీ శిఖర మెక్కినంత బులుపు !

XI

నిదుర నుండి లేపితే మధ్యలో
బలవంతాన ఎవడో గరుజు కొద్దీ
విరిగి చెదరిన కలల బొమ్మలతో
కులే నిశ్శబ్ద శిఖరాల క్రింద
భయ క్షణాలపై నడచే వీళ్ళు !

కళ్ళు నలుముకుంటూ ఉదయాన్ని చూచి
నెత్రు మడుగని కళ్ళు మూసుకొనే
వీళ్ళు, మనవాళ్ళు – దీపికలై
వెలుగు ఇవ్వకపోతే మానేరు
తగులబెట్టకుండా ఉంటే చాలు !
మెలకువ మాట దేవుడెరుగు
కాలానికి సంకెళ్ళు కాకుంటే చాలు.

XII

దిక్కుల్ని ఎత్తుతూ మూల నుండి
వీచే గాలికి, రాగంతో
కురేస వర్షధారా ప్రసారం
నదిస్తూ, నినదిస్తూ –
హృదయ స్పందన లయ
శబ్దిస్తూ అవిరామంగా,

మబ్బు మెరపులో
తోచే ఆశా రూపంగా

వాన చినుకుతో
వచ్చే సృజన శక్తిగా,
ఉంటుంది నాకు ప్రతి క్షణం
బిందు ముఖంతో సదా.

n

# ఇటీవలి ముక్తకాలు

గత జన్మలోని ప్రియమిత్రం వలె
ఇంటి ముందు వ్రాలింది ఉదయం
నా ముఖంలో చివురించింది ఆనందం
నా కళ్ళలో వికసించింది వివేకం.

బ్రతుకులో ఒక్కొక్క దినం
చేతికి తిరిగిరాని రత్నం
కాంతుల మిరుమిట్లతో సగం
జీవితం అవుతుంది రామార్పణం.

ప్రతిరోజూ మనకు అపరిచితమే
ప్రతిదారీ మనకు క్రొత్తే,
అయినా అంతలో సుపరిచితమై
పాతబడుతుంది మరునాటికే.

కఠిన శిలాపంక్తులవలె
పరచుకొన్న కాలంపైనా అనవరతం
ప్రవహిస్తుంది, అదృష్టవంతుని జీవితం
జలధారా సందోహమై, సంగీతమై.

రేగే ఆకులతో ఎగిసే తలపులతో
పరుగిడే ఈ జీవితం ఒకనాటికి
నిలచిపోయే స్థానం ఒకటే ఒకటి,
కాలాన్ని కబళించి వెలిగే మృత్యు శిఖరం.

రాత్రి మేల్కొనే ఉంది
కన్నుల్లో వత్తులతో, ఎందుకా ?

నా బ్రతుకును చూడాలని
సూర్యుడు లేని వేళల్లో.

పనికి రానివి వర్తమానంలో
విసరేయి భవిష్యత్తులోకి,
ఆ రహస్యపు పెట్టెలోని
అమూల్య వస్తువులన్నీనూ.

మనపై నుండి ఎగసి దూకి
బ్రతుకును సమార్ద్రం చేస
తొందరలో ప్రవహించే కాలంలోనే.
కొట్టుక పోనూవచ్చు అనుకోకుండా.

నేను ఉంటాను
వచ్చే రోజుకు జ్ఞాపకం
నాకు ఉండవు
పోయిన రోజులు జ్ఞాపకం.

ఎంతకాలం గడచిందో
జ్ఞాపకం లేదుగాని.
మరపు మటుకు నిలిపింది.
అనంత కాలాన్ని ఒక్క క్షణం.

వస్తుంది ఫైర్ ఇంజన్
అంతా అయ్యాక రామార్పణం
దారికి అడ్డంగా ఎండలో
త్రాగే నీటికై జనసందోహం.

ఈ కొండపై సామాన్య మానవులు
రాజరికపు టానవాళ్ళు
భద్రపరచిన సమాధులపై

వెలిగే వత్తులతో ప్రమిదలు !

రాత్రి నిదురలో– ఆలోచన
చుట్టుకుంది కృష్ణ సర్పమై.
ఉదయం మెలకువతో ఆలోలమై
గంతులేస్తుంది గోవత్సమై.

కుత్తుక బంటి బురదలో
కూరుకపోయిన సాయం సూర్యునికీ
ఉంటుంది ఆశ ఎవరో రక్షిస్తారనే ?
లేంది చూచేమా ? మరో ఉదయం.

పోనీ ఎవరిదారిన వారిని
నిల్వకు ఎవరిదారికీ అడ్డం
ప్రస్తుతానికి ఈ మనో గుణం
బ్రతుక్కి ఇస్తుంది మహాసత్త్వం.

చీకట్లను వడపోసి మరీ
ప్రసరింపజూస్తుంది వెలుగు
ఏలాగో సందుచేసుకొని
దూరి పోజూస్తున్నాయి చీకట్లు.

రానీ క్రియాశీలానికి
ప్రయోజన తత్త్వం
రానీ కళారూపానికి
సామాజిక వివేకం.

ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో
వర్తమాన గత రూపాల్లో
ప్రవర్తించే కాలానికీ,
క్రియా రూపం జీవితం.

రాత్రి పర్వతం వలె
కన్పించింది ఆశ్చర్యంతో,

పగలు ప్రవాహ రూపంలో
కదలుతూంది- కాలం.

ఎరుపు తిరిగిన ముఖంతో
మండే నిప్పు పెదవులతో
పూలు వాడిన కళ్ళతో, ఏమిది ?
ఏముంది ? పట్టపగటి బ్రతుకు.

నలగి తరగి పెరిగే మానవుడు
కాలానికి ఇచ్చే కానుక ?
హింస, అసహనం, అశాంతిలో
ఉదయించే ఆత్మజ్ఞత.

గాలికి కొట్టకపోయే వాడైనా సరే
నిల్వజూస్తాడు కొండవలె బ్రతుకులో
ఎవడూ వదలడు దేనినీ గాలికి.
గాలికీ కొట్టుకపోయేదైనా– ఆఖరికి.

పర్వతం గాలిని నిలిపితే
గాలి సముద్రాన్ని లేపుతుంది
స్వభావం మనిషిని స్తంభేస్త
మనిషి సమాజాన్ని నిందిస్తాడు.

కాల సముద్రంలో లోతులు చూచేది
నీవూ నేనూ కాదు సూర్యచంద్రులు
వర్తమాన శిఖరాలు అధిరోహించేది
రవీ చంద్రుడూ కాదు, మానవుడు.

ఈ ముఖరేఖల తరగలపై
నటిస్తూన్నవి ఎన్ని చిత్రాలో ?
ఆపై నుండి క్రింది వరకు
ఊహకు వచ్చినన్ని బ్రతుకులో

ఈ గదిలో బంధించారా వ్యక్తిని?
ఆకాశాన్ని పట్టినట్లు గుప్పిట్లో
వర్షధారలు కురేసచోటు నుండి

వెలుగు నిప్పులు దూకుతాయి పైకి.

ఆ గుట్టవద్దకు చేరే వరకు
ఆపైది రాయి వేస్తుంది గుండెలో
ఈ నదిని దాటిపోగానే
మరో నది కారజేస్తుంది నీరు.

ఉంటుంది దారి ప్రతి మనిషికీ
పరుగెత్త డానికెప్పుడైనా ఎక్కడైనా?
చేస్తుంది ఊహ ప్రతి మనసూ
ఏడుస్తూ ఎవడిపైనో అంతో ఇంతో !

చెట్టు గుట్ట మట్టీ, లక్షణంతో
ఆది మానవ బాల్య గానమూ
విశ్వమంతా ఉన్ననాలో, లేనిదో?
ఏమీ లేదు, ఒక్క ''నేను'' తప్ప.

వెతుకుతూన్నవి అడుగులు నేలపై తిండికై
ఎగురుతూన్నవి మాటలు గాలిలో కోర్కెపై
కదలుతూన్నవి ఊహలు మనసులో నీడలై
ఎంతైనా ఎక్కడికి అక్కడే! ఈ ఘటానికి!

నీడలో ఇంత సుఖంగా గడపాలనీ
నీడలో కొంత చాటుగా బ్రతకాలనీ
ఎంతగా కోరిక ఉన్నా మనిషికి!
బయట పడేయాలనే, ఎప్పటికీ వెలుగుకు!

మనుషుల తలలు వేటాడే మనస్తత్వం
చివరకు నిల్వునా బూది అయ్యే వైలక్షణ్యం,
పులుల నుండి రక్షణకై ప్రయత్నంలో
పులులై వ్యవహరించే వికృతతత్వం

ఆహారం కోసం సాహస కార్యాల్లో
నిమగ్నమైన జీవితంలో,
ఆహారంతో పాటు ఆనందమూ

పొందడమే ఆ శ్రమకు ఫలం.

పేరోల కీర్తిని కొలిచే పిరమిడ్లు చూచి
పట్టరాని ఆనందం పొందిన మనస్సు
కాలం మీద మారిన దృష్టితో నేడు,
పొందుతూంది పనివాండ్ర గుండెల సవ్వడి.

దగ్ధమైన భూమి నుండి పచ్చదనం
మొలిపిస్తుంది వర్షాశీర్వాదం,
రాతివంటి ఎదలో అనురాగం
దుమికిస్తుంది శిశూదయ బింబం.

వేటతో మొదలై దాడితో కొనసాగి
సమరంలో శిఖరమెక్కిన హింసా ప్రవృత్తి,
వెనువెంటనే సాధించిన ఘనకార్యాలు
బాణాలు, తుపాకులు, బాంబులు, రాకెట్లు.

తలచుకోగానే సర్జన్ చేతిలో కత్తి
రెపరెపలాడేను వెలుగు రెక్కలు,
భయాన్ని చీల్చినపుడే మతిప్రభ
మెరుస్తుంది మిల మిల ప్రాణ దీపం!

రోజులు వస్తు పోతున్నాయి అదే పనిగా
వెలుగుతూ ఇరు సంజల మెలకువతో,
రోజులు వస్తూ పోతున్నాయి అదే పనిగా
గుండెపై నునుమెత్తని అడుగులతో.

ఆ బాట పోయి పోయి మలగి తిరిగి
చివరకు కలసింది సముద్రంలో,
ఈ మనిషి నడచి నడచి అలసి సొలసి
నిదురించేదీ – దీని ఒడ్డునేగా.

ఎండారి గొంతులో నీటి చుక్క
ముత్యమై వజ్రమై మెరేస వేళ,
ప్రతిభ అను, అది అదృష్టం అను

ఆ స్థితిలో పరిసరమంతా అమూల్యమే!

ఎక్కడికక్కడే ఎదురయ్యే సరిహద్దులు
ఎన్నని స్వంతం చేసుకోగలవు బ్రతుకులో
భౌతిక మానసిక ఘర్షణ ఉన్నంత వరకు
అడుగు తీసివేస లోపలనే సరిహద్దులు !

నీడ కరగదు ఎంతటి జలధిలోనూ
నీడ తేలుతుంది వెలుగు కెరటంపై
నీడ ఒదుగుతుంది చీకటి చంకలో,
మునిగి తల ఎత్తుతుంది మనస్సులో.

ప్రకాశమాన జీవితంలో తప్పని
వస్తూ పోయే నీడల్ని గురించి
యాచిస్తూ కూర్చునే వాడికి
ఏం తెలుస్తుంది ? వస్తు స్వరూపం !

ఏవో చివుళ్ళు తప్ప ఏమీ నోచని మ్రోడును
అదృష్టం ఎక్కించిందో లేదో అందలం,
మేసరు విరగబడి ఈ మేధావులు
దేశ భవితవ్యానికి పట్టిన చెదలు !

ఇదో, శ్మశానంలో మిగిలిన కొరవి
రాలుస్తుందని బ్రతుకులో వజ్రాలు,
కదలేరు కొమ్ములు తిరిగిన ''రచైతలు''
స్వర్గ చిత్రం దిద్దుకున్న కళ్ళతో.

కడలిలోని అలలు అదే పనిగా
చెబుతూనే ఉన్నాయి యుగాలుగా
నెనరుతో విసరుతో చెప్పిందే చెప్పిందే,
పెడచెవిని పెడుతూనే ఉంది అవని.

పగలూ అవసరమే దీపం
కళ్ళతో వెతికే ముఖాలకు,
రాత్రి అవసరం లేదు దీపం

మనస్సుతో వెదకే ముఖాలకు.

రక్తారుణ సరస్సులో ఉదయం
తల ఎత్తిన సూర్యతేజం,
ఒకరికి దేవీపదలాక్షారాగం
మరొకరి బ్రతుక్కి విప్లవ కేతనం.

ఆ పోయిన వస్తువు దొరికిందా ?
ఎవడికి? ఎక్కడ ? ఎప్పుడు? చెప్మా !
ఆ పోయిన వస్తువే దొరికితే
అసహనం, అశాంతి, ఆక్రందన దేనికి ?

క్షణాల రేఖలతో వ్యూహం పన్నేవాడే
ప్రతివాడూ ఏదో ఒక ప్రయోజనంతో,
రేఖల నీడల్లో నీడ కలుపుతూపోయే
ప్రతి మనసూ, ఒక గిజిగాని గూడు.

ఇటు నీటినీ అటు దిక్కుల్నీ చూస్తూ
సముద్రంలో నావపై ప్రయాణికుని వలె,
ఇటు లౌకికమూ అటు అలౌకికమూ
అనుభవిస్తూ పోయేను – మనస్సు.

రానీ మృత్యువు ఎదురై పైపైకి
పోనీకు నీ నుండి శాంతమైన తేజం
ఆ రవిలోని కల్యాణతమ రూపం
బింబితమై నీలో అదే నీవైపో !

n

# కొలతలేని కాలం

క్షణం క్షణం.
ఒక క్షణం నుండి
మరో క్షణం దూరం.
కొలవబడదు, యోజనాల్లో.

ఈ క్షణాల్లో
అంటి ఉన్న ఘటనలు
ఒక అయస్కాంత బిందువుపై
కేంద్రీకృతమై ఉన్నవి
సూదివలె ఈ బిందువు
చెదరిన మనస్సును
కలుపుతుంది ఒకచోట.

బిందువు బిందువులో
విభక్తమైంది వృత్తరేఖ
ఈ రోజుచిత్తరువు తెరపై
పొందుతూంది సంపూర్ణ రూపం
శతశః ఖండితమై కథ
నిర్మిత మౌతూంది
ఛాయా చిత్రంగా.

ఎన్నో ఏండ్లు నెలలు రోజులు
అరగి అరగి
అస్తిత్వ హీనమై పోయాయి,

ఈ కథలో

ఎక్కడా విరామం లేదు.

భూత కాలంలో జన్మ పొంది
ఈ ఘటనలతో.
వర్తమాన క్రియలో ఉన్నవి
ఉంటూనే ఉంటవి.

**హిందీ - శ్రీరామశర్మ**

1969.

# ఎక్కడిదీ జ్వాలా రూపం

ఎక్కడిదీ జ్వాలా రూపం
ఏ దిశనుండి నాలోకి
ఎప్పుడు దయచేసిందీ?
బింబిస్తూ తన ముఖం
ప్రతి చుక్కలో ప్రతి పూవులో
ప్రతి తరగలో ప్రతి క్షణంలో.

నిద్రలేని కళ్ళలో పూచిన
గూలాబిరేకుల అంచుల
వంపుల్లో తిరుగుతూ,
కళ్ళలో ఒదిగిన
మెలకువ గట్లపై కదలుతూ
ఎక్కడిదీ జ్వాలా రూపం
ఎప్పుడు దయచేసిందీ ?

ఏ నాడులు సంస్పృశించి
సంగీతం ఒలికించాలనో ?
ఏ రూపం తగులబెట్టి
బూడిద చేయాలనో ?
దయచేసింది చెప్పా పెట్టకుండా
తిష్ఠవేసింది పిలువని అతిధియై.

నా ఇంటి వాకిట
అరుణ సుమ తోరణమైంది
నా ఊరి బయట

కింశుకసుమ వనమైంది

నిలుస్తుందా? నిలుకడగా.

ఎక్కడిదీ జ్వాలా రూపం.

ఏ తపస్సులో పుట్టింది ?
ఏ విప్లవంలో పెరిగింది?
కణకణాన్ని వెలిగించి
తేజో జగత్తును నిలుపుతుందా?
కణకణాన్ని దహించి
సూర్య గోళంగా మారుస్తుందా ?

ఎక్కడిదీ జ్వాలా రూపం ?
ఏ దిశ నుండి నాలోకి
ఇలా దయచేసింది?

ఆనాడు అరణి నుండి
ఉద్భవించిన అగ్ని
ఈ రహస్య రూపం ధరించిందా?
ఈనాడు తీగెల్లో
ప్రవహించే విద్యుత్తు
ఈ ప్రకాశ రూపం పొందిందా?

తర తరాల వలయాలు క్రమించి
వచ్చి చేరిందా ? నన్ను ఇపుడు,
తర తరాల వలయాలు గమించి
ఇలాగే పోయేనా? మునుముందు.

ఎక్కడిదీ జ్వాలా రూపం
ఎక్కడిదో కానే కాదు,
ఎంతో పరిచయమున్నట్లుంది
అంతలో క్రొత్తదనం వహిస్తుంది
గుర్తుపట్టే వీలు లేనంతగా.

రాలేదు ఏ దిశలనుండ
ఈ జ్వాలా రూపం
నా నుండి ప్రసరించింది
ప్రతి దిశలోకి.

నాలోకి ప్రసరిస్తుంది
ప్రతి దిశ నుండ

చీకటీ, వెన్నెలా వెలుగూ
ఏ విభేదమూ లేకుండా.

మనిషిలోని వాంఛా భీజం
తొడిగిన పల్లవ రాగం
మనిషిలోని అహంకార వృక్షం
వదలిన సంతాన ఫలం.

ఎక్కడికీ పోదు,
ఉంటుంది అందరిలోను,
అణీయసుల నుండి మహీయసుల వరకు
సముద్రంలో బడబాగ్నివలె గుప్తంగా
అరణిలో అనల తేజంవలె రహస్యంగా.

ఈ జ్వాలా ప్రకాశంతో
ఉదయించిన సంస్కృతి,
ఈ జ్వాలా సంచారంతో
కావచ్చు, చీకటి దిబ్బ.

ఇది ఎక్కడికీ, పోదు.
ఉంటుంది గుండె తోపులో
గంతులేస హరిణ మృగం వలె.

ఇది ఎక్కడికీ పోదు
ఉంటుంది నిద్రా వనంలో
జూలు విదల్చి నిల్చే సింహంవలె.

ఈ మనోజ్ఞ జ్వాలా రూపం
అఖిల మానవాత్మకు సంకేతం.



9 789356 797116

# స్వేచ్ఛా కవిత్వం

మొదటి సంపుటం Addendum - 1

రచనా కాలం 1953 - 1975

Madiraju Ranga Rao was born on June 8, 1935, in Pandithapuram village, Khammam, Telangana.

Madiraju Ranga Rao was a student of Telugu and Sanskrit literature at Osmania University (O.U), obtained M.A. Sanskrit (1960), M.A. Telugu (1962), Ph.D. Telugu (1966). Dr. Madiraju Ranga Rao was a member of the Editorial Board for the critical editions of Andhra MahaBharatham and Andhra MahaBhagavatham. Dr. Rao's first academic appointment in 1964 was with the Department of Telugu, O.U, Hyderabad, then followed a long tenure at Kakatiya University, Warangal, Telangana as Professor, Chair Board of studies and Dean for Faculty of Arts. Prof. Madiraju Ranga Rao was the Founder and President of 'Rasadhuni Sahithi Parishath' literary Foundation.

స్వేచ్ఛా కవిత్వం
మొదటి సంపుటం
Addendum - 1
రచనా కాలం
1953 - 1975

Vol. 1

Prof. Madiraju Ranga Rao, a distinguished writer, scholar-poet and a literary critic, contributed extensively to various literary genres of Telugu literature including classical literature, modern poetry, and criticism. Prof. Rao established his own niche through his literary works in 'Free Verse' (Swecchaa Kavithvamu) and Literary Criticism. Central to Prof. Madiraju Ranga Rao's poetic purpose were humanistic ideals and a democratic perspective rooted in a heart that symbolized peace. This was the very essence of his 'Free Verse' poetry. Popular journals published his creative writings on a regular basis. During his long and highly productive literary career, Prof. Madiraju Ranga Rao’s creative writings culminated in more than 160 books on 'Free Verse' and over 20 books on Literary Criticism – a total of over 180 books – published until his demise on June 21, 2025.

# స్వేచ్ఛా కవిత్వం — SWECCHAA KAVITHVAMU

## మొదటి సంపుటం (Volume I) · Addendum – 1

### ABOUT THIS DOCUMENT / ఈ గ్రంథం గురించి

A complete, page-for-page digital edition of the printed book. Each page of this document corresponds exactly to the same page of the printed edition (616 pages).

Title: Swecchaa Kavithvamu (స్వేచ్ఛా కవిత్వం), Volume I, Addendum – 1
Author: Prof. Madiraju Ranga Rao — ఆచార్య మాదిరాజు రంగారావు
Born: 8 June 1935, Pandithapuram village, Khammam, Telangana, India
Poet, scholar and literary critic; studied Telugu and Sanskrit literature at Osmania University (M.A. Sanskrit).
Period of composition: 1953–1975 (రచనా కాలం)
Language: Telugu (Telugu script); front matter partly in English
Genre: Modern Telugu poetry — గేయాలు, వచన కవిత్వం, ముక్తకాలు
Edition: First Edition, 2026
ISBN: 978-93-5679-711-6
Editors: Madiraju Santhosh Kumar · Devulapally Haritha · Madiraju Charitha
Copyright: © Dr. M. Santhosh Kumar
Published by: Rasadhuni Sahithi Parishattu, Shantinagar, Hyderabad – 28
Printed at: Anupama Printers, Shantinagar, Hyderabad – 28
For copies: Dr. Madiraju Santhosh Kumar, +91 98499 79899
Digital portal: swecchaa-kavitvamu.org
Author site: madirajurangarao.com
Extent: 616 pages

### CONTENTS / విషయ సూచిక (11 collections)

1. కిర్మీరం Kirmeeram (1957) · 2. మేల్కొన్న ఆకాశం Melkonna Akasam (1959)
3. మనోభూమికలు Manobhumikalu (1960) · 4. అద్దంలో నీడలు Addamlo Needalu (1960)
5. పృథ్విగీతం Pridhvi Geetam (1961) · 6. మరో ఉదయం Maro Udayam (1962)
7. సౌందర్యశిఖ Soundarya Sikha (1963) · 8. యుగసంకేతం Yuga Sanketam (1970)
9. ముక్తకాలు – ఉష ఆగమనం Mukthakalu – Usha Agamanam (1970)
10. మానవీయం Manaveeyam (1971) · 11. ఆనందధుని Anandadhuni (1975)

### KEYWORDS

Telugu poetry, Telugu literature, modern Telugu poetry, Madiraju Ranga Rao, Swecchaa Kavithvamu, స్వేచ్ఛా కవిత్వం, మాదిరాజు రంగారావు, Yuga Sanketam, యుగసంకేతం, Telangana literature, Osmania University, Telugu geyalu, vachana kavithvam, 20th century Telugu verse, Hyderabad, Warangal.

### DIGITAL EDITION NOTE

Text recovered from the printed edition and re-typeset in Unicode Telugu (Noto Sans Telugu). Page geometry follows the print edition: A5, margins 0.2in top/bottom, 0.3in left/right. This page is an added metadata page and does not appear in the printed book.